
# అసురసంధ్య

## మాల్కం ఎక్స్ ఆత్మకథ



అలెక్స్ హేలీ

CI

# అసురసంధ్య

## మాల్కం ఎక్స్ ఆత్మకథ

రచన

**అలెక్స్ హేలీ**

తెలుగు

**యాజ్ఞి**

హైదరాబాద్ బుక్ ట్రస్ట్

ధర : రూ. 45/-

ఆంగ్లమూలం : The Autobiography of Malcolm X with the assistance of Alex Haley, Penguin Books, 1968

ప్రథమ ముద్రణ : సెప్టెంబర్, 2006

ప్రతులకు, వివరాలకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్,
ప్లాట్ నెం. 85, బాలాజీనగర్, గుడిమల్కాపూర్,
హైదరాబాద్-500 067. ఫోన్ : 2352 1849

---

ముద్రణ : ఓం సాయి గ్రాఫిక్స్, నారాయణగూడ, హైద్రాబాద్. ఫోన్ : 27564141

# విషయసూచిక


అధ్యాయం పేజి నెం.

1. పీడకల ........ 1
2. జేబులో బొమ్మ ........ 19
3. పల్లెటూరి చిన్నోడు ........ 29
4. లారా ........ 34
5. హార్లెమ్ నివాసి ........ 38
6. డెట్రాయిట్ రెడ్ ........ 42
7. దందారాయుడు ........ 50
8. పద్మవ్యూహం ........ 56
9. బందీ ........ 59
10. సైతాన్ ........ 62
11. యా అల్లా... ........ 68
12. రక్షకుడు ........ 75
13. మినిస్టర్ మాల్కం ఎక్స్ ........ 80
14. నల్ల ముస్లింలు ........ 87
15. ఇకారస్ ........ 91
16. బహిష్కరణ ........ 94
17. మక్కా ........ 103
18. ఎల్-హాజ్ మాలిక్ ఎల్ షాబాజ్ ........ 105
19. అసురసంధ్య ........ 107

## రచయిత పరిచయం

## అలెక్స్ హేలీ (1921-1992)

పాత్రికేయుడు, రచయిత 1965లో 'ఆటోబయాగ్రఫీ ఆఫ్ మాల్కం ఎక్స్' పుస్తకానికి సహరచయితగా, సంపాదకుడిగా పనిచేసి జాతీయ స్థాయి గుర్తింపు పొందాడు. పన్నెండు సంవత్సరాలు పరిశోధన చేసి రాసిన 'రూట్స్'కు 1976లో పులిట్జర్ బహుమతి వచ్చింది. 1977లో ఇదే పుస్తకం ఆధారంగా ప్రసారమైన టెలివిజన్ మినీ సిరీస్ కూడా విశేష ప్రజాదరణ పొందింది. నల్లవాళ్ల గురించే 1993లో 'క్వీన్' అనే నవల కూడా అచ్చయింది.

# అమెరికన్ శిలువెక్కిన ఆఫ్రికన్ 'తార'

ఇది అమెరికన్ నల్లముస్లిం జాతీయోద్యమనాయకుడైన మాల్కం ఎక్స్ ఆత్మకథ. సుప్రసిద్ధ నవల 'రూట్స్' (ఏడుతరాలు) రాసిన అలెక్స్ హేలీ తనకు మాల్కం ఎక్స్ చెప్పినట్టు ఈ ఆత్మకథకు అక్షరరూపమిచ్చాడు.

అమెరికా తీర రక్షక దళంలో ఇరవై ఏళ్లు పనిచేసిన తర్వాత హేలీ, లాస్ ఏంజిల్స్‌లో జర్నలిస్టుగా స్థిరపడ్డాడు. అక్కడ 'నేషన్ ఆఫ్ ఇస్లాం' గురించి విని, హార్లెమ్‌కు (న్యూయార్క్) వచ్చాడు. 'ప్లేబాయ్' పత్రిక తరఫున ఈ రచన పూర్తి చేయటానికి ఆయనకు దాదాపు రెండు సంవత్సరాలు పట్టింది. దానిక్కారణం, రోజుకు పద్దెనిమిది గంటలు పనిచేసే మాల్కం ఎక్స్ జీవితశైలి.

నేషన్ ఆఫ్ ఇస్లాం నాయకుడు ఎలైజా ముహమ్మద్ తర్వాతి స్థానంలో వుండే వ్యక్తిగా మాల్కం ఎక్స్ క్షణం తీరికలేని జీవితం గడిపాడు. పొద్దున నిద్రలేచింది మొదలు, పడుకొనే వరకూ తెల్లవాడి మీద నిప్పులు కక్కుతూ, ఒక్క అమెరికాలోనే కాకుండా, యూరప్, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా దేశాలన్నీ సుడిగాలిలా తిరిగాడు. నల్లవాళ్లను ముస్లింలుగా మార్చటం కోసం కాలాన్ని తన ఊపిరిగా చేసుకొని బతికాడు. 1950లో ఒక కార్యకర్తగా సంస్థలో చేరి చాలా కొద్దికాలానికే నాయకుడిగా ఎదిగాడు. తాను సభ్యుడిగా చేరినప్పుడు సంస్థలో మొత్తం సభ్యుల సంఖ్య నాలుగు వందలు. తాను పనిచేసిన పన్నెండు సంవత్సరాల్లో అమెరికాలోని ప్రధాన నగరాలు, చిన్నా పెద్దా పట్టణాల్లో వందకు పైగా మసీదులు స్థాపించాడు. అమెరికాలోని నల్లవాళ్లను తన వాగ్ధాటితో మంత్రముగ్ధులను చేసి సభ్యుల సంఖ్య నలభైవేల వరకు పెంచాడు.

పత్రికలు, రేడియోలు, టెలివిజన్‌లలో వాదనలు, చర్చలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాల్లో ప్రసంగాలు, నీగ్రోవాడల్లో కార్యకలాపాలు, మసీదుల నిర్వహణ, విదేశీ పర్యటనలతో ఎప్పుడూ తీరిక అన్నదే లేని ఆయనతో కారులో, రైల్లో, హార్లెమ్ వీధుల్లో తిరుగుతూ, రెస్టారెంట్లో, హోటల్లో, ఎయిర్‌పోర్టులో, కళాశాలల్లో, విశ్వ

విద్యాలయాల్లో, మసీదుల్లో, సంభాషణలు జరుపుతూ హేలీ నోట్సు రాసుకున్నాడు.

1963లో నేషన్ ఆఫ్ ఇస్లాం నాయకుడు ఎలైజా ముహమ్మద్ తన అనైతిక ప్రవర్తనను మాల్కం ప్రశ్నించాడనే కోపంతో, రోజురోజుకూ అమెరికాలోని నల్లవాళ్లలో ఆయనకు పెరుగుతున్న ఆదరణ చూసి అసూయతో, భవిష్యత్తులో తన స్థానానికే ముప్పు వస్తుందనే భయంతో కుట్రపన్ని ఆయన్ను సంస్థ నుండి బహిష్కరించాడు. అంతటితో ఊరుకోకుండా మాల్కం ఎక్స్‌ను చంపేయమని తన సంస్థలోని ముస్లింలను ఆదేశించాడు.

తన ఆలోచనలతో, ఆశయాలతో, ప్రసంగాలతో అప్పటికే తెల్లశత్రువులను సంపాదించుకున్న ఆయనకు తన సహచరులు కూడా బద్ధ శత్రువులు కావటం బాధాకరం. నేషన్ ఆఫ్ ఇస్లాం నుండి బైటికొచ్చిన తర్వాత హార్లెమ్ మధ్యలో కొత్త మసీదును స్థాపించి మక్కా యాత్రకు పోయాడు. అక్కడి నుంచి వచ్చిన తర్వాత 'ఆర్గనైజేషన్ ఆఫ్ ఆఫ్రికన్ అమెరికన్స్ యూనిటీ' అనే కొత్త సంస్థను స్థాపించాడు. 1964లో పరిస్థితి మరింతగా విషమించింది. నల్ల ముస్లింలు మాల్కం ప్రతి కదలికనూ నీడలా వెంటాడారు. ఏ క్షణమైనా ప్రాణంపోయే పరిస్థితుల్లో అలెక్స్ హేలీ ఈ ఆత్మకథ రెండో భాగానికి సంబంధించిన నోట్స్ రాసుకున్నాడు. తన ఇంటిలో జరిగిన బాంబుపేలుడు నుండి భార్యాబిడ్డలతో సహా బైటపడ్డ మాల్కం ఎక్స్‌ను 1965 ఫిబ్రవరి 21న హార్లెమ్‌లోని అడూబన్ బాల్‌రూంలో ప్రసంగిస్తుండగా, నేషన్ ఆఫ్ ఇస్లాం సభ్యులు అతి దగ్గర నుండి పదహైదురౌండ్లు కాల్పులు జరిపి కిరాతకంగా హత్య చేశారు. ఈ హత్యకు తెల్లవాళ్లు, పోలీసులు నిశ్శబ్దంగా సహకరించారు. ఇది 'అల్లా విధించిన శిక్ష' అని ఎలైజా ముహమ్మద్ తన నేరాన్ని సమర్థించుకున్నాడు.

అయితే, ఇక్కడో విషయం గుర్తు చేసుకోవాలి. సుప్రసిద్ధ పౌర హక్కుల నాయకుడు మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్ సమకాలికుడైన మాల్కం ఎక్స్ 2006లో తెలుగు పాఠకులకు పరిచయం కావటం ఆశ్చర్యకరమైన విషయమే. ఎందుకంటే, ఆధునిక ఆంగ్ల సాహిత్యంలో 'క్లాసిక్'గా గుర్తింపు పొందిన 'రూట్స్' 1975లో వస్తే, 1980లో హెచ్‌బిటి వారే 'ఏడుతరాలు' పేరుతో దాన్ని అచ్చేశారు. మాల్కం ఎక్స్ ఆత్మకథ రాసేనాటికి అలెక్స్ హేలీ జర్నలిస్టుగానే అనామకుడు. నల్లజాతి పట్ల హేలీ దృష్టినీ, చైతన్యాన్నీ అత్యంత ప్రభావితం చేసిన వ్యక్తి మాల్కం ఎక్స్.

ఇంగ్లీషులో 1965లో అచ్చయిన ఈ ఆత్మకథ ఇంతకాలం తర్వాత తెలుగులో రావటం నిజంగా ఆలోచించాల్సిన విషయమే. అసాధారణమైన నాయకత్వ లక్షణాలున్న మాల్కం ఎక్స్ అసలు ఇక్కడి మేధావుల దృష్టి నుండి ఎలా తప్పిపోయాడు? మార్టిన్ లూథర్‌తో పోలిస్తే ఆయన ఆవేశపరుడు కావచ్చు. కానీ ఒక ప్రజా నాయకుడిగా ఆయన జీవితంలో ఇక్కడి దళితులు, ముస్లింలకు ఉపయోగపడే విషయాలు ఎన్నో వున్నాయి.

నాయకుడిగా చిల్లిగవ్వ కూడా సంపాదించుకోకుండా వ్యక్తిగత నీతి నియమాలు, క్రమశిక్షణ, నిబద్ధత, త్యాగం, నిరంతర అధ్యయనం, మేధోనిజాయితీ, తన జాతి ప్రజల పట్ల షరతుల్లేని ప్రేమ ఇన్ని లక్షణాలు వున్న వ్యక్తి ఎందుకు మన మేధావులను ఆకర్షించలేదు? అన్ని దురలవాట్లను, బలహీనతలను అధిగమించి ప్రజానాయకుడిగా ఎదిగిన ఆస్తికుడు మాల్కం ఎక్స్.

ఈయన ఇంకా విదేశీయుడు. వామపక్ష మేధావులు ఈ దేశంలోని ప్రతిభావంతులెందరినో గుర్తించలేక ప్రజా ఉద్యమాలకు అపార నష్టం కలిగించారు. అన్ని ఉద్యమాల నాయకులూ అదే పని కొనసాగిస్తున్నారు. దీని వెనుక వున్నది పాశ్చాత్య హేతువు అనుకరణ.

సూటిగా ఒక ప్రశ్న. స్వాతంత్ర్యం వచ్చిన యాభై తొమ్మిదేళ్లలో కింది కులాలు, బిసిలు, మైనార్టీ వర్గాల్లో ఇలాంటి నాయకుడు ఒక్కరు కూడా ఎందుకు పుట్టలేదు? దళితులు, బిసిలు, ముస్లింలు మధ్య వున్న 'సామాజిక వ్యత్యాసం' పైన అన్ని కోణాల్లో చర్చ జరగాలి. వలస పాలన తెచ్చిన పాశ్చాత్య హేతువుకూ ప్రాచ్య హేతువుకూ మధ్య సృజనాత్మక సామరస్యం ఇప్పుడు చాలా అవసరం. మానవతా విలువలను గౌరవించి సీరియస్‌గా ఆలోచించే స్వతంత్ర వ్యక్తిత్వాలను కూడా అన్ని ఉద్యమ నాయకత్వాలూ చర్చకు ఆహ్వానించాలి. అప్పుడే ప్రజా ఉద్యమాలకు కొత్త ఆలోచనలు, సిద్ధాంతం, నాయకులు దొరుకుతారు.

**- యాజ్ఞి**

# నల్లజాతి వైతాళికుడు మాల్కం ఎక్స్

మాల్కం ఎక్స్ జీవితాన్ని అర్థం చేసుకోవడానికి, నల్లజాతి విముక్తి పోరాటంలో అతడు నిర్వహించిన పాత్రను అవగాహన చేసుకోవడానికి ఈ జీవిత చరిత్ర ఎంతో ఉపకరిస్తుంది. అమెరికాలోని నల్లజాతిని తొలినాళ్ళలో నీగ్రోలు అని పిలిచేవారు. కాని ఆ పదం ఇప్పుడు అవమానకరంగా భావింపబడుతుంది. మాల్కం ఎక్స్ ఈ పదం గురించి వివరించాడు. నల్లజాతి స్త్రీల మీద తెల్ల మగవాళ్ళు అత్యాచారం చేయడం వల్ల జన్మించిన సంతతిని నీగ్రోలు అని వ్యవహరించే వారని ఆయన పేర్కొన్నాడు. ఇప్పుడు అవమానకరంగా భావిస్తూ ఆ పదాన్ని నల్లవాళ్ళు వ్యతిరేకిస్తున్నారు. దళిత ప్రజానీకాన్ని ఇక్కడ హరిజనులు అని జాతీయోద్యమ కాలంలో గాంధీ, ఆయన అనుచరులు పిలవడం కూడా మనకు తెలిసిందే. నిమ్న, ఉన్నత కులాల వ్యక్తుల మధ్య సంపర్కం వల్ల కలిగిన సంతానం అని ఆ పదానికి అర్థం. అంబేడ్కర్, అతని అనుచరులు మాత్రం అంటరానివారు అని వ్యవహరించడం మనకు తెలుసు. కాని ఇప్పుడు ఆ పదాలను కింది కులాలను సంకేతించడానికి ఉపయోగించడం పట్ల దళితులకు తీవ్ర అభ్యంతరం ఉంది. అంటరానితనం, అంటరానివాళ్ళు అనే పదాలను ఉపయోగించడం పట్ల తీవ్రమైన అభ్యంతరాలు ఉన్నాయి. చరిత్రలో తప్పుడు భావాలను విరివిగా ప్రయోగించిన దాఖలాలు ఉన్నాయి. వాటికి ప్రాచుర్యం, పలుకుబడి ఉంది. అంటరానితనం అనేది కింది కులాల శరీరాల్లో వుండదు. 'అంటలేనితనం' అనేది అగ్రకులాల్లో వుండే మానసిక భావన. కింది కులాల్లో స్వాభావికంగానే అంటరానితనం ఉంటుందనే తప్పుడు అవగాహనను ఆ పదం మోస్తుంది. అందువల్ల అన్‌టచబులిటి, అన్‌టచబుల్ అనే పదాలే తప్పుడు పదాలు. తప్పుడు భావనలైనప్పటికీ, అవి చరిత్రలో లిఖిత రూపంలో నమోదై ఉన్నాయి. వాటిని తెలుగులో అంటలేనితనం, అంటబడనివాళ్లు అని తెలుగీకరించాలనే సూచన ఉంది. అలాగే నీగ్రో, నిగ్గర్ అనే పదాలతో నల్ల

జాతీయులను సూచించడం పట్ల తీవ్రమైన అభ్యంతరాలు ఉన్నాయి. 'బ్లాక్, బ్లాక్స్' అనే పదాలతోనూ, 'ఆఫ్రికన్-అమెరికన్స్' అనే పద బంధంతోనూ నేడు ప్రపంచమంతా ఆ జాతిని సంకేతిస్తుంది. సాపేక్షంగా ఇవి వారికి గౌరవ సూచకాలు. ఆఫ్రికన్-అమెరికన్స్ అనే పదం ఎంతో లోతైంది. నల్లజాతి ప్రజల ఛరిత్రను, చరిత్ర పరిణామాన్ని ఈ పదం సూచిస్తుంది. కొన్ని వందల సంవత్సరాల క్రితం ఆఫ్రికా ఖండం నుంచి లక్షలాది మంది నల్ల బానిసలను అమెరికా వలస వాదులు, ధనికులు కొనుగోలు చేసి తెచ్చుకున్నారు. వారిని అమ్మింది కూడా ఆఫ్రికా ఖండంలోని బానిస యజమానులు. ఆ తర్వాత ఆఫ్రికా ఖండం చాలా వరకు యూరప్ ఆక్రమణ కిందికి వచ్చింది. లక్షలాది మంది నల్లవారిని బ్రిటన్ బానిసలుగా తరలించింది.

కాని ఆ తర్వాత అమెరికాలో స్థిరపడిన లక్షలాది మంది నల్లవారికి ఆఫ్రికాలోని మూలాలతో పేగు బంధం తెగిపోయింది. తొలితరం నల్లవారికి ఆఫ్రికాలోని తన వంశంలోని వాళ్ళతో కలిసిపోవాలని, వారితో అనుబంధాన్ని కలుపుకోవాలనే ఆకాంక్ష ప్రబలంగా వుండేది. తెల్లవాళ్ళ దోపిడి, అణచివేత నుంచి విముక్తి కోరుతున్న నల్లవాళ్ళు తిరిగి ఆఫ్రికా ఖండం వెళ్ళాలని కోరుకున్నారు. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత, ఆ అభిలాష ఉద్యమాకృతి దాల్చింది. ఆ ఉద్యమాన్ని 'బ్యాక్ టు ఆఫ్రికా' అంటారు. ఈ ఉద్యమం నల్లవారిని ఉత్తేజితుల్ని చేసింది. అయితే, చాలా మంది నల్లవారికి తమ మూలాలెక్కడ ఉన్నాయో తెలియదు. తమ రక్త సంబంధీకులు ఎవరో తెలియదు. అలాంటి తెలియని స్థితిని కల్పించినందుకు నిరసనగా చాలామంది నల్లవాళ్ళు, వారి పేరు చివర 'ఎక్స్' అనేదాన్ని చేర్చుకున్నారు. మన కథా నాయకుడి అసలు పేరు 'మాల్కం లిటిల్'. మాల్కం కూడా తన పేరు చివర 'ఎక్స్' చేర్చుకుని 'మాల్కం ఎక్స్'గా మార్చుకున్నాడు. అందువల్ల పేరు కేవలం ఒక వ్యక్తిని సూచించేది మాత్రమే కాదు. పేరు ఒక ధిక్కారం. ఒక నిరసన. ఒక ప్రతిఘటన. ఒక నవీన సమాజ నిర్మాణ సంకల్పం. ఆఫ్రికన్-అమెరికన్స్ పోరాటంలో మాల్కం ఎక్స్ ఒక కలికితురాయి. అమెరికా శ్వేత పాలకుల పాలిట సింహస్వప్నం. లక్షలాది మంది ఆఫ్రికన్-అమెరికన్స్ ను ఆయన మాటలు ప్రభావితం చేశాయి. ఆత్మ గౌరవంతో పాటు, ఆర్థిక స్వయం ప్రతిపత్తి కోసం బ్లాక్ మార్కెట్‌ను నిర్మించాలని ఆయన చేసిన ప్రతిపాదనల వల్ల, బ్లాక్ రెస్టారెంట్లు, బ్లాక్ స్టోర్ హౌజ్‌లు, బ్లాక్ పరిశ్రమలు విరివిగా వెలిశాయి. తెల్లవాళ్ళ ఆర్థిక వ్యవస్థను సవాల్ చేశాయి. ఇంకా ఆ పరంపర

కొనసాగుతూ ఉంది. ఆఫ్రికన్-అమెరికన్స్‌కు ప్రత్యేక రాజ్యం కావాలని, అందుకు అమెరికా పాలకులు అంగీకరించకుంటే కనీసం ప్రత్యేక భౌగోళిక రాష్ట్రం ఇవ్వాలని మాల్కం ఎక్స్ గురువు ఎలైజా ముహమ్మద్ చేసిన ప్రతిపాదనను శక్తివంతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాడు. 1959లో మార్టిన్ లూథర్ కింగ్ (జూనియర్) ఇండియా వచ్చి గాంధీ, అంబేద్కర్ రచనలు అధ్యయనం చేసి వెళ్ళాడు. ఈ విషయం మరిచిపోకూడదు.

మాల్కం ఎక్స్ జీవిత చరిత్ర ఆయన మరణించిన నాలుగు దశాబ్దాల తర్వాత తెలుగు పాఠకులకు అందుబాటులోకి వస్తోంది. ఇది చాలా ఆలస్యమే అయినప్పటికీ ఎంతో ఆహ్వానించదగింది. మాల్కం ఎక్స్ రచనలు, జీవితం వర్తమాన పరిస్థితులలో ఎలాంటి ప్రాసంగికత కలిగి వున్నాయి? అమెరికా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట వారసత్వం బలంగా వున్న మన తెలుగు సమాజానికి మాల్కం ఎక్స్ జీవితం ఎలాంటి స్ఫూర్తినిస్తుంది? ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌ల మీద అమెరికా నాయకత్వంలో సామ్రాజ్యవాద దేశాలు దాడి చేసి ఆక్రమించుకొన్న ఒక అనాగరిక చారిత్రక సందర్భంలో, అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్, లెబనాన్ మీద సాగిస్తున్న అమానుష యుద్ధకాండను ప్రత్యక్షంగా మనం చూస్తున్న నేపథ్యంలో మాల్కం ప్రాసంగికతను అంచనా వేయడం అవసరం. అర్థం చేసుకోవడం మరింత అవసరం.

మాల్కం ఎక్స్ జీవితంలోని అతి ముఖ్యమైన సంఘటనలను, మలుపులను ఈ పుస్తకంలో తెలుసుకోవచ్చు. కాని, మొత్తం నల్లజాతి సాగించిన విముక్తి ఉద్యమాన్ని స్థూలంగా వీక్షించి, ఆ ఉద్యమ పరిణామ క్రమంలో ముఖ్యమైన నాయకుల పాత్రను విశ్లేషించి, మాల్కం ఎక్స్ నిర్వహించిన చారిత్రక పాత్రను ఆ క్రమంలో అర్థం చేసుకున్నప్పుడు మాత్రమే పాఠకుడి అవగాహన సమగ్రతకు సమీపంగా ఉంటుంది.

అమెరికా నల్లజాతి విముక్తి పోరాటంలో ప్రపంచంలోని అనేక మందికి ఒక పోరాట పంథా గురించి మాత్రమే తెలుసు. ఇంకా వాస్తవికంగా చెప్పాలంటే ముగ్గురు ప్రముఖుల పేర్లు మాత్రమే తెలుసు. అబ్రహం లింకన్, బుకర్ టి. వాషింగ్టన్, మార్టిన్ లూథర్ కింగ్ (జూనియర్)లు ఆ ముగ్గురు. వీరిలో లింకన్ బానిస వ్యవస్థను రద్దు చేశాడు. బుకర్ టి. వాషింగ్టన్ తొలి నల్లజాతి విద్యావంతుడు. అమెరికా దేశాధ్యక్షుడితో కలిసి శ్వేతభవనంలో సుదీర్ఘ చర్చ చేసినవాడు. ఆ దేశ అధ్యక్షుడితో

కలిసి విందు స్వీకరించిన తొట్ట తొలి నల్లవాడు. ఇక, మార్టిన్ లూథర్‌కింగ్ (జూనియర్)ను అమెరికా గాంధీగా లోకమంతా కీర్తించిన నల్లజాతి పౌర హక్కుల ఉద్యమ నాయకుడు.

ఆఫ్రికన్ అమెరికన్ల పోరాటం ఏక శిలా సదృశ్యమైంది కాదు. అయితే కేవలం గాంధీ మార్గ పౌరహక్కుల ఉద్యమం మాత్రమే బాగా ప్రచారమైంది. కాని దానికి సమాంతరంగా జరిగిన మహోద్యమం కూడా ఉంది. అది ఎలైజా ముహమ్మద్ మార్గదర్శకంలో మాల్కం ఎక్స్ నిర్మించిన, నడిపించిన 'నేషన్ ఆఫ్ ఇస్లాం'. ఇది ఆఫ్రికన్-అమెరికన్‌లకు ప్రత్యేక దేశం కోరుతూ నల్లజాతి ముస్లింలు చేసిన మహోన్నత ఉద్యమం. మాల్కం సంపూర్ణ నాయకత్వంలో ఆ తర్వాత నడిపిన ఆఫ్రికన్-అమెరికన్ ఐక్యతా సంస్థ పోరాటం (Organization of Afro-American Unity; OAAU) నల్ల జాతి ముస్లిం ఉద్యమం తెల్ల పాలకులకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. పదునైన కత్తి వేటు లాంటి, విద్యుద్ఘాతం లాంటి మాల్కం ఉపన్యాసాలు శ్వేత భవన పునాదులను కంపింప చేశాయి. ఈ సమాజంలోని ప్రగతిశీల గుణం కారణంగా బ్లాక్ పాంథర్స్ ఉద్యమం కూడా మరింత బాగా సుపరిచితం.

నల్లవాళ్ళ బానిసత్వం : పోర్చుగీసు వ్యాపారులు మొదటిసారిగా ఆఫ్రికా నుంచి కరీబియన్ ప్రాంతానికి 1502లో బానిసలను తీసుకువచ్చారు. వ్యవసాయంలో వీళ్ళని ఉపయోగించుకున్నారు. అప్పటి నుంచి 1860 వరకు 10 మిలియన్ల ఆఫ్రికన్ బానిసలను అమెరికాకు తరలించారు. ప్రధానంగా ఇప్పటి దక్షిణ యు.ఎస్.ఎ. ప్రాంతంలోకి తరలించారు. వర్జీనియ, మేరీలాండ్, దక్షిణ కరోలినా తదితర ప్రాంతాల్లోకి ఎక్కువ సంఖ్యలో తీసుకెళ్లారు. 1860 వరకు కొంతమంది స్వేచ్ఛ పొందిన బానిసలు కూడా ఉండేవాళ్ళు. కాని వీరి సంఖ్య చాలా స్వల్పం. ఉత్తర అమెరికాలో కేవలం ఆరు శాతం మాత్రమే ఆఫ్రికా బానిసలు ఉన్నారు. ఇప్పటికీ దక్షిణ అమెరికాలోనే నల్లవాళ్లు అధిక సంఖ్యలో ఉంటారు. అమానుషంగా చిత్రహింసలకు గురయ్యేది కూడా అక్కడే. ఉత్తర అమెరికా నల్లవాళ్ళ పరిస్థితి కాస్త మెరుగు. భార్లీ, బియ్యం, పత్తి పండించడంలో ఆఫ్రికా బానిసలది అపారమైన నైపుణ్యం. అందుకే బ్రిటీషు వలస పాలనలో ఉన్న అమెరికాలోని 13 ప్రాంతాల్లో నల్లవారిని వ్యవసాయ పనికి అధికంగా వాడారు. పత్తి విత్తనాలు కనుగొనడం, పత్తి

పంట లాభసాటిగా మారడం కూడా బానిసల పాలిట శాపం అయ్యింది. బానిసలు కేవలం వ్యవసాయ పనులే కాకుండా నావికులుగా, మత ప్రచారకులుగా, ఇంటి పనిమనుషులుగా, అధ్యాపకులుగా, వడ్రంగి, కమ్మరి పనులు చేసేవాళ్ళుగా, సంగీతం మాస్టార్లుగా, అకౌంటెంట్లుగా కూడా పని చేసేవారు. 1775లో అమెరికా విప్లవం ప్రారంభం అయ్యింది. స్వేచ్ఛ, సమానత్వం నినాదాలు తెల్లవాళ్ళను, నల్లవాళ్ళనూ బ్రిటీషు వలసాధిపత్యానికి వ్యతిరేకంగా ఏకం చేశాయి. వీరోచిత పోరాటం చేశారు. అమెరికా విముక్తి పొందింది. కాని, బానిసత్వం మాత్రం రద్దు కాలేదు. స్వేచ్ఛ కోసం పోరాడిన బానిసలను తెల్లవాళ్ళు మోసం చేశారు. ముందే చెప్పినట్టు 1793లో పత్తి వంగడాలను కనుగొనడం బానిస వ్యవస్థ కొనసాగడానికి హేతువైంది. స్వతంత్ర అమెరికా ఆర్థిక పునాది వ్యవసాయం మీద ఆధారపడి ఉంది. పత్తి ఉత్పత్తి లాభసాటి వ్యవహారంగా మారింది. పత్తి పండించడానికి అవసరమైన మానవ శ్రమ బానిసల దగ్గర ఉంది. అందువల్ల బానిసత్వం రద్దును వ్యతిరేకించారు. దక్షిణ అమెరికా తెల్ల భూస్వాములు ససేమిరా అంగీకరించలేదు. 1860 నాటికి దక్షిణాదిలోని అనేక ప్రాంతాలు నల్లవాళ్ళ శ్రమను దోచి సుసంపన్నమైనవి. బానిస వ్యవస్థను రద్దు చేయాలని అనేక సంఘాలు ఏర్పడ్డాయి. అనేక చారిత్రక పత్రాలు, కరపత్రాలు ప్రచురించారు. 1827లో మొదటిసారి నల్లవాళ్ళ కోసం నల్లవాళ్ళు నిర్వహించే పత్రికను స్థాపించారు. 1833లో బానిసత్వ వ్యతిరేక అమెరికన్ సంఘం (American Anti Slavery Society) ఏర్పడింది. అమెరికా రాజ్యాంగం బానిసత్వానికి చట్టబద్ధత నిస్తుందని విమర్శించారు. బానిసత్వంలో మగ్గుతున్న వారిని కాపాడ్డానికి బానిసలు భూగర్భ రైలు మార్గాన్ని తవ్వారు. ఈ రహస్య మార్గం గుండా అనేక మందిని కాపాడి ఆఫ్రికా తరలించారు. ఈ ప్రయత్నానికి అమెరికా చరిత్రలో విశిష్ఠ స్థానం ఉంది.

అమెరికా అంతర్యుద్ధం (1861-1865) కూడా బానిసత్వానికి చరమ గీతం పాడలేకపోయింది. కాని అనేకమంది నల్లజాతి బానిసలు బానిసత్వం రద్దవుతుందని ఆకాంక్షించారు. అనేకమంది బానిస యజమానులు వ్యతిరేకిస్తున్నా కూడా బానిసల ఆకాంక్షలను గౌరవిస్తూ 1863, జనవరి 1వ తేదిన అబ్రహం లింకన్ బానిసత్వాన్ని రద్దు చేస్తూ ప్రకటన మీద సంతకం పెట్టాడు. కాని బానిస యజమానుల కొమ్ముగాసే ఒక మిలిటరీ అధికారి నేతృత్వంలో బానిసలను అణచివేయడానికి కూక్లక్స్ క్లాన్

అనే తీవ్రవాద సంస్థను స్థాపించారు. ఈ దుర్మార్గులు అనేకమంది బానిసలను చాలా క్రూరంగా హతమార్చారు. అబ్రహం లింకన్ కూడా చంపబడ్డాడు. అంతర్యుద్ధం ముగిసింది. అమెరికా ప్రభుత్వం పునర్నిర్మాణం చేపట్టింది. అనేక రాష్ట్రాలకు నల్లజాతి వారసులు గవర్నర్లు అయ్యారు. అమెరికా పార్లమెంటు సభ్యులుగా పోటి చేసి గెలిచారు. అధికారం అనుభవించారు. కాని, తెల్లవాళ్ళు అనేకమంది నల్లవారిపై అవినీతి ఆరోపణలు చేసి కేసుల్లో ఇరికించారు. ఈ పునర్నిర్మాణ కాలంలో ఉత్తర అమెరికాలో రిపబ్లికన్ పార్టీ బలంగా ఉండేది. దక్షిణ ప్రాంతంలో కూడా అనేక మంది నల్లజాతీయుల మద్దతు ఆ పార్టీ పొందింది. కాని, కూ క్లక్స్ క్లాన్ తీవ్రవాదులు అనేక మంది రిపబ్లికన్ పార్టీ నాయకులను హత మార్చారు. డెమొక్రటిక్ పార్టీకి తీవ్రవాదులు అండగా ఉన్నారు. క్రమంగా డెమొక్రటిక్ పార్టీ బలపడింది. ఆ పార్టీ బలపడ్డానికి దారుణమైన పద్ధతులు అనుసరించారు. *జిమ్ క్రో సిస్టమ్ అమలు పరిచారు. చదువు, పన్ను కట్టగలిగే శక్తి వంటి అనేక షరతులు పెట్టి వాళ్ళకున్న ఓటింగ్ హక్కును రద్దు చేశారు. 1955 వరకు నల్లవాళ్ళకు విడి రైలు బోగీలు, హోటళ్ళు, విడిది ఏర్పాట్లు చేశారు. చదువుకునే అవకాశం రద్దు చేశారు. బస్‌లో కూర్చునే హక్కు కూడా లేదు. రోజా పార్క్ అనే నల్లజాతి హక్కుల ఉద్యమ కార్యకర్త ప్రతిఘటించే వరకు పౌర హక్కులు లేవు. డబ్ల్యూ.ఇ.బి.డు బోయిస్ వంటి విద్యావంతులైన నల్లజాతి మేధావులు సాగించిన చట్టపరమైన పోరాటం మార్టిన్ లూథర్ కింగ్ ప్రవేశంతో పౌర హక్కుల ఉద్యమంగా పరిణమించింది. అయితే నల్లజాతీయులు అంతర్యుద్ధం కాలంలోనూ, అంతకు ముందు బ్రిటీషు వ్యతిరేక పోరాటంలోనూ పొందిన అనుభవాలతో అమెరికా ప్రభుత్వంతో అనేక సార్లు హక్కుల గురించి సంప్రదింపులు జరిపారు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో యుద్ధ రంగంలోని అనేక దశల్లో పాల్గొని సత్ఫలితాలు చూపించారు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో అనేక కాంట్రాక్టులు సాధించారు. వేలాదిమంది యుద్ధంలో సైనికులుగా పాల్గొని మెడల్స్ సాధించారు. ఆర్థికంగా బలపడ్డారు. కానీ, దక్షిణ అమెరికాలోని నల్లజాతిని దోచి బతుకుతున్న తెల్లవాళ్ళు మాత్రం వారిని సమానంగా చూడలేదు. కనీస పౌర హక్కులు కూడా ఇవ్వలేదు. అయితే ఉత్తర అమెరికాలోని నల్లజాతీయులు సాపేక్షంగా స్వేచ్ఛా జీవులు. దక్షిణ అమెరికాలో మగ్గిపోతున్న

---

★ జిమ్‌క్రో సిస్టమ్ : అన్ని విషయాల్లో, అన్ని చోట్లా నల్లవారిని విడివిడిగా ఉంచే పద్ధతి.

నల్లవాళ్లు వాళ్ల కొరకు రాజకీయంగా, చట్టపరంగా పోరాడుతూ ఉండే వాళ్ళు. బుకర్ టి. వాషింగ్టన్ బ్రతికి ఉన్న కాలంలోనే అతని ప్రతిష్ట దిగజారింది. ఆయన లొంగుబాటు ధోరణిని డుబోయిస్ వంటి విద్యావేత్తలు ఎదిరించారు. నల్లజాతి నిమ్నస్థానం అంగీకరించి తెల్లవాళ్ళ ఆధిక్యతను అంగీకరించాలని ఆయన చేసిన ప్రతిపాదనను కొత్తతరం తోసిపుచ్చింది. 1915లో ఆయన మరణించారు. అప్పటికే డుబోయిస్ విద్యావేత్తగా, హార్వర్డ్ విశ్వ విద్యాలయం ఆచార్యుడుగా పని చేస్తున్నాడు. ఆయన క్రమంగా హక్కుల ఉద్యమంలోకి ప్రవేశించారు. 1955లో రోజా పార్క్ కేసు గెలువడంలో ఆయన చాలా కీలక పాత్ర పోషించాడు. ఇది రేఖా మాత్రంగా నల్లజాతి నేపథ్యం. ఇప్పుడు నల్లజాతి ముస్లింల గురించి మాట్లాడుకుందాం.

నల్లజాతి ముస్లిం ఉద్యమ చరిత్ర :

నల్లజాతి ముస్లింల ఉద్యమం మొదటి ప్రపంచ యుద్ధం (1914-1918) ఆరంభం కన్నా ముందే మొదలైంది. నల్లజాతి ముస్లింలు స్వయం సమృద్ధి, స్వయం ప్రతిపత్తి సాధించే లక్ష్యంతో రెండు పాయలుగా ఈ ఉద్యమం ప్రారంభమైంది. మూరిష్ సైన్స్ టెంపెల్ ఆఫ్ అమెరికాను 1913లో ప్రాఫెట్ డ్ర్యూ అలీ స్థాపించాడు. మార్క్యస్ గర్వే, యూనివర్సల్ నీగ్రో ఇంప్రూవ్‌మెంట్ అసోసియేషన్ (Universal Negro Improvement Association) ను 1914లో స్థాపించాడు. అలీ మరణానంతరం ఆయన వారసుడు వాలస్ డి. ఫర్డ్ నాయకత్వం స్వీకరించాడు. 1930లో ఫర్డ్ డెట్రాయిట్‌లో ఒక టెంపుల్ స్థాపించాడు. ప్రస్తుతం అది మసీదుగా పిలువబడుతుంది. నేషన్ ఆఫ్ ఇస్లాంకు అదే నాందిగా చరిత్రకారుల స్థిరమైన అభిప్రాయం. చికాగోలో 1933లో ఒక మసీదు నిర్మించాడు. 1934లో ఆకస్మికంగా వాలస్ డి. ఫర్డ్ అదృశ్యమయ్యాడు. అతని జాడ తెలియకుండా పోయింది. ఆ సమయంలో ఎలైజా ముహమ్మద్ ఫర్డ్ వారసుడిగా బాధ్యతలు స్వీకరించాడు. అప్పటి నుంచి 1975లో అతడు వృద్ధాప్యంతో కాలం చేసే వరకు అతడే నేషన్ ఆఫ్ ఇస్లాంకు అధిపతి. ఇతడి అసలు పేరు ఎలైజా పూలే. ఫర్డ్‌కు అనేక మారు పేర్లు ఉన్నాయి. వాటిలో ముహమ్మద్ ఒకటి. పూలే తన గురువు చిహ్నంగా ఎలైజా ముహమ్మద్‌గా పేరు మార్చుకున్నాడు. ప్రవక్తగా, దైవదూతగా, ఒక దశలో తానే అల్లాగా కూడా ప్రకటించుకుని అమెరికన్ నల్లజాతికి తప్పుడు ఇస్లాంను బోధించిన వ్యక్తి. ఇతడే మాల్కం ఎక్స్ గురువు. ఇతడి అనైతిక జీవితం మాలల్కం ఎక్స్‌ను ఇస్లాం గురించి

పునరాలోచించేలా చేసింది. ప్రవక్త, దైవదూతగా పూజించిన ఎలైజా ముహమ్మద్ తన పాలిట మృత్యు దూతగా మారాడని మాల్కం ఎక్స్ చివరి రోజుల్లో గ్రహించాడు. ఈర్ష్య, అసూయ, అనైతికత మూర్తీభవించిన ఎలైజా ముహమ్మద్ 1965లో మాల్కం ఎక్స్ తన అనుచరులతో హత్య చేయించాడు. ఈ వివరాలన్నిటిని మీరు ఈ పుస్తకంలో తెలుసుకుంటారు. నల్లజాతి ముస్లింల ప్రధాన ఉద్యమం నేషన్ ఆఫ్ ఇస్లాం. ఈ ఉద్యమంలోని అతి ముఖ్యమైన డిమాండ్ అమెరికా దేశంలో నల్లజాతి వాళ్ళకు ప్రత్యేక విడి దేశం. ఆఫ్రికన్-అమెరికన్స్ నిజమైన మూలాలు ఆఫ్రికా ఖండంలో ఉన్నాయి. కాని రక్తసంబంధీకుల చిరునామాలు అస్పష్టంగానైనా తెలియవు. అంతేకాక, అమెరికాలో సుదీర్ఘకాలం పాటు జీవించడం వల్ల చాలామంది ఆఫ్రికన్ అమెరికన్స్‌కు ఆఫ్రికా ఖండం వెళ్ళడం ఇష్టం లేదు. కాని, తెల్లవాళ్ళ దోపిడి కింద నలగడం కూడా ఇష్టం లేదు. తెల్లజాతి ఆధిపత్యం వహిస్తున్న అమెరికాలో నల్లజాతి జీవించడం వల్ల ఎలాంటి న్యాయమూ జరగదు. అందుకే నల్లజాతీయులకు విడిగా ఒక స్వతంత్ర దేశం ఉండాలని నల్లజాతి ముస్లిం ఉద్యమం డిమాండ్ చేసింది. ఈ డిమాండ్‌ను అంగీకరించకపోతే కనీసం అమెరికాలోనే ఒక రాష్ట్రం ప్రత్యేకంగానైనా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. నల్లజాతిని నల్లజాతీయులు పాలించు కున్నపుడే జాతిపరమైన వివక్ష, దోపిడి అంతం అవుతాయని ఎలైజా ముహమ్మద్ ప్రబోధించాడు. గాంధేయవాదులు తెల్లవాళ్ళతో సఖ్యతను, సహజీవనాన్ని ప్రబోధిస్తూ ఉండగా నల్లజాతి ముస్లిం నాయకులు మాత్రం వేర్పాటు వాదాన్ని బలంగా ప్రచారం చేశారు.

ఎలైజా ముహమ్మద్ తన వాదనతో, వాక్ పటిమతో అనేకమందిని ఇస్లాంలోకి ఆకర్షించాడు. కాని నల్లజాతి ముస్లిం ఉద్యమం ప్రజా ఉద్యమంగా, ప్రభావితం చేయగల శక్తిగా ఎదిగింది మాత్రం మాల్కం ఎక్స్ ఇస్లాంలోకి మారిన తరువాతే. మాల్కం లిటిల్ అరాచకుడిగా నేరమయ జీవితం గడిపిన కాలంలో చేసిన నేరానికి పదేళ్ళు జైలు శిక్ష అనుభవించాడు. ఆ క్రమంలోనే ఆయన ఎలైజా ముహమ్మద్ బోధనలకు ఆకర్షితుడయ్యాడు. తెల్లవాడు 'దయ్యం' అని, ఆ దయ్యం నల్లవాళ్ళను బానిసలుగా మార్చి అన్ని విధాలుగా దోపిడి చేస్తున్నారని ఎలైజా వివరించాడు. జైలులో అనేక గ్రంథాలు చదివాడు. ఆ జైలులో జరిగే చర్చా గోష్ఠుల్లోనూ మేధో చర్చల్లోనూ పాల్గొని మాల్కం క్రమంగా మేధావిగా మారాడు.

నిరంతరం ఎలైజా ముహమ్మద్‌తో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపించాడు. అనేక సందేహాలను నివృత్తి చేసుకున్నాడు. జైలు జీవితం ముగిసింది. నేరుగా వెళ్ళి ఎలైజా ముహమ్మద్ ప్రసంగిస్తున్న మసీదులో అందరి మధ్య కూర్చున్నాడు. అప్పుడే అందరి ముందుకు మాల్కంను పిలిచి పరిచయం చేశాడు. తనకు ఇక నుంచి మాల్కం అత్యంత విశ్వాసపాత్రుడు అని ప్రకటించాడు. తన నేషన్ ఆఫ్ ఇస్లాంను విస్తరించే మాల్కంకు పని అప్పగించాడు. మాల్కం ఆ ఉద్యమంలోకి ప్రవేశించే వరకే ఎలైజా ముహమ్మద్ ప్రభ. ఆ తర్వాత మాల్కం ఎక్స్ ఆ ఉద్యమాన్ని నడిపాడు. వందల సంఖ్యలో ఉన్న ముస్లింలు వేలాదిగా తయారు కావడానికి మాల్కం అహర్నిశలు కృషి చేశాడు. ముస్లింల కోసం, నేషన్ ఆఫ్ ఇస్లాం ఉద్యమ ఉద్దేశాలను ప్రజలకు అందించడం కోసం 'ముహమ్మద్ స్పీక్స్' అనే పత్రిక ప్రారంభించాడు. అతి తక్కువ కాలంలోనే అనేకమందికి చేరువయ్యింది. మాల్కం ప్రసంగ వ్యూహం మరింత శక్తివంతమైంది. మొదట చరిత్రలో జరిగిన దౌర్జన్యాలను వివరించి మానసికంగా ఒక ఆవేశం తెప్పించేవాడు. ఆ తరువాత బానిస జీవితానికి కారణం అవుతున్న తెల్లవాళ్ళ మీదికి ఆ కోపాన్ని మళ్ళించేవాడు. తెల్లవాడి మీద కసిని, ద్వేషాన్ని కలిగించేలా నల్లవాళ్ళను నిర్దాక్షిణ్యంగా క్రూరంగా హింసించిన చరిత్రను వర్ణించేవాడు. వర్తమానంలో తెల్లదయ్యం క్రిస్టియానిటి మాటున బానిసత్వాన్ని బోధిస్తున్న తీరును వివరించి ఇస్లాం సరైన జీవన మార్గంగా, విలువలతో కూడిన ధార్మిక పంథాగా అర్థం చేయించేవాడు. తన మాటల మంత్రశక్తితో వేలాది నల్లవాళ్ళను ఆకట్టుకున్నాడు.

ఎలైజా ముహమ్మద్ కన్నా మరింత ముందుకు వెళ్ళి కొత్త ప్రతిపాదనలు చేశాడు. నల్లవాళ్ళు స్వతంత్రులు కావడానికి ఆర్థిక స్వావలంభన సరైన విధానం అని గుర్తించాడు. అందుకోసం నల్లవాళ్ల మార్కెట్‌ను సృష్టించాలని ఉద్బోధించాడు. నల్లజాతి కల్చర్, రెస్టారెంట్లు, పరిశ్రమలు, స్టోర్ హౌజ్‌లు, రిటైల్ షాపులు వంటి సమస్త రంగాలను నల్లజాతి నిర్మించుకోవాలని ప్రతిపాదించాడు. ఈ ఆర్థిక పరిపుష్టిని సుసాధ్యం చేయడానికి ముస్లింలు పరస్పరం సహకరించుకోవాలని సూచించాడు. విలువలతో కూడిన జీవితం సాగించడానికి స్త్రీలు, పురుషులకు ఇస్లాం ప్రవచిస్తున్న విలువలను పాఠ్యాంశాలుగా బోధించాడు. ఇందుకు అవసరమైన శిక్షణా తరగతులను సతీమణితో కలిసి నిర్వహించాడు. 45 రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన పాఠశాలలను

స్థాపించాడు. తెల్లవాళ్ళు దాడులు చేసినప్పుడు ఆత్మరక్షణ కొరకు, సాటి నల్లవారిని కాపాడడానికి శారీరక ధారుడ్యం అవసరమని గుర్తించి అందుకొరకు పురుషులకు కరాటే, జూడో వంటి యుద్ధ విద్యల్లో శిక్షణ ఇప్పించాడు. తాగుడు, మాదక ద్రవ్యాలు తీసుకోవడం వంటి అలవాట్లు మనిషిని దుర్బలుణ్ణి చేస్తాయని వాటికి దూరంగా ఉండాలని బోధించాడు. తెల్లజాతి ఒక పథకం ప్రకారం వాటికి నల్లవాళ్ళను బానిసలు కావిస్తుందని విమర్శించేవాడు. క్రమశిక్షణ, నైతిక విలువలు నల్లజాతికి అత్యంత ముఖ్యమైనవని అర్థం చేయించగలిగాడు. స్త్రీల మీద మాత్రం కాస్త అసహనం ప్రదర్శించేవాడు. వాళ్ళ విశ్వసనీయతను మొదట్లో శంకించేవాడు. కాని బెట్టీతో వివాహం తరువాత చాలా విషయాలలో స్త్రీలు మగాళ్ళ కన్నా విశ్వసనీయులని తెలుసుకున్నాడు.

ఒకవైపు ఇస్లాం ప్రచారం చేస్తూనే మరో వైపు తెల్లవాళ్ళ దోపిడీ విధానాలను వ్యతిరేకించాడు. ఇజ్రాయిల్ పాలస్తీనా మీద దాడి చేస్తే జూడాయిక్ సామ్రాజ్యవాద దాడిగా అభివర్ణించి తీవ్రంగా ఖండించాడు. వియత్నాం మీద అమెరికా యుద్ధం చేయడాన్ని తీవ్రంగా నిరసించాడు. సెయింట్ ఆగస్టన్‌లో తెల్లవాళ్ళ తీవ్రవాద సంస్థ కూ క్లక్స్ క్లాన్ మూకలు నల్లవాళ్ళపై దాడి చేశారు. ఆ సందర్భంలో మార్టిన్ లూథర్ కింగ్‌కు ఒక లేఖ రాశాడు. తెల్లవాళ్ళను అదుపులో ఉంచడానికి, నల్లవారికి రక్షణ కల్పించడానికి ఫెడరల్ సైన్యాన్ని పంపించమని అమెరికా ప్రభుత్వాన్ని అడగమని ఆ లేఖలో సూచించాడు. ప్రభుత్వం అందుకు సంసిద్ధతను చూపకపోతే ఒక్క ఫోను చేస్తే తన ముస్లిం వీరులను అక్కడికి పంపిస్తాను అన్నాడు. భయం ఎలా ఉంటుందో వాళ్ళకు రుచి చూపిస్తామని సంఘీభావ సందేశం పంపించాడు. మాల్కం ఎక్స్‌కు మార్టిన్ లూథర్ కింగ్ పౌరహక్కుల ఉద్యమం పట్ల సానుభూతి ఉండేది కాదు. మార్టిన్ లూథర్ కింగ్ ప్రసిద్ధి కాంచిన 'ఐ హావ్ ఏ డ్రీమ్' ఉపన్యాసాన్ని విమర్శించాడు. కింగ్ అందమైన కలలు కంటూ ఉంటే మొత్తం నల్లజాతి ప్రజలు మాత్రం కాళరాత్రులు చవి చూస్తున్నారని ఎద్దేవా చేసేవాడు. కింగ్ సహజీవనం ప్రతిపాదిస్తే మాల్కం వ్యతిరేకించాడు. వేర్పాటు వాదమే నల్లజాతికి మేలు చేస్తుందని చెప్పాడు. తెల్లవాళ్ళతో సహజీవనం లేదా మైత్రిని నల్లజాతీయులు నిర్ద్వంద్వంగా తోసుపుచ్చాలని ప్రతిపాదించాడు.

మాల్కం ఉపన్యాసాలతో ప్రభావితులైన అనేకమంది ఇస్లాంలోకి మారారు.

స్వతంత్ర ఆర్థిక వ్యవస్థను నిర్మించుకున్నారు. తెల్లవాళ్ళ మార్కెట్‌కు ప్రత్యామ్నాయ మార్కెట్‌ను నిర్మించుకున్నారు. మాల్కం సభ పెడితే లక్షలాదిగా జనం కదిలింది. క్రమంగా మీడియా మాల్కంను అతివాదిగా, దుందుడుకు స్వభావం కలవాడిగా, ముస్లింలను రెచ్చగొడుతున్న మతవాదిగా చిత్రించడం మొదలు పెట్టింది. మాల్కం ఉద్యమంలోకి వచ్చిన అనతి కాలంలోనే ప్లే బోయ్ పత్రికలో అలెక్స్ హేలీ మాల్కం ఎక్స్‌తో ఒక ఇంటర్వ్యూ ప్రచురించాడు. అప్పటికి అతని వయసు 36 సంవత్సరాలు. చాలా చిన్న వయసులోనే ఆయన ప్రపంచ దృష్టిని ఆకర్షించాడు. ఆ తరువాత ముస్లింల సంఖ్య పెరుగుతూ ఉన్న కొద్ది, ఆర్థికంగా ఆ సమూహం బలపడుతున్న కొద్దీ అమెరికా మీడియా మాల్కం అభిప్రాయాలకు ప్రాధాన్యతనివ్వడం ప్రారంభించింది. దేశ అంతర్గత విషయాలతో పాటు విదేశీ వ్యవహారాల మీద, విదేశాంగ విధానం మీద కూడా మాల్కం ఆలోచనలను మీడియా విస్తృత ప్రచారం చేసింది. ఊహించలేని విధంగా ప్రజల మధ్య మాల్కం ప్రతిష్ట పెరగడం ఎలైజా ముహమ్మద్‌ను భయపడేలా చేసింది. అంతకు మించి అసూయ పడేలా చేసింది. క్రమంగా ఉద్యమం మాల్కం హస్తగతం అవుతుందని ఎలైజా భయపడ్డాడు.

అప్పటికే ఎలైజా తన ఆఫీసు సిబ్బందితో లైంగిక సంబంధం పెట్టుకున్న విషయం బహిరంగం అయ్యే పరిస్థితి వచ్చింది. ఆరోపణలు బాహాటంగా వచ్చాయి. అవి వాస్తవమని నిర్ధారించుకుని మాల్కం ఎంతో వ్యధ చెందాడు. ప్రవక్త, దైవదూతగా విశ్వసించిన వ్యక్తి, ఇస్లాంకు విరుద్ధంగా అనైతిక కార్యకలాపాలకు పాల్పడటం బాధించింది. తిరిగి మళ్ళీ ఖురాన్ చదివాడు. బైబిల్ చదివాడు. ఎలైజా ముహమ్మద్‌ను రక్షించాలని, అందుకు అవసరమైన ఉటంకింపుల కొరకు పవిత్ర గ్రంథాలు అధ్యయనం చేశాడు. తాను చేసింది సరైందేనని, తనూ కొన్ని బలహీనతలకు అతీతుణ్ణేమీ కాదని ఎలైజా ముహమ్మద్‌ను కలిసి మాట్లాడినప్పుడు సమర్ధించు కున్నాడు. అది మరింత ఇబ్బంది కలిగించింది. ఆ తరువాత ఒక సభలో ప్రసంగిస్తూ ఉండగా అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్. కెన్నడిని ఎవరో అగంతకులు కాల్చి చంపారనే వార్త తెలిసింది. మీడియా వాళ్ళు మాల్కం అభిప్రాయం అడిగారు. తెల్లజాతి పాలకులు నాటిన విష బీజాలు ఇప్పుడు కోత కొస్తున్నాయని వ్యాఖ్యానించాడు. ఈ ప్రకటనను తెల్లవాళ్ళ మీడియా వక్రీకరించింది. ఆ హత్యను సమర్ధిస్తున్నట్టు వార్తలు ప్రచురించింది.

ఈ సంఘటనను ఒక సాకుగా చూపి ఎలైజా ముహమ్మద్ మాల్కం ఎక్స్‌ను నేషన్ ఆఫ్ ఇస్లాం నుంచి బహిష్కరించాడు. తాను కొంత కాలం పాటు మౌనం పాటిస్తే తిరిగి ఉద్యమంలోకి స్వీకరిస్తామని ఎలైజా ముహమ్మద్ ప్రకటించాడు. దీనితో మాల్కం తీవ్రంగా మనస్తాపం చెందాడు. తన అనైతిక వర్తనను లోకానికి తెలుపుతాడని జడిసి మాల్కంను చంపడానికి ఆదేశాలు జారీ చేశాడు. ఆ సమయంలో మాల్కం తన సొంత ఉద్యమాన్ని నిర్మించడానికి పూనుకున్నాడు.

దాని కన్నా ముందు ఇస్లాం దేశాలను సందర్శించాడు. వివిధ ముస్లిం దేశాలు తిరిగాడు. ఆయా దేశాధ్యక్షులతో సమావేశమయ్యాడు. ఒక దేశ అధ్యక్షుడు పొందగలిగిన గౌరవాన్ని అందుకున్నాడు. కాని, తన పూర్వ విశ్వాసాలను ఈ పర్యటన మార్చి వేసింది. అప్పటి వరకు ముస్లింలంతా ప్రపంచమంతటా నల్ల రంగుతో ఉంటారనుకున్నాడు. కాని, చాలా అరబ్ దేశాల్లో ముస్లింలు తెల్లగా, గోధుమరంగుతో ఉండడం గమనించాడు. ఒకప్పుడు క్రీస్తు ఏ రంగులో ఉంటాడని ప్రశ్నించినవాడు. తెల్లదయ్యం సృష్టించిన మరో దయ్యమే క్రీస్తు అని ఆవేశపడ్డ వ్యక్తి. దేవుడికి రంగు లేదని, అతడు నిర్వికారుడని కొత్తగా తెలుసుకున్నాడు. తెల్లవాళ్ళలో కూడా నల్లవాళ్ళ విముక్తికి పాటుపడే వాళ్ళ నిజాయితీని గుర్తించాడు. వివిధ దేశాలలో దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా విప్లవిస్తున్న విద్యార్థులు, యువకులు, మేధావులు, నాయకులను కలుసుకున్నాడు. తన విశ్వాసాలను పరీక్షించుకున్నాడు. ఆఫ్రికన్-అమెరికన్‌ల విముక్తికి ఇతర ఎథ్నిక్ (మైనార్టీ) సమూహాల మద్దతు అవసరమని గుర్తించాడు. మతంతో సంబంధం లేకుండా ఆఫ్రికన్-అమెరికన్‌ల నందరినీ ఐక్యం చేయాలని, బలమైన ఐక్య సంఘటన నిర్మించాలని నిర్ణయించుకున్నాడు.

అమెరికా తిరిగి వచ్చి తన అనుచరులతో కలిసి 'నిజమైన ఇస్లాం'ను అమెరికాలో ప్రచారం చేయడానికి ఉద్యుక్తుడయ్యాడు. ఎలైజా ముహమ్మద్ ఇస్లాం పేరిట బోధించింది తప్పని, ఇస్లామిక్ దేశాల్లో ఉన్న సున్నీ మార్గ ఇస్లాం వాస్తవమైందని ప్రజలకు చెప్పాడు. నల్లజాతి విముక్తి రాజకీయమైందని, నల్లజాతి విముక్తికి సంపూర్ణ సహకారం అందించే తెల్లవాళ్ళను కూడా విశ్వసించాలని అన్నాడు. అయితే ఆ పోరాటం నల్లవాళ్ళ నాయకత్వంలో మాత్రమే జరగాలని ప్రకటించాడు. నల్లవాళ్ళను మతంతో నిమిత్తం లేకుండా ఐక్యం చేయడానికి 'ఆర్గనైజేషన్ ఆఫ్ ఆఫ్రికన్-అమెరికన్ యూనిటీ' అనే సంస్థను స్థాపించాడు.

కానీ, శత్రువులు నీడలా వెంటాడుతూనే ఉన్నారు. తనను మృత్యువు వెన్నాడుతూ ఉందని అతనికి చాలా స్పష్టంగా తెలుసు. ఒక సందర్భంలో ఇలా చెప్పాడు. 'నేనూ, కింగ్ ఇద్దరమూ రెండు భిన్నమైన మార్గాల్లో నల్లజాతి కొరకు పోరాడుతున్నాం. మా ఇద్దరి అంతు చూడకుండా అమెరికా శ్వేత దురహంకారులు ఊర్కోరు. మేమిద్దరం హత్యకు గురికావడం మాత్రం తథ్యం. అయితే ఎవరు ముందు హత్య చేయబడుతారు అనేదే ప్రశ్న' అని చమత్కరించాడు. ఎలైజా ముహమ్మద్‌ను ప్రవక్తగా విశ్వసిస్తున్న ముస్లింలు తనను తప్పకుండా హత్య చేస్తాని మాల్కం లోకానికి తెలియ చేస్తూనే ఉన్నాడు. అనుమానించినట్టుగానే, మాల్కం మీద హత్యాయత్నం జరిగింది. తన మరణానికి రెండు రోజుల ముందు ఒక అరబ్ పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చాడు. ఆ పత్రిక సంపాదకులు పంపిన ప్రశ్నలకు సమాధానం రాస్తూ ఎలైజా ముహమ్మద్ తనను హత్య చేయడానికి మనుషులను నియమించాడని, తానెప్పుడైనా చనిపోవచ్చునని చెప్పాడు. చావు గురించి భయపడ్డం లేదనీ, ముసలివాడిగా చావడం కన్నా యువకుడిగా చావడమే ఆనందమనీ చెప్పాడు. ఆ ఇంటర్వ్యూ ప్రశ్నలకు సమాధానం రాస్తున్న సమయం అర్ధరాత్రి. ఆ వేళ కొంతమంది ఇంటి మీద బాంబులు విసిరారు. భార్యా పిల్లలతో బతికి బయటపడ్డాడు. తిరిగి అదే రాత్రి ఆ ఇంటర్వ్యూ పూర్తి చేశారు. ఈ ఇంటర్వ్యూని మాల్కం మరణించిన తరువాత ఆ పత్రిక ప్రచురించింది. అర్ధరాత్రి దాడి జరిగిన రెండు రోజుల తరువాత (1965, ఫిబ్రవరి ఒకటి) ఆఫ్రికన్ అమెరికన్ యూనిటీ సభలో వేదిక మీంచి మాట్లాడుతూ ఉండగా కొంతమంది సాయుధులైన దుండగులు అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. మాల్కం ఎక్స్ నెత్తుటి మడుగులో నేల కొరిగాడు. దాడి చేసి వారిలో ఒకణ్ణి అక్కడి ప్రజలు పట్టుకొని చితకబాదారు. ఆవేశంలో ఊగిపోయారు. పోలీసులు అడ్డుకుని ఉండకపోతే చంపేసేవాళ్ళే. చావు బతుకుల మధ్య ఆ ఆగంతకున్ని ఆసుపత్రిలో చేర్చారు. కాని, మాల్కం ఎక్స్ మరణంతో ప్రపంచం అంతా దిగ్భ్రాంతి చెందింది. అమెరికా అంతా దుఃఖఛాయలు అలుముకున్నాయి. అమెరికాలోని పత్రికలన్నీ ఈ దారుణాన్ని ఖండించాయి. సంపాదకీయాలు ప్రచురించాయి. అనేక మంది నాయకులు, మేధావులు, రచయితలు ఈ దారుణ హత్యను ఖండించారు. మాల్కం నిరూపమానమైన ఉద్యమ జీవితాన్ని, అసాధారణమైన మేధస్సును కొనియాడారు. కాని, ఎలైజా ముహమ్మద్ మాల్కం ఎక్స్ మరణం పట్ల సంతృప్తి ప్రకటించాడు. తనకు ఎదురు తిరిగినందుకు అల్లా

విధించిన శిక్షగా అభివర్ణించుకున్నాడు. కాని, మరణం తరువాత మాల్కం ప్రభావం ఘనమైంది. నెత్తురు మండే కొత్త యువకులకు మాల్కం ఎక్స్ మార్గం ఆదర్శమైంది. బ్లాక్ పాంథర్స్ ఉద్యమం సాయుధ పోరుకు సిద్ధపడింది. మాల్కం ఎక్స్ ఆలోచన విధానం, మార్క్సిజం, మావోయిజం మార్గం ప్రకటించుకున్నారు. మార్టిన్ లూథర్ కింగ్ అహింసా విధానం అమెరికా పాలకులను ఏమీ చేయలేదని విమర్శించారు. మౌలిక మార్పు రావాలంటే అమెరికా తెల్లజాతి దోపిడీ వ్యవస్థను సమూలంగా మార్చాలని, సామ్యవాద వ్యవస్థ స్థాపించాలని కొంతమంది సాయుధ సమరం ప్రారంభించారు.

మాల్కం ఎక్స్ ప్రభావం మార్టిన్ లూథర్ కింగ్ మీద కూడా ఉంది. పౌర హక్కుల నేతగా అనేక ఉద్యమాలు నడిపిన మార్టిన్ ఆఫ్రికన్-అమెరికన్‌ల ఆర్థిక పరిస్థితి మీద దృష్టి సారించలేదు. పూర్తి స్థాయి ఉద్యోగాలు కల్పించాలని, నల్లజాతి ప్రజల ఆదాయ వృద్ధికి అవసరమైన చట్టం చేయాలని డిమాండ్ చేశాడు. ఆర్థికపరమైన డిమాండ్లను సాధించడానికి మార్టిన్ లూథర్ కింగ్ 'పూర్ పీపుల్స్ క్యాంపెయిన్' (Poor People's Campaign) నిర్వహించాడు. అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో లక్షలాదిమంది ప్రజలతో ప్రదర్శన చేయాలని కింగ్ తలపోశాడు. కాని మాల్కం అనుమానం నిజమైంది. కూ క్లక్స్ క్లాన్ తీవ్రవాదులు కింగ్‌ను పొట్టన పెట్టుకున్నారు. కింగ్ మరణంతో నల్లజాతీయులు తీవ్రంగా దుఃఖించారు. నల్లజాతి విముక్తికి ప్రయత్నించిన అనేకమంది నాయకులను శ్వేత జాతి దురహంకారులు హత్య చేశారు. అబ్రహం లింకన్ మొదలు కెనడీ వరకు దేశాధినేతలను హత్య చేశారు. కింగ్ హత్య తరువాత ముస్లిం నాయకులను, పౌరహక్కుల నాయకులను హత మార్చారు. శాంతియుత పద్ధతుల్లో పోరాడితే ప్రయోజనం లేదని యువకులు నిర్ణయించుకుని సాయుధ పోరాటానికి సిద్ధపడ్డారు. బ్లాక్ పాంథర్స్ మూవ్‌మెంట్ ముందుకు సాగింది. మాల్కం ఎక్స్ ప్రతిపాదించిన 'నల్లజాతి విప్లవం' వీళ్ళు ఆచరణలో పెట్టారు.

మాల్కం ప్రారంభించిన ముస్లిం ఉద్యమం ఆ తరువాత అమెరికా సంస్కృతిని బహు విధాలా మార్చేసింది. ఆయన ప్రభావం ఆ తరువాత అనేక దశాబ్దాలుగా పని చేస్తూనే ఉంది. రిపబ్లికన్ డెమొక్రటిక్ రాజకీయాల పట్ల నల్లజాతికి ఉన్న భ్రమలను ఆయన బద్దలు కొట్టినంతగా మరెవ్వరూ చేయలేదు. కాని, ప్రస్తుతం

పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. 9/11 సంఘటన తరువాత పని గట్టుకొని ముస్లిం వ్యతిరేకతను అమెరికా సమాజంలో కొంతమంది రైట్ వింగ్ బుద్ధి జీవులు పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ముస్లిం అనగానే అనుమానించే దారుణ పరిస్థితి దాపురించింది. అనేకమంది ముస్లిం యువకులను నిర్బంధించారు. ముస్లిం వ్యతిరేకత ఒక ఫోబియా వలె మారింది. నిజానికి అది ముస్లిం వ్యతిరేకత మాత్రమే కాదు. నల్లజాతి స్వయం ప్రతిపత్తి సాధించి, తెల్లజాతి ఆధిపత్యాన్ని సవాల్ చేస్తున్న ఒక ప్రగతిశీల పరిణామాన్ని వ్యతిరేకించే దశ, కూ క్లక్స్ క్లాన్ దమనకాండను ఇప్పుడు అమెరికా ప్రభుత్వం చేపట్టింది. భారతీయ ముస్లింలు వాళ్ళ దేశభక్తిని ప్రదర్శించుకొని హిందూత్వవాదులను సంతృప్తి పరిచే ఆగత్యం దాపురించిన విధంగా, నల్లజాతి ముస్లింలకూ ఒక భయంకరమైన విషమ పరిస్థితి నెలకొంది. దళితులు సంపదలో వాటా అడుగుతున్న సమయంలో, దళిత మార్కెట్ సృష్టించాలని తపిస్తున్న సందర్భంలో, నయా వలస వాదానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తూనే ఆర్థికంగా బలపడాలని ప్రయత్నిస్తున్న నేపథ్యంలో, విద్యారంగంలో దళిత, వెనుకబడిన, గిరిజనులకు ప్రవేశం కావాలని పోరాడుతున్న చారిత్రక మలుపులో మాల్కం ఎక్స్ ఆలోచనలు ఉత్సాహం ఇస్తాయి. ప్రేరణ నిస్తాయి. అందుకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుంది.

- జిలుకర శ్రీనివాస్

అధ్యాయం - 1

# పీడకల

నేనింకా మా అమ్మ కడుపులో వున్నప్పుడు, ఒక రాత్రి ఒమాహాలోని (నెబ్రెస్కా) మా ఇంటిపై కూక్లక్స్‌క్లాన్ ముఠా వాళ్లు గుర్రాలపై దండెత్తి వచ్చారు. వాళ్లు తుపాకులు చూపి మా నాన్న బైటికి రావాలని భీకరంగా అరుస్తూ ఇంటిని చుట్టుముట్టారు. మా అమ్మ తలవాకిలి దగ్గరికి వెళ్లి తలుపు తీసింది. తాను గర్భవతినని వాళ్లు గుర్తించేందుకు వీలుగా వాకిట్లో నిలబడి, 'నేను ముగ్గురు పసివాళ్లతో వున్నాను. మా ఆయన మతబోధ చేయటానికి మిల్‌వాకీ వెళ్లాడు'' అని సమాధానం చెప్పింది.

వాళ్లు అంతటితో ఊరుకోలేదు. 'ఆఫ్రికాకు మరలండి' అని మార్కస్ గార్వీ ఇచ్చిన నినాదంతో, మా నాన్న ఒమాహాలోని 'మంచి' నీగ్రోల మధ్య 'సమస్య సృష్టించి, వ్యాప్తి' చేయటం 'మంచివాళ్లయిన క్రైస్తవ తెల్ల జాతీయులకు' నచ్చటంలేదు కాబట్టి, తక్షణమే ఊరు విడిచి వెళ్లిపోవాలని, లేదంటే ప్రాణాలు తీస్తామని ఆ నరహంతక ముఠా మా అమ్మను బెదిరించి హెచ్చరించింది.

మా నాన్న పేరు అర్ల్‌లిటిల్. బాప్టిస్ట్ మినిస్టర్‌గా వుంటూ మార్కస్ ఆరెలియస్ గార్వీ నేతృత్వంలోని 'విశ్వ నీగ్రో ఉద్ధరణ సంఘం' (యు.ఎన్.ఐ.ఎ)లో అంకిత భావంతో పనిచేసే కార్యకర్తగా పేరు తెచ్చుకున్నాడు. మా నాన్నలాంటి శిష్యుల సహాయంతో న్యూయార్క్ నగరం హార్లెమ్‌లోని తన కేంద్ర కార్యాలయం నుండే గార్వీ నల్లజాతి పవిత్రతను ప్రచారం చేస్తూ, తమ పూర్వీకుల దేశమైన ఆఫ్రికాకు తిరిగి వెళ్లాలని నీగ్రో ప్రజల్లో ఉత్తేజం కలిగించాడు. ఈ ఒక్క కారణం ఆయన్ను ఈ భూమ్మీదే అత్యంత వివాదాస్పదుడైన వ్యక్తిగా నిలబెట్టింది.

ఆ ముఠా ఇంకా అలాగే అరుస్తూ చివరికి గుర్రాల డొక్కల్లో పొడిచి ప్రతి కిటికీనీ తుపాకీ మడమలతో ఛిన్నాభిన్నం చేస్తూ ఇంటిచుట్టూ దౌడు తీయించింది. ఈ పని పూర్తి కాగానే, భుగభుగమండే దివిటీలు గాలిలో తిప్పుతూ ఎంత అకస్మాత్తుగా వచ్చి పడ్డారో అంతే వేగంగా చీకట్లో కలిసిపోయారు.

మా నాన్న ఇంటికి తిరిగి వచ్చాక కోపంతో ఊగిపోయాడు. అయితే నేను పుట్టే వరకూ అక్కడే వుండాలని నిర్ణయించుకున్నాడు. ఆయన ఆ రోజుల్లో అయినా

ఈ రోజుల్లో అయినా చాలామందిలాగా భయపడే నీగ్రో కాదు. మా నాన్న ఆరడుగుల నాలుగు అంగుళాల ఎత్తు, చాలా నల్లగా వుండేవాడు. ఆయనకు ఒకే కన్ను వుండేది. ఇంకో కన్ను ఎలా పోయిందో నాకు తెలీదు. ఆయన జార్జియాలోని రెనాల్డ్స్ ప్రాంతానికి చెందిన వ్యక్తి. అక్కడే మూడో నాలుగో గ్రేడ్ వరకూ చదివి మానేశాడు. అమెరికాలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ఆత్మాభిమానాలతో ఒక నీగ్రో ఎప్పటికీ బతకలేడనీ, అందుకే నీగ్రో అయినవాడు అమెరికాను తెల్లవాడికే ఇచ్చివేసి తన మూలవాసుల మాతృభూమి అయిన ఆఫ్రికాకు తిరిగి వెళ్లాలని మార్కస్ గార్వేలాగే నాన్న కూడా నమ్మాడు. ఈ కారణంవల్ల ఎంత ప్రమాదకరమైనా సరే ఈ సిద్ధాంతాన్ని తన ప్రజల్లో వ్యాప్తి చేయాలని నిర్ణయించుకున్నాడు. నాన్నవాళ్లు ఆరుగురు అన్నదమ్ములు. వాళ్లలో ముగ్గురిని తెల్లముఠా హత్య చేసింది. ఒక చిన్నాన్నను ఉత్తరప్రాంత పోలీసులు కాల్చి చంపారు. మరో చిన్నాన్న ఒక్కడే మంచానపడి సహజంగా చనిపోయాడు. తెల్లవాడి చేతిలో చనిపోవటం ఇక మా నాన్న వంతు. ముందు నుండీ నా నమ్మకం కూడా అదే. నేను కూడా ఈ ఘర్షణలోనే ప్రాణాలు కోల్పోతాను. ఇందుకు అన్ని రకాలుగా సిద్ధంగానే వున్నాను.

మా నాన్నకు నేను ఏడవ సంతానం. బోస్టన్‌లో వుండగా ఆయన మొదటి భార్యకు ఎల్లా, ఎర్ల్, మేరీ ముగ్గురు పిల్లలు పుట్టారు. ఆ తర్వాత ఫిలడెల్ఫియాలో మా అమ్మను కలిసి అక్కడే ఆమెను పెళ్లి చేసుకున్నాడు. అక్కడే మా పెద్దన్నయ్య విల్‌ఫ్రెడ్ పుట్టాడు. అమ్మా, నాన్న అక్కడి నుండి ఒమాహాకు వచ్చిన తర్వాత హిల్డా, ఫిల్బర్ట్‌లు పుట్టారు.

వీళ్ల తర్వాత నేనే. ఒమాహా ఆసుపత్రిలో 1925 మే 19న నేను పుట్టే నాటికి మా అమ్మకు ఇరవై ఎనిమిదేళ్ళు. ఆ తర్వాత మిల్‌వాకీ వెళ్లాం. అక్కడే రెగినాల్డ్ పుట్టాడు. ఇకపోతే, మా అమ్మ పేరు లూయిలిటిల్. ఆమె గ్రెనెడాలో పుట్టింది. ఆమె పుట్టే నాటికి అదింకా బ్రిటిష్ పాలనలోనే వుండింది. ఆమె తండ్రి తెల్లవాడు కావటంవల్ల అమ్మ తెల్ల స్త్రీలానే కనిపించేది. ఆమెకు పొడవాటి నల్లటి జుట్టు వుండేది. ఆమె మాట్లాడే యాస నీగ్రోల యాసలా వుండేది కాదు. తాను ఒక తెల్లవాడికి పుట్టటం ఆమెకు ఏ మాత్రమూ ఇష్టముండేది కాదు. ఆయన్ని తాను ఏనాడూ చూడలేదని ఆమె చాలా సంతోషంగా చెప్పటం నాకు తెలుసు. ఆ మహానుభావుడివల్లే నా చర్మానికీ, జుట్టుకూ రాగిరంగు సంక్రమించింది. మా కుటుంబంలోకల్లా లేతరంగు వాడిని నేనే. (బోస్టన్, న్యూయార్క్ నగరాల్లోని లక్షలాది

నీగ్రోల్లో ఇలాంటి రంగు కలిగి వుండటం గొప్ప అనే భావన వెర్రిగా వుండేది. నిజానికి ఈ విధంగా పుట్టటమే అదృష్టంగా భావించేవారు. నా క్క్యాడా ఇలాంటి అభిప్రాయమే వుండేది. అయితే నాలో ప్రవహించే ఆ తెల్లరేపిస్టు ప్రతి రక్తం బొట్టునూ ద్వేషించటం ఆ తర్వాత నేర్చుకున్నాను).

కుటుంబ పోషణ కోసం సొంతంగా ఏదైనా వ్యాపారం చేద్దామనే ఆలోచన మా నాన్నకు వుండటం వల్లేమో మా కుటుంబం కొంతకాలం మిల్‌వాకీలోనే వుండిపోయింది. మార్కస్ గార్వీ కూడా తెల్లవాడి నుండి స్వతంత్రంగా బతకమని చెప్తున్న రోజులవి. అందుకే అక్కడి నుండి మిచిగాన్‌లోని లాన్సింగ్ పట్టణానికి మకాం మారింది. మా నాన్న అక్కడ ఒక ఇల్లు కొన్నాడు. ఆ ఇంటిని నడపటం కోసం స్థానిక నీగ్రో బాప్టిస్ట్ క్రైస్తవ మందిరాల్లో వీలున్నప్పుడల్లా మతబోధ చేసేవాడు. మిగిలిన వారమంతా మార్కస్ గార్వీ భావాలను ప్రచారం చేస్తూ తిరిగేవాడు.

నాన్నకు ఎప్పుడూ ఒక సొంత దుకాణం పెట్టుకోవాలని వుండింది. దానికోసం డబ్బు కూడా పోగుచెయ్యటం మొదలుపెట్టాడు. కానీ, స్థానికంగా వుండే అంకుల్ టామ్ తొత్తులైన కొంతమంది నీగ్రోలు ఆయన విప్లవాత్మక విశ్వాసాల గురించి అక్కడే వుండే తెల్లవాళ్లకు చిలవలు పలవలుగా వర్ణించి చెప్పేవారు. ఈసారి, 'ఊరు విడిచి వెళ్లిపో' అనే బెదిరింపు నల్ల సైన్యంగా పిలవబడే స్థానిక నీగ్రోల నుండే వచ్చింది. వాళ్లు తెల్ల అంగరఖాలకు బదులు నల్లవి ధరించేవారు. కొద్దికాలంలోనే ఈ నల్ల సైనికమూకలు మా నాన్న ఎక్కడికి వెళ్లినా 'సొంత లాభం చూసుకునే నల్ల నా కొడుకు', 'సొంత దుక్కాణం పెట్టుకోవాలనుకుంటున్నాడు', 'లాన్సింగ్ నీగ్రో ప్రాంతానికి దూరంగా బతకాలనుకుంటున్నాడు', 'మంచి నల్ల నా కొడుకుల' మధ్య చిచ్చు పెట్టాలనుకుంటున్నాడు అంటూ ఆయన్ను వేధించటం మెదలుపెట్టారు.

మా అమ్మ మళ్లీ గర్భవతి అయింది. యువోనీ పుట్టిన తర్వాత 1929లో పీడకలలాంటి ఒక రాత్రి వచ్చింది. అది నాకు బాగా గుర్తున్న నా తొలి జ్ఞాపకం. తుపాకీ మోతలు, అరుపులు, పొగ, మంటలు సృష్టించిన ఆ భయానక రాత్రి నేను ఉలిక్కిపడి కళ్లు తెరవటం నాకు బాగా గుర్తుంది. మా ఇంటికి నిప్పు పెట్టి పారిపోతున్న ఇద్దరు తెల్లవాళ్ల మీద గట్టిగా అరుస్తూ నాన్న పిస్తోలుతో కాల్చాడు. చుట్టూ కాలిపోతున్న ఇంటి మధ్యలో మేమున్నాం. అక్కడి నుండి తప్పించుకోవటం కోసం మేం గెంతుతూ, దిక్కు తోచకుండా పరిగెడుతూ, తూలి పడిపోతున్నాం. మంటలెగసి ఇల్లు కూలిపోయేలోగా చేతుల్లోని పసిబిడ్డను పట్టుకొని అమ్మ ఇంటి

వసారాలోకి పరిగెత్తింది. నాకు బాగా గుర్తు - ఆ రాత్రంతా మేం ఏడుస్తూ చెడ్డీలపైనే వున్నాం. మా ఇల్లంతా కాలిపోయి నేలమట్టమయ్యే వరకూ తెల్ల పోలీసులు, మంటలార్పడానికి వచ్చిన వాళ్లు ఊరికే చూస్తూ నిలబడ్డారు.

మా నాన్న కొంతమంది మిత్రుల సహాయంతో మాకు బట్టలు కొని కొద్దిరోజులు తాత్కాలికంగా మమ్మల్ని వేరే ఇంటిలో వుంచి, ఆ తర్వాత తూర్పు లాన్సింగ్ పొలిమేరల్లో వుండే మరో ఇంటికి కుటుంబాన్నంతా చేర్చాడు. ఆ రోజుల్లో తూర్పు లాన్సింగ్ ప్రాంతంలో చీకటిపడిన తర్వాత తిరగటానికి నీగ్రోలను అనుమతించేవారు కాదు. ఇక్కడే మిచిగాన్ స్టేట్ యూనివర్సిటీ కూడా వుంది. 1963 జనవరిలో ఇక్కడి విద్యార్థులను ఉద్దేశించి నేను ప్రసంగించినపుడు ఈ కథంతా చెప్పాను. (చాలా కాలం తర్వాత ఈ యూనివర్సిటీలోనే మనస్తత్వశాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తున్న మా తమ్ముడు రాబర్ట్‌ను కలుసుకున్నాను). ఈ ప్రాంతం ఏ విధంగా మమ్మల్ని వేధించి పట్టణానికి రెండుమైళ్ల దూరంలో వున్న పల్లెల్లోకి తరిమి వేసిందో విద్యార్థులకు చెప్పాను. ఈ పల్లెలోనే మా నాన్న మా కోసం స్వహస్తాలతో నాలుగు గదుల ఇల్లు కట్టాడు. ఈ ఇంట్లోనే నేను ఎదగటం మొదలుపెట్టాను.

ఇక్కడి జ్ఞాపకాలను ఒకసారి నెమరువేసుకుంటే - ఆ రోజు మా ఇల్లు కాలిపోయిన తర్వాత, పోలీసులు మా నాన్నను పిలిపించి, నిప్పుపెట్టిన వాళ్లపై పిస్తోలు పేల్చటానికి నీకు అనుమతి ఎవరిచ్చారు, అసలు అది నీకు ఎక్కడిదని ప్రశ్నించారు. తరచూ పోలీసులు మా ఇంటికి వచ్చి వస్తువులు చిందరవందర చేసి 'తుపాకీ కోసం సోదా చేస్తున్నాం' అని చెప్పేవారు. కానీ, తుపాకీ దిండు పొరుగులో పెట్టి కుట్టటం వల్ల వాళ్లెప్పుడూ దాన్ని కనిపెట్టలేకపోయారు.

దీని తర్వాత, చెప్పుకోతగిన జ్ఞాపకాలంటే - మా అమ్మ నాన్నల మధ్య జరుగుతూ వుండిన గొడవలు. కొన్నిసార్లు నాన్న అమ్మను కొట్టేవాడు. అమ్మ చక్కగా చదువుకోటం కూడా ఒకరకంగా ఈ గొడవలకు కారణం కావచ్చు. ఒక చదువుకున్న స్త్రీ ఒక చదువురాని మగవాడి తప్పులను సరిదిద్దే చాపల్యాన్ని ఆపుకోలేదు అని నాకనిపిస్తుంది. అందుకే ఆయన దగ్గర ఆమె ఎప్పుడు సుభాషితాలు వల్లించినా జుట్టుపట్టి ఈడ్చేవాడు.

మా నాన్న నన్ను తప్ప మిగతా పిల్లలను శత్రువుల్లాగా చూసేవాడు. ఆయన పెట్టిన నియమాలను అతిక్రమించిన వారిని కఠినంగా దండించేవాడు. అసలు ఆ

నియమాలను తెలుసుకోవటమే చాలా కష్టమైన పని. నాకు మాత్రం మా అమ్మ బడితెపూజ చేసేది. ఎందుకిలా జరుగుతోందనే విషయం గురించి నేను చాలా ఆలోచించాను. నేను అనుకునేదేమంటే, తెల్లవాళ్ల పట్ల నాన్నకు తీవ్రమైన వ్యతిరేకత వుండేది. వాళ్లు నీగ్రో మెదళ్లలోకి ఎక్కించిన విషయాలు ఆయన అంతశ్చేతనలో వుండిపోయి బాధించటం వల్ల, తన సంతానంలోకల్లా లేతరంగులో వుండే నన్ను మాత్రం ఏమీ అనేవాడు కాదు. ఆ రోజుల్లో చాలామంది నీగ్రో తల్లిదండ్రులు నల్లరంగు పిల్లల కన్నా లేతరంగు పిల్లలను మెరుగ్గా చూసేవారు. ఇది నేరుగా 'మ్యూలాటో' (వర్ణ సంకరం వల్ల పుట్టిన వ్యక్తి) బానిస సంప్రదాయం నుండి వచ్చినదే. ఎందుకంటే, చూడటానికి మ్యూలాటో తెల్లవాడికి దగ్గరగా వుంటాడు కాబట్టి వాడు 'మెరుగైనవాడు' గా భావించేవాళ్ళు. నాన్న బాప్టిస్ట్ చర్చిలో అతిథి బోధకుడిగా, గార్వీ అనుచరుడిగా రెండు బాధ్యతలూ నిర్వర్తించేవాడు. ఆయనతో చర్చికిపోయి అక్కడ భక్తబృందం చేసే ప్రార్థనలు, పాటలు విన్నా నాకు ఏనాడూ మతం పట్ల ఆసక్తి కలగలేదు.

ఒక బోధకుడిగా నాన్నకు లాన్సింగ్ నీగ్రోలతో మంచి సంబంధాలుండేవి. అప్పుడు నీగ్రోలు చాలా దుస్థితిలో వుండేవారు. ఇప్పుడూ అలాగే వున్నారనుకోండి. కాకపోతే ఇంకోరకంగా తెల్లవాడి మాటలతో దారితప్పిపోయి, ఏది దొరికితే దానితోనే తృప్తిపడే 'మధ్యతరగతి' నీగ్రోలు అంత ఎక్కువ శాతంలో వుండే మరో పట్టణాన్ని నేను చూడలేదు. హోదాల కోసం పడి చస్తూ, అంతా సమైక్యంగా వుండాలనుకునే బాపతు నీగ్రోలే వాళ్లంతా. నేను పెరిగి పెద్దవాడవుతున్న కాలంలో 'విజయాలు' సాధించిన నీగ్రోలంటే సామాన్లు మోసేవాళ్లు, బూట్ పాలిష్ చేసేవాళ్లే. అంగడికి కాపలాకాసే పనికి ఆ రోజుల్లో చాలా గౌరవం వుండేది. లాన్సింగ్ కంట్రీక్లబ్‌లో పనిచేసేవాళ్లు, రాష్ట్ర రాజధానిలో బూట్ పాలిష్ చేసేవాళ్ళే నిజమైన 'కులీనులు', 'ధనవంతులు', 'జాతిరత్నాలు'. నిజానికి నంబర్ల రాకెట్లలో పాల్గొంటూ జూదగృహాలు నడుపుతూ వుండిన నీగ్రోల చేతుల్లో మాత్రమే డబ్బులాడుతుండేవి. మిగిలిన వారిలో చాలామంది పస్తులున్నవారే.

పట్టణ నీగ్రోలతో పోలిస్తే మేం కనీసం రొట్టెముక్కలైనా తిని కడుపు నింపుకున్నాం. వాళ్లకు అవి కూడా లేవు. మేం పల్లెలో వుండగా తిండి విషయంలో మా నాన్న జాగ్రత్త పడటం వల్ల ఆ మాత్రమైనా తినగలిగాము. మత బోధకుడిగా నాన్న సంపాదించేదంతా మా తిండికీ బట్టకే సరిపోయేది. కుటుంబ పోషణ కోసం

నీచమైన పనులు చేయాల్సి వచ్చినా గార్వీ భావాలను పోరాట స్ఫూర్తితో ప్రచారం చేయటం విడిచిపెట్టని మా నాన్న రూపం నాకింకా గర్వం కలిగిస్తూనే వుంది. ఆ స్ఫూర్తే ఆయనను 'మొండివాడు'గా తీర్చిదిద్దింది. 'నీవు ఈ తెల్లవాళ్లకు చావుభయం పెడుతున్నావు' అని ఒక ముసలవ్వ నాన్న మొహం మీదే నవ్వుతూ చెప్పటం నాకింకా గుర్తుంది.

మా కుటుంబంలో నన్ను మాత్రమే ఆయన కొన్నిసార్లు యు.ఎన్.ఐ.ఎ. సమావేశాలకు తన వెంట తీసుకొని పోయాడు. నాకు గుర్తున్నంతలో ఇదే ఆయన నాకు చేసిన మహోపకారం. ఆయన నిర్వహించిన ఈ సమావేశాలు గుట్టుచప్పుడు కాకుండా జనాల ఇళ్లలోనే జరిగేవి. సమావేశం జరుగుతున్న ఇంటిలో ఇరవైకి మించి నీగ్రోలు వుండేవారు కాదు. నట్టింట్లో అంతమందీ క్రిక్కిరిసి కూర్చొని నాన్న మాటలు శ్రద్ధగా వినేవారు. అక్కడ ఏ విషయమైనా అందరూ తెలివిగా, భూమ్మీద కాళ్లు పెట్టి నిజాయితీగా మాట్లాడుకునేవారు.

'ఆడమ్ ఉద్యానవనం విడిచి యూరప్ గుహల్లోకి వెళ్లిపోయాడు', 'ఆఫ్రికా ప్రజల కోసమే ఆఫ్రికా,' 'ఇథియోపియా వాసులారా మేల్కోండి' అంటూ ఆ సమావేశాల్లో నాన్న ఇచ్చిన నినాదాలు నా చెవుల్లో ఇంకా గింగురుమంటూనే వున్నాయి. ఆఫ్రికాను నల్లవాళ్లే పాలించే కాలం ఇంక ఎంతో దూరంలో లేదనే విషయం గురించే నాన్న మాట్లాడేవాడు. 'నల్లవాళ్లు' అనే పదాన్ని ఆయన ఎక్కువగా ఉపయోగించేవాడు. 'ఆఫ్రికా పాపపరిహార సమయం ఎప్పుడొస్తుందో ఎవరికీ తెలీదు. అది గాలిలో వుంది. అది వస్తూ వుంది. ఏదో ఒకరోజు అది తుఫానులా వచ్చి ఇక్కడ వాలుతుంది'. ఈ సమావేశాల్లో మార్కస్ గార్వీ ఫోటోలు అందరి చేతుల్లోనూ కనిపించేవి. ఫోటోలు చూసిన తర్వాత, ఆయన వెనుక లక్షలాది నీగ్రోలు కవాతు చేసుకుంటూ పోతున్నట్టు నాకు అనిపించేది. ఆయనకు ఒక్క అమెరికాలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అనుచరులున్నట్లు చెప్పుకునేవారు. చివరికి ఈ సమావేశాలన్నీ, 'శక్తివంతులైన జాతి జనులారా, లేవండి, మీరు అనుకున్నది సాధించగలరు' అని నాన్న అనగానే అందరూ ముక్తకంఠంతో పలకటంతో ముగిసేవి. ఇలాంటి మాటలన్నీ వింటున్నప్పటికీ ఆఫ్రికాలోని నల్లవాళ్ల గురించి నేను ఏనాడూ పెద్దగా ఆలోచించలేదు. ఆ సమయానికి ఆఫ్రికా అంటే, నగ్నంగా తిరిగే బానిసలు, నరమాంసభక్షకులు, కోతులు, పులులు, పొగలు కక్కే అడవులు - ఇదే నా మనసుకు తెలిసిన రూపం.

మా నాన్న కొన్నిసార్లు లాన్సింగ్ చుట్టుపక్కల ప్రాంతాల్లో జరిగే సమావేశాలకు

తన పాతకాలం నాటి కారులో నన్ను తీసుకొనిపోయేవాడు. ఒకసారి, పగటిపూట సమావేశానికని (చాలా వరకు ఈ సమావేశాలు రాత్రిపూటే జరిగేవి), లాన్సింగ్‌కు నలభై మైళ్ల దూరంలో వుండే 'ఒవోస్సో' అనే పట్టణానికి తీసుకొనిపోయాడు. ఈ పట్టణాన్ని నీగ్రోలంతా 'శ్వేతనగరం' అని పిలిచే వాళ్లు. (ఒవోస్సో, థామస్ ఇ. డీవీ పుట్టిన ఊరుగా ప్రసిద్ధి) తూర్పు లాన్సింగ్‌లో మాదిరే ఇక్కడ కూడా చీకటి పడిన తర్వాత నీగ్రోలను అనుమతించరు. అందుకే ఈ పగటి సమావేశం. నిజానికి, మిచిగాన్ పట్టణాలన్నీ అలాగే వుండేవి. ప్రతి పట్టణంలోనూ కనీసం ఒక నీగ్రో కుటుంబమైనా వుండేది. ఇక్కడికి దగ్గర్లో వున్న మేసన్‌లో అలా లియాన్స్ కుటుంబం వుండేది. మేసన్ హైస్కూల్లో ఫుట్‌బాల్ స్టార్‌గా ఎంతో పేరు తెచ్చుకున్న లియాన్స్ ఇప్పుడు పొట్టకూటి కోసం పట్టణంలో అన్ని చోట్లా ఊడిగం చేస్తున్నాడు.

ఒకవైపు నాన్న ఇలా సమావేశాలతో తీరిక లేకుండా వుంటే, మరోవైపు అమ్మ ఎప్పుడు చూసినా ఇంటి చాకిరీ అంతా తానొక్కతే చేసుకుంటూ మా అందరిమీదా మండిపడుతూ వుండేది. ఆమె సాధారణంగా నాన్నతో వాదిస్తూనో లేదా ఏమీ మాట్లాడకుండా వుండటమో చేసేది. ఆహారం విషయంలో ఆమెకు గాఢమైన అభిప్రాయాలుండేవి. ఆమెకు పందిమాంసమన్నా, కుందేలు మాంసం అన్నా ఇష్టముండేది కాదు. వాటిని మేము తినటం కూడా ఆమెకు నచ్చేది కాదు. మా నాన్నకు మాత్రం ఇవంటే చాలా ఇష్టం. ఆయన నిజమైన జార్జియా నీగ్రో. ఆయన పీకలదాకా తింటూ వుండిన ఆ తిండినే ఇప్పుడు హార్లెమ్‌లో 'రాజభోజనం' అంటున్నారు.

మా అమ్మ నాకు బడితెపూజ చేసేదని చెప్పాను కదా- పొరుగువాళ్లు చూస్తున్నారని తెలిసినా సరే నన్ను కొట్టేది. నన్ను కొట్టటానికి ఆమె ఊరికే చెయ్యెత్తితే చాలు, నేను ప్రపంచానికంతా తెలిసేట్టు మొత్తుకునేవాడిని. ఆ సమయానికి ఎవరైనా ఇంటి ముందు నుంచి పోవటం గమనించినప్పుడు ఆమె మనసు మార్చుకోవటమో, నా మీద ముద్దులు కురిపించటమో చేసేది. దాని గురించి ఇప్పుడు ఆలోచిస్తే నాకొక విషయం స్పష్టంగా అర్థమవుతోంది. నేను లేతరంగువాడినని నాన్న నన్ను ముద్దు చేసేవాడు. నల్లగా వుండే మిగతా పిల్లలను చావగొట్టేవాడు. మా అమ్మ స్వయంగా లేతరంగు మనిషే అయినా ఆమెకు నల్లగా వుండే పిల్లలంటేనే ఎక్కువ ఇష్టం. సరిగ్గా ఈ ఒక్క కారణంగానే ఆమె నాకు నరకం చూపించింది. 'ఎండలో పడి తిరుగు కనీసం రంగైనా వస్తుంది' అనేదామె. నిజానికి ఆమె నన్ను ఇలా తిడుతూ

కొడుతూ వున్నందువల్లే రంగు పట్ల నాలో ఆధిక్యతా భావం కలగలేదు. నన్ను దండించటం ద్వారా అమ్మ తన మనసులోని భారాన్ని దించుకుందని నాకు కచ్చితంగా తెలుసు.

మా అన్న విల్‌ఫ్రెడ్ అంటే అమ్మకు చాలా ఇష్టం. బుద్ధిగా వుండేవాడు. తనకు ఏదైనా తినాలనిపించి అడిగి లేదనిపించుకున్నా అల్లరి చేయకుండా ఆకలితోనే వుండేవాడు. అందుకే ఆమె దృష్టిలో ఆయనొక దేవదూత. కానీ నేనలా కాదు. లేదంటే ఏడ్చి అల్లరి చేయటమే పని. జీవితంలో ఒక విషయం నేను చాలా చిన్నతనంలోనే నేర్చుకున్నాను. అదేమంటే, 'నీకు ఏదైనా కావాలంటే, నీవు బాగా అల్లరి చేయాలి'!

ఎంత అల్లరి చేసినా మా ఇంటిలో వుండిన పెద్ద తోటలో నేను కూడా ఎంతో ఇష్టంగా కోడిపిల్లలను పెంచేవాడిని. ఇక్కడే మా అమ్మ గురించి ఒక మంచి జ్ఞాపకం చెప్పాలి. ఒకరోజు నేను ఆమె దగ్గరికి పోయి నాకే సొంతంగా ఒకతోట కావాలని అడిగాను. ఆమె నా కోసం ఒక చిన్న మడి చూపించింది. ఆ మడిలో నేను బఠాణీ మొక్కల్ని ఎంతో ఇష్టంగా జాగ్రత్తగా పెంచాను. భోజనం బల్లమీద అవి కనిపించినప్పుడు గర్వంతో పొంగిపోయేవాడిని. నా తోటలో ఏ మాత్రం గడ్డి మొలిచినా వెంటనే చేత్తో ఊడబెరికేవాడిని. నా మొక్కల వరుసల మధ్య దోగాడుకుంటూ పురుగులేమైనా వున్నాయేమోనని వెతికేవాడిని. వుంటే వాటిని చంపి భూమిలో పాతిపెట్టేవాడిని. ఇలాంటి చీడపీడలేవీ లేకుండా మొక్కలు ఏపుగా పెరుగుతూ వుంటే ఆ వరుసల మధ్య వెల్లకిలా పడుకొని, రెప్పవాల్చకుండా నీలాకాశంలో సాగిపోయే మబ్బుల వంక చూస్తూ అన్ని రకాల విషయాల గురించీ ఆలోచించేవాడిని.

అయిదవ ఏట నేను కూడా స్కూలుకు పోవటం మొదలు పెట్టాను. విల్‌ఫ్రెడ్, హిల్డా, ఫిల్బర్ట్‌లతో పాటు పొద్దున్నే ఇల్లు విడిచి నడుచుకుంటూ పోయి వచ్చేవాడిని. ఆ ప్రాంతంలో మాదొక్కటే నీగ్రో కుటుంబం కాబట్టి పోయి రావటంలో సమస్యేమీ లేదు. ఆ రోజుల్లో ఉత్తర ప్రాంతంలోని తెల్లవాళ్లు కొంతమంది నీగ్రోలను 'దత్తత' తీసుకునేవాళ్లు. వాళ్ల వల్ల నల్లవాళ్లకు ఏ ప్రమాదమూ లేదు. తెల్లవాళ్ల పిల్లలు మాకు ఒరగబెట్టింది కూడా ఏమీలేదు. వాళ్లు మమ్మల్ని 'నల్ల వెధవా', 'కర్రోడా' అని పిలిచేవాళ్లు. మేము కూడా అవి మాకు సహజంగా వచ్చిన పేర్లు అనే అనుకునేవాళ్ళం. అలా పిలవటం అవమానించటమని వాళ్లు ఏనాడూ అనుకోలేదు. మా గురించి వాళ్లు అలా అనుకున్నారంతే.

1931లో ఒక మధ్యాహ్నం మేము స్కూలు నుండి వచ్చేసరికి అమ్మా నాన్నా వాదించుకుంటున్నారు. నల్లసైన్యం బెదిరింపుల కారణంగా ఇంట్లో భయం గొలిపే వాతావరణం నెమ్మదిగా అలముకుంది. అంతలో మేము పెంచుతూ వుండిన కుందేళ్లలో ఒకదాన్ని వండమని నాన్న అమ్మను అజ్ఞాపించాడు. మామూలుగా అయితే వాటిని తెల్లవాళ్లకు అమ్మేవాళ్లం. వాటిలో నుండి నాన్న ఒక కుందేలును సర్రున బైటికి లాగి దాని మెడ విరిచి మొండెం నుండి దాని తలను వేరుచేశాడు. ఆయన చాలా బలిష్ఠమైన మనిషి. కోళ్లు, కుందేళ్ల తలలు కోయటానికి ఆయనకు కత్తికూడా అవసరం లేదు. చేటల్లాంటి తన నల్లచేతులతో దాని తలను అలా మెలితిప్పి, రక్తమోడుతున్న ఆ పదార్థాన్ని మా అమ్మ కాళ్ల దగ్గర పడేట్టు వెనక్కివిసిరికొట్టాడు.

అమ్మ ఏడుస్తూనే దాని తోలు వలుస్తోంది. నాన్న చాలా కోపంతో విసురుగా తలవాకిలి దాటి, పట్టణానికిపోయే రోడ్డు వైపు నడవటం మొదలుపెట్టాడు.

అప్పుడే అమ్మలో ఏదో ఆందోళన మొదలైంది. జరగబోయే వాటి పట్ల ఆమెలో ఏదో జ్ఞానం బలంగా పనిచేసేది. ఈ లక్షణం ఆమె సంతానంలో చాలామందికి వుందనుకుంటా.

అమ్మ గట్టిగా అరుచుకుంటూ వసారాలోకి పరిగెత్తేసరికే నాన్న రోడ్డుమీదవున్నాడు. ఎర్లీ! ఎర్లీ అని అరిచి, ఒంటిమీద వున్న గుడ్డను గట్టిగా పట్టుకొనే వీధికి అడ్డంగా పడి రోడ్డు వైపు పరిగెత్తింది. నాన్న వెనక్కి తిరిగి ఆమెను చూశాడు. ఆయన ఇంకా కోపంగానే వున్నాడు. రావద్దన్నట్టు ఆమె వంక చెయ్యి ఊపి నడుస్తూనే వున్నాడు. ఆ రోజంతా ఏడుస్తూ, వణుకుతూ, ఆందోళన పడుతూ ఉంది. ఆమె మనసు మనసులో లేదు. కుందేలు మాంసం వండి గిన్నెలో మూసిపెట్టింది. మేము రాత్రి నిద్రపోయే సమయానికి కూడా నాన్న ఇంటికి రాకపోవటంతో అమ్మ మమ్మల్ని గుండెలకు గట్టిగా అదుముకుంది. మాకు వింతగా అనిపించి ఏమి చేయాలో కూడా తోచలేదు. ఎందుకంటే, ఆమె అలా ప్రవర్తించటం అంతకు ముందెన్నడూ మేము చూడలేదు.

మళ్లీ అమ్మ గుండెలు బాదుకుంటూ కేకపెట్టిన శబ్దానికి మెలకువ రావటం నాకు గుర్తుంది. లేచి చూసేసరికి పోలీసులు నట్టింట్లో వున్నారు. వాళ్లు అమ్మను ఓదార్చడానికి ప్రయత్నిస్తున్నారు. వాళ్ల వెంట పోవటానికని ఆమె గబ గబా గుడ్డలు తగిలించుకుంది. మా అందరికీ అయోమయంగా కనిపిస్తున్నా నాన్నకు జరగరానిదేదో జరిగిందనే విషయం మాత్రం అర్థమైంది.

పోలీసులు అమ్మను ఆసుపత్రికి తీసుకొని పోయారు. అక్కడ నాన్న శరీరం మీద గుడ్డకప్పి వుంచిన గదిలోకి ఆమెను పిలుచుకొనిపోయారు. చూడటానికి భయపడి ఆమె చూడలేదు. అలా చూడకపోవటమే మంచిదనిపించింది. నాన్న పుర్రె ఒకవైపు పూర్తిగా చితికిపోయి వుందని తర్వాత నాకు తెలిసింది. ఆయనపై దాడిచేసి తీవ్రంగా గాయపరచి రైలు పట్టాలపై అడ్డంగా పారేశారని లాన్సింగ్‌లోని నీగ్రోలంతా చెవులు కొరుక్కున్నారు. నాన్న శరీరం సగానికి సగం తెగిపోయి వుంది.

ఆయన ఆ స్థితిలో రెండున్నర గంటలున్నాడు. అప్పటి నీగ్రోలు, ప్రత్యేకించి జార్జియా నీగ్రోలు ఇప్పటి నీగ్రోల కన్నా చాలా బలిష్ఠంగా వుండేవాళ్లు. జార్జియాలో పుట్టిన నీగ్రోలు కేవలం ప్రాణం నిలుపుకోవటానికే అంత బలిష్ఠంగా వుండాల్సి వచ్చేది.

అప్పుడు నాకు ఆరేళ్లు. జనాల ఏడుపులతో, శాపనార్థాలతో మా ఇల్లంతా నిండిపోవటం లీలగా నాకు గుర్తుంది. అమ్మకు మతి చలించింది. అంత్యక్రియలు పూర్తయ్యేవరకూ ఆమె పరిస్థితి అలాగే వుండింది.

మరోవారం రోజుల పాటు చాలామంది మా ఇంటికి వచ్చి అమ్మను పరామర్శించి వెళ్లారు. మేము త్వరగానే ఇదంతా మరచిపోయినా అమ్మ పరిస్థితి మాత్రం అలాలేదు. బతికున్న కాలంలో నాన్న చేసిన రెండు బీమా పాలసీల తాలూకు డబ్బు తీసుకోవటంలో ఆమె శ్రద్ధ తీసుకొని త్వరపడింది. చనిపోయిన తర్వాత ఇబ్బందులు పడకుండా కుటుంబానికి రక్షణ కల్పించాలని నాన్న చెప్పేవాడు. చిన్న పాలసీ డబ్బు ఏ సమస్యా లేకుండా చేతికొచ్చింది. ఆ డబ్బులో చాలా భాగం నాన్న అంత్యక్రియలకైన ఖర్చులకే సరిపోయింది. రెండవది పెద్దపాలసీ. ఆ డబ్బు కోసం అమ్మ రోజూ పట్టణానికి పోయి నిరాశగా తిరిగొచ్చేది. 'మీ ఆయన ఆత్మహత్య చేసుకున్నాడు కాబట్టి డబ్బు ఇవ్వటం కుదరద'ని కంపెనీ కార్యాలయంలో తేల్చి చెప్పారు. ఇంటికి వచ్చే వాళ్ల తాకిడి మళ్లీ ఎక్కువైంది. అందరూ తెల్లవాళ్లపై నిప్పులు కక్కారు.

అప్పుడు మా పరిస్థితి ఇలా వుండింది.

ముప్పయినాలుగేళ్ల మా అమ్మకు భర్తలేడు. ఏదైనా అవసరమొస్తే ఇచ్చేవాడులేడు. తన ఎనిమిది మంది పిల్లలకు రక్షణగా నిలిచేవాడు లేడు. అయినా, మొదటి పాలసీ కారణంగా మా కుటుంబం కొంచెమైనా ఊపిరిపీల్చుకొని ఒక రకంగా మళ్లీ గాడిలో పడింది.

అన్నయ్య విల్‌ఫ్రెడ్ వెంటనే బడిమానేసి, పట్టణానికి పోయి ఏ పని దొరికితే అది చేశాడు. ఎద్దులా కష్టపడ్డాడు. ఆ రోజుకు ఎంత సంపాదిస్తే అంతా అమ్మ చేతికిచ్చేవాడు. హిల్డా కూడా పిల్లలను చూసుకునే పనిలో కుదిరింది. ఫిల్బర్ట్, నేను ఏమీ చేయకుండా ఇంట్లోనే పోట్లాడుకునేవాళ్లం. బడిలో మాత్రం ఇద్దరమూ కలసి తెల్లపిల్లతో పోట్లాడేవాళ్లం. ఏ కారణమూ లేకుండానే ఆ పోట్లాటలకు జాతి స్వభావం వచ్చేది. మా తమ్ముడు రెగినాల్డ్ ఇంకా పిల్లవాడు. చిన్నప్పటి నుండి వాడికి నా దగ్గరే చనువెక్కువ. ఇంటి అవసరాల కోసం అమ్మ అప్పు చేయటం మొదలుపెట్టింది. నాన్న అప్పు చేయటాన్ని తీవ్రంగా వ్యతిరేకించేవాడు. 'మళ్లీ బానిసత్వంలోకి జారిపోవటానికి అప్పు మొదటి మెట్టు' అని ఆయనెప్పుడూ అంటుండేవాడు. అమ్మ లాన్సింగ్‌కు వెళ్లి తెల్లవాళ్ల ఇళ్లల్లో ఇంటిపని, కుట్టుపని చేసేది. ఆమెనెవరూ నీగ్రో అనుకునేవారు కాదు. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆ రోజుల్లో నీగ్రోలను ఇళ్లలో పనికి పెట్టుకునేవారు కాదు.

ఆమె ఎవరి తాలుకు మనిషో తెలియనంత వరకూ బాగానే వుండేది, ఆమె ఎవరి భార్యనో తెలిసిపోయిన తర్వాత ఉద్యోగం ఊడిపోయేది. అప్పుడు ఆమె ఇంటికి ఎలా ఏడ్చుకుంటూ వచ్చేదో, ఆ ఏడుపును ఎలా దాచటానికి ప్రయత్నించేదో నాకు బాగా జ్ఞాపకం. అప్పట్లో ఏదో ఒక ఉద్యోగం ఆమెకు ఎంతగానో అవసరం.

ఒకసారి మేము ఏదో అవసరమై ఆమె పనిచేసే చోటికి పోయినట్టు గుర్తు. అక్కడున్న వాళ్లు మమ్మల్ని చూసి ఆమె ఒక నీగ్రో అని గుర్తుపట్టేసరికి అమ్మ అక్కడే మాపై నిప్పులు కక్కి ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చేసింది. ఈసారి మాత్రం ఏమీ దాచకుండానే.

పరిస్థితి తెలుసుకొని సంక్షేమ సంఘంవాళ్లు ఇంటికి రావటం మొదలుపెట్టారు. వాళ్లు అమ్మతో మాట్లాడుతూ ఆమెను సవాలక్ష ప్రశ్నలడిగి వేధించేవారు. వాళ్ళు మా ఇల్లంతా కలియజూసుకుంటూ అమ్మ పట్ల మా పట్ల ప్రవర్తించిన తీరునుబట్టి నా మనసుకు అనిపించింది. ఒక్కటే - వాళ్ల దృష్టిలో మేం మనుషులం కాదు. కేవలం 'విశేషాలం' అంతే.

అమ్మ సంక్షేమ చెక్కు, వితంతువులకిచ్చే పించను తీసుకుంటూ ప్రతి నెలా కిరాణా కొట్టువాడికి ఇచ్చేది పోగా మిగిలిన దానిలోనే సంసారం నడిపేది. మా పరిస్థితి వేగంగా పతనం కావటం మొదలుపెట్టింది. భౌతిక పతనం కంటే మానసికమైనదే ఎక్కువ. అన్నిటికీ మించి ఆత్మాభిమానంగల స్త్రీ అయిన అమ్మకు

ఎవరి దయమీద ఆధారపడటమూ ఇష్టముండేది కాదు. కిరాణ కొట్టువాడు ఏదైనా తప్పుచేస్తే తాను తెలివితక్కువదాన్ని కాదని పదునుగా జవాబు చెప్పేది. అది వాడికి నచ్చలేదు. తాను ఎదిగిన స్త్రీననీ, తన పిల్లలను తనే పోషించుకోగలననీ, ఇంటిచుట్టూ పదేపదే తిరుగుతూ తమ బతుకుల్లో తలదూర్చవలసిన అవసరం లేదనీ సంక్షేమ సంఘం వాళ్లతో కూడా చెప్పేది. వాళ్లకు కూడా అది నచ్చలేదు.

అయితే వాళ్లు సంక్షేమ చెక్కుని అడ్డం పెట్టుకొని ఇంటికి వచ్చేవాళ్లు. తాము మా వాళ్లే అయినట్టు, మేము తమ ఆస్తి అయినట్టు ప్రవర్తించటం మొదలుపెట్టారు. మాలో ఎదిగిన పిల్లల్ని పక్కకు తీసుకొనిపోయి, అమ్మ మీద మాలో మాకే లేనిపోనివన్నీ చెప్పినప్పుడు మాత్రం ఆమె తీవ్రంగా స్పందించేది. సంఘంవాళ్లు మాకు మాంసం, పొట్లాలు, కూరగాయలు, పళ్లు, అన్నిరకాల వస్తువులు ఇస్తున్నా వాటిని తీసుకోవటాన్ని అమ్మ ఎందుకు ద్వేషించేదో మేము నిజంగానే అర్థం చేసుకోలేకపోయాం. నిజానికి తనదీ, తన పిల్లల ఆత్మాభిమానాన్నీ కాపాడటం కోసం అమ్మ అలుపెరుగని పోరాటం చేస్తూ వుందని నాకు ఆ తర్వాత అర్థమైంది.

కాపాడుకోవటానికి మా దగ్గర మిగిలింది మా ఆత్మాభిమాన మొక్కటే. 1934 కల్లా దానికీ గడ్డు రోజులు మొదలయ్యాయి. ఆ సంవత్సరమంతా ఆకలితో అలమటించిపోయాం. అమ్మ ఏ పని దొరికితే అది చేస్తూ వుంది. విల్‌ఫ్రెడ్ అమ్మకు సహాయపడుతున్నాడు. లాన్సింగ్‌లోని ఒక బేకరీలో ఒక దమ్మిడీ ఇస్తే, ముందు రోజు చేసిన పాడువాటి బ్రెడ్డు, బిస్కెట్లు వచ్చేవి. అవి తీసుకొని రెండు మైళ్ల దూరంలో వుండే పల్లెలోని ఇంటికి చేరుకునేవాళ్లం. అమ్మ బ్రెడ్డుతో చాలా రకాల వంటలు చేసేది. బ్రెడ్డు ముక్కలతో పాటు టొమాటోలు మగ్గించి ఇచ్చేది. అదొక భోజనం గొడ్డుమాంసం రొట్టెలు దొరికితే బ్రెడ్డు కంటే ఎక్కువగా అదే తినేవాళ్లం. మొత్తానికి ఏది దొరికితే అది ఎగబడి తిన్నాం.

ఇంట్లో ఒక్క దమ్మిడీ కూడాలేని రోజుల్లో ఆకలికి తట్టుకోలేక కళ్లు బైర్లు కమ్మేవి. అప్పుడు అమ్మ ఒక పెద్దకుండలో ఏవో ఆకులు ఉడికించి ఇస్తే అవే తినేవాళ్లం. నీచమైన మనస్తత్వం కలిగిన ఒక పొరుగువాడు ఆ ఆకులు బైటికి తీసి చూపెడితే, 'వీళ్లు కాల్చిన గడ్డి తిన్నారు' అని మా తోటి పిల్లలంతా మమ్మల్ని ఆట పట్టించేవారు. కొన్నిసార్లు అదృష్టం బాగుంటే మొక్కజొన్న జావ రోజుకు మూడుసార్లు లాగించేవాళ్లం లేదా పొద్దున జావ, రాత్రి మొక్కజొన్న రొట్టె తినేవాళ్లం.

1934 చివరికాలంలో మా కుటుంబం మానసికంగా చితికిపోయి మా

ఆత్మాభిమానమంతా మంటగలిసే పరిస్థితి దాపురించింది. ఇంట్లో అన్నిటికీ కరువొచ్చింది. ఉచిత ఆహారం పంపిణీ చేసే చోటికి మేము వెళ్లవలసిన పరిస్థితి లేదని మాలో అందరమూ లోలోపల గర్వించిన వాళ్లమే. కానీ ఇప్పుడు మేము కూడా వాళ్లలో చేరిపోయాం. కొన్నిసార్లు నేను బడి ఎగ్గొట్టి రెండు మైళ్లు నడిచి లాన్సింగ్‌కు పోయేవాడిని. అక్కడ అంగళ్లలో పెట్టెల్లో, బుట్టల్లో అమ్మకానికి పెట్టిన యాపిల్ పండ్ల వంక ఆశగా చూసుకుంటూ, వాటిని ఎలాగైనా దొంగిలించి విందు చేసుకునే అవకాశం కోసం ఎదురుచూసేవాడిని.

తిండి కోసమే రాత్రి భోజనాల సమయానికంతా మాకు తెలిసిన వాళ్లింట్లో వాలేవాడిని. ఆ వేళప్పుడు అక్కడికి నేను ఎందుకు వచ్చేవాడినో వాళ్లకు తెలుసని నాకూ తెలుసు. వాళ్లు నన్నేమీ అనకుండా ఎంతో ఆప్యాయంగా భోజనానికి పిలిచేవాళ్లు. నేను పీకలదాకా మెక్కేవాడిని. గొహన్నా ఇంటికి పోవటానికి నేనెక్కువగా ఇష్టపడేవాడిని. వాళ్లు ముసలివాళ్లు. ఎంతో మంచివాళ్లు. వాళ్లతో పాటే ఆ ఇంటిలో శ్రీమతి అడ్కాక్ కూడా వుండేది. ఎవరికి ఏ అవసరం వచ్చినా ఆమె వెంటనే తన చేతనైన సహాయం చేసేది. ఆమె ఒకసారి నాతో చాలా కాలంపాటు గుర్తుండిపోయిన ఒక మాట అంది. 'మాల్కం, నీలో ఒక విషయం నాకు బాగా నచ్చుతుంది. నీవు మంచివాడివి కావు. అయితే ఆ విషయాన్ని నీవెప్పుడూ దాచిపెట్టవు. నీవు మనసులో ఒకటి పెట్టుకొని పైకి మరొకటి చెప్పేవాడివి కావు'.

నేను ఇంటికి దూరంగా జనం మధ్య తిరుగుతూ చిల్లర దొంగతనాలు చేయడం, నాకు ఏది కావాలనిపిస్తే దాన్ని దక్కించుకోవటమే తప్ప దేనికీ ఎదురుచూడని మొండితనం నాలో పెరగటం మొదలైంది. మానసికంగా కంటే నేను శారీరకంగా వేగంగా పెరుగుతున్నాను. పట్టణం చుట్టుపక్కల వాళ్లంతా ఇప్పుడు నన్ను గుర్తు పడుతున్నారు. నన్ను గుచ్చిగుచ్చి చూసే తెల్లవాళ్లు మా నాన్నను కూడా అదేవిధంగా ఎందుకు చూస్తూ వుండేవారో నాకు ఇప్పుడిప్పుడే కొద్దిగా అనుభవంలోకి వస్తూ వుంది. మా నాన్నను నల్ల సైనికులో తెల్లముఠా వాళ్లో చంపేశారని, బీమా కంపెనీ పాలసీ డబ్బు మా అమ్మకు ఇవ్వలేదనీ మా బడిలో తెల్లపిల్లలు మాతో చెప్పేవారు. ఇదంతా వాళ్లు తమ తల్లిదండ్రుల నుంచి తెలుసుకున్నదే.

నేను దొంగతనం చేసి పట్టుబడినప్పుడల్లా సంక్షేమసంఘం వాళ్లు మా ఇంటికొచ్చి నన్ను నిలదీసి, నన్ను ఎక్కడికైనా పంపిస్తే బాగుండునని అమ్మతో

అనేవారు. ఆమె వాళ్లకు ఘాటుగా జవాబు చెప్పి తర్వాత నన్ను చావగొట్టేది. పొరుగు వాళ్లందరికీ తెలిసేట్టు నేను ఓండ్ర పెట్టేవాడిని. నన్ను ఎంతగా కొట్టినా నేను ఏనాడూ అమ్మ మీద చేయెత్తలేదు. ఈ విషయం నేను గర్వంగా చెప్పుకోగలను.

వేసవికాలంలో రాత్రిపూట మిగతా అన్ని అల్లరి పనులతోపాటు కలింగిరి పండ్లు దొంగిలించేవాళ్లం. అందుకే మమ్మల్ని 'కలింగిరి దొంగలు' అనేవారు. ఇదే పని తెల్లపిల్లలు చేస్తే, వాళ్లు కేవలం నీగ్రోల మాదిరి నటిస్తున్నారనేవారు. నీగ్రోలను అవహేళన చేయటం, నెపం వాళ్లమీద పెట్టటం ద్వారా తెల్లవాళ్లు తాము చేసిన వెధవ పనులన్నిటినీ ఎప్పుడూ దాచిపెట్టటమో సమర్థించుకోవటమో చేశారు.

ఒకసారి, నేను రోజంతా కష్టపడి సామాన్లు మోసి ఒక డాలర్ సంపాదించుకున్నాను. ఆ రోజుల్లో డాలర్ అంటే చాలా ఎక్కువ. నాకు బాగా ఆకలిగా వుండటంతో మంచి తిండి తిందామని కలలుకంటూ పట్టణంవైపు బయలుదేరాను. వయసులో నాకంటే పెద్దవాడైన ఒక తెల్లపిల్లవాడు దారిలో కలిశాడు. 'చిత్తు బొత్తు' ఆడదాం అన్నాడు. వాడి దగ్గర చాలా చిల్లర వుంది. అరగంట ఆడిన తర్వాత నా డాలర్‌తో సహా చిల్లరంతా వాడికే పోయింది. చేసేది లేక నట్టి చేతులతోనే ఇంటిముఖం పట్టాను. తర్వాత ఆలోచిస్తే వాడు నన్ను మోసం చేశాడని అర్థమైంది. నాణెం పట్టుకొని ఎగరేసే పద్ధతిలోనే రహస్యమంతా వుంది. జూదమాడటంలో ఇదే నాకు మొదటి పాఠం. బాగా గమనించండి, అన్నిసార్లూ ఒకడే గెలుస్తున్నాడంటే వాడు జూదమాడటం కాదు - మోసం చేస్తున్నాడని అర్థం. ఈ దెబ్బతో, నా జీవితంలో ప్రతిసారీ ఓడిపోతున్నాననే ఆలోచన వచ్చినప్పుడంతా జాగ్రత్తగా గమనించేవాడిని. తెల్లవాడు వృత్తి జూదగాడు. అన్ని ముక్కలూ తనవైపే పెట్టుకొని, ఎప్పుడూ బల్లకింది నుండే మా ప్రజలతో వాడు వ్యవహారమంతా నడిపాడు.

ఈ కాలంలో సెవెన్త్‌డే అడ్వెంటిస్టులు పరిచయమయ్యాక మా అమ్మలో కొంచెం మార్పు వచ్చింది. వాళ్ల సమావేశాలకు తరచుగా వెళ్లేది. వాళ్ల దగ్గరి నుండి పుస్తకాలు తెచ్చుకొని చదివేది. సంక్షేమ సంఘం మాకు ఆహారాన్ని సహాయంగా పంపిస్తూ వుండటంతో విల్‌ఫ్రెడ్ మళ్లీ బడికి పోవటం మొదలుపెట్టాడు. అన్నయ్య కూడా అమ్మతోపాటు పుస్తకాలు బాగా చదివేవాడు. ఎప్పుడు చూసినా ఏదో ఒక పుస్తకంలో కూరుకొని పోయి వుండేవాడు. అడ్వెంటిస్టులు పంది, కుందేలు మాంసాలు తినటాన్ని వ్యతిరేకించటం మా అమ్మ మీద ఎక్కువ ప్రభావం చూపింది. ఆమె అభిప్రాయాలూ అవే. అమ్మతో పాటు వాళ్ల సమావేశాలకు మేమూ పోయేవాళ్లం.

అక్కడ వాళ్లు పెట్టే మంచి తిండి కోసమే మాలాంటి పిల్లలంతా వచ్చేవాళ్లు. అడ్వెంటిస్టులు ఈ ప్రపంచమంతా త్వరలోనే అంతమవుతుందని చెప్పేవారు. అయితే, అంత స్నేహభావంతో వుండిన తెల్లవాళ్లను నేను అంతకు ముందెన్నడూ చూడలేదు.

సంక్షేమ జనాలతో మా అమ్మ గొడవపడుతూనే వుంది. తాము హక్కుదారులైనట్లు ఇంటి విషయాల్లో జోక్యం చేసుకునేవారు. మాలో మాకే తగవులు పెట్టి మమ్మల్ని వేరు చేసే ఆలోచన మా మనసుల కెక్కించాలని చూసేవారు. 'మీలో ఎవరు అందంగా వుంటారు?' నీవు ఒక్కడివే ఎందుకు నల్లగా లేవు? అని నన్ను ప్రశ్నించేవారు.

మమ్మల్ని పెంచే బాధ్యతను వేరేవాళ్లకు అప్పగించేట్టు చేయటం వాళ్ల కార్యకలాపాల్లో ఒక భాగం. దీని విషయమై అమ్మ వాళ్లతో గొడవ పడినప్పుడల్లా నన్ను ఎరగా ఉపయోగించుకునేవారు. నేను దొంగతనాలు చేస్తున్నాను అంటే మా అమ్మ నన్ను సరిగా పెంచకపోవటంవల్లే కాబట్టి నన్ను మరొకరికి అప్పగించాలని వాళ్ల అసలు ఉద్దేశం. అమ్మకు ఇది అస్సలు ఇష్టం లేదు.

సంక్షేమ కార్యకర్తలు మా అమ్మ మతిస్థిమితం కోల్పోతూ వుందని చెప్పటం మొదలుపెట్టారు. ఒకసారి మా ఇంటికి దగ్గర్లో వుండే ఒక నీగ్రో ఆమెకు పందిమాంసం ఇవ్వబోతే ఆమె తీసుకోలేదు. సెవెన్త్‌డే అడ్వెంటిస్టు మతస్థులమైన మేం దీన్ని తినము అని చెప్పింది. 'పిచ్చిది' మంచి మాంసం వద్దంటోంది అని ఆమె ముఖం మీదే ఇలా చాలాసార్లు అనటం నేను స్పష్టంగా విన్నాను.

వాళ్లు మనుషులను పీక్కుతినే రాబందులు. మా అమ్మ మనోభావాలను వాళ్లు ఏ రోజూ అర్థం చేసుకోలేదు. ఆమెను గౌరవంగా చూడనూ లేదు. 'ఆమెకు తిండి వద్దనే పిచ్చి' అని మాతోనే చెప్పేవారు. అప్పటి నుంచే మా కుటుంబం, మా ఐక్యత విచ్ఛిన్నం కావటం మొదలుపెట్టాయి. ఆ గడ్డు కాలంలో నేను ఏవిధంగానూ అమ్మకు సహాయపడలేదు. నావల్ల ఆమె ఎన్ని కష్టాలు, బాధలు పడ్డా ఆమె అంటే నాకు చాలా ప్రేమ.

గొహన్నాల కుటుంబం నన్ను తమ ఇంట్లో పెంచుకునే విధంగా సంఘం వాళ్లు రహస్య మంతనాలు జరిపి అమ్మతో చెప్పటం, ఆమె చీవాట్లు పెట్టడం జరిగిపోయాయి.

ఈలోగా నల్లగా, ఎత్తుగా మా నాన్నలాగే అనిపించే ఒక వ్యక్తి లాన్సింగ్ నుండి అప్పుడప్పుడూ మా ఇంటికి రావటం మొదలుపెట్టాడు. ఆయన చేసే పని

ఏమిటో నాకు తెలీదు. 1935లో లాన్సింగ్‌లో బతికే ఏ నీగ్రోకూ చెప్పుకోవటానికి ఫలానా వృత్తి అంటూ ఏదీ వుండేది కాదు. ఒంటరివాడైన ఆయన, అప్పటికింకా ముప్పయి ఆరేళ్ల వయసులోనే వున్న మా అమ్మ ఎక్కడ కలుసుకున్నారో నాకు తెలీదు. అతడి స్వతంత్ర జీవితాన్ని సహజంగానే అమ్మ ఆరాధించింది. మమ్మల్ని అదుపులో పెట్టటం రోజు రోజుకూ సమస్యగా మారుతున్న ఆమెకు ఒక మగతోడు వుంటే సహాయంగా వుంటుందని భావించింది. తండ్రి స్థానంలో ఒక మనిషి వుంటే సంఘం వాళ్లను తన కుటుంబం దరిదాపులకు రానీయకుండా దూరంగా తరిమేయవచ్చని ఆమె ఆలోచన. దీనిపట్ల మాకెవరికీ అభ్యంతరం లేకున్నా, అతను ఇంటికి రాగానే అమ్మ ఉన్న వాటిలోనే మంచి బట్టలు వేసుకొని, మనసు తేలిక పరుచుకుంటూ నవ్వుతూ మాట్లాడటం మాకు వింతగా అనిపించేది.

ఇలా సుమారు ఒక ఏడాది గడిచింది. 1936లోనో 1937లోనో లాన్సింగ్ నుండి వచ్చే ఆ మనిషి చెప్పాపెట్టకుండా అమ్మతో వున్న సంబంధాన్ని తెంచుకొని ఇంటికి రావటం మానేశాడు. మా ఎనిమిది మందినీ పోషించే బాధ్యత తీసుకోవటానికి భయపడి అతను వెనకడుగు వేశాడు అతని పరిస్థితీ అర్థం చేసుకోతగిందే. అయితే మా అందరికీ అన్ని రకాలుగా భద్రత కల్పించే ఉచ్చులో ఇరుక్కుపోయిన అమ్మను ఈ నిర్ణయం మానసికంగా తేరుకోలేని దెబ్బ కొట్టింది. ఈ దెబ్బతో తనలో తానే గట్టిగా మాట్లాడుకొనే ధోరణి ఆమెలో మొదలై రోజురోజుకూ అది భయం గొలిపే విధంగా పెరుగుతూ వుంది.

ఆమె బలహీనపడుతూ వుండటం చూసిన సంఘం వాళ్లు నన్ను ఇంటికి దూరంగా తీసుకొని పోవటంలో నిమగ్నమయ్యారు. నన్ను అభిమానించే గోహన్నా కుటుంబంలో పెరిగితే చాలా బాగుంటుందని నచ్చజెప్పారు. ఆ ఇంట్లో వాళ్లంతా 'పెద్దోడు' అని పిలిచే ఒక అబ్బాయి నాతో చాలా స్నేహంగా వుండేవాడు. నాకు కూడా వాళ్లంతా అంటే ఇష్టమే. కానీ, నేనెంతగానో ఆరాధించే మా అన్నయ్య విల్‌ఫ్రెడ్‌ను, మా అందరికీ మరో తల్లిలాంటి మా అక్కయ్య హిల్డాను, చిన్నవాళ్లయిన తమ్ముళ్లను, చెల్లెలిని విడిచి వెళ్లిపోవటం నాకు ఏ మాత్రమూ ఇష్టంలేదు. అమ్మ తనలో తాను మాట్లాడుకోవటం ఎక్కువై మా ధ్యాసే లేకుండా వుంటోంది. మా ఇంటికి పూర్వపు కళే తప్పిపోయింది. ఇన్నాళ్లూ మమ్మల్ని పెంచిన అమ్మ మా కళ్లముందే అచేతనంగా మారిపోతూ వుంది. ఇంటి బరువు బాధ్యతలన్నీ విల్‌ఫ్రెడ్, హిల్డా నెత్తిన పడ్డాయి.

ఆ తర్వాత కొద్ది కాలానికే నన్ను గోహన్నా ఇంటికి తీసుకొనిపోయారు.

అక్కడ పెద్దోడు, నేను ఒకే గదిలోనే వుండేవాళ్లం. ఎక్కడికి పోయినా జంటకవుల్లాగే తిరిగేవాళ్లం.

గోహన్నా కుటుంబంవాళ్లు, శ్రీమతి అడ్కాక్ చేపల వేటకు ఎంతో ఇష్టంగా పోయేవాళ్లు. కొన్ని శనివారాలు వాళ్లతోపాటు నేను, పెద్దోడు కూడా పోయేవాళ్లం. ఒకసారి ఆ ఇంటివాళ్లు తమ సన్నిహిత మిత్రులతో కలిసి కుందేళ్ల వేటకు మా ఇద్దర్నీ కూడా తీసుకొని పోయారు. ఈ ముసలివాళ్లంతా ఎప్పుడూ పన్నినట్టే వ్యూహం పన్నినారు. పెంపుడు కుక్క కుందేలుపై దూకగానే అది తప్పించుకొని వలయాకారంగా తిరుగుతుంది. కొద్దిసేపటికి తప్పించుకుపోయిన ప్రదేశానికే తిరిగి వస్తుంది. అంతవరకూ వేచి వుండి దాన్ని పట్టుకుంటారు. ఇదే ఆ వ్యూహం. నేను బాగా ఆలోచించి ఒక పథకం వేశాను. నేను, పెద్దోడు వాళ్ల నుండి విడిపోయి, కుందేలు వెనక్కి వచ్చే ప్రదేశం దగ్గరే కాచుకొని వున్నాం. కుందేలు మొదటగా నన్నే దాటి వెళ్లాలి. ఈ వ్యూహం మంత్రంలా పనిచేసింది. ముసలివాళ్లు ఒకటి పట్టుకునేలోపు నేను మూడు, నాలుగు కుందేళ్లు పట్టుకునేవాడిని. ఆశ్చర్యం కలిగించిన విషయమేమిటంటే, ఆ ముసలివాళ్లు నేను మంచి వేటగాడినని నివ్వెరపోయారు తప్ప నా విజయ రహస్యం కనిపెట్టలేకపోయారు. వాళ్ల వ్యూహాన్ని మెరుగుపర్చటం తప్ప నేను పెద్దగా చేసిందేమీ లేదు. దాంతో మరో ముఖ్య పాఠం నేర్చుకున్నాను. ఎప్పుడైనా సరే, నీకన్నా ఎక్కువ విజయాలు ఎవరైనా సాధిస్తున్నారంటే, మరీ ముఖ్యంగా ఇద్దరూ ఒకే పనిచేస్తున్నప్పుడు అలా జరుగుతోందంటే నీవు చేసే పనిని అవతలి వ్యక్తి విభిన్నంగా చేస్తున్నాడని అర్థం.

సమయం దొరికినప్పుడల్లా మా ఇంటికి వెళ్లి వచ్చేవాడిని. త్వరలోనే సంఘంవాళ్లు మా అమ్మ సంతానాన్నంతా తమ చేతుల్లోకి తీసుకున్నారు. చివరికి అమ్మకు జబ్బు బాగా ముదరటంతో ఆమెను కలమజూలోని పిచ్చాసుపత్రికి తరలించారు. అది లాన్సింగ్‌కు డెబ్బై మైళ్ల దూరంలో వుంది. మెక్‌కెలన్ అనే లాన్సింగ్‌లోని ఒక జడ్జికి మా అందరిపైనా అధికారం వుండేది. మేం కోర్టు కనుసన్నల్లో మెలిగే 'సంఘం పిల్లలం'. మాపైన సర్వాధికారాలూ ఆయనవే. నల్లవాడి పిల్లలపై తెల్లవాడికి అధికారం! ఇది దయతో కూడుకున్న చట్టబద్ధమైన ఆధునిక బానిసత్వం తప్ప ఇంకేమీ కాదు.

అమ్మ కలమజూలోని అదే ఆసుపత్రిలో సుమారు ఇరవై ఆరేళ్లు వుండింది. నేను మిచిగాన్‌లో వుండగా తరచూ వెళ్లి ఆమెను చూసి వస్తూండేవాడిని. ఆమె దయనీయస్థితి నన్ను గాఢంగా కదిలించింది. 1963లో అమ్మను ఆసుపత్రి నుండి

బైటికి తీసుకొచ్చిన తర్వాత లాన్సింగ్‌లో ఫిల్బర్ట్ దగ్గరే వుండింది. నేను 1952లో చివరిసారి ఆమెను చూశాను. ఆ తర్వాత మళ్లీ ఇంకెప్పుడూ చూడలేనేమో అనుకున్నాను. అప్పుడు నాకు ఇరవై ఏడేళ్లు. నన్ను అసలు ఆమె గుర్తుపట్టనే లేదు. నేను ఆమెను మాట్లాడించాలని చూసినప్పుడల్లా ఆమె మనసు మరెక్కడో వుండేది. 'అమ్మా, ఈ రోజు ఏం వారమో నీకు తెలుసా?' అనడిగాను. దానికామె నన్ను తదేకంగా చూసి, 'జనాలంతా పోయారు' అని జవాబు చెప్పింది. అప్పుడు నా మనోభావాలేమిటో మాటల్లో చెప్పలేను. నన్ను ఈ ప్రపంచంలోకి తీసుకొచ్చి, నాకు పాలిచ్చి, పెంచి, బుద్ధి నేర్పి, నన్ను శిక్షించి, ప్రేమించిన అమ్మకు నేనిప్పుడు ఎవరో తెలీదు. ఆ పరిస్థితి కళ్లారా చూసిన తర్వాత, నేను పట్టుతప్పి పాతాళంలోకి జారిపోతున్నట్టుగా అనిపించింది.

రాజ్యంలోని ఒక సామాజిక సంస్థ మా కుటుంబాన్ని నాశనం చేసిందని నేను నిజంగా నమ్ముతున్నాను. మేమంతా కలిసి వుండాలనే కోరుకున్నాం. కానీ, సంక్షేమం, కోర్టులు, వారి డాక్టరు దెబ్బ మీద దెబ్బ కొట్టి మా ఇంటిని కూల్చేశారు. వాళ్లు మమ్మల్నెప్పుడూ అంకెలుగానో, వాళ్ల పుస్తకాల్లో కేసులుగానో తప్ప మనుషులుగా చూడలేదు. అమ్మ వాళ్ల దృష్టిలో కేవలం సమాచారాన్ని తెలిపే ఒక గణాంకం. ఇది మనసులో కుళ్లు, స్వార్థమే తప్ప, దయాదాక్షిణ్యాల్లేని సమాజ వైఫల్యం. అందుకే, మనుషుల్ని అణగదొక్కి, తలమీద పెట్టిన బరువును మోయలేనందుకు వాళ్లకు జరిమానా విధించే సమాజంపట్ల నాక్కూడా మనసులో ఏ మాత్రమూ దయాదాక్షిణ్యాల్లేవు.

మా అమ్మ గురించి ఎవరితోనైనా సరే నేను చాలా అరుదుగా మాట్లాడాను. ఎందుకంటే, ఏ మాత్రమూ జంకు లేకుండా ఒక మనిషిని చంపగలిగిన నేను, అమ్మ గురించి ఎవరైనా తప్పుగా మాట్లాడితే సహించలేను. అందుకే, ఆమె విషయంలో తలదూర్చే అవకాశం నేను ఏ మూర్ఖుడికీ ఇవ్వలేదు. 1937లో మా కుటుంబం ముక్కలైన తర్వాత, విల్‌ఫ్రెడ్, హిల్డా మా నాన్న కట్టిన నాలుగు గదుల ఇంట్లోనే వున్నారు. ఫిల్బర్ట్ లాన్సింగ్‌లోనే శ్రీమతి హాకెట్ దగ్గరికి, రెగినాల్డ్, వెస్లీ విలియమ్స్ ఇంటికి వెళ్లారు. వీళ్లు అమ్మ స్నేహితులు. యువోనీ, రాబర్ట్‌లను మెక్‌గైర్ అనే వెస్టిండియన్ కుటుంబం తీసుకుంది.

మేమంతా విడిపోయినా లాన్సింగ్ చుట్టూ - బడిలో బయటా మెమెక్కడ కలిసినా మంచి సంబంధాలే కొనసాగించాం. మా కుటుంబంలో కృత్రిమ విభజన సృష్టించి, మా మధ్య దూరం పెంచినా, మానసికంగా మేమంతా మరింత సన్నిహితంగా మెలిగాము.

అధ్యాయం - 2

# జేబులో బొమ్మ

1937 జూన్ 27న జేమ్స్ బ్రాడాక్‌ను మట్టి కరిపించి జోలూయిూ ప్రపంచ హెవీ వెయిట్ ఛాంపియన్‌గా అవతరించాడు. ఈ విజయంతో లాన్సింగ్‌లోని నీగ్రోలు కూడా ఆనందోత్సవాలు జరుపుకున్నారు. జాతి అభిమానాన్ని ఉత్సవంగా జరుపుకోవటం మాత్రం మా తరం వాళ్లకు తెలీనిది. ప్రతి నీగ్రో పిల్లవాడూ ఛాంపియన్ కావాలని ఉవ్విళ్లూరాడు. అప్పటికే స్కూల్లో మంచి బాక్సర్‌గా గుర్తింపు తెచ్చుకున్న మా అన్న ఫిల్బర్ట్‌లో కూడా ఉత్సాహం ఉరకలు వేసేది. నేను కూడా ఇదే ఊపులో బాగానే సాధన చేశాను. ఒకసారి నాలాగే అనుభవంలేని బిల్ పాటర్సన్‌తో ఒక అమెచ్యూర్ బౌట్‌లో పాల్గొన్నాను. ఆ పోటీని చూడటానికి మా అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లతో పాటు పట్టణంలో నాకు తెలిసిన ప్రతి ఒక్కరూ హాజరయ్యారు. వీళ్లంతా నా కోసం వచ్చినవాళ్లు కాదు. అప్పటికే ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్న ఫిల్బర్ట్ తమ్ముడు ఎలా పోట్లాడుతాడో చూద్దాం అని వచ్చినవాళ్లు. పీటర్సన్‌కూ నాకూ మధ్య పోటీ మొదలైంది. మా ఇద్దరికీ అదే మొదటి పోటీ. నేనైతే భయపడ్డాను. తాను కూడా నన్ను చూసి భయపడ్డానని పీటర్సన్ ఆ తర్వాత నాతో చెప్పాడు. ఈ పోటీలో నేను ఓడిపోయాను.

ఆ రోజుల్లో క్రీడలు, సంగీతం, నాట్యంలాంటి వాటిల్లో పాల్గొనటానికి మాత్రమే నీగ్రోలకు అనుమతి వుండేది. ఒక నల్లవాడు మరో తెల్లవాడిని కొట్టడానికి అవకాశముండే ప్రదేశం బాక్సింగ్ రింగ్ ఒక్కటే. నేను ఓడిపోయిన తర్వాత అంతా నన్ను చిన్నచూపు చూశారు. మా తమ్ముడు రెగినాల్డ్ అసలు నన్ను కన్నెత్తి కూడా చూడకపోవటంతో నాకు భరించరాని అవమానమైంది. వెంటనే కసరత్తులు మొదలుపెట్టాను. వ్యాయామశాలంతా నా చెమట చిందించి మరో పోటీకి సిద్ధమయ్యాను. ఈసారి పీటర్సన్ సొంత ఊరైన ఆల్మాలో పోటీ మొదలైంది. గంట మోగగానే నేనో పిడికిలి చూశాను. తర్వాత పిడుగులు పడ్డాయి. పది సెకండ్ల తర్వాత రెఫరీ నా మొహం మీద 'పది' అని అరిచాడు. బహుశా చరిత్రలో అతి చిన్న 'పోరాటం' ఇదేనేమో! ఈ దెబ్బతో బాక్సింగ్‌కు స్వస్తి పలికాను.

ఇది జరిగిన కొన్ని రోజుల తర్వాత, ఒకరోజు నెత్తిన టోపీ పెట్టుకొని తరగతి

గదిలోకి వెళ్లాను. అది సహించని తెల్ల ఉపాధ్యాయుడు, తాను ఆగమని చెప్పేవరకూ ఆ టోపీ అలాగే నెత్తిన పెట్టుకొని తరగతి గది చుట్టూ తిరుగుతూనే వుండమని శిక్ష వేశాడు. ఆయన పాఠం చెపుతుండగా నేను మధ్యలో చొరబడి కుర్చీపై సూది గుచ్చి వెంటనే బైటికి వెళ్లిపోయాను. ఆయన కూర్చోగానే బాధతో కేకపెట్టాడు. నేను వెనుక వాకిలి గుండా పారిపోయాను. ఈ నేరానికి నన్ను బడి నుండి బహిష్కరించారు. బడి ఎగ్గొడితే నన్ను గోహన్నా కుటుంబంలోనే వుండనిస్తారనే ఆలోచనకు నాకు వుండిందనుకుంటా. ఆ ఉద్దేశంతోటే సొంత ఖర్చుల కోసం ఏదైనా చిన్న పనిలో చేరదామని ఊళ్లో పడి తిరుగుతూ వుంటే ఒక సంఘం మనిషి నన్ను పట్టుకొని కోర్టుకు అప్పగించాడు. అక్కడ నన్ను సంస్కరణ పాఠశాలకు పంపించాలని నిర్ణయించారు. అప్పటికి నా కింకా పదమూడేళ్లే. మేనార్డ్ అలెన్ అనే సంఘం మనిషి నన్ను గోహన్నా ఇంటి నుండి పిలుచుకొని వస్తూంటే ఆ ఇంట్లో వాళ్లంతా కన్నీళ్లు పెట్టుకున్నారు. తెల్లవాడైనా ఆయన చాలా మంచివాడు. వాళ్లందర్నీ ఓదార్చాడు. నాకు మాత్రం ఏడుపు రాలేదు. నేను బట్టలు సర్దుకోగానే ఆయన తన కారులో మేసన్‌లోని బాలనేరస్తుల జైలుకు నన్ను తీసుకొనిపోయాడు. దారి మధ్యలో నాకు ఎంతో ధైర్యం చెప్పాడు. 'సంస్కరణ' అంటే మెరుగ్గా మారటం అని ఆయనే ఆ మాటకు అర్థం చెప్పాడు. ఇక్కడున్న కాలంలో పిల్లలు తమ తప్పులు సరిదిద్దుకొని అందరూ గర్వించేట్టుగా బతకాలనీ, జైలు అధికారి శ్రీమతి స్వెర్లిన్ ఆమె భర్త ఇద్దరూ చాలా మంచివాళ్లనీ చెప్పాడు.

నిజంగానే వాళ్లు చాలా మంచివాళ్లు. శ్రీమతి స్వెర్లిన్ బాల నేరస్తులందరితో కలిసి భోంచేసేది. (సెవెన్త్‌డే అడ్వెంటిస్టుల గ్రామసభల తర్వాత మళ్లీ తెల్లవాళ్లతో కలిసి భోంచేసిన సందర్భం అదే). నీగ్రోలతో పోలిస్తే తెల్లవాళ్ల ఆహారపుటలవాట్లలో ఎంత తేడా వుంటుందో మరోసారి గమనించాను. స్వెర్లిన్ ఇంటిలో చెత్తలూడ్చటం, బండలు అలకటం మొదలుపెట్టాను. నా మనస్తత్వం వాళ్లందరికీ నచ్చింది. నేను వాళ్ళ జేబులో బొమ్మనెలా అయ్యానో ఇప్పుడు అర్థం చేసుకోగలను. నేను వాళ్ల ముందే వున్నా, 'నల్ల వెధవల' గురించి యథేచ్ఛగా, ఆ పదానికి అసలు అర్థమే నాకు తేలీదేమో అన్నంత బాహాటంగా మాట్లాడుకునేవాళ్లు. రోజుకు కనీసం ఓ వందసార్లయినా 'నల్లవెధవ' అనే పదం వాడేవారు. వాళ్ల మనసుల్లో ఏదో హాని చేద్దామని కాదు కానీ ఆ పదాన్ని మాత్రం అంతగా వాడేవారు. వీళ్ల మాటల్లోనే కాదు, వీళ్ల దగ్గరికి వచ్చిపోయే స్థానిక తెల్ల రాజకీయ నాయకులు, వీళ్లకు సన్నిహిత

మిత్రుడైన లాన్సింగ్ జడ్జి చేసే చర్చల్లో కూడా 'నల్లవేధవే' అందరికీ ఇష్టమైన అంశం. లాన్సింగ్‌లో వుండగా నా మీద సర్వాధికారాలూ వుండిన జడ్జి ఈయనే. ఆయన ఇక్కడికి రాగానే నా గురించి అడిగి, నన్ను దగ్గరికి పిలిపించుకొని నేనో మంచి గుర్రంపిల్లనో, జాతి స్వభావం తెలిసిన కుక్కపిల్లనో అయినట్టు ఎగాదిగా చూశాడు. ఇక్కడ నేను చెప్పదలుచుకున్నది ఒక్కటే, నేను పెంపుడు జంతువును కాదు మనిషినని, వాళ్లు మాట్లాడుకుంటున్నది నాకు అర్థమవుతుందనే విషయమే వాళ్లకు ఎప్పుడూ తోచలేదు. వాళ్లకున్నట్టే నాక్కూడా అదే సున్నితత్వం, బుద్ధి, అవగాహనాశక్తి వున్నాయని ఒప్పుకోవటానికి వాళ్లెప్పుడూ సిద్ధంగా లేరు. నేనున్న స్థితిలో తెల్లపిల్లవాడు కనుక వుండింటే ఇవన్నీ వాళ్లు గుర్తించి వుండేవాళ్లు. చారిత్రకంగా తెల్లవాళ్లతో వచ్చిన గొడవే ఇది. మేము వాళ్లతో పాటే వున్నా వాళ్ల మనుషులం కాదు. మా కోసం వాళ్లు వాకిలి తెరిచి వుంచినట్టు కనిపించినా అదెప్పుడూ మూసే వుంది. ఈ రకంగా వాళ్లు 'నన్ను' ఎప్పుడూ చూడనేలేదు. అందుకే 'సమైక్యతా దాహం'తో తపిస్తున్న నీగ్రోలకు నేను దీన్నే ఈ రోజు స్పష్టం చేయటానికి ప్రయత్నిస్తున్నాను. మీ 'ఉదార' తెల్ల స్నేహితులు, 'మంచి తెల్లవాళ్లు'గా పిలవబడే చాలామంది గురించి ఆలోచించమని చెప్తున్నాను. నీపట్ల ఒకడు ఎంత మంచిగా అయినా వుండనీ, నీ వెప్పటికీ గుర్తు పెట్టుకోవాల్సిన విషయమేమంటే, వాడు తనను, తన జాతిని ఎలా చూస్తాడో, నిన్ను దాదాపు అలా ఎన్నటికీ చూడడు. నీ పక్కన నిలబడొచ్చు. కానీ పటిష్టంగా కాదు. సంక్షోభం తలెత్తినప్పుడు, ఏ నల్లవాడికన్నా తనే మెరుగనే నమ్మకం వాడి నరనరానా జీర్ణించుకొని పోయినట్టు కొన్నిసార్లయినా నీవు తెలుసుకుంటావు.

మొత్తానికి బాలనేరస్తుల జైల్లో వున్న కాలంలో రోజులు బాగానే గడిచాయి. నేను విల్‌ఫ్రెడ్, ఫిల్బర్ట్‌లకన్నా బాగా పెద్దవాడి నవుతున్నాను. వాళ్లిద్దరూ అమ్మాయిలతో కలిసి నాట్యం కూడా చేస్తున్నారు. నన్ను కొంతమంది అమ్మాయిలకు పరిచయం చేశారు. వాళ్లలో కొంతమంది నచ్చినా నా దగ్గరున్న డబ్బును వాళ్ల కోసం తగలెయ్యి లేదు. శనివారం రాత్రులను నీగ్రో బార్లు, రెస్టారెంట్లలోనే మజా చేసుకున్నాను. గల్లా పెట్టెలన్నీ ఎర్స్కిన్, హాకిన్స్ బృందం పాడే 'టక్సిడో జంక్షన్', 'స్లిమ్ అండ్ స్లామ్స్', 'ఫ్లాట్‌ఫూట్ ఫ్లూజీ' లాంటి పాటల కోసం ఎదురుచూసేవి. కొన్నిసార్లు లాన్సింగ్‌లో జరిగే నాట్యాలకు సంగీతం అందించటానికి 'న్యూయార్క్' నుండి పెద్ద బృందాలు వచ్చేవి. 'న్యూయార్క్' అనే మాట చెవిలో పడేసరికి పాడుతున్నది ఎవరైనా సరే జనాలు ఇళ్ల నుండి బిలబిలా బైటికి వచ్చేవాళ్లు.

లక్కీథాంప్సన్, మిల్ట్‌జాక్సన్‌ల పేర్లు కూడా నేనప్పుడే విన్నాను. తర్వాత హార్లెమ్‌లో వుండగా వీళ్ల గురించి ఎక్కువగా తెలుసుకున్నాను. బాలనేరస్తుల జైల్లో వున్నవాళ్లు విడుదల అయిన వెంటనే సంస్కరణ పాఠశాలకు పోయేవాళ్లు. నేను వెళ్లే తేదీ రెండు మూడుసార్లు వాయిదా పడింది. నా కళ్లముందే కొత్తవాళ్లు రావటం, పోవటం కూడా అయింది. శ్రీమతి స్వెర్లిన్ పుణ్యమా అని నేనక్కడే వుండిపోయాను. నాక్కూడా పోవాలని లేదు. అయితే ఆమె ఒకరోజు వచ్చి నన్ను మేసన్ జూనియర్ హైస్కూల్లో చేర్పిస్తున్నట్టు చెప్పింది. పట్టణంలో వున్న ఆ బడిలో చదువుకున్న బాలనేరస్తుడిని నేనే. అక్కడ నేను ఏడో గ్రేడ్‌లో చేరాను. అక్కడ చదువుకునే తెల్లపిల్లలు లాన్సింగ్ బడిలోని పిల్లలకన్నా నాతో ఎక్కువ స్నేహంగా వుండేవారు. ఉపాధ్యాయులతో సహా అందరూ నన్ను 'నల్ల వెధవ' అని పిలుస్తున్నా, శ్రీమతి స్వెర్లిన్ తరపువాడిగా నేను అందరికీ ముఖ్యుడినయ్యాను. చదువుకుంటూనే ఒక స్థానిక రెస్టారెంట్లో గిన్నెలు కడిగే పనిలో చేరాను. బడి విడిచిన తర్వాత పనికి పోయేవాడిని. ప్రతి శుక్రవారం రాత్రి జీతం డబ్బులు చేతిలో పడగానే ఎంతో ఎత్తుకు ఎదిగిపోయినట్టు పొంగిపోయేవాడిని. అలా సంపాదించిన డబ్బు కూడబెట్టి ఒక ఆకుపచ్చ సూటు, బూట్లు కొన్నాను. నా తోటి విద్యార్థులకు చిన్న చిన్న విందులు కూడా ఇచ్చేవాడిని.

ఇంగ్లీషు, చరిత్ర నేనెక్కువగా ఇష్టపడ్డ విషయాలు. ఇంగ్లీషు చెప్పే ఒస్ట్రోవ్‌స్కి, జీవితంలో ఏదో ఒకటి సాధించాలనే దాని గురించే ఎప్పుడూ చెప్తుండేవాడు. చరిత్ర క్లాసులో నచ్చని విషయం ఒక్కటే 'నల్ల వెధవ', జోకులకు ప్రసిద్ధుడైన ఉపాధ్యాయుడు విలియమ్స్. ఒకసారి మా పాఠ్యపుస్తకంలో నీగ్రో చరిత్ర గురించి ఒక పెద్ద పేరాగ్రాఫునంతా ఊపిరి తీసుకోకుండా, నీగ్రోలు ఎలా బానిసలయ్యారో, ఎలా విముక్తులయ్యారో వాళ్లెట్లా నోరులేని వాళ్లో నవ్వుకుంటూనే చదివాడు. ఆ పాఠానికి తన సొంత మానవ పరిణామశాస్త్ర ఉల్లేఖనాన్ని కూడా జోడించి 'నీగ్రోల పాదాలు ఎంత పెద్దవంటే - వాళ్లు నడిస్తే నేలమీద అడుగులు పడవు, గుంతలు పడతాయి' అని నవ్వుతూనే చెప్పాడు. నాకు ఆయనన్నా అసహ్యం కానీ చరిత్ర అంటే చాలా ఇష్టం. అయితే నాకు అస్సలు నచ్చని విషయం లెక్కలు అని చెపుతున్నందుకు పాఠకులు నన్ను మన్నించాలి. లెక్కల్లో వాదించటానికి అవకాశం వుండదు. ఎందుకంటే అక్కడ నువ్వొక తప్పు చేస్తే అందుకే అది నాకు నచ్చలేదు అది తప్పే.

బాస్కెట్‌బాల్ జట్టులో ఒక ఆటగాడిగా చుట్టుపక్కల పట్టణాల్లో పోటీలకు పోయినప్పుడు నన్ను చాలా రకాలుగా తిట్టేవారు. మా కోచ్‌తో సహా ఎవ్వరికీ అవి తిట్లుగా అనిపించలేదు. విచిత్రంగా ఎందుకో నాకు మాత్రమే అట్లా అనిపించేది. సాధారణంగా ఈ పోటీలు ముగిసిన తర్వాత అందరూ కలిసి నాట్యం చేసేవారు. నేను మాత్రం బిర్ర బిగుసుకు పోయేవాణ్ణి. ఎవరితోనూ కలిసేవాడిని కాదు. అక్కడ ఆహ్లాదకరమైన వాతావరణమున్నా భౌతికరంగా ఏదో అడ్డుగోడ వున్నట్టు అనిపించేది. ఈ జేబులో బొమ్మ ఏ తెల్ల అమ్మాయితోనూ కలిసి నాట్యం చేసేవాడు కాదు. వాళ్లంతా నాట్యం చేస్తుంటే నేను అక్కడే నిలబడి చూస్తూ, నవ్వుతూ, మాట్లాడుతూ, ఏదో ఒక పానీయం తాగుతూ, తింటూ కొంచెంసేపు గడిపి క్షమించమని అక్కడి నుంచి త్వరగా బైట పడేవాడిని. ప్రత్యేకంగా ఒక్క విషయం గురించి మాత్రం చాలాసేపు ఆలోచించేవాడిని. లాన్సింగ్‌లో మాదిరే మేసన్ బడిలోని తెల్ల అబ్బాయిలు కూడా అన్నిచోట్లా కలిసే తిరుగుతున్నా ఒక్క విషయంలో అంతా కలిసి నన్ను ఏకాకిని చేసేవారు. కొంతమంది తెల్ల అమ్మాయిలతో, కొన్నిసార్లు తమ అక్కచెల్లెళ్లతో కూడా నన్ను బలవంతంగా సెక్సులో పాల్గొనమని పట్టుబట్టేవారు. తమ అక్కచెల్లెళ్లతో సహా మిగతా ఆడపిల్లల్ని అనుభవించామనో లేదా అందుకు ప్రయత్నిస్తున్నామనో నాతో చెప్పేవారు. వాళ్లు నన్ను అడ్డం పెట్టుకొని ఆడపిల్లల్ని బలవంతపెట్టి తమ పని కానిస్తున్నారని నాకు నిదానంగా అర్థమైంది. నీగ్రోలకు సెక్సు గురించి బాగా తెలుసని వాళ్లకు నమ్మకం. ఇదే విషయం ఆడపిల్లలతో చెప్పమని నన్ను అడిగేవారు. నేను ఏ రోజూ ఎవ్వరితో అట్లా చెప్పలేదు. విల్‌ఫ్రెడ్, ఫిల్బర్ట్ పరిచయం చేసిన నీగ్రో అమ్మాయిలనే నిజంగా నేను కోరుకున్నది. అయితే నాకే ధైర్యం చాలలేదు. లాన్సింగ్‌లో విన్నదీ, చూసిందీ ఏమంటే శనివారం రాత్రుల్లో నల్ల పురుషులు, కొంతమంది తెల్ల స్త్రీలు ఒకరినొకరు కోరుకునేవారు నీగ్రోల వెంట పడేవారు కూడా. అయితే అక్కడ ఏ సమస్యా రాలేదు. నేననుకున్నట్టే ఇదంతా సర్వసామాన్యమని ప్రతి ఒక్కరూ అనుకున్నారని నా కనిపిస్తుంది. నేను మాత్రం మరో రెండేళ్ల దాకా తెల్ల అమ్మాయిల జోలికి వెళ్లలేదు.

ఏడో గ్రేడ్ రెండవ సెమిస్టర్‌లో వుండగా నేను క్లాసు ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యాను. మిగతా వాళ్లకంటే ఇది నాకే ఎక్కువ ఆశ్చర్యం కలిగించింది. నేను చదువులో ముందుండటమే దీనికి కారణమని నా కనిపిస్తుంది. నేను అందరికీ ముద్దొచ్చే బొచ్చు కుక్కపిల్లలా వుండేవాడిని. ఒక నీగ్రోలా వుండటం గురించి

నేనెక్కువగా బాధపడలేదు. ఎందుకంటే నేనొక తెల్లవాడిలా వుండటం కోసమే చెమటోడ్చి కష్టపడ్డాను. అందుకే తెల్లవాళ్లతో కలిసిపోవటానికి తమ విలువైన సమయాన్ని వృధా చేసుకుంటున్నారని నల్ల అమెరికన్లకు చెప్పటం కోసమే ఈ రోజు నా జీవితంలో ఎక్కువ భాగం వెచ్చిస్తున్నాను. శ్రీమతి స్వెర్లిన్ నా ఎన్నిక గురించి విని, 'మాల్కం నిన్ను చూస్తే మాకు గర్వంగా వుంది' అని అభినందించింది. నన్ను అప్పుడప్పుడూ చూసిపోవటానికి వస్తూ వుండిన మేనార్డ్ అలెన్ కూడా నన్ను మెచ్చుకున్నాడు. 'సంస్కరణ' అనే మాటకున్న అర్థాన్ని నాకన్నా బాగా ఎవరూ రుజువు చేయలేదని కితాబు కూడా ఇచ్చాడు. పోతే 'గాన్ విత్ ద విండ్' సినిమా గురించి ఇక్కడ ఒక జ్ఞాపకం చెప్పుకోవాలి. మేసన్‌లో ఒకసారి ఆ సినిమా వేశారు. థియేటర్ మొత్తానికి నేనొక్కడినే నీగ్రో. సీతాకోకచిలుక మెక్‌క్వీన్ తెరమీద కనిపించగానే, నాకు దుప్పట్లో దూగాడుతున్న అనుభూతి కలిగింది. నాకు పధ్నాలుగేళ్లు వచ్చాయి. విల్‌ఫ్రెడ్, హిల్డా లాన్సింగ్‌లోని మా పాత సొంత ఇంట్లోనే వుంటున్నారు. ప్రతి శనివారమూ అక్కడికి పోయేవాణ్ణి. విల్‌ఫ్రెడ్‌కు పుస్తకాల పిచ్చి తగ్గలేదు. ఫిల్బర్ట్ ఈ ప్రాంతానికే చాలా గొప్ప అమెచ్యూర్ బాక్సర్ అవుతాడని ఇక్కడ ప్రతి ఒక్కరూ అనుకునేవారు. నేను బాక్సింగ్ మానేశాక రెగినాల్డ్‌కు నాకూ మధ్య మంచి సంబంధాలేర్పడ్డాయి. శ్రీమతి విలియమ్స్ ఇంటికి పోయి వాడినీ వెస్లీని చూసి వాళ్ల చేతుల్లో చెరి రెండు డాలర్లు పెట్టటం, శ్రీమతి మెక్‌గైర్ ఇంటిలో యువానీ, రాబర్ట్‌లను కలిసి వాళ్లకూ కొంత డబ్బు ఇవ్వటం నాకు సంతోషం కలిగించేది. అందరూ కలిసినప్పుడు కూడా అమ్మా, నాన్నల ప్రస్తావన ఎవరూ తెచ్చేవారు కాదు. పెద్దవాళ్లం మాత్రం విడివిడిగా కలమజూకు పోయి అమ్మను చూసి వచ్చేవాళ్లం. ఈ కాలంలోనే మా నాన్న మొదటి భార్య కూతురైన ఎల్లా బోస్టన్ నుండి లాన్సింగ్‌కు వస్తున్నట్టు సమాచారం అందింది. మేమంతా ఎంతో సంతోషించాం. ఆమె ఇక్కడికి రావటం నా మీద చాలా ప్రభావం చూపింది. తాను ఒక నల్ల స్త్రీ అయినందుకు అంతగా గర్వించే మనిషిని నా జీవితంలో అంతకు ముందెన్నడూ చూడలేదు. ఒకరోజు నేను మధ్యాహ్నం బడి నుండి ఇంటికి రాగానే ఎల్లాను చూశాను. ఆమె నన్ను కౌగిలించుకొని ఆపాదమస్తకమూ చూసింది. అధికారం పుట్టిపడే ఆమె రంగు మామూలు నలుపు కాదు, మా నాన్నలాగే కారునలుపు. ఆమె చూపులో, మాటలో, నడకలో, తీరులో అంతటా ఆత్మవిశ్వాసం తొణికిసలాడేది. తన కుటుంబంలోని చాలామందిని జార్జియా నుండి బోస్టన్‌కు రప్పించి సహాయం చేసిందని మా నాన్న

ఈమె గురించి గొప్పగా చెప్పటం గుర్తొచ్చి అది నిజమే అనిపించింది. ఆమె కష్టపడి, ఆస్తులు సంపాదించిందనీ, 'నల్ల సమాజం'లో పనిచేస్తోందనీ నాన్న చెప్పేవాడు. చేతిలో పైసా లేకుండా ఉత్తర అమెరికాకు వచ్చి ఎంతో కష్టపడి కూడబెట్టిన ఆస్తుల ద్వారా వచ్చే డబ్బును జార్జియాలోని కుటుంబసభ్యులకు పంపించేది. ఆమెను చూడగానే ఆ లక్షణాలన్నీ కనిపించాయి. ప్రస్తుతం ఆమె రెండో భర్తతో కలిసి జీవిస్తోంది.

ఎల్లా అన్నిరకాల కుశల ప్రశ్నలూ అడిగింది. విల్‌ఫ్రెడ్, హిల్డాల ద్వారా నేను క్లాస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన విషయం తెలుసుకుంది. ప్రత్యేకించి ఆమె నా మార్కుల గురించి అడగ్గానే పరిగెత్తిపోయి నా ప్రోగ్రెస్ రిపోర్టు తెచ్చి చూపించాను. క్లాసు ఫస్ట్ వచ్చిన ముగ్గురిలో నేనూ ఒకడిని అయినందుకు నన్ను ఎంతగానో మెచ్చుకుంది. నన్ను దగ్గరికి తీసుకొని 'నాన్న పిల్లలమంతా కలిసే వుండాలి' అని చెప్పింది. ఆ మాటే కాదు, ఆమె చెప్పిన పద్ధతి కూడా నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది. మనమంతా కలిసి అమ్మను చూడటానికి పోతున్నామని ఆమె చెప్పినప్పుడు మేమంతా చాలా సంతోషపడ్డాం. ఈ లోకంలో అమ్మకు ఏదైనా సహాయం చేయాలంటే అది ఎల్లాకు మాత్రమే సాధ్యమవుతుందని మా అందరికీ అనిపించింది. అందరమూ కలిసి అమ్మను చూడటానికి కలమజూకు పోయాం. నవ్వుతూ బైటికి వచ్చిన అమ్మ ఎల్లాను చూడగానే చాలా ఆశ్చర్యపోయింది. దాదాపు తెల్లగా వుండే అమ్మ, కారునలుపులో వుండే ఎల్లాల మధ్య కొట్టొచ్చినట్టు తేడా కనిపించింది. ఇద్దరూ ఒకరినొకరు గాఢంగా కౌగిలించుకున్నారు. ఆ తర్వాత జరిగిన విషయాలు నాకు పెద్దగా గుర్తులేవు కానీ ఆసుపత్రి నుండి బైటికి పోయేటప్పుడు మాత్రం అమ్మకు శారీరకంగా ఏదో జబ్బు చేసినట్టు తప్ప ఇంకేమీ లేదనిపించింది. దీనికి కారణం ఎల్లా అక్కడ వుండటం అనేదొక్క విషయమే గుర్తుంది. కొన్ని రోజుల తర్వాత మేముండే అన్ని ఇళ్లూ మరోసారి తిరిగి ఎల్లా బోస్టన్‌కు వెళ్లిపోయింది. పోయే ముందు తనకు క్రమం తప్పకుండా ఉత్తరాలు రాస్తూండమని నాకు చెప్పి పోయింది. వేసవి సెలవులకు బోస్టన్‌కు రమ్మని కూడా ఆమె చెప్పటంతో ఎగిరి గంతేశాను.

1940 వేసవికాలంలో లాన్సింగ్ నుండి గ్రేహౌండ్ బస్సులో బోస్టన్‌కు బయలుదేరాను. అక్కడికి చేరుకోగానే ఎల్లా వచ్చి, బోస్టన్‌లోని రాక్స్‌బరీ కాలనీలో వుండే వాంబెక్ వీధిలోని తన ఇంటికి పిలుచుకొని పోయింది. అక్కడ ఎల్లా రెండో భర్త అయిన ఫ్రాంక్‌ను కలిశాను. ఆయన ఒక సైనికుడు. ఆమె తమ్ముడు ఎర్ల్

బోస్టన్‌లోనే గాయకుడిగా వుంటున్నాడు. ఆమె చెల్లెలు మేరీ చాలా నెమ్మదస్తురాలు. దుడుకు స్వభావంలో ఎల్లా నేనూ ఒకటే. అందుకే మేరీ నాకు చాలా గమ్మత్తుగా కనిపించింది. ఎల్లా ఎన్నో రకాల పనుల్లో తలమునకలై వుండేది. ఆమె ఎన్ని రకాల క్లబ్బుల్లో సభ్యురాలో నాకైతే తెలీదు. స్థానికంగా పనిచేసే 'నల్లసమాజం'లో ఆమెది నాయకురాలి హోదా. ఆ పెద్ద నగరంలో ఆనకట్ట తెగినట్టు మాట్లాడే నల్లవాళ్లతో పాటు ఇంకా ఎన్నో వింతలూ, విశేషాలూ చూశాను. అక్కడి ప్రజలు షికాగో, డెట్రాయిట్, న్యూయార్క్ నగరాల గురించి అలవోకగా మాట్లాడుకునేవారు. రాత్రిళ్లు, ముఖ్యంగా శనివారాలైతే చాలు రాక్స్‌బరీ నడిబొడ్డున అంత భారీ సంఖ్యలో నీగ్రోలు తిరిగే ప్రపంచాన్ని నేను అంతకు ముందు చూడలేదు. నియాన్ లైట్లు, నైట్ క్లబ్బులు, బార్లు, కార్లు, రెస్టారెంట్ల నుండి వచ్చే నల్లవంటల ఘుమఘుమలతో వీధులన్నీ నిండిపోయేవి. చేయీచేయీ కలిపి నడుచుకుంటూ పోయే నలుపు-తెలుపు జంటల్ని కూడా మొదటిసారి నేనిక్కడే చూశాను. నల్లవాళ్ల కోసమే ప్రత్యేకంగా క్రైస్తవ మందిరాలు కూడా వున్నాయి. ఆ మందిరాల్లో తెల్లవాళ్లు కేవలం పెదవులతో ప్రార్థనలు చేస్తే, బోస్టన్ నీగ్రోలు మాత్రం మనస్ఫూర్తిగా చేసేవారు. ఈ విశేషాలన్నీ లాన్సింగ్ వచ్చి చెపుతానని విల్‌ఫ్రెడ్‌కు ఉత్తరమైతే రాశాను కానీ అప్పటికే చదువుతో, చాకిరీతో బాగా అలసిపోవటం వల్ల సమయం చాలలేదు. దీంతో వెంటనే ఎనిమిదో గ్రేడ్‌లో చేరిపోవాల్సి వచ్చింది. బోస్టన్ నుండి తిరిగి వచ్చిన తర్వాత, నిజంగా నా జాతి మనుషులు అక్కడే వున్నారనిపించింది. అక్కడి నుంచి రాగానే స్నేహితులు, స్వెర్లిన్ దంపతులు, నేను పనిచేసే రెస్టారెంట్‌లోని తెల్లవాళ్లంతా నీలో చాలా మార్పు వచ్చింది ఏమిటి విషయమని అడిగారు.

నేను ఎప్పటిలాగానే చదువులో ఫస్టు వస్తూనే వున్నాను. మొదటి సెమిస్టర్ పాసై 'ఎ' గ్రేడ్‌లోకి పోయాను. తర్వాతి సంవత్సరం హైస్కూల్‌లో చేరాలి. ఆ సమయంలో నా జీవితాన్ని మలుపు తిప్పిన ఒక సంఘటన జరిగింది. మాకు ఇంగ్లీషు చెప్పే ఓస్ట్రోవ్‌స్కీ ప్రతి దానికీ సలహా ఇచ్చేవాడు. ఆయన పుట్టుకతోనే సలహాదారని మేమంతా జోకులు వేసుకునేవాళ్లం. ఆయన నాకూ ఓ సలహా ఇచ్చాడు. అందులో ఏదైనా హాని తలపెట్టే ఉద్దేశముందేమోనని అనుమానించాను. ఎందుకంటే ఒక అమెరికన్ తెల్లవాడిగా అది ఆయన స్వభావంలోనే వుంటుంది. తన విద్యార్థుల్లోకల్లా ఉత్తమ విద్యార్థిని, స్కూలు ఫస్టు అయిన నా భవిష్యత్తును ఆయన చూస్తున్న పద్ధతి ఏమంటే 'నీ స్థానంలో నీవుండు'. తెల్లవాళ్లందరూ నల్లవాళ్ల గురించి

కోరుకునేది కూడా ఇదే. 'మాల్కం, నీవు నీ భవిష్యత్తు గురించి ఎప్పుడైనా ఆలోచించావా? అని అడిగాడు. పెద్దగా నేనెప్పుడూ ఆలోచించకపోయినా, 'అవున్సార్ నేను లాయర్ కావాలనుకుంటున్నాను' అని చెప్పాను. నిజానికి ఆ రోజుల్లో లాన్సింగ్‌లో నీగ్రో లాయర్లు కానీ, డాక్టర్లు కానీ లేరు. నాకు తెలిసిందల్లా లాయర్ నాలాగా గిన్నెలు కడగడు అనే దొక్కటే. నేనీ మాట చెప్పగానే ఓస్ట్రోవ్‌స్కీ ఆశ్చర్యపోయాడు. నెమ్మదిగా నిట్టూర్చి వంకరనవ్వు నవ్వుకుంటూ 'మాల్కం జీవితంలో మనకు అన్నిటికన్నా అవసరమైనది వాస్తవికంగా వుండటం. నన్ను అపార్థం చేసుకోవద్దు. మేమంతా కూడా నీలాంటి వాళ్లమే. అయితే ఒక నల్లవెధవకు తాను లాయర్ కావటమనేది ఏ మాత్రమూ వాస్తవికమైన లక్ష్యం కాదు. నీవు చేయగలిగినదాన్ని గురించే ఆలోచించు. వడ్రంగం పని నీకు బాగా వచ్చు. నీ పనితనాన్ని అందరూ మెచ్చుకుంటారు. వడ్రంగం పని గురించి ఎందుకు ఆలోచించవు? జనాలు కూడా నిన్ను వ్యక్తిగా ఇష్టపడతారు. వాళ్ల అన్ని పనులూ నీ దగ్గరే చేయించుకుంటారు కదా? ఆయన మాటల్లోని భావం తర్వాత నాకు అర్థమై నా మనసులో ముల్లులా గుచ్చుకుంటూనే వుండింది. ఆయన క్లాసులో మిగతా తెల్లవాళ్ల కిచ్చిన సలహాలు ఇంతకన్నా ఎక్కువగా నన్ను కలవరపరిచాయి. వాళ్లలో చాలామంది తమ తల్లిదండ్రుల్లాగే రైతులమవుతామని, కొంతమంది టీచర్లమవుతామని, ఒక విద్యార్థి పశు వైద్యుడినవుతానని, మరో అమ్మాయి తాను నర్సునవుతాననీ ఇలా రకరకాలుగా చెప్పారు. ఆయన వాళ్లందర్నీ ప్రోత్సహించాడు. అలా చెప్పిన వాళ్లలో నాతో సమానంగా మార్కులు సంపాదించుకున్నవారు ఒక్కరు కూడా లేరు. నా తోటి తెల్ల విద్యార్థులకన్నా నేనే చదువులో ముందున్నా, జీవితంలో నాక్కావలసింది సాధించుకునే తెలివితేటలు వాళ్ల దృష్టిలో నాకు లేవు.

ఆ సంఘటనతో మార్పు మనసులో మొదలైంది. తెల్లవాళ్లకు దూరంగా వుండటం, క్లాసుకు రావటం, అడిగినప్పుడు మాత్రం బదులు చెప్పటం, ఓస్ట్రోవ్‌స్కీ క్లాసులో మొక్కుబడిగా కూర్చోవటం - ఇంక ఈ రకంగా ప్రవర్తించటం మొదలుపెట్టాను. నా వెనుక ఎవరైనా 'నల్లవెధవ' అన్నట్టు వినపడగానే ఆగి వెనక్కి తిరిగి చూసేవాడిని. అది వాళ్లకు ఆశ్చర్యం కలిగించేది. 'నల్లవెధవ' అని ఎవరైనా అంటే సహించటం లేదు. ఇందులో తప్పేముంది? టీచర్లతో సహా నాకేమైందో ఎవరికీ అంతు బట్టలేదు. అందరూ నా గురించి చర్చించుకుంటున్నారని నాకు అర్థమైంది. కొన్ని వారాలపాటు నేను పనిచేసే రెస్టారెంట్‌లో, స్వేర్లిన్ ఇంట్లో కూడా

నాది ఇదే వరుస. ఒకరోజు శ్రీమతి స్వేర్లిన్ నన్ను తన ఇంటికి పిలిపించింది. అక్కడే సంఘం మనిషి మేనార్డ్ అలెన్ కూడా వున్నాడు. వాళ్ల మొహాలు చూడగానే ఏదో జరగబోతూందని అర్థమైంది. బడిలో, పనిలో, తమ దగ్గర, మేసన్‌లో ప్రతి ఒక్కరి దగ్గరా మంచి పేరు తెచ్చుకున్న తర్వాత కూడా నేను అందరితో సంతోషంగా ఎందుకు వుండలేకపోతున్నానో తమ కెవ్వరికీ అర్థం కావటం లేదని ఆమె చెప్పింది. ఇంక నేను ఎక్కువ రోజులు బాలనేరస్తుల జైల్లో వుండాల్సిన పనిలేదని, నన్ను చాలా ఇష్టపడే లియాన్స్ ఇంటికి పంపటానికి అన్ని ఏర్పాట్లూ చేశానని ఆమె చెప్పింది. తర్వాత ఆమె నా ముందుకు తన చెయ్యిచాపి, 'నిన్ను ఒక వందసార్లు అడిగి వుంటాను మాల్కం, ఏమి తప్పు జరిగిందో నాకు చెప్పాలనుకుంటున్నావా? అని అడిగింది. నేను కూడా చేయి కలిపి 'ఏమీ లేదు మేడం' అని చెప్పి నా సామాను సర్దుకొని వచ్చేశాను. వాకిలి దగ్గర ఆమె కళ్లు తుడుచుకోవటం చూశాను. నాకు చాలా బాధ కలిగింది. ఆమెకు కృతజ్ఞతలు చెప్పి అలెన్ వెంట లియాన్స్ ఇంటికి వెళ్లిపోయాను. ఎనిమిదో గ్రేడ్ పూర్తవుతున్న కాలంలో రెండు నెలలపాటు ఆ ఇంట్లోనే వున్నాను. ఆ ఇంట్లో వాళ్లంతా ఏమి జరిగిందో తెలుసుకోవాలని ప్రయత్నించారు. అయితే నేను వాళ్లకేమీ చెప్పలేదు. ఎప్పటిలాగే ప్రతి శనివారమూ లాన్సింగ్ వెళ్లి అందర్నీ చూసి వచ్చేవాడిని. కారణం చెప్పలేదు గానీ, నాకు మాత్రం బోస్టన్‌కు వచ్చి అక్కడే బతకాలని వుంది అని ఎల్లాకు ఉత్తరం రాశాను. ఆమె ఎలా చేసిందో నాకు తెలీదు. నన్ను అధికారికంగా మిచిగాన్ నుండి మెసాచుసెట్స్‌కు బదిలీ చేసే ఏర్పాటు చేసింది. ఆ వారమే ఎనిమిదో గ్రేడ్ పూర్తిచేసి, మరోసారి గ్రేహౌండ్ బస్సులో బోస్టన్‌కు బయల్దేరాను. అప్పటి నుంచీ ఆ కాలం గురించి ఆలోచించాను. నా జీవితంలో భౌతికంగా ఏ మార్పు చోటు చేసుకున్నా దాని పర్యవసానాలు మాత్రం గొప్పగా లేవు. నేనింకా మిచిగాన్‌లోనే వుండింటే, లాన్సింగ్‌లోని ఏ నీగ్రో అమ్మాయినో పెళ్లి చేసుకొని, బూట్‌పాలిష్ చేసేవాడిగానో, అక్కడి కంట్రీ క్లబ్బులో వెయిటర్‌గానో, వడ్రంగి వాడిగానో బతికేవాణ్ణి. ఆ రోజుల్లో వీళ్లే నీగ్రోల దృష్టిలో 'విజేతలు'. అందుకే, అప్పటి నుంచీ నా మనస్సాక్షి ఏది చెపితే అదే చేస్తూ పోయాను. నాకిప్పుడనిపిస్తుంది, ఒకవేళ ఓస్ట్రోవ్‌స్కీ లాయర్‌గా నన్ను ప్రోత్సహించి వుంటే, బహుశా ఈ రోజు ఒక లాయర్‌నై నీగ్రోల తరఫున వకాల్తా పుచ్చుకొని వాళ్లు 'సమైక్యత' కోసం బిచ్చమెత్తుకునే రెండు ముఖాల తెల్లవాళ్ల నుండి ఏవో కొన్ని ఎంగిలి మెతుకులు ఏరుకుంటూ వుండేవాడిని. అల్లా దయవల్ల నేనలాంటి తలచెడిన నల్ల క్రైస్తవుడిలా మిగిలిపోలేదు.

అధ్యాయం - 3

# పల్లెటూరి చిన్నోడు

మేసన్, మిచిగాన్ వాసనలు నాలో ఇంకా బలంగా వున్నాయి. కొంకర్లు తిరిగి జడలు కట్టిన రాగిరంగు జుట్టుకు నేను గ్రీజ్ కూడా పట్టించేవాడిని కాదు. నా ఆకుపచ్చ సూటు చేతులు మణికట్ల వరకూ వుండేవి. సాక్సులు మూడు అంగుళాలు కనపడేట్టు ప్యాంటు కాళ్లు వుండేవి. దీని పైకి, లాన్సింగ్ కిరాణం అంగట్లో పైన వేసుకునే లేత ఆకుపచ్చరంగులో సన్నటి కాలర్లుండే ఓ మూరేడుకోటు. నా అవతారాన్ని చూసి ఎల్లానే బిత్తరపోయింది. తర్వాత తేరుకొని, జార్జియా నుండి వచ్చిన 'లిటిల్' కుటుంబసభ్యులు నాకన్నా నాటురకం అని తానే ధైర్యం చెప్పింది. నా కోసం తన అందమైన చిన్ని మేడపైన ఒక గది కేటాయించింది. ఆమె వంటింట్లో అడుగు పెట్టిందంటే మాత్రం నిజంగానే జార్జియా మహిళ. ఆమె వడ్డిస్తే, పందిమాంసం, జింకమాంసం, పచ్చి కూరగాయలు, చేపలవేపుడు, క్యాబేజి, గెనుసుగడ్డలు, గులకరాళ్లు, గొజ్జు, మొక్కజొన్న రొట్టెలతో కంచమంతా నిండిపోయేది. వడ్డించిన పదార్థాలు ఎంత తింటే ఆమెకు అంత ఇష్టం. మేసన్, లాన్సింగ్‌లలో ఎంత గంభీరమైన వ్యక్తిలా కనపడిందో ఇప్పుడూ అలాగే వుంది. నేనక్కడకు చేరుకోవటానికి సుమారు రెండు వారాల ముందు తన రెండో భర్తతో కూడా ఆమె విడిపోయింది. తన జాతి మనుషుల కోసం నిరంతరం కష్టపడే అలాంటి స్త్రీతో కాపురం చేయటం ఏ సగటు మగవాడికైనా అసాధ్యమని నాకనిపించింది. కొత్తగా వచ్చే నీగ్రోల మాదిరి వెంటనే ఏదో ఒక ఉద్యోగంలో చేరిపోకుండా ముందు నగరాన్నంతా కలియ తిరిగి ప్రదేశాలు, విశేషాలు, బస్సులు, దారులన్నీ తెలుసుకొని బోస్టన్ నగరాన్ని మనసారా ఆస్వాదించమని ఆమె చెప్పింది. ఉద్యోగంలో చేరిన తర్వాత ఇది సాధ్యం కాదని, సమయం వచ్చినప్పుడు తానే నాకు మంచి ఉద్యోగం చూసిపెడతానని చెప్పింది.

ఇంక నేను పొరుగునే వున్న రాక్స్‌బరీ అంతా చుట్టిరావటం మొదలుపెట్టాను. అక్కడ వుండే నీగ్రోల జీవనశైలి నేనెప్పుడూ కలలో కూడా ఊహించనిది. వీళ్లంతా బాగా చదువుకొని గొప్పగొప్ప ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకునే ఉన్నతస్థాయి నీగ్రోలు. వాడల్లో బతికే నీగ్రోలు వీళ్ల కంటికి కూడా ఆనేవారు కాదు. పూర్వం లాన్సింగ్‌లో నేను చూసిన మధ్యతరగతి నీగ్రోలకు వీళ్లు రెండాకులు ఎక్కువ చదివిన

నగర నీగ్రోలు. బోస్టన్ నీగ్రోలు తెల్లవాడు చెప్పేదంతా తలకెక్కించుకోవటంలో ఇంకా బాగా ముదిరిపోయినవాళ్లు. ఇదొక్కటే నేను చూసిన తేడా. కూతవేటు దూరం కూడా లేని వాడలో బతికే నీగ్రోలకన్నా తాము నాగరికులమనీ, మానం, మర్యాద కలిగిన వాళ్లమనీ, అధికులమనీ గొప్పలు చెప్పుకునేవారు. ఈ తప్పుడు అవగాహన వీళ్లను 'మెరుగైన'వారిగా చేసి, తెల్లవాళ్లను అనుకరించటం కోసం వీళ్ల వీపులు విరగ్గొట్టుకునేలా వారికి ఊడిగం చేయించింది. అంతో ఇంతో డబ్బువుండి ఎల్లా మాదిరి వలస వచ్చి ఉన్నత స్థానాల్లో స్థిరపడిన వాళ్లను 'నల్లయూదులు'గా పిలిచేవారు. వీళ్లు 'బ్యాంకులో పనిచేస్తున్నాం', 'భద్రతా దళాలలో పనిచేస్తున్నాం' అని గొప్పగా చెప్పుకొన్న వాటి అర్థం ఊడిగం చేస్తున్నారనే. కానీ, వినేవాళ్లకు మాత్రం నిజంగా వీళ్లు ఏ రాక్‌ఫెల్లరో, మెలనో అనిపించేవాళ్లు. తెల్లవాళ్ల ఇళ్లలో పనిచేసే ప్రతి నల్లవాడూ ప్రతి పనిమనిషీ ఆ రోజుల్లో 'నేను ముసలివాళ్లతో వుంటున్నాను' అని చెప్పుకునేవాడు. నలభై యాభై ఏళ్లు వచ్చిన వాళ్లు కూడా ఇక్కడి వార్తలు అక్కడికి, అక్కడి వార్తలు ఇక్కడికీ చేరవేయటానికి రాయబారుల్లా నల్ల సూట్లు, తెల్ల కాలర్లు వేసుకొని 'ప్రభుత్వం పనికి', 'కోర్టు పనికి' పోతున్నామని చెప్పుకునేవాళ్లు. అప్పుడైనా ఇప్పుడైనా నీగ్రోలు ఏవిధంగా తమని తాము కించపరుచుకుంటున్నారో తెలియకుండా బతకటం నాకైతే ఆశ్చర్యం కలిగించలేదు. రాక్స్‌బరీ విడిచి బోస్టన్ నగరమంతా తిరగటం మొదలుపెట్టాను. బోస్టన్, హార్వర్డ్ విశ్వవిద్యాలయాలతో సహా అన్ని బార్లు, రెస్టారెంట్లు, సంగీతం, నాట్యాలతో హోరెత్తిపోయే రోజ్‌ల్యాండ్ స్టేట్ బాల్‌రూం లాంటివన్నీ కళ్లారా చూసి ఎంతో ఆశ్చర్యానికీ, ఆనందానికీ లోనయ్యాను. నేను ఇల్లు పట్టకుండా తిరగటం ఎల్లా గమనించి 'నీ తోటి వాళ్లతో తిరుగు' అని సలహా ఇచ్చింది. నేను అదేమీ పట్టించుకోకుండా నీగ్రో వాడలోనే తిరిగేవాడిని. అక్కడ కొంతమంది యువకులు పనీపాటా లేకుండా అన్నిచోట్లా కనిపించేవారు. వారి జుట్టు అచ్చం తెల్లవాళ్ల జుట్టులాగే నిటారుగా వుండేది. దీన్ని 'కాంక్' అంటారని ఎల్లా చెప్పింది. నాకు అప్పటి వరకూ మందు, సిగరెట్ రుచి కూడా తెలీదు. కానీ పది పన్నెండేళ్ల వయసుకే ఇక్కడి నల్ల పిల్లలకు కుస్తీలు, పేకాట, నంబర్లపైన డబ్బు పెట్టటం లాంటి అలవాట్లన్నీ వుండేవి. వాళ్ల నోళ్లలోనే నేను మొదటిసారిగా 'పుంజు', 'పిల్లి', 'పిట్ట', 'చలువ', 'షోకిల్లా' అనే పదాలు విన్నాను. యాసతో పలికే ఇవన్నీ నాకు కొత్త పదాలే. ప్రతి రాత్రీ పడుకునే ముందు ఈ పదాలను మననం చేసుకునేవాడిని. ఇక్కడ స్త్రీ పురుషులు వాళ్లకు ఇష్టమైనదంతా

బాహాటంగానే చేసేవారు.

ఎక్కడైనా సొంతంగా ఉద్యోగంలో చేరి ఎల్లాను ఆశ్చర్యపరచాలనుకున్నాను. ఒకరోజు మధ్యాహ్నం ఒక పూల్ రూంలోకి తొంగిచూశాను. అక్కడ బిలియర్డ్స్ ఆటగాళ్లు రంగురంగుల బంతుల మీద పందెం కాసి ఆడుతున్నారు. వాళ్లకు సహాయం చేస్తూ కాంక్ జట్టుతో షార్టీ అనే వ్యక్తి కనిపించాడు. అతనొకసారి బైటికి వచ్చి నన్ను చూసి 'హేయ్, ఎర్రోడా' అని పలకరించాడు. ఆ పిలిచే పద్ధతిలోనే ఇతను చాలా స్నేహపూర్వకంగా వుంటాడని అర్థమైంది. మొదటిసారి చూడగానే నేను ఎంతగా పల్లెటూరి వాసన వేస్తున్నానో నవ్వుతూ చెప్పాడు. నా తల గన్నేరు పొదలా వుందని తమాషా చేశాడు. నాకు ఏదైనా ఉద్యోగం చేయాలనుందని చెప్పాను. ఇక్కడే వుంటావా లేక ఏదైనా ఊడిగం చేయాలనుకుంటున్నావా? అని అడిగాడు. ఊడిగం అంటే ఉద్యోగం అన్న మాట. ఇంతకు ముందు ఏ పనిచేసేవాడివని అడిగితే, మేసన్‌లో గిన్నెలు కడిగేవాడినని చెప్పాను. అంతే, 'మనోడివే, నాది కూడా లాన్సింగే' అని గట్టిగా అరిచాడు. వయసులో నాకన్నా పదేళ్లు పెద్దవాడైన అతను నాతో చాలా చనువుగా వుండేవాడు. షార్టీ లాన్సింగ్‌లో హైస్కూల్ మొదటి సంవత్సరంలో చదువు మానేశాడు. అక్కడ తనకు తెలిసిన ప్రదేశాలు, మనుషుల గురించి చెప్తుంటే నాకు ప్రాణం లేచి వచ్చినట్టయింది. ఈ నగరంలో ఇంతటి ఆత్మీయుడు దొరకటం నిజంగా నా అదృష్టం. నగర జీవితం గురించి మిగతా 'పుంజు'లతో కలిసి అతను నాకు పాఠాలు నేర్పటం మొదలుపెట్టాడు. తాను నంబర్లపైన రోజుకు కనీసం ఒక్క డాలరైనా పెట్టి ఆడతానని, ఒకవేళ నంబర్ తగిలి డబ్బు వస్తే సొంత బ్యాండు బృందాన్ని తయారుచేసుకుంటానని చెప్పాడు. నేను నంబర్ల ఆట ఒక్కసారి కూడా ఆడలేదని చెప్పడానికి చాలా సిగ్గుపడ్డాను. ఆడపిల్లల విషయంలో కూడా నా అనుభవరాహిత్యాన్ని షార్టీ మన్నించాడు. నన్ను తన రూముకు తీసుకొనిపోయి శాక్సోఫోన్ పాఠం చెప్పాడు. నేను ఇంటికి పోయేసరికి, 'షార్టీ అని ఎవరో నీ కోసం ఫోన్ చేశారు' అని ఎల్లా చెప్పింది. రోజ్‌ల్యాండ్ స్టేట్ బాల్‌రూంలో తనకు తెలిసిన పిల్లవాడు బూట్‌పాలిష్ ఉద్యోగం ఆ రాత్రి విడిచి పెడుతున్నాడని తెలిసి, దాన్ని నా కోసం అలాగే వుంచమని షార్టీ అతనికి చెప్పాడు. 'మాల్కం' నీకు ఈ పనిలో తగినంత అనుభవం లేదు' అని ఎల్లా చెప్పింది. నేను ఈ పని చేయటం ఆమెకు ఇష్టం లేదు. కానీ, ప్రపంచంలోనే గొప్ప బ్యాండ్ వుండే ప్రదేశంలో పని చేయబోతున్నాననే ఆలోచనతో నాకు నోటమాట కూడా రావటంలేదు.

రాత్రి తిండి కూడా తినకుండా అక్కడికి పరిగెత్తి ఆ కొత్త పనిలో చేరాను. ఆ పనిని నాకు అప్పగించిన ఫ్రెడ్డీ బూట్‌పాలిష్ చేసే పనిముట్లన్నీ నా చేతిలో పెట్టి ఏ సమయంలో ఎలా చేసి డబ్బు బాగా రాబట్టుకోవచ్చో కిటుకులన్నీ చెప్పాడు. బూటు లేసులు, చేతి రుమాళ్లు తెల్ల 'పిల్లులకు' ఎలా అమ్మాలో, తాగిన మైకంలో వుండే వారికి సేవచేసి ఎలా బురిడీ కొట్టించాలో కూడా చెప్పాడు. అతను స్వయంగా నా బూట్లు శరవేగంతో పాలిష్ చేసి మిరుమిట్లు గొలిపేలా చేశాడు. ఆ వేగం నాకు అర్థమే కాలేదు. నా కోసం ఆ పనంతా మరోసారి నిదానంగా చేసి చూపాడు. ఈ పని ఎంత వేగంగా చేస్తే అంత డబ్బు వస్తుందని చెప్పాడు. "ఇక్కడికి వచ్చే వాళ్లలో కొంతమంది గంజాయినీ, అమ్మాయిల్నీ అడుగుతారు. ఇలా అడిగే వారిలో పోలీసు ఎవడో నీవు గుర్తించే వరకూ వాటి జోలికి వెళ్లొద్దు. అన్నీ సరిగ్గా వేగంగా చేస్తే రోజుకు ఒక నాట్యానికి పది పన్నెండు డాలర్లు సంపాదించవచ్చు. అన్నిటికన్నా ముఖ్యంగా నీవు గుర్తు పెట్టుకోవాల్సిన విషయమేమంటే, ఈ ప్రపంచంలో ప్రతిదీ ఒక దందా. సరేనా ఎర్రోడా" ? ఇదీ ఫ్రెడ్డీ నాకు నేర్పిన పాఠం.

నాట్యం అయిపోగానే జాతి భేదం లేకుండా స్త్రీ పురుషులు ఒకరినొకరు కోరుకునేవారు. రోజ్‌ల్యాండ్‌లో చాలావరకు తెల్లవారి కోసమే నాట్యాలు, పాటలు సాగేవి. నల్ల స్త్రీలు అన్ని రకాలుగా శిరోజాలను అలంకరించుకుంటే, మగవాళ్లు జనపనార సూట్లు వేసుకొని జుట్టుకు గ్రీస్ రాసుకుని నాట్యం చేసేవారు. ఇవన్నీ చూసుకుంటూ నేను ఎందరో ప్రముఖ వ్యక్తులకు బూట్‌పాలిష్ చేశాను. సంగీతానికి అనుగుణంగా నేను వేగంగా పాలిష్ చేయటంవల్ల నాకు చాలా మంది అభిమానులేర్పడ్డారు. ఈ కాలంలోనే, షార్టీ అతని స్నేహితుల సహవాసంతో నాకు మందు, సిగరెట్లు, గంజాయి, పేకాట, నంబర్లు అన్నీ అలవాటయ్యాయి. బూట్‌పాలిష్ చేయగా వచ్చిన డబ్బును జనపనార సూట్ కొనుక్కోవటానికని దాచాను. ఇదే విషయం ఒకరోజు రాత్రి షార్టీతో చెప్పాను. అతను ఆశ్చర్యపోయి, 'డబ్బు దాచటమేమిటి? అప్పు గురించి నీవెప్పుడూ వినలేదా? అనడిగాడు. మరుసటి రోజు పొద్దున్నే ఒక బట్టల అంగడికి నన్ను పొమ్మన్నాడు. దాని యజమాని ఒక యూదు అతను షార్టీ స్నేహితుడు. నన్ను గుర్తు పట్టి షార్టీ తనకు బాగా కావలసిన వాడని చెప్పాడు. ఒక కాగితం తీసుకొచ్చి నా పేరు, చిరునామాలతో పాటు షార్టీ పేరు కూడా రాసుకొని సూట్ నా చేతిలో పెట్టాడు. షార్టీ పరిచయాలన్నీ నాకు చాలా ఆశ్చర్యం కలిగించేవి. త్వరలోనే నా జుట్టు 'కాంక్' చేసుకోవటానికి తగినంత

పొడవైందని షార్టీ నిర్ణయించాడు. వెంటనే దానికి కావలసిన దినుసులన్నీ అతను నాకు ఓ పట్టీలో రాసిచ్చాడు. దాన్ని కిరాణం అంగడికి తీసుకొని పోయి, రెడ్‌డెవిల్ జిగురు, రెండు గుడ్లు, రెండు మధ్య సైజు తెల్ల ఆలుగడ్డలు, పూల్‌రూం దగ్గర్లోని మందుల అంగడిలో ఒక జగ్గు వేజ్‌లైన్, ఒక పెద్ద సోప్‌బార్, ఒక నాటు దువ్వెన, మరో నీటు దువ్వెన, లోహపు మూతితో పిచికారీ చేసే ఒక రబ్బరు చిమ్మి, ఒక రబ్బరు తొడుగు, ఒక జత గ్లోవ్స్ కొనుక్కున్నాను. ఇవన్నీ చూసి 'మొదటిసారి కాంక్ చేయించుకుంటున్నారా?' అని మందుల అంగడివాడు అడిగితే, 'అవును' అని గర్వంగా నవ్వుతూ జవాబు చెప్పాను. ఇవన్నీ మోసుకొని రూముకు పోయిన తర్వాత షార్టీ ఇవన్నీ మిక్సీలో తిప్పి చెక్క చెంచాతో కలుపుతూ, 'లోహపు చెంచా ఎప్పుడూ వాడొద్దు. అది జిగురును నల్లగా చేస్తుంది' అని జ్ఞానబోధ చేశాడు. చివరికి వీటితో జెల్లీలాంటి పదార్థం తయారవగానే అందులోకి తక్కినవన్నీ వేసి నా తలకు పట్టిస్తూ 'చాలా మంటగా వుంటుంది. ఇప్పుడు నీవు నిజంగా ఎంత ఓర్చుకుంటే నీ జుట్టు అంత నిటారుగా వుంటుంది' అన్నాడు. షార్టీ దువ్వటం మొదలుపెట్టగానే కొద్దిగా వేడిగా అనిపించింది. ఆ తర్వాత జుట్టు మండటం మొదలైంది. మరికొద్దిసేపటికి తల మీద తాట లేచిపోతున్నట్టు మంట. కళ్లల్లో ముక్కులో నీళ్లు కారుతున్నాయి. అప్పటికే పంటి బిగువున బాధనంతా భరించిన నేను ఇంక ఉండలేకపోయాను. వాష్ బేసిన్ దగ్గరికి పరుగెత్తిపోయి షార్టీని నోటికొచ్చిన బండబూతులన్నీ తిట్టాను. ఈ తతంగమంతా పూర్తి అయిన తర్వాత షార్టీ నా చేతికి అద్దం ఇచ్చాడు. అప్పుడే మొదటిసారి నా తల పరివర్తన చెందటం చూశాను. ఇప్పుడు నా జుట్టు తెల్లవాడి జుట్టులాగే ఎరుపురంగులో నిగనిగలాడుతోంది. నిజంగా ఇదంతా ఎంత హాస్యాస్పదం! నన్ను నేను దిగజార్చుకోవటానికి ఇదే మొదటి మెట్టు. తెల్ల ప్రమాణాల ప్రకారం అందంగా కనిపించటానికి తమని తాము ఇంతగా హింసించుకునే నల్లవాళ్ల జాబితాలోకి నేను కూడా చేరిపోయాను. ఇదంతా ఆత్మగౌరవాన్ని మరిచి అనుకరణతో వినోదాన్ని పంచటమే. ఇన్ని బాధలు పడినా విషాదమేమిటంటే ఏ నల్ల స్త్రీ కానీ తెల్ల స్త్రీ కానీ కాంక్ వున్నవాడిని ప్రత్యేకంగా ఇష్టపడటం నేనెక్కడా వినలేదు. ఈ రోజటికీ ఒక నల్ల స్త్రీ తెల్ల విగ్గు పెట్టుకున్నా, ఒక నల్లవాడు కాంక్ చేసుకున్నా నా వ్యక్తిగత అనుభవంతో నేను చెప్పేది ఒక్కటే, జుట్టు మీద చూపించే శ్రద్ధ మెదడు మీద చూపితే వెయ్యిరెట్లు బాగుపడొచ్చు.

## అధ్యాయం - 4
# లారా

జంట నాట్యంలో నాకు తగిన జోడీ అని చెప్పుకోగలిగిన ఒకే ఒక అమ్మాయి లారా. నేను బూట్‌పాలిష్ ఉద్యోగం విడిచిపెట్టి మా అక్క ఎల్లా ఇంటికి దగ్గర్లోని ఒక డ్రగ్ స్టోర్‌లో సోడాలు అందించే ఉద్యోగంలో చేరాను. అక్కడే మొదటిసారి లారాను చూశాను. మధ్యతరగతి నీగ్రోలు నివసించే ఆ ప్రాంతంలోనే లారా తన అమ్మమ్మతో కలిసి వుండేది. షాపుకు ఎప్పుడు వచ్చినా ఏదో ఒక పుస్తకంలో మునిగిపోయేది. ఆమెకు ఆల్‌జీబ్రా, సైన్స్ ఇష్టమైన విషయాలు. ఆమెతోపాటు నా వయసు నీగ్రో యువకులు కూడా వచ్చి అక్కడ వాలేవారు. వారి భాష, వేషధారణ నాకు పరాయిగా అనిపించేది. అందుకే, పొద్దునంతా అలాంటి వాతావరణంలో పనిచేసే నాకు చీకటి పడితే చాలు, ఆ ప్రాంతం నుండే బైట పడాలనిపించేది. నేను ఇలాంటి వాళ్ల మధ్య వుండాలని ఎల్లా చెపుతూండేది. కానీ నేను ఆ పని చేయలేదు. రాత్రి ఎనిమిది గంటలయ్యేసరికి నంబర్ల ఆటలో డబ్బు సంపాదించి షార్టీతో కలిసి జల్సా చేసి మరుసటి రోజు ఉదయమే షాపులో హాజరయ్యేవాడిని. అక్కడికి వచ్చేవాళ్లలో కృత్రిమత్వమనేదే లేకుండా ఎంతో స్నేహంగా సహజంగా కనిపించింది లారా ఒక్కతే. నేను ఏదైనా తెచ్చి యిస్తే 'థాంక్స్' అని ఊరుకొనేది. అంతకు మించి ఒక్కమాట కూడా మాట్లాడేది కాదు. ఆమెది మృదువుగా తీగలా వుండే కమ్మని కంఠం. మిగతా నల్లవాళ్లలా కాకుండా తాను తనలాగే వుండేది. హైస్కూల్ జూనియర్ చదువుతున్న లారాకు ఒకే స్నేహితురాలు వుండేది. ఇద్దరూ ప్రతిరోజూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. లారా అమ్మమ్మ పాత కాలంనాటి మనిషి, చాదస్తురాలు.

ప్రతిరోజూ స్కూలు విడిచిపెట్టగానే లారా కోసం ఎదురుచూసేవాడిని. ఆమెకు ఐస్‌క్రీమ్ ఇప్పించటం, చదువు గురించి ఏదో ఒకటి మాట్లాడుకుంటూ ఆమెతో కలిసి నడవటం మామూలయ్యాయి. నేను తనకు నచ్చిన విషయం ఆమె కూడా దాచిపెట్టలేదు. లారా గురించి షార్టీకి చెప్పలేదు. ఆమె షార్టీలాంటి వాళ్లను, వాళ్లు కూడా ఆమెను సరిగా అర్థం చేసుకోలేరు. ఆమె అంతవరకూ ఎవరినీ ముట్టుకొని కూడా వుండదని నేను కచ్చితంగా చెప్పగలను. ఆమెకు తాగుడు తెలీదు. గంజాయి గురించి అసలే తెలీదు.

ఉన్నట్టుండి ఒకరోజు మధ్యాహ్నం తనకు జంటనాట్యం ఇష్టమని చెపితే

ఆశ్చర్యపోయాను. నీకిది ఎలా తెలుసని అడిగితే, ఒకసారి తన స్నేహితురాలి ఇంట్లో జరిగిన పార్టీలో చేశానని చెప్పింది. 'ఈ శనివారం రోజ్‌లాండ్‌లో కౌంట్‌బేసీ నాట్యం వుంది, అక్కడికి పోవటం నీకిష్టమేనా?' అని అడిగాను. ఆ ప్రశ్నకు లారా కళ్లు విప్పారాయి. ఉద్వేగంతో ఉబ్బితబ్బిబ్బు అయ్యింది. 'దీని గురించి ఎంతగానో విన్నాను కానీ ఒక్కసారి కూడా చూళ్లేదు. అక్కడికి పోతే అమ్మమ్మకు కోపం వస్తుంది' అని చెప్పింది. దాంతో సరే, మరోసారెప్పుడైనా పోదాం అన్నాను. అయితే నాట్యం జరిగే రోజు మధ్యాహ్నమే లారా పరిగెత్తుకుంటూ నా దగ్గరకొచ్చింది. ఇంతకు ముందెన్నడూ అమ్మమ్మకు అబద్ధం చెప్పలేదు. కానీ స్కూల్లో ఈ సాయంత్రం ఫంక్షన్ వుందని అబద్ధం చెప్పి వచ్చాను' అని చెవిలో చెప్పింది. 'నేను ఒక అమ్మాయిని ఇంటికి తీసుకొస్తున్నాను. అక్కడి నుండి అటే మేము రోజ్‌లాండ్‌కు పోతాము' అని ఎల్లాకు ఫోన్ చేసి చెప్పాను. ఇంతకు ముందు ఇలా నేను ఎప్పుడూ చేయకపోయినా ఎల్లా తన ఆశ్చర్యాన్ని దాచుకుంది. లారాను అక్కకు పరిచయం చేసి నేను మేడ మీదికి వెళ్లాను. కిందికి వచ్చేలోపే వాళ్లిద్దరూ ఎంతో కాలంగా పరిచయమున్న వారిలా మాటల్లో మునిగిపోయారు. అక్కడి నుండి నేరుగా నేను, లారా రోజ్‌లాండ్ వెళ్లాం. అక్కడ నన్ను చూడగానే చాలామంది పలకరించారు. మేమిద్దరం నాట్యం చేశాము. అంతకు ముందు నాతో చాలామంది అమ్మాయిలు బాగా నాట్యం చేసినవారే. కానీ లారాతో చేసిన తర్వాత అంతకు ముందెన్నడూ లేనంతగా మనసు తేలికపడింది. లారా నాట్యం చేసే పద్ధతిలోనే ఆ గమ్మత్తు వుంది. ఆమె నా శరీరంతో జత కలిసి చలాకీగా, అందంగా, గిరగిరా నీడలా చాలా తేలికగా తిరుగుతూ నాట్యం చేసేది. ఆమే నాకు నిజమైన భాగస్వామి! ఉరకలేసే ఉత్సాహంలో మునిగిపోయి నాట్యం చేసేవాళ్లు, పోటీలు పెట్టుకునేవాళ్లు, అన్ని రకాల వాళ్లూ అక్కడ వుండేవారు. మిగతా అమ్మాయిలతో కలిసి నాట్యం చేయమని కొంతమంది నన్ను బలవంతపెట్టేవాళ్లు.

చీకటి పడగానే లారాను వాళ్లింటి దగ్గర విడిచిపెట్టి మళ్లీ ఎప్పుడు పోదాం అంటే తనేమీ మాట్లాడలేదు. అందుకే తానే వచ్చి పిలిచే వరకూ అడగరాదని నిర్ణయించుకున్నాను. నేను షాపులో వుండగా ఒకరోజు వచ్చి ఈసారి వాళ్ల ఇంటికే వచ్చి, నన్ను పిలుచుకొని పొమ్మని చెప్పింది. వాళ్ల అమ్మమ్మ గురించి తెలిసినా ఇంటికే వెళ్లి తలుపు తట్టాను. పాతకాలం దుస్తులు వేసుకొని, ముడతలు పడ్డ ఆ నల్లమనిషి నేను మాత్రమే పట్టేంత వాకిలి తెరిచి 'లోపలికిరా కుక్కా' అంది. రివాల్వర్లు పట్టుకొని నా కోసం తిరిగిన దాదాల కంటే ఆమే నాకు పెద్ద శత్రువు. లారా గదిలోకి

దూసుకొచ్చింది. ఆమె మనసు బాగా లేదనే విషయం నాకు అర్థమైంది. కారులో కూర్చోగానే, అంతకు ముందు అమ్మమ్మకు అబద్ధం చెప్పినందుకు ఏడ్చింది. నిజం చెప్పిన తర్వాత వాళ్లిద్దరి మధ్యా చాలా తీవ్రమైన గొడవ జరిగింది. తాను బడి మానేసి ఉద్యోగం చూసుకోవటానికి బైటికి వెళుతున్నాని తెగేసి చెప్పటంతో నా ఎదురుగానే ముసలామె మండిపడింది. లారా బైటికి నడిచింది.

ఆ సాయంత్రం రోజ్‌లాండ్‌లో మేమిద్దరం అడుగు పెట్టేసరికి అందరి దృష్టి మామీదే వుంది. నాకు తెలిసిన వాళ్లు, పోయినసారి లారా నాట్యం చూసినవాళ్లు చప్పట్లు కొడుతూ మా ఇద్దర్నీ హుషారెత్తిస్తున్నారు. నాట్యం మొదలైంది. ఈసారి లారా ఇంకా కొత్తగా చేసింది. ఆమె కదలికల్లో మతి చెదిరే సౌందర్యముంది. లారా నా అరచేతుల మీద గాలిలో, నా ఒడిలో, కౌగిలిలో నా శరీరమంతా మెరుపుతీగలా అల్లుకుంటూ నా కళ్లతో కళ్లు కలిపి నాట్యం చేస్తున్నప్పుడు గాలికి ఊగుతున్న ఆమె శిరోజాల నుండి చెమట చుక్కల ముత్యాల జల్లు కురుస్తోంటే నా మనసు మాటలకందని ఏవో తన్మయ శిఖరాల వైపు సాగిపోయింది. నాట్యం పూర్తి కాగానే చప్పట్లు, తాళాలు, బ్యాండ్ మోతలు, అరుపులు, హర్షధ్వానాలతో రోజ్‌లాండ్ దద్దరిల్లింది. అందరి మధ్యా ఆ రోజే ఒక కొత్త నాట్య తార మెరిసింది. ఇదంతా ఒక తెల్ల అమ్మాయి చూస్తోంది. ఆమె పేరు సోఫియా. ఆమె నావైపే వస్తోంది. తర్వాత నేను లారాను పట్టించుకోకుండా సోఫియాతో నాట్యం చేశాను. చీకటి పడగానే లారాను వాళ్లింటి దగ్గర విడిచిపెట్టి సోఫియాతో కలిసి మళ్లీ రోజ్‌ల్యాండ్‌కు చేరుకున్నాను. సోఫియా కూడా ఎల్లా వుండే ప్రాంతంలోనే ఇంకా కొంచెం దూరంలో వుంటుంది. కొన్ని నెలలపాటు మేమిద్దరం బార్లు, రెస్టారెంట్లలో జల్సా చేసుకున్నాం. వారానికి మూడు రాత్రులు కలిసి బైటికి పోయేవాళ్లం. ఆమెకు అంతకు ముందే తెల్లవాళ్లతో కూడా పరిచయాలున్నాయి. అయితే చాలా కాలంపాటు నాకు ఆశ్చర్యం కలిగించిన విషయం ఆ మొదటి రాత్రి అంత ధైర్యంగా ఆమె నా దగ్గరికి ఎలా వచ్చిందా అని. బహుశా గతంలో మరో నీగ్రోతో అనుభవం వుండొచ్చు. కానీ ఈ విషయం నేనెప్పుడూ ఆమెను అడగలేదు. ఆమె కూడా ఎప్పుడూ చెప్పలేదు. 'మొదటి రాత్రి మిగతా మగవాళ్ల గురించి ఒక స్త్రీని ఎప్పుడూ అడగొద్దు. నువ్వలా అడిగితే, ఆమె నీవెప్పటికీ తెలుసుకోలేని అబద్ధమైనా చెపుతుంది లేదా నీవు విని తట్టుకోలేని నిజమైనా చెపుతుంది'.

షార్టీతో తిరగటం చాలా వరకు తగ్గించాను. తన గ్యాంగులో నన్నెప్పుడైనా చూస్తే, 'నాతో తల దువ్వించుకున్న పిల్లగాడు ఇప్పుడు పిట్టతో తిరుగుతున్నాడు' అని

బనాయించేవాడు. నేను తెల్ల అమ్మాయిని వెంటేసుకొని తిరగటంవల్ల నిజంగానే నాకు పాఠాలు నేర్పిన షార్టీ హోదా పెరిగినట్టయింది. రాక్స్‌బరీలో తిరిగే మిగతా పోకిరీ మూకలు నేను, సోఫియా ఏ బార్‌కు వెళ్లినా మా వెనుక చప్పట్లు కొడుతూ, మెచ్చుకుంటూ 'ఎర్రోడా' అని పిలవటం మొదలుపెట్టారు. సోఫియాను నా నుంచి ఎగరేసుకొని పోవటమే వాళ్ల ఉద్దేశమని నాకు తెలుసు. నన్ను చూసి చాలా మంది మగవాళ్లు అసూయపడేవారు. నేను పనిచేసే షాపు దగ్గరికి లారా మళ్లీ రానేలేదు. తర్వాత నేను ఆమెను చూసే నాటికి ఆమె పేరు ఇంటా బయటా జైల్లో మోగిపోతూ వుంది. హైస్కూల్ చదువు పూర్తికాగానే చెడ్డదారిలో పోవటం మొదలుపెట్టింది. అమ్మమ్మతో గొడవపడి బైటికి వెళ్లటం మెల్లిగా మందుకు, గంజాయికి అలవాటు పడటం, అక్కడి నుండి తనను తాను మగవాళ్లకు అమ్ముకోవటం వరకూ దారితీసింది. మగవాళ్లపై ద్వేషంతోనే స్వలింగ సంపర్కానికి కూడా అలవాటు పడింది. ఈ పరిస్థితికి నేనే కారణమని చాలా కాలంపాటు నన్ను నేను నిందించుకున్నాను. నేను కూడా తెల్ల అమ్మాయిని చూసే దృష్టితోనే తననూ చూడటం ఆమెను కోలుకోలేని దెబ్బకొట్టింది. ఇందుకు క్షమించమని అడగడానికి నా దగ్గరున్న సమాధానం ఒక్కటే. చాలామంది యువకుల్లాగే నేను కూడా అప్పుడు ఒక మూగ, చెవిటి, గుడ్డి నీగ్రోలాగే వున్నాను.

నేను సోఫియాతో తిరగటం గురించి తెలుసుకున్న ఎల్లా నన్ను దూరం పెట్టటం నాకేమీ ఆశ్చర్యం కలిగించలేదు. షార్టీ వుంటున్న అపార్ట్‌మెంటులో సగభాగం అద్దెకు తీసుకోవటానికి సోఫియానే డబ్బు ఇచ్చింది. వెంటనే బోస్టన్‌లోని పార్కర్‌హౌస్‌లో బస్‌బాయ్‌గా మరో ఉద్యోగంలో చేరాను. ప్రయాణీకులు భోంచేసిన ఎంగిలి కంచాలన్నీ వంటగదిలో అంట్లు తోమే వాళ్ల దగ్గర పెట్టి రావటం నా పని. నేను ఆ పనిలో చేరిన కొన్ని వారాలకే జపాన్‌వాళ్లు పెర్ల్‌హార్బర్‌పైన బాంబులు కురిపించారు. ఉన్న ఉద్యోగం కాస్తా ఊడింది.

అధ్యాయం - 5

# హార్లెమ్ నివాసి

రోజు మార్చి రోజు రైల్లో నాలుగు గంటల పాటు కాఫీ! క్యాండీ! కేక్! ఐస్‌క్రీం! అని అరుచుకుంటూ తిరిగే కొత్త పనిలో చేరాను. బోస్టన్, సోఫియాల నుండి నన్ను దూరం చేయాలనే ఆలోచనతో ఎల్లా సిఫారసు చేసిన ఈ కొత్త ఉద్యోగంలో బోస్టన్, న్యూయార్క్ నగరాల మధ్య తిరిగే ప్రయాణీకులకు పైవన్నీ అందించేవాడిని. ఈ పనిలో చేరడానికి నా వ్యక్తిగతమైన కారణాలు కూడా వున్నాయి. 'బంగారు బాతు' న్యూయార్క్ నగరాన్ని చూడాలని నాకెప్పటి నుంచో కోరిక. బడాబడా వ్యాపారులు, దందాలు చేసేవాళ్లు, సంగీతకారులు వుండే ఈ నగరం గురించి, ప్రత్యేకించి హార్లెమ్ గురించి మా నాన్న కూడా గొప్పగా చెప్పేవాడు. ఇక్కడ నీగ్రోలు వేల సంఖ్యలో మార్కస్ గార్వీ అనుచరులుగా వుండేవారు. జోలూయిా తెల్ల ప్రత్యర్థిపై విజయం సాధించిన ప్రతిసారీ 'షికాగో డిఫెండర్', 'పిట్స్‌బర్గ్ కొరియర్', 'ఆఫ్రికన్-అమెరికన్స్' లాంటి నీగ్రో పత్రికల్లో పతాక శీర్షికల కెక్కేవాడు. ఈ బాక్సర్‌ను నీగ్రో సముద్రం చేతులెత్తి హర్షం వెలిబుచ్చినప్పుడల్లా ఆయన హార్లెమ్‌లోని థెరీసా హోటల్ నుండి వారికి అభివాదం చేసేవాడు. అలాంటి న్యూయార్క్ నగరాన్ని చేతిలో పైసా లేకుండా చూడటం సాధ్యమయ్యే పనికాదు. అలాంటిది నయాపైసా ఖర్చు లేకుండా మా అక్కకు తెలిసిన ఒక పెద్దాయన ద్వారా న్యూయార్క్‌కు వచ్చిపోయే ఉద్యోగం దొరకటం నా అదృష్టం. న్యూయార్క్‌లో బ్రాడ్వే విద్యుద్దీపాలు, సవాయ్ బాల్‌రూం, హార్లెమ్‌లోని అపోలో థియేటర్ చెప్పుకోతగ్గవి. అయితే ఎల్లాకు తెలీకుండా నేనూ సోఫియా రోజు మార్చి రోజు కలుస్తూనే వుండేవాళ్లం. త్వరలోనే నాకు బోస్టన్ - న్యూయార్క్ నగరాల మధ్య తిరిగే రైలులో నాలుగో వంటవాడి ఉద్యోగం దొరికింది. నాలుగో వంటవాడంటే మరేమీ కాదు అంట్లు తోమేవాడు అని అర్థం. తాత్కాలికంగా ఈ పనివాడుగానే నాకు వాషింగ్టన్ డి.సి.కి పోయే రైల్లో పని అప్పగించారు. ఐదు వందల మైళ్ల పొడవునా నా మొహాన పడే గిన్నెలు తోముకుంటూ వుండేవాడిని. తీరిక సమయం దొరగ్గానే వాషింగ్టన్‌లోని మారుమూల ప్రాంతాలకు వెళ్లేవాడిని. అక్కడ రాక్స్‌బరీలో కంటే అధ్వాన్నంగా నివసించే నీగ్రోలను చూశాను. శ్వేతసౌధానికి దగ్గర్లోని ఈ నీగ్రో ప్రాంతాలలో దొంగతనాలు, హత్యలు ఎక్కువ జరుగుతాయని, నన్ను జాగ్రత్తగా వుండమని రైల్ బోర్డు వంటవాళ్లు,

వెయిటర్లు హెచ్చరించేవారు. అయితే ఇక్కడి నీగ్రోలు పెంకుటిళ్లలో వుంటూ హోవర్డ్ యూనివర్సిటీ పట్టాదారులై వుండి కూడా కూలీలుగా, స్టోర్ కీపర్లుగా, పోర్టర్లుగా, గార్డులుగా, టాక్సీ డ్రైవర్లుగా పనిచేసేవాళ్లు. వాషింగ్టన్‌లో నివసించే నీగ్రో దృష్టిలో ఉత్తరాలు మోసుకొని పోవటం చాలా పరువు కలిగిన ఉద్యోగం.

హార్లెమ్‌లోని స్మాల్స్‌ప్యారడైజ్ తమకందరికీ ఇష్టమైన ప్రదేశమని వంటవాళ్లంతా చెప్పేవారు. అక్కడ రాత్రిపూట ముప్పయి నలభై మంది పడి చచ్చే తెల్లవాళ్ల మధ్య అల్లరి వుండేది. వాళ్లంతా దాదాపు గొణుగుతున్నట్టుగా మాట్లాడుకునేవారు. తాము తాగిన మందుకు మాత్రమే వాళ్లు బిల్లు చెల్లించేవారు. అక్కడి సహజ వాతావరణం చూసిన తర్వాత ఐదు నిమిషాల్లోనే నేను బోస్టన్, రాక్స్‌బరీలను మరిచిపోయాను. 'యాంకీక్లిప్పర్'లో న్యూయార్క్, బోస్టన్‌ల మధ్య శాండ్‌విచ్, కాఫీ అమ్ముకుంటూ తిరుగుతున్న నాకు న్యూయార్క్ నగరమే తగినదని సోఫియా చెప్పింది. నిజమే న్యూయార్క్, హార్లెమ్ నాకు మత్తెక్కించాయి. తిండి పదార్థాలు వేగంగా అందిస్తూ అందరి మెప్పు పొందాను. కాస్త హంగు, ఆర్భాటం ప్రదర్శించి అమ్మితే తెల్లవాడు దేన్నయినా కొంటాడు అనే విషయం తెలుసుకున్నాను. తమ సొంత ప్రాముఖ్యత అంటే నీగ్రోలు మందు కొడుతున్న లాన్సింగ్‌లో మాదిరి నీగ్రోలు సేవకులుగానే కాదు మనస్తత్వ శాస్త్రవేత్తల్లా కూడా తిరిగేవారు. సమయం దొరికిందంటే చాలు కొత్త ప్రదేశాలు చూసుకుంటూ వెళ్లిపోయేవాడిని. స్మాల్స్ ప్యారడైజ్‌కు దగ్గర్లోని హార్లెమ్ వై.ఎం.సి.ఎ. దగ్గర ఒక గది తీసుకున్నాను. హిట్లర్, ముస్సోలినీలకు వ్యతిరేకంగా పోరాడుతున్న అమెరికా మిత్రపక్షమైన రష్యా గురించి ఆ రోజుల్లో రేడియోలు, వార్తా పత్రికలు ఎక్కువగా ప్రచారం చేసేవి. నా ప్రాణానికి న్యూయార్క్ గంధర్వ లోకమైతే హార్లెమ్ సాక్షాత్తూ స్వర్గలోకమే. స్మాల్స్, బ్రాడాక్ బార్లలో దందాలు చేసేవాళ్లు కూడా నా ఎర్రటి జుట్టు చూసి 'ఎర్రోడా' అని పిలవటం మొదలుపెట్టారు. శాండ్‌విచ్ అమ్మకాల్లో నేను రికార్డు సృష్టించటంతో వాటిని అమ్మే అసలు ఉద్యోగి మరొకటి వెతుక్కోవాల్సి వచ్చింది. ఇంక వెయిటర్లు, వంటవాళ్లు కూడా నన్ను 'శాండ్‌విచ్ ఎర్రోడు' అని పిలవటం మొదలుపెట్టారు.

ప్రయాణీకుల మధ్య చలాకీగా తిరుగుతూ మొరటుగా వుండే నా మీద ఫిర్యాదులు కూడా వచ్చేవి. ఎవరెంత నచ్చజెప్పినా నేను ఖాతరు చేసేవాడిని కాదు. ఒక్కోసారి బాగా మందుకొట్టో, గంజాయి దట్టించో పనిలో దూకేవాడిని. డ్యూటీ అయిపోగానే గ్రాండ్ సెంట్రల్ స్టేషన్‌కు పోయేవాడిని. ఆరడుగులకు మించి ఎత్తు, జనపనార సూట్, నిప్పులాంటి ఎర్రటి జుట్టు, నారింజరంగు బూట్లు - ఈ వేషధారణతో

జనం మధ్య నేను అడుగుపెడితే నా విసురు చూసి చాలామంది తెల్లవాళ్లు నాకు దారి ఇచ్చి నన్ను ఊరికే అలా చూస్తూ వుండిపోయేవాళ్లు. నిజానికి నేను తెల్లవాడిని అనుకరిస్తున్నాను. కానీ అజ్ఞానంవల్ల నేను చాలా చురుకైనవాడిని అనే భ్రాంతిలో వున్నాను. ప్రయాణీకులు నా మీద చేసిన ఫిర్యాదులకు కండక్టర్లు తమవి కూడా జోడించి అధికారులకు చెప్పినా నేను లెక్కచేయలేదు. 'న్యూ హెవెన్‌లైన్' రైలు సిబ్బంది నాకు రావలసిన డబ్బు చెల్లించటంతో లాన్సింగ్ పోయి ఒకసారి మా వాళ్లందరినీ చూసి రావాలనిపించింది. మిచిగాన్‌లో కాలు పెట్టిన తర్వాత నన్ను చూసి అంతా విస్తుపోయారు. నా కాంక్, సూటు, బూటు చూసి అందరూ నేనేదో శనిగ్రహం మీది నుండి వచ్చినట్టు చూశారు. కలమజూ ఆసుపత్రిలో అమ్మను చూశాను. ఆమెను చూసిన తర్వాత కానీ నా కాళ్లు భూమ్మీద నిలబడలేదు. మేసన్‌లో శ్రీమతి స్వెర్లిన్ దగ్గరికి పోయాను. ఆమె నా వేషభాషలు చూసి భయపడింది. మళ్లీ లాన్సింగ్ వచ్చి లింకన్ స్కూల్లో నాట్యం చేశాను. చిన్న చిన్న ఆడపిల్లల్ని నా భుజాలపైనా, నడుముపైనా కూర్చోబెట్టుకొని నేను ప్రదర్శించిన నాట్య విన్యాసాల్ని అక్కడున్నవాళ్లంతా సంభ్రమాశ్చర్యాలతో చూశారు. ఆ రాత్రి 'హార్లెమ్ రెడ్' అని ఆటోగ్రాఫులు కూడా చేశాను. చివరికి లాన్సింగ్ జనాలకు వెర్రెత్తించి, దడపుట్టించి అక్కడి నుండి బైటపడ్డాను.

న్యూయార్క్‌లో అడుగుపెట్టగానే, రెండో ప్రపంచయుద్ధం వేడికి ఉద్యోగాలు మారాల్సి వచ్చింది. ఖాళీ అయిన ఉద్యోగాల్లో సైన్యంలో చేరిపోయినవాళ్లవే వున్నాయి. స్మాల్స్ ప్యారడైజ్ నడుపుతున్న ఎడ్‌స్మాల్ అతని సోదరుడు చార్లీ గురించి హార్లెమ్‌లో చాలామందికి తెలీకపోయినా నేను వాళ్లన్ను కలుసుకున్నాను. నేనో సాధారణ మనిషినైనా చార్లీ స్మాల్ నాతో మాట్లాడాడు. తాను ఎన్నోసార్లు నేను దందాలు చేస్తుండగా నిశ్శబ్దంగా గమనించినవాడు. అప్పటివరకూ ఏ పోలీసుకూ దొరకనని తెలుసుకొని, తన బార్‌లో పనిచేసే ఉద్యోగులకు పెట్టిన నియమనిబంధనల గురించి చెబుతూ, కస్టమర్లపట్ల ఆలస్యం, సోమరితనం, దొంగతనాలు, దందాల్లాంటివేవీ జరుగకూడదని చెప్పాడు. నేను సరే అన్నాను. అది 1942వ సంవత్సరం. నాకు అప్పుడే పదహారేళ్లు నిండాయి. స్మాల్స్ ప్యారడైజ్‌లో పనిచేస్తున్న కాలంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. బార్‌లో ఉద్యోగం చేస్తే తాగడానికి వచ్చేవాళ్లు కూడా ఎన్నో పాఠాలు చెపుతారు. మరో విషయమేమిటంటే హార్లెమ్, నీగ్రోలుండే ప్రదేశంలా ఎందుకు లేదనేది నన్ను బాగా వేధించిన ప్రశ్న. నాకు తెలిసి అక్కడ డచ్‌వాళ్లు కూడా వుండేవారు. వాళ్ల తర్వాత పొట్ట చేతబట్టుకొని యూరప్ నుండి ఎంతోమంది వచ్చారు. అయితే అందరికన్నా ముందు

జర్మన్లు అక్కడికి వచ్చారు. వీళ్ల తర్వాత ఐరిష్‌వాళ్లు, ఇటాలియన్లు, యూదులు ఒకరి తర్వాత ఒకరు వచ్చారు. న్యూయార్క్ నగరంలో 1683 నుండి వుంటున్న నీగ్రోలు చెట్టుకొకరు పుట్టకొకరు వుంటే, యూరోపియన్లు మాత్రం హార్లెమ్‌లో పాతుకొనిపోయారు. 1910లో ఒక నీగ్రో రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుడు కట్టించిన అపార్ట్‌మెంట్లలో నీగ్రోలతో పాటు బతకటం నామోషీగా భావించి వీళ్లంతా ఒకరొకరే హార్లెమ్ విడిచిపోయారు. ఆ తర్వాత ఈ ప్రాంతమంతా నీగ్రోలతో నిండిపోయింది. 1920 దశకం మొదట్లో హార్లెమ్‌లో సంగీతం, వినోదం పరిశ్రమ స్థాయికి చేరుకున్నాయి. 1925లో స్మాల్స్ ప్యారడైజ్, 1926లో కాటన్‌క్లబ్, సవాయ్ బాల్‌రూం ప్రారంభించబడ్డాయి. వీటిల్లో జరిగే కార్యక్రమాల్లో జనాలు మునిగితేలేవారు. 1929లోనే 'అమెరికా కంచుకోట'గా హార్లెమ్ ప్రపంచ ప్రసిద్ధిగాంచింది. స్మాల్స్‌కు రోజూ వచ్చేవాళ్లు మాట్లాడుకునే మాటలు శ్రద్ధగా వినేవాడిని. దందాలు చేయటం కూడా ఒక జీవిత విధానమని వాళ్ల అభిప్రాయం. అది నాక్కూడా తలకెక్కింది. అలాంటి అనుభవజ్ఞుల దగ్గర నంబర్ల ఆటలో, అమ్మాయిలను అప్పగించటంలో చిల్లర దొంగతనాల నుండి సాయుధ దొంగతనాల వరకు అన్నిట్లోనూ రాటు తేలాను.

అధ్యాయం - 6

# డెట్రాయిట్ రెడ్

ప్రతిరోజూ పదహైదు నుండి ఇరవై డాలర్ల వరకూ నంబర్ల మీద పెట్టటం నాకు దినచర్యగా మారిపోయింది. నాకే కాదు న్యూయార్క్‌లో నివసించే ప్రతి నీగ్రోకూ ఇది వ్యసనమే. చాలీచాలని బతుకులు అదృష్టాన్ని ఇలా అన్ని ప్రదేశాల్లో అన్ని రకాలుగా వెతుక్కునేవి. హార్లెమ్ నంబర్ల పరిశ్రమకు పోలీసు ఉన్నతాధికారుల సహాయ సహకారాలు ఎప్పుడూ వుండేవి. ఒక బ్యాంకర్ కింద ఒక కంట్రోలర్ వుంటాడు. అతని కింద యాభై మంది నంబర్లు నడిపేవాళ్లు వుంటారు. ఎవరి స్థాయిలో వారికి కమీషన్ పోగా మిగిలినదంతా బ్యాంకర్ తీసుకుంటాడు. ఈ ఆట ఆడేవాళ్లు అన్నిరకాల నంబర్లపైనా డబ్బు పెట్టేవారు. కోరుకున్న అదృష్ట సంఖ్య కోసం ప్రార్థన చేసినందుకు ఎవాంజిలిస్టులు డబ్బు కూడా వసూలు చేసేవారు.

ఈ కాలంలోనే నేను న్యూయార్క్‌లోని నల్ల దందారాయుళ్ల దృష్టిలో పడ్డాను. ఒకసారి ఒకతను వచ్చి నా టేబుల్ మీద కూర్చున్నాడు. నేను అతని ముందు బీరు తెచ్చి పెట్టాను. అతను చప్పున నా మీదికి వంగి టేపుతో నా కొలతలు తీసుకొని బీరు తాగి తాపీగా వెళ్లిపోయాడు. మళ్లీ మధ్యాహ్నం నేను డ్యూటీకి వచ్చేసరికి ఎవరో ఒక ప్యాకేజి నా చేతికిచ్చారు. అందులో చాలా ఖరీదైన నీలంరంగు సూట్ వుంది. ఆ తర్వాత తెలిసిందేమంటే, ఆ వ్యక్తి ఒక వెస్టిండియన్. అతను న్యూయార్క్‌లో 'నలభై దొంగల ముఠాలో 'టాప్ ఎక్సిక్యూటివ్'. వాళ్లది చాలా పెద్ద నెట్‌వర్క్ వున్న ముఠా. ఎలాంటి దుస్తులైనా అవి ఎంత ఖరీదైనవైనా కేవలం ఒక్కపూటలో మనముందుంటాయి. పైగా అసలు ధరకన్నా తక్కువే. ఈ ముఠాలోని సభ్యుడు ఎంత పెద్ద షోరూంలోకైనా ఖరీదైన బట్టలు వేసుకొని కొంచెం కూడా ఎవ్వరికీ అనుమానం రాకుండా ఠీవిగా వెళ్లి ఎవరూ చూడకుండా ఆ షోరూంలోనే దాక్కుంటాడు. రాత్రి తాళాలన్నీ వేసుకొని పోయిన తర్వాత తాను లోపలే అన్నిటినీ బ్యాగులో పెట్టుకుంటాడు. తన ముఠాకు ఫోన్ చేస్తే ట్రక్కు వస్తుంది. పోలీసులు పెట్రోలింగ్‌కు వచ్చేలోపే నిమిషాల్లో అన్నిటినీ తీసుకొని వెళ్లిపోతారు. ఇదేరకంగా గన్నులు, కెమెరాలు, చేతి గడియారాలు, అత్తరు సీసాలతో పాటు మారిజువానా సిగరెట్లు, ఆఫ్రికా, పర్షియాల నుండి వచ్చే 'గాంజా', 'కిస్కా'

వ్యాపారాలు కూడా ముమ్మరంగా సాగేవి. ఇవి చేతులు మారే క్రమంలో ఏ మాత్రం తేడా వచ్చిన మెడకాయ మీద తలకాయ వుండదు. హార్లెమ్ చీకటి సామ్రాజ్యంలో 'బ్లాక్‌శామీ', 'బబ్' హూలన్, 'కింగ్' ప్యాడ్‌మోర్, 'వెస్టిండియన్ ఆర్చీ' పేరు మోసినవాళ్లు.

ఈ మొత్తం వ్యవహారంలో వ్యభిచారం కూడా ఒక పెద్ద దందా. 'క్యాడిలాక్' డ్రేక్ అందరూ అసహ్యించుకునే తార్పుడుగాడు. బట్టతల, బానపొట్ట వేసుకొని దర్శనమిచ్చేవాడు. తన దగ్గరున్న ఆడవాళ్ల గురించి ఒకసారి ఎవరో ఆటపట్టిస్తే 'అందంగా లేని ఆడవాళ్లు అధికంగా శ్రమిస్తారు' అనటం నాకు బాగా గుర్తు. ఇతనికి పూర్తిగా విరుద్ధమైన స్వభావం వున్నవాడు శామీ. ఇతని ప్రధాన వ్యాపారం కూడా ఆడవాళ్లే. నాట్యం జరిగే ప్రదేశాల్లో ఆడవాళ్ల ముఖకవళికలు చూసి తన వ్యాపారానికి పనికివచ్చే వాళ్లని పసిగట్టటంలో మహా నిపుణుడు. శామీ, నేను చాలా సన్నిహిత మిత్రులమయ్యాం. అతని దగ్గరుండే అందమైన స్త్రీలను నేను మరెవ్వరి దగ్గరా చూడలేదు. ఇతని దగ్గర చాలామంది పడిచచ్చే 'అలబామా రసగుల్లా' అనే తెల్ల స్త్రీ వుండేది. ఈమెకు రెండు పెగ్గులు మందు పోస్తే చాలు, తన కథంతా మూడు ముక్కల్లో చెప్పేది. ఈమెది అలబామా. హైస్కూలు చదివే రోజుల్లోనే వాళ్లింట్లో పనిచేసే నీగ్రోను బలవంతపెట్టింది. తన కోరిక తీర్చకుంటే తనపై బలాత్కారానికి ప్రయత్నించావని అందరికీ చెపుతానని అతన్ని బెదిరిస్తే అతను ఆ ఇంట్లో పనే వద్దనుకొని పారిపోయాడు. ఆ తర్వాత హార్లెమ్ చేరుకుంది. ఈమెను సవాయ్ బాల్‌రూంలో చూసి పట్టుకున్నానని శామీ నాతో చెప్పాడు. నేను పనిచేసే స్మాల్స్ ప్యారడైజ్ నేరస్తులుండే చోటు కాదు కానీ హార్లెమ్‌లో రాత్రిపూట అలంకరణలతో ఆకర్షణీయంగా వుండే రెండు మూడు అడ్డాల్లో ఇదీ ఒకటి. పైగా న్యూయార్క్ సిటీ పోలీస్‌శాఖ కూడా, తెల్లవాళ్లెవరైనా హార్లెమ్‌లో తమకు 'సురక్షిత' ప్రదేశమేదని అడిగితే దీని పేరే చెప్పేవారు.

నేనిక్కడ ఉద్యోగం చేస్తున్న కాలంలోనే సెయింట్ నికొలస్ అవెన్యూలోని ఒక అపార్టుమెంటులో రూము తీసుకున్నాను. ఇలాంటి అపార్టుమెంట్లలో చాలా వరకు వేశ్యలే వుండేవారు. అందరికీ అంతో ఇంతో గంజాయి అలవాటుండేది. హార్లెమ్‌లో నివసించే ప్రతి ఒక్కరూ బతికి బట్ట కట్టటానికి ఏదో ఒక దందా చేసేవాళ్లు. దీన్ని మరిచిపోవటానికే ఉన్నత స్థితిలో కనిపించటం వాళ్లకు అవసరమయ్యేది. ఇక్కడ వుండగానే స్త్రీల గురించి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. ఈ వేశ్యలే ప్రతి

భార్యా భర్తా తెలుసుకొని తీరాల్సిన విషయాలు నాకు నేర్పారు. తర్వాతి కాలంలో వేశ్యలు కాని స్త్రీలే చాలా మంది స్త్రీలపట్ల నాకు అపనమ్మకం కలిగే విధంగా ప్రవర్తించారు. చర్చికి పోతూ కూడా చాలామంది మగవాళ్లతో సంబంధాలు కొనసాగించిన స్త్రీల కంటే వేశ్యలే నాపట్ల నీతిగా అక్కచెల్లెళ్లలా ప్రవర్తించారు. నలుపు, తెలుపు రెండు రకాల స్త్రీల గురించీ మాట్లాడుతున్నాను. యుద్ధ సమయంలో తమ భర్తలు దేశం విడిచి పోరాటంలో మునిగిపోయి వుంటే ఇక్కడ నల్ల స్త్రీలు తెల్లవాళ్లతో పడుకోవటమే కాకుండా తమ భర్తలు పంపే డబ్బు కూడా విటులకు ఇచ్చేవారు. ఇలా చాలామంది తల్లులుగా, భార్యలుగా అబద్ధపు జీవితం గడిపారు. తెల్లవాడి రొచ్చుగుంత నీతుల గురించి మొదట నాకు తెలియజెప్పింది తెల్ల స్త్రీలే. చెడుదారి పట్టిన నా జీవితంలో స్వయంగా నా కళ్లతో చూసింది కూడా తెల్లవాడి నీతులే. నేను పనిచేస్తున్నది ఒక బార్‌లోనే అయినా ఈ వేశ్యలు నన్ను తమ చిన్న తమ్ముడిలాగానే చూశారు. వీళ్లలో కొంతమంది నా రూముకు వచ్చి గంజాయి దమ్ము కొట్టి ఏదో ఒకటి మాట్లాడేవాళ్లు. అయితే ఇక్కడో విషయం చెప్పాలి. వేశ్యాగృహాలు రాత్రిపూట రద్దీగా వుండటం ఎక్కడైనా మామూలే. కానీ నేనుండే అపార్ట్‌మెంట్ మాత్రం ఉదయం ఆరు గంటల నుండి ఏడున్నర వరకు చాలా రద్దీగా వుండేది. అంత పొద్దున ఇక్కడికి వచ్చే వాళ్లంతా పెళ్లయిన మగవాళ్లే కావటం నన్ను చాలా ఆశ్చర్యానికి గురిచేసింది. ఉదయం తొమ్మిది గంటలకల్లా అక్కడ మిగిలే మగవాడిని నేనొక్కడినే. భర్తలపై పెత్తనం చెలాయిస్తూ, ఎప్పుడూ అది లేదు ఇది లేదు అని ఫిర్యాదులు చేస్తూ ఏదో ఒకటి కచ్చితంగా తెచ్చివ్వాలని పోరుపెట్టి, మానసికంగా వాళ్లను నీరుగార్చిన భార్యలే ఈ ఉదయం రద్దీకి బాధ్యులు. తమ సుఖం కోసం భార్యల్ని దోచుకుంటున్నారనే భావంతో మగవాళ్లను వత్తిడికి గురిచేస్తే ఆ వత్తిడి తట్టుకోలేక ప్రతి భర్తా ఇక్కడికి అంత పొద్దునే వచ్చేవాడు. ఈ వేశ్యలు మగవాళ్లు చెప్పిన ప్రతి మాటా శ్రద్ధగా వినే బుద్ధిమంతులైన విద్యార్థుల్లా మెలిగేవారు. లైంగిక సామర్థ్యం బాగా వుండే ఇరవైల వయసు దాటిన తర్వాత మగవాళ్లు ప్రధానంగా తమ అహాన్ని తృప్తిపరచుకోవటానికే పడకగదిలోకి పోతారని, దీన్ని అర్థం చేసుకోకుండా భార్యలు వాళ్ల అహాన్ని విపరీతంగా గాయపరుస్తారని వీళ్లు చెప్పారు. అక్కడికి వచ్చే మగవాడు ఎంత సామర్థ్యం చూపాడనేది విషయం కాదు. వుండే ఆ కొద్దిసేపూ తనంత మగవాడు ఈ ప్రపంచంలోనే లేడనే భావన వేశ్య కలిగిస్తుంది. అందుకే అంత పొద్దునే ఈ వేశ్యలు అంతగా వ్యాపారం

చేసుకునేవాళ్లు. ఈ పరిస్థితిని అర్థం చేసుకున్న భార్యలు తమ భర్తలను కాపాడుకోగలిగారు. ఈ వేశ్యలు నాతో ఏ విషయమైనా చెప్పేవారు. వీళ్ల అభిప్రాయం ప్రకారం ఒక స్త్రీని అప్పుడప్పుడూ చిన్నపిల్లలాగా చూసుకోవాలి, ఆ తర్వాత ఆమె పట్ల నిక్కచ్చిగా వుండాలి. స్వభావసిద్ధంగా స్త్రీలందరూ పెళుసుగా, బలహీనంగా వుంటారు. శక్తివంతుడైన మగవాడి పట్ల వాళ్లు ఆకర్షితులవుతారు.

క్రమం తప్పకుండా బోస్టన్ నుండి సోఫియా నా కోసం హార్లెమ్‌కు వచ్చి పోతూనే వుండేది. బోస్టన్‌లో వున్న ఆమెను ఒకసారి వచ్చి పొమ్మని అడిగితే, ఈ వారమంతా ఎక్కడికీ రాలేనని, తాను బోస్టన్‌లోనే ఒక తెల్లవాడిని పెళ్లి చేసుకున్నానని చెప్పింది. అయితే ఈ సంఘటన నన్నేమీ ఆశ్చర్యపరచలేదు. ఎందుకంటే అంతకు ముందు ఒకసారి సోఫియాను శామీకి పరిచయం చేశాను. ఆ తర్వాత తెల్లస్త్రీల మనస్తత్వం గురించి శామీ నేనూ చాలా విషయాలు చర్చించుకున్నాం. దాని తర్వాత నేను మానసికంగా ఇలాంటి నిర్ణయానికి పూర్తి సిద్ధంగా వున్నాను. ఈ విషయంలో శామీకి నేనెంతగానో రుణపడి వున్నాను. నల్లవాడితో లైంగిక సంబంధం పెట్టుకున్నా, వాడు ఇంకా తెల్లవాడి కాలి కిందే వున్నాడనే సంగతి తెల్ల స్త్రీకి తెలుసని, అన్నిచోట్లకూ స్వేచ్ఛగా తిరుగుతూ విలాసవంతంగా బతకాలనుకునే ఆమె మనస్తత్వానికి నీగ్రో ఆటంకం కాబట్టి వాడిని ఏ క్షణమైనా వదిలించుకుంటుందని శామీ చెప్పాడు. ఇంకొందరు తెల్లస్త్రీలు తమ వీలు కోసం భద్రత కోసం తెల్లవాళ్లను పెళ్లి చేసుకున్నా ఇంకోవైపు నీగ్రోలతో సంబంధాలు కొనసాగిస్తూనే వుంటారు. ఇదంతా నీగ్రో మీద ప్రేమతో కాదు. కామం మీద, మరీ ముఖ్యంగా సమాజం నిషేధించే కామం మీద ప్రేమతో చేస్తారు. ఒక తెల్లస్త్రీ విపరీతమనిపించే పిచ్చి ప్రేమతోనో లేదా తన కామం తీర్చుకోవటానికో మాత్రమే ఒక నీగ్రో మగవాడితో కలిసి వుంటుంది.

నేను హార్లెమ్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కుదురుగా వుండేసరికి నాకు రెడ్ అనే మారుపేరు వచ్చింది. ఈ పేరుతో మరో ఇద్దరున్నారని తెలిసి వాళ్లిద్దర్నీ కలిశాను. ఒకరు 'సెయింట్ లూయీరెడ్' ఇతను సాయుధ దొంగతనాలు చేసే వృత్తిదొంగ. మరొకరు 'షికాగో రెడ్' ఇతను నైట్‌క్లబ్‌లో పనిచేసే విదూషకుడు. చాలామంది నాది ఏ ప్రాంతమని అడిగితే లాన్సింగ్ అని చెప్పాను. కానీ చాలామంది న్యూయార్క్ నగరవాసులు అదెక్కడుంది అని అడిగేవారు. అందుకు నాది డెట్రాయిట్ అని చెప్పటం మొదలుపెట్టాను. దాంతో మెల్లగా నా పేరు 'డెట్రాయిట్ రెడ్'గా స్థిరపడిపోయింది. 1943లో నంబర్ల రాకెట్ నడిపేవాళ్లు నాకు ఉద్యోగం

ఇస్తామని చెప్పారు. అమ్మాయిలను సరఫరా చేసే ఉద్యోగానికూడా పిలుపొచ్చింది. అయితే అవి రెండూ నాకు నచ్చలేదు. వాటికవసరమైన నిర్వహణా సామర్థ్యం కూడా నాకు లేదు. చివరికి శామీతో కలిసి మత్తుమందు వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నాను. ఇదైతే పెద్దగా కష్టపడకుండానే త్వరగా డబ్బు సంపాదించవచ్చు. మా ఇద్దరి మధ్యా అంగీకారం కుదరగానే నాకు తెలిసిన వాళ్లందరికీ మారిజువానా సరఫరా చేయటం మొదలుపెట్టాను. న్యూయార్క్‌లో సంగీతకారులందరికీ ప్రతిరోజూ ఇది కావాలి. నాకు ఈ రంగంలోనే కాకుండా ఇంకా వేరే దందాలు చేసే వాళ్లు కూడా చాలామంది తెలియటం వల్ల నా పని సులువైంది. ఈ వ్యాపారంలో తలమునకలై చాలా తక్కువగా నిద్రపోయాను. ఈ రకంగా తిరిగి అమ్మటంవల్ల నా జేబులో ఎప్పుడూ నోట్ల కట్టలుండేవి. పదిహేడేళ్ల యువకుడి దగ్గర ఇంత డబ్బుండటం ఆ రోజుల్లో అయినా ఈ రోజుల్లో అయినా అదృష్టమే. నా జీవితంలో మొదటిసారి అప్పుడే స్వేచ్ఛలో వుండే గొప్ప అనుభూతిని పొందాను. ఇక్కడో తమాషా సంగతి చెప్పాలి. ఒకసారి ఒక గాయకుడు కోడి తుంటి ఎముక గుండా మారిజువానా పీల్చాడు. ఇలా పీలిస్తే కొద్దిసేపటికి 'స్వర్గం' అందుతుందని చెప్పాడు.

మారిజువానాతో పాటు హెరాయిన్, కొకైన్‌లు కూడా సరఫరా చేయాలని పించింది. ఇవి అందిస్తే రోజుకు వంద డాలర్ల దాకా సంపాదించవచ్చు. అయితే ఈ వ్యాపారం చేయటానికి చాలా అనుభవం, నైపుణ్యం కావాలి. వీటి మీద పోలీస్ నిఘా ఇంకా ఎక్కువగా వుంటుంది. దందాలు చేయటంలో తలపండిన ఎంతోమంది నాకు బాగా పరిచయముండటం నాకు మేలు చేసింది. ఏ దందా చేసినా సరే, అందులో విజయం సాధించాలంటే అవసరం వచ్చినప్పుడు ఏ వ్యక్తిని ఎక్కడ ఎలా ఉపయోగించుకోవాలో తెలిసి తీరాలి. వాళ్లు పోలీసులు, డిటెక్టివ్‌లు కూడా కావచ్చు. అయితే అప్పటికి నేనింకా ఆ స్థాయికి చేరుకోలేదు. అందుకే శామీ నా చేతిలో రోజూ ఇరవై డాలర్లు పెట్టేవాడు. ఈ కాలంలోనే నేను విపరీతంగా సినిమాలు చూసేవాడిని. కొన్నిసార్లు రోజుకు అయిదు సినిమాలు చూసేవాడిని. రాత్రి థియేటర్ నుండి బైటికి రాగానే నా పని మొదలు పెట్టేవాడిని. మారిజువానా అగ్గిపుల్ల సైజులో కాగితంలో చుట్ట చుట్టి అందరికీ ఇచ్చేవాడిని. ఈ 'రీఫర్స్' విపరీతంగా అమ్మితే బాగా డబ్బు వచ్చింది. సోఫియాను చూడాలని మనసు లాగటంతో బోస్టన్‌కు పోయాను. ఎల్లాను కూడా చూశాను. అక్కడ వున్న కాలంలో నాకు సహాయం

చేసినందుకు కృతజ్ఞతగా ఆమెకు కొంత డబ్బు ఇచ్చాను. అయితే లారా విషయంలో మాత్రం ఆమె నన్ను క్షమించలేదు. ఆమెతో కొద్దిసేపు మా కుటుంబంలో వచ్చిన మార్పుల గురించీ, కుటుంబసభ్యులందరి గురించీ మాట్లాడి వెళ్లిపోయాను.

షార్టీ అపార్ట్‌మెంట్ నుండి సోఫియాకు ఫోన్ చేశాను. ఇద్దరమూ కలిసి షార్టీ ప్రదర్శన చూశాం. సొంత బ్యాండ్ పెట్టుకోవాలనే షార్టీ కోరిక నెరవేరింది. మరుసటి రోజు నా హార్లెమ్ పరిచయాలు, అనుభవాలన్నీ షార్టీకి చెప్పాను. 'ఒరే, నువ్వేమో అయిపోయావు!' అన్నాడు. బోస్టన్ నుండి తిరుగు ప్రయాణమయ్యాను. హార్లెమ్ చుట్టపక్కల తిరిగే డిటెక్టివ్‌ల దృష్టిలో నేనింకా పడలేదు. వాళ్ల కన్నుగప్పి రీఫర్లు చేరవేసేవాడిని. అయితే, ఒకరోజు పొద్దున రూముకు వచ్చి చూస్తే డిటెక్టివ్‌లు వచ్చిపోయిన గుర్తులు కనిపించాయి. అలా వచ్చినప్పుడు ఏ సాక్ష్యమూ దొరక్కపోతే వాళ్లే గుట్టుగా రీఫర్లు దాచిపెట్టి మరుసటి రోజు వచ్చి వాటిని 'కనిపెడతార'ని నేను చాలాసార్లు విన్నాను. అందువల్ల వాళ్లకు ఆ అవకాశం ఇవ్వకుండా నా వస్తువులను ఖాళీచేసి వేరే రూములో పడుకునేవాడిని. అప్పటి నుండే నా దగ్గర 25 ఆటోమేటిక్ పిస్టల్ పెట్టుకోవటం మొదలుపెట్టాను. పోలీసులు కనుక్కోకుండా వుండటం కోసం దాన్ని సరిగ్గా వీపు మధ్య వుండేలా బెల్టు కింద దాచిపెట్టేవాడిని. ఈ పరిస్థితివల్ల నా వ్యాపారం సన్నగిల్లింది. సమయమంతా నన్ను నేను రక్షించుకోవటానికే ఖర్చయిపోతూ వుంది. నేను పడుకునేచోటు శామీకి తప్ప ఎవ్వరికీ చెప్పలేదు. చివరికి, మాదకద్రవ్యాల స్క్వాడ్ ప్రత్యేక లిస్టులో నేను కూడా వున్నానని సమాచారం అందింది.

జనం రద్దీగా వుండే ప్రదేశాల్లో వాళ్లు నా కోసం గాలించటం మొదలుపెట్టారు. నా పైన నిఘా ఎక్కువ కావటంతో రీఫర్లను ఖాళీ సిగరెట్ పెట్టెల్లో, వీధి దీపాల దగ్గర, చెత్తకుండీల వెనకా దాచిపెట్టేవాడిని. అయితే సంగీత, నాట్య కళాకారులను చెత్తకుండీ దగ్గర వేచి వుండమని చెప్పటం వీలు కాదు కాబట్టి, గొప్పవాళ్లుండే వీధుల్లో తిరుగుతూ రెడ్‌క్రాస్ బ్యాండేజి బాక్సుల్లో పెట్టి అందజేసేవాడిని. ఇది చాలా బాగా పనిచేసింది. కానీ, కొన్ని రోజులకు మధ్య హార్లెమ్‌లో నివసించే ఈ వ్యసనపరులు నేను ఆ ప్రాంతం విడిచి వెళ్లాలని బలవంతపెట్టారు. దాంతో నేను ఇంకా కింది ప్రాంతానికి పోయి రీఫర్లు అమ్మటం మొదలుపెట్టాను. అక్కడ వుండేదంతా పేదవాళ్లే. వాళ్లకు కావలసింది నాసిరకం సరుకు. అలాంటి దానికోసం జంతు లక్షణాలుండే ఆ పేద నీగ్రోలు నన్ను అనుసరించి వస్తుండేవారు. ఇలాంటి

జంతువులు, రాబందులు వుండే ప్రపంచంలో నీవు కూడా ఇలాగే బతకాలి. మనుగడ కోసం పోరాటం అంటే నిజంగా ఇదే. అందుకే, నీగ్రో జంతువులుండే ఈ అడవిలో ఒంటరి తోడేలు మాదిరే బతికాను. నా దగ్గర డబ్బు కొన్నిసార్లు బాగానే వుండేది. మరికొన్నిసార్లు కేవలం తిండి తినటానికి మాత్రమే సరిపోయేది. పైగా నిషా కూడా పెరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో శామీ నాకో ఐడియా ఇచ్చాడు. 'రైల్‌బోర్డు గుర్తింపు కార్డు నీ దగ్గర ఇంకా అలాగే వుందా?' అని అడిగాడు. వుంది అన్నాను. రైల్‌బోర్డు అధికారులు దాన్ని తిరిగి తీసుకోలేదు. 'అయితే, ఈ వేడి చల్లారే వరకూ దాన్ని అడ్డం పెట్టుకొని రైళ్లలో తిరుగుతూ ఎందుకు అమ్మకూడదు? అని ప్రశ్నించాడు. అతను చెప్పింది నిజం. అందుకే రైల్లో తిరుగుతూ, తమ బ్యాండ్‌తో ఊళ్లు తిరిగే పరిచయస్తులందరికీ రీఫర్లు చేరవేయటం మొదలుపెట్టాను. నా దగ్గర 'న్యూహెవెన్' రైలు గుర్తింపు కార్డు వుంది. మిగతా రైళ్లలో కూడా కొన్ని రోజులు పనిచేసి వాటిల్లో కూడా గుర్తింపు కార్డులు సంపాదించాను. వీటిని అడ్డం పెట్టుకొని న్యూయార్క్ నగరంలో నా రీఫర్ల వ్యాపారం పెద్ద ఎత్తున చేశాను. నాలా ఒక ప్రయాణీకుడు రీఫర్లు అమ్మటం గురించి నా పరియస్తులు అంతకు ముందు కనీసం వినను కూడా లేదు.

ఇలా రైళ్లలో తిరుగుతూ న్యూయార్క్ నగరం నుండి చిన్న పట్టణం దాకా నా వ్యాపారం కోసం ఎక్కడ ఆగాల్సి వస్తే అక్కడ ఆగిపోయేవాడిని. అలా ఒకరోజు నేను న్యూయార్క్ చేరుకునేసరికి మా తమ్ముడు రెగినాల్డ్ నా కోసం ఎదురుచూస్తున్నాడు. నేనింకా స్మాల్స్‌లోనే పనిచేస్తున్నాననుకొని అక్కడికి వెళితే, అక్కడున్న వాళ్లు శామీ దగ్గరికి పంపించారు. మా తమ్ముడిని చూడటం సంతోషమనిపించింది. కళ్లు మూసే ఆటలో నేనెక్కడ దాక్కున్నానో కనిపెట్టాలని వెతికిన పిల్లగాడే ఇప్పుడు నా ముందున్నది అని నమ్మటానికి చాలా సమయం పట్టింది. రెగినాల్డ్ ఇప్పుడు దాదాపు ఆరడుగులున్నాడు. అయితే నాకన్నా కొన్ని అంగుళాలు పొట్టిగా వున్నాడు. వాడిని అన్ని ప్రదేశాలకూ తీసుకొనిపోయాను. బాగా గమనించిన తర్వాత వాడు నాకు నచ్చాడు. పదహారేళ్ల వయసులో వాడు చూపిన ఆత్మాభిమానం ఆ వయసులో నాకు లేదు. వాడు వచ్చిన సమయంలో నాకు రూములేదు కానీ నా దగ్గర కొంత డబ్బుంది. వాడి దగ్గరా కొంత వుంది. ఇద్దరమూ సెయింట్ నికొలస్ హోటల్లో బసచేశాం. ఆ రాత్రంతా లాన్సింగ్ రోజుల గురించీ, మా కుటుంబం గురించీ మాట్లాడుకున్నాం. మా అమ్మ, నాన్నల గురించి వాడికి

గుర్తులేని విషయాలు చెప్పాను. వాడు మిగతా అందరి గురించీ చెప్పి నా మనసులో సంతోషం నింపాడు. విల్‌ఫ్రెడ్ ఇంకా విల్బర్‌ఫోర్స్ విశ్వవిద్యాలయంలో ట్రేడ్ ఇన్‌స్ట్రక్టర్‌గా వుంటున్నాడు. హిల్డా, ఫిల్బర్ట్ లాన్సింగ్‌లోనే వుంటున్నారు. పెళ్లి చేసుకునే ఆలోచనలో వున్నారు. వీళ్ల తర్వాత మాదే వంతు. యువోనీ, వెస్లీ, రాబర్ట్ లాన్సింగ్‌లోనే బడిలో చదువుకుంటున్నారు. ఫిల్బర్ట్ పూర్తిస్థాయి క్రైస్తవ మతస్తుడిగా మారిపోవటం గురించి ఇద్దరమూ బాగా నవ్వుకున్నాం. రెగినాల్డ్ ఎదురుచూస్తున్న వాణిజ్య ఓడ ఇంజన్ రిపేర్లు చేసుకొని ఒక వారంలో న్యూయార్క్ చేరబోతోంది. మర్చెంట్ మెరైన్‌లో పనిచేస్తున్న వాడిని చూసి ఎంతో సంతోషమైంది. తన ఉద్యోగం గురించి తక్కువగానే మాట్లాడినా, నేను వేసిన జోకులకు నవ్వుతూనే నా జీవితశైలిని వాడు ఆరాధించాడు. వేషధారణలో వాడు సాంప్రదాయకంగా కనిపించాడు. అందుకే ఎవడికో రీఫర్ అంటగట్టి వాడికి ఇంకా సాంప్రదాయకంగా కనిపించే ఓవర్‌కోటు, సూటు ఇప్పించాను. జీవితంలో నేను నేర్చుకున్నది వాడికి చెప్పాను. 'నువ్వు ఏదైనా పొందాలనుకుంటే నీవు ఇంతకుముందే ఏదైనా పొందినట్టు కనిపించాలి'. రెగినాల్డ్ వెళ్లిపోయే ముందు, ఆ ఉద్యోగం మానేసి హార్లెమ్‌కు వచ్చేయమని చెప్పాను. నా తమ్ముడు నా కళ్ల ముందు వుండటం నాకు సంతోషం కలిగించే విషయం. వాడు నా దగ్గరికొస్తే నేను నమ్మదగిన వ్యక్తులు ఇద్దరే. రెగినాల్డ్ మరొకడు శామీ.

1943లో సైన్యంలో చేరమని పిలుపొచ్చింది. ఆ రోజుల్లో ఈ ప్రపంచంలోకల్లా నన్ను భయపెట్టిన విషయాలు మూడు. అవి జైలు, ఉద్యోగం, సైన్యం. వెంటనే సైనిక నియామక కేంద్రంలో హాజరయ్యాను. అక్కడ పెద్ద హాల్లో చాలా మందిని పరీక్షిస్తున్నారు. నిశ్శబ్దంగా వుండే ఆ ప్రదేశంలో నేను నోటి కొచ్చిందంతా లొడలొడా వాగేస్తున్నాను. నాలో ఏదో తెలీని భయం, ఆందోళన వున్నాయి. అనుక్షణం జాగ్రత్తగా వుంటూ దందాలు చేసుకునే నాలాంటి మాదకద్రవ్యాల బానిస ఇలాంటి మానసిక స్థితిలోనే వుంటాడు. అక్కడే ఆర్మీ సైకియాట్రిస్ట్ కూడా వున్నాడు. ఆయనతో కొద్దిసేపు మాట్లాడాను. ఆ తర్వాత నన్ను ఉద్యోగంలోకి తీసుకోలేదు. ఎందుకు తీసుకోలేదో ఆర్మీ ఎన్నడూ చెప్పలేదు. నన్నెందుకు తిరస్కరించారో అడగటానికి నేనెప్పుడూ బాధపడలేదు.

అధ్యాయం - 7

# దందారాయుడు

రైళ్లలో తిరుగుతూ రీఫర్లు అమ్మే పని అకస్మాత్తుగా మానేశాక రెండేళ్లు హార్లెమ్‌లో ఏమి చేశానో పెద్దగా గుర్తులేదు. తర్వాత న్యూయార్క్ పోయాను. అక్కడ గ్రాండ్ సెంట్రల్ స్టేషన్ కిందివైపు, రైల్వే ఉద్యోగులు రైళ్లు వచ్చేలోపు 'బిగ్‌బ్లాక్‌జాక్', 'పోకర్' ఆటలు తెల్లవార్లూ ఆడేవాళ్లు. అక్కడ టేబిల్‌పైన ఒక్కోసారి అయిదు వందల డాలర్లు కూడా వుండేవి. ఒకసారి బిగ్‌బ్లాక్‌జాక్ ఆట ఆడుతుండగా ఒక ముసలి వంటవాడు ముక్కలు తారుమారు చేయాలని చూస్తే అతని ముఖంపై నా పిస్టల్ పెట్టాను. మరోసారి ఈ ఆటలు ఆడటానికి పోయినప్పుడు నా అంతరాత్మ హెచ్చరించింది. పిస్టల్ వీపు మధ్య బెల్టు కింద పెట్టుకున్నాను. సరిగ్గా అప్పుడే ఎవరో అరిచారు. పెద్ద పందిముఖాలేసుకొని ఇద్దరు ఐరిష్ పోలీసులు లోపలికి వచ్చారు. నన్ను సోదా చేసినా పిస్టల్ దొరకలేదు. టికెట్ లేకుండా గ్రాండ్ సెంట్రల్ స్టేషన్‌లో మళ్లీ కనిపించకూడదని చెప్పారు. దాంతో రైల్వే రక్షకదళం నా మీద కన్నేసి వుందని అర్థమైంది. దాంతో ఇంకెప్పుడూ రైల్వేలో ఉద్యోగం కోసం ప్రయత్నించలేదు. తిరిగి హార్లెమ్ చేరుకున్నాను.

డిటెక్టివ్‌లకు నేను పాతబడటంతో రీఫర్లు అమ్మటం మానుకున్నాను. చదువు లేకుండా, నైపుణ్యం లేకుండా, భయంతో, నక్కతెలివితో అందర్నీ తమాషాలు చేస్తూ అందినదాన్నల్లా ఎగరేసుకుపోయే నిజమైన దందారాయుడిలాగే బతికాను. ఆ రోజుల్లో దేనికోసమైనా తెంపు చేసేవాడిని. ప్రతి నగరంలోని నల్లవాడలో అప్పుడూ ఇప్పుడూ బడిమానేసిన పిల్లలు నేను చేసినట్టే దందాలు చేస్తూ బతుకుతున్నారు. వాళ్లు అనివార్యంగా రోజురోజుకూ అక్రమ మార్గంలోకి, అనైతిక జీవితంలోకి జారిపోతుంటారు. పూర్తిస్థాయి దందారాయుళ్లు ఒకచోట స్థిరంగా వుండరు. అడవిలో మాదిరే ఏ దందారాయుడైనా మెలకువతో వున్న ప్రతిక్షణం వాస్తవికంగా, అంతశ్చేతన ఇచ్చే జ్ఞానం ఆధారంగా బతుకుతాడు. అలా కాకుండా వాడెక్కడైనా ఆగినా, వేగం తగ్గించినా ఆకలిగొన్న మిగతా నక్కలు, తోడేళ్లు, రాబందులకు నిర్దాక్షిణ్యంగా ఆహారమవుతాడు. ఆ తర్వాత ఆరు నెలలపాటు చిల్లర దొంగతనాలు చేశాను. శామీ సిఫారసుతో కొకైన్ పీల్చటం మొదలుపెట్టాను. వీధుల్లో తిరిగేటప్పుడు .25 పిస్టల్, పనిమీద పోయినప్పుడు అంతకన్నా పెద్దవి తీసుకొని పోయేవాడిని. చాలా తరచుగా రూములు మార్చేవాడిని. శామీ నేనూ ఒకసారి దొంగతనం

చేయటానికి వెళ్లి పోలీసులకు దొరక్కుండా తెలివిగా తప్పించుకున్నాం. పూర్తి స్థాయి దందారాయుడిగా అవతారమెత్తినా ఆడంబరంగా కనిపించేవాడిని కాదు. అది నేను పెట్టుకున్న నియమం కూడా. అలా కనిపించటమంటే చాలా త్వరగా జైలుకు పోవటం. అందుకే ఎవరికీ ఏ అనుమానమూ రాకుండా తిరుగుతూ, చేతిలో డబ్బు చాలా తక్కువగా వుందనుకున్నప్పుడు మాత్రమే మరో ఉద్యోగం గురించి ఆలోచించేవాడిని.

కొన్ని వారాలు నంబర్లపైన పెద్ద మొత్తాలు పందెం కాసేవాడిని. సినిమాలు చూడటం మళ్లీ ఎక్కువైంది. అయితే ఏ పనిచేసినా నా స్నేహితులైన సంగీతకారులకు మాత్రం ఎప్పుడూ దూరం కాలేదు. రెగినాల్డ్ తన పనిమీద మారోసారి వచ్చాడు. పోయినసారి వచ్చినప్పుడు దిగ్భ్రమ కలిగించే సంగీత ప్రపంచాన్ని వాడికి చూపించాను. దాంతో వాడు సంగీతానికి వీరాభిమానిగా మారిపోయాడు. వాడికి ప్రముఖులైన చాలామంది సంగీతకారుల్ని స్వయంగా పరిచయం చేశాను. రైల్లో రీఫర్లు అమ్మే సమయంలోనే చాలామంది నాకు తెలుసు. ఆ తర్వాత, 1944-45లో న్యూయార్క్ నగరం చుట్టుపక్కల జనాదరణ పొందిన ప్రతి నీగ్రో సంగీతకారుడికీ నేను తెలుసు. ఇద్దరమూ కలిసి అన్నిచోట్లకూ పోయాం. వాడు వేలాది నీగ్రోల మనోభావాలేమిటో తెలుసుకున్నాడు. ఇప్పుడు నీగ్రోలోకంలోకి వచ్చిపడ్డాడు. వాడికి హార్లెమ్‌లో సరికొత్త బతుకు పాఠాలు నేర్పటం మొదలుపెట్టాను. వాడు కూడా అపాయం లేని చిన్న చిన్న దందాలు మొదలుపెట్టాడు. ఈ క్రమంలో ప్రతి నీగ్రో తెల్లస్త్రీ వ్యామోహంలో పడతాడు. కానీ వాడు పడలేదు. ఓసారి సోఫియా దగ్గరికి కూడా పోయాడు. అయితే వీడేమీ చేయకపోవటంతో ఆమె నిరుత్సాహపడింది. అది నా మనసుకు సంతోషాన్నిచ్చింది. వాడే సొంతంగా ఒక నల్లస్త్రీని ఎన్నుకున్నాడు. ఏదో రెస్టారెంట్‌లో పనిచేస్తున్న ఆమెకు ముప్పయి ఏళ్లు. యువకుడు దొరికిన ఆనందంలో వీడి కోసం విపరీతంగా ఖర్చు చేసేది. వాడు చిన్నపిల్లవాడైనట్టు అన్నీ అమర్చేది. వాడు తీసుకొన్న ఈ నిర్ణయం వాడి మీద నాకున్న గౌరవాన్ని పెంచింది. అంతేకాదు, దందాల్లో ఎంతో అనుభవమున్న వాళ్లకంటే వీడు చూపిన తెలివి నన్ను ఆశ్చర్యపరిచేది. వాడి వయసు పదహారేళ్లే. అయినా ఆరడుగుల రూపంతో, ప్రవర్తనతో చాలా పెద్దవాడేమో అనిపించేవాడు.

రెండో ప్రపంచయుద్ధ కాలంలో హార్లెమ్‌లో ఉద్రిక్త పరిస్థితి వుండేది. 1935లో నీగ్రోలను పనిలోకి తీసుకోకుండా తెల్ల వర్తకులు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడినప్పుడు వేలాది నీగ్రోలు హార్లెమ్‌ను ధ్వంసం చేశారు. అలాంటి పరిస్థితి మళ్లీ ఇప్పుడే

చూస్తున్నాం అని హార్లెమ్‌లో చాలా కాలంగా నివసిస్తున్న వాళ్లు చెప్పారు. నీగ్రోలు తెల్లస్త్రీలతో కలిసి నాట్యం చేయరాదని న్యూయార్క్ మేయర్ లాగార్డియా అధికారికంగా సవాయ్‌బాల్‌రూం మూయించటమే పరిస్థితి ఇలా వేడెక్కడానికి కారణం. దీనికి వ్యతిరేకంగా ఆడం క్లైటన్ పావెల్ చాలా పెద్ద పోరాటమే చేశాడు. దీని ఫలితంగానే ఎడిసన్ అండ్ న్యూయార్క్ టెలిఫోన్ కంపెనీలో నీగ్రోలకు పనులు దొరికాయి. ఆయన యు.ఎస్. నేవీ, యు.ఎస్. ఆర్మీల్లో కలిసికట్టుగా వున్న నీగ్రోలను విడదీయటం గురించి కూడా పోరాటం చేశాడు. అయితే అది విజయవంతం కాలేదు. ఉదార ఉత్తర ప్రాంత చర్యలవల్ల చాలా కాలంపాటు సవాయ్ మూతపడటంతో తెల్లవాళ్లందర్నీ హార్లెమ్ అసహ్యించుకుంది. అంతలో, బ్రాడాక్ హోటల్లో తెల్ల పోలీసులు ఒక నీగ్రోను కాల్చి చంపారని పుకారు పుట్టటంతో పరిస్థితి మరింత వేడెక్కింది. చావు భయంతో చైనావాళ్లు తలుపులు బిగించుకోవటం చూసి మేమంతా నవ్వుకున్నాం. తెల్లవాడి డబ్బు మీదే ఆధారపడి బతికే రాత్రి ఉద్యోగుల, దందారాయుళ్ల పరిస్థితి దయనీయంగా మారటంతో ఈ అల్లర్లు జరిగాయి.

రోజులు దుర్భరంగా మారటంతో దందాలు చేసేవాళ్లు కూడా ఏదో ఒక పనిలో చేరుతున్నారు. కొంతమంది వేశ్యలు కూడా ఇళ్లల్లో పనిమనుషులుగా కుదురుకున్నారు. దీంతో అమ్మాయిల వ్యాపారం చేయటం 'అసాధ్యం' అనే నిర్ణయానికి వచ్చి నేనూ శామీ ఒక చోరీకి పథకం వేశాం. అది బెడిసికొట్టి వెంట్రుకవాసిలో తప్పించుకున్నాం. శామీవైపు బుల్లెట్ దూసుకొచ్చింది. అయితే అతనికి గాయమేదీ కాలేదు. అక్కడ చెరొకవైపు పోయి తప్పించుకున్నాం. పొద్దునే శామీకి ఎలా వుందో చూద్దామని తన అపార్ట్‌మెంట్‌కు పోతే, అక్కడ ఒక అందమైన తలపాగరు స్పానిష్ నీగ్రో అమ్మాయి ఏడుస్తూ అతనిపై సోలిపోతూ కనిపించింది. నన్ను చూడగానే అరుస్తూ గోళ్లతో రక్కటానికి నా మీదికి వస్తున్నా శామీ ఎందుకు ఆమె నోరు మూయించలేదో అర్థం కాలేదు. అయితే ఆ పని నేను చేసి కంటి చివర నుండి గమనిస్తున్నాను. శామీ తన పిస్టల్ అందుకోవటానికి పోతున్నాడు. ఆమెను నేనలా కొట్టటం శామీ సహించలేకపోయాడు. ఇద్దరం ఒకరినొకరు చంపుకోవటానికి సిద్ధపడ్డాం. ఆమె అతడి మతి చెదరగొట్టటంతో నేను వాకిట్లో నుండి బైటపడ్డాను. శామీ చాలా దూరం నన్ను వెంబడించాడు. అప్పుడే ఇద్దరమూ పోలీసుల కళ్లలో పడ్డాం. మా ఇద్దరి గురించీ దగ్గర్లో వున్న పట్టణాన్ని అప్రమత్తం చేశారు. ఆ తర్వాత ఇద్దరమూ కొన్ని రోజులు దూరంగా వుండాలనుకున్నాం.

ఆ సంఘటనతో, ఈ ప్రపంచంలో నేను సంపూర్ణంగా నమ్మదగిన మనిషి

రెగినాల్డ్ ఒక్కడే అని అర్థమైంది. వాడిని తాత్కాలికంగా రైల్వేలో ఉద్యోగం చెయ్యమని చెప్పాను. నాకున్న పేరు రీత్యా మళ్లీ నంబర్ల రాకెట్‌లో పడ్డాను. హార్లెమ్‌లో నష్టం రాని వ్యాపారం అదొక్కటే. మా బాస్ భార్య 1930లలో డచ్‌షుల్జ్ సెక్రటరీగా పనిచేసింది. అప్పుడు హార్లెమ్ నంబర్ల వ్యాపారమంతా ఆయన కనుసన్నల్లో మెలిగింది. నంబర్ల బెట్టింగ్ స్లిప్పులుండే బ్యాగును వాషింగ్టన్ బ్రిడ్జి దగ్గర వుండే వ్యక్తికి ఇచ్చి రావటం నా పని. అంతకు మించి ఏమీ తెలీదు. రాకెట్లలో ప్రశ్నలు అడగరాదు. మా బాస్ భార్య, ప్రసిద్ధ సంగీతకారుడు హాంప్టన్ భార్య గ్లేడీ - వ్యాపారదక్షత కలిగిన ఈ ఇద్దరు స్త్రీలంటే నాకు గౌరవం. మా బాస్ భార్య తన అనుభవాలు, నంబర్ల రాకెట్‌లో అందరి వాటాల గురించీ చెప్పింది. నేరానికి చట్టం ఎలా సహకరిస్తుందో తన వ్యక్తిగత అనుభవంతో తెలుసుకున్నానని కూడా చెప్పింది. దేశంలోని సామాజిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలు, నేరస్తులు, చట్టం, రాజకీయ నాయకులు విడదీయలేని భాగస్వాములని ఆమె నాకు ప్రత్యక్షంగా చూపించింది. నంబర్లపై నేను ఎక్కువ డబ్బు సంపాదించే ఉద్దేశంతో వెస్టిండియన్ ఆర్చీ దగ్గరికొచ్చి పడ్డాను. ఈయన గురించి ఇంతకుముందే చెప్పాను. హార్లెమ్‌లో నివసించే అతి భయంకరమైన నీగ్రోల్లో ఈయనొకడు. పూర్వాశ్రమంలో షుల్జ్‌కు ముఖ్య అనుచరుడు.

కేవలం పాత పరిచయంవల్ల కాదు, ఆర్చీకి వున్న అసాధారణ ప్రతిభ వల్లే మా బాస్ భార్య ఆయనను పనిలోకి తీసుకుంది. ఎన్ని కాంబినేషన్ నంబర్లనైనా ఆయన కాగితం మీద రాసుకునేవాడు కాదు. అన్నీ ఆయన తలకాయలోనే వుండేవి. ఈ కారణంగా నంబర్ల రాకెట్ నడిపే వాళ్లందరికీ ఆయన ఆదర్శప్రాయుడయ్యాడు. దీనివల్ల ఉపయోగమేమిటంటే బెట్టింగ్ స్లిప్పులనేవే ఆయన దగ్గర వుండవు, కాబట్టి ఏ పోలీసూ పట్టుకోలేడు. నేను ఇలాంటి నీగ్రోలను మరికొంత మందిని కూడా కలిశాను. వీళ్లు ఇంకోరకం సమాజంలో బతికివుంటే, గణితంలో వీరి అసాధారణ ప్రతిభ రాణించి వుండేది. అయితే వీళ్లు నల్లవాళ్లు. ఏది ఏమైనా ఆర్చీకి క్లయింట్‌గా వుండటమే ఒక హోదా. అప్పు కూడా ఇచ్చేంత డబ్బు ఆయన దగ్గర ఎప్పుడూ వుండేది. చివరికి, తెల్ల గ్యాంగులతో మా బాస్ చేసుకున్న ఆరునెల్ల కాంట్రాక్టు కాలం విజయవంతంగా ముగిసింది. ఇందులో భాగస్వాములైన వాళ్లందరికీ బాగా డబ్బు ముట్టింది. ఆ తర్వాత మా బాస్ అతని భార్య జూద గృహం తెరిచారు. నేను వాళ్ల దగ్గరే పనిచేస్తూ వుండిపోయాను. ఈ కాలంలోనే ఇంకో హార్లెమ్ మేడం పరిచయమైంది. తాళాలు బిగించిన తలుపుల వెనుక జరిగే రాసలీలల రాత్రి

ప్రపంచపు మరో ముఖాన్ని ఆమె నాకు పరిచయం చేసింది. జనంతో రద్దీగా వుండే బ్రాడ్వే ప్రాంతంలోని ఆస్టర్ హోటల్ బైట వుండి అక్కడి నుండి 'పార్టీ'లను పట్టుకొచ్చే ఉద్యోగం నాకిచ్చింది. అలా చాలామందిని పిలుచుకొని వచ్చేవాడిని. వారిలో అన్ని రంగాలకు చెందిన తెల్ల ప్రముఖులూ వుండేవారు. హార్లెమ్ వాళ్ల పాపపంకిలం. నల్లవాళ్లను పోచుకోవటం, తెల్లప్రపంచంలో తమ ముఖాలకు తగిలించుకున్న 'కులీన', 'ప్రముఖ', 'గౌరవనీయ' ముసుగులన్నీ తీసి పారేయటమే అక్కడ వాళ్లు చేసిన పని.

తెల్లవాళ్లు నీగ్రో స్త్రీలంటే ఎంతగా పడిచచ్చేవారో మరొక ఉదాహరణ చెపుతాను. ఒక అపార్ట్మెంట్లో కండలు తిరిగిన రాక్షసి బొగ్గులాంటి ఒక నీగ్రో అమ్మాయి వుండేది. ఆమెతో అరవై ఏళ్లు దాటిన తెల్లవాళ్లు కోరి కోరి తన్నులు తినేవారు. ఇది ఆమె 'ప్రత్యేకత'. కొంతమంది దీంతో తృప్తిపడక, కాళ్లావేళ్లా పడి ఏడుస్తూ తమని మళ్లీ ఆమె దగ్గరికి తీసుకొని పొమ్మని నన్ను ప్రాధేయపడేవారు. వాళ్లు ఊరూ పేరూ లేని వాళ్లు కాదు. ప్రభుత్వంలో పెద్ద పెద్ద హోదాల్లో పనిచేసిన అధికారులు. అదే నాకు చాలా ఆశ్చర్యం కలిగించేది. దీన్ని ఒక మానసిక వైద్య నిపుణుడు ఎలా అర్థం చేసుకుంటాడని చాలా ఆలోచించాను. నాకు అర్థమైంది ఒక్కటే. వాళ్లకు నరనరాన నలుపంటే అంతగా వ్యామోహం! కొద్ది రోజులకు మరో 'ప్రత్యేక' మేడం వున్నట్టు తెలిసింది. ఆమె తెల్ల లెస్బియన్. ఈ అందమైన స్త్రీ ఒక మగనీగ్రో కంపెనీయే నడిపేది. ధనవంతులైన తెల్లస్త్రీల దగ్గరికి ఈ నీగ్రోలను పంపటమే ఆమె పని. ఈ వ్యాపారాన్ని ముందు తన సొంత అపార్ట్మెంట్లోనే ప్రారంభించి, విజయం సాధించింది. కొద్దికాలంలోనే మరో మూడు అపార్టుమెంట్లను బాడుగకు తీసుకొని నడిపే స్థాయికి ఎదిగింది. తన దగ్గరికి వచ్చే తెల్లస్త్రీలు తమ స్నేహితురాళ్లకు ఆమె పేరు సిఫారసు చేయటంతో పైకి 'మెసెంజర్ సర్వీస్' ప్రారంభించి లోపల ఫోన్లో తన వ్యాపారమంతా నడిపేది. రంగుపై వున్న మోజును కూడా ఆమె గమనించింది. నేను లేతరంగు నీగ్రోను కావటంవల్ల 'అత్యవసర' పరిస్థితిలో పనికిరానని నవ్వుతూ నాతో చెప్పింది.

ఈ 'మెసెంజర్ సర్వీస్' ఆలోచన ఆమెకు రావటానికి కారణం కొంతమంది తెల్లస్త్రీలు మగనీగ్రోలను తమ ఇళ్లకు పంపమని కోరటమే. అందువల్ల ఆమె తరఫు నీగ్రో యువకులు 'మెసెంజర్లుగా' వచ్చి, మ్యాన్హట్టన్లోని ధనిక స్త్రీలు 'ఆర్డర్' చేసినది 'డెలివర్' చేసిపోయేవాళ్లు. దీన్ని తెల్లమగవాళ్లు ఏ రకంగానూ అడ్డుకోలేరు. ఎందుకంటే, తెల్ల సమాజం పనివాడి పాత్ర పోషిస్తూ నీగ్రోను సవాల్

చేయటాన్ని కలలో కూడా ఊహించలేదు. అదే దీని వెనుక వున్న వ్యాపార రహస్యం. విషాదమేమిటంటే, ఈ రకంగా సుఖం పొందే నలుపు, తెలుపు మగవాళ్లు, ఆడవాళ్లు ఒకరినొకరు అసహ్యించుకుంటూనే వుండేవారు. అయితే, ఆత్మవంచన చేసుకునే తెల్లవాడు నీగ్రోల 'అనైతికత' గురించి మాట్లాడతాడు. ఈ ప్రపంచంలో తెల్లవాళ్లకన్నా అనైతికంగా బతికే వాళ్లెవరు? ముఖ్యంగా ఎగువ మధ్యతరగతి వాళ్లు! ఈ మధ్యే అన్ని నగరాల్లోనూ తెల్ల గృహిణులు, వాళ్ల భర్తల బూతు బాగోతాల గురించి చాలా పత్రికల్లో వార్తలొచ్చాయి. కొన్ని రోజులకు నేను ఈ ఉద్యోగం కూడా మానేసి ఒక యూదు దగ్గర పనిలో కుదిరాను. అతను నన్ను చాలా బాగా చూసుకొనేవాడు. అతను అక్రమ మద్యం వ్యాపారం చేసేవాడు. స్టేట్ లిక్కర్ అథారిటీలో జరిగిన అవకతవకలన్నీ బైటి ప్రపంచానికి తెలియటంతో ఈతరాని అతడిని సముద్రంలోకి విసిరి చంపేశారు. దీంతో నేను మరోసారి అనుమానాస్పద వ్యక్తినయ్యాను. ఇక అక్కడి నుండి బైటపడి వెస్టిండియన్ ఆర్చీ దగ్గర కాంబినేషన్ నంబర్పై పందెం కాసి మూడు వందల డాలర్లు గెలుచుకొని వెంటనే జీన్‌పార్క్స్‌కు ఫోన్ చేశాను. ఆమె హార్లెమ్‌లోకల్లా అందగత్తె, గాయకురాలు. నేను ఈ విధంగా డబ్బు సంపాదించినప్పుడల్లా ఇద్దరం కలిసి జల్సా చేసేవాళ్లం. పోలోగ్రౌండ్స్ దగ్గర వుండే బార్‌లోని టెలిఫోన్‌బూత్‌లో ఇదే విషయం మాట్లాడుతుండగా, ఇద్దరు కరడుగట్టిన మనుషులు నన్ను ఉరిమి చూస్తుండటం గమనించాను. నా జేబులో సిగరెట్‌పెట్టె తప్ప పిస్టల్ లేదు. కానీ వాళ్లను మభ్యపెట్టటం కోసం నిజంగానే నా జేబులో ఏదో వున్నట్టు నటించటం మొదలుపెట్టాను. వాళ్లు ఇటాలియన్లు. సరిగ్గా అప్పుడే ఒక పోలీస్ రావటంతో వాళ్లు తప్పించుకున్నారు. పోలీసును చూడగానే నాకు సంతోషం కావటం నా జీవితంలో అదే మొదటిసారి. ఆ తర్వాత శామీ ఇంటికి చేరుకొనే వరకూ నేను వణుకుతూనే వున్నాను. కొద్ది రోజులుగా వెస్టిండియన్ ఆర్చీ నా కోసం అక్కడ కాపుకాసి వున్నాడని శామీ చెప్పాడు.

నిజం చెప్పాలంటే, ఇవన్నీ చెప్పటానికి ఈ రోజు నేను ఇంకా ప్రాణాలతో ఎలా వున్నానో నాకైతే తెలీదు. మూర్ఖులను, పసివాళ్లను దేవుడు కాపాడతాడని అంటారు. నన్ను కూడా ఆ అల్లా చల్లగా చూశాడనే అనుకుంటున్నాను. నా జీవితంలో ఈ కాలమంతా నిజంగా చచ్చిపోయాను. మానసికంగా చచ్చిపోయాను. నాకు నేనే తెలీకుండా బతికాను. ఏది ఏమైనా, శామీ ప్రకారం వెస్టిండియన్ ఆర్చీతో నాకు 'ముందున్నది ముసళ్ల పండగ'.

అధ్యాయం - 8

# పద్మవ్యూహం

ఎవరో తలుపు కొడుతున్నారు. పైజామా వేసుకొని పరుపు మీద పడుకొన్న శామీ, ఎవరు? అన్నాడు. వెస్టిండియన్ ఆర్చీ గొంతు వినపడగానే, శామీ కొకైన్ పౌడర్ గబగబా పరుపు కిందికి తోశాడు. నేను వాకిలి తీశాను.

'రెడ్ - నా డబ్బు నాక్కావాలి!'

ప్రమాదకరమైన నీగ్రోలు కూడా ఆర్చీ చేతిలో చావాలని కోరుకోరు. ఇప్పటికీ నేను నమ్మలేకున్నాను. అతడు నన్ను నిజంగా భయపెట్టాడు. అతడిని చూడగానే నాకు గొంతులోంచి మాట కూడా పెగల్లేదు.

'సమస్యేమిటి?' అన్నాను.

నేను కట్టని నంబర్ మీద డబ్బు తీసుకున్నానని ఆర్చీ అనుకున్నాడు.

'ఆర్చీ, నీలాంటి అనుభవజ్ఞుడు తగలని నంబర్‌కు డబ్బులిస్తాడా?'

ఇంతలో దిండు కింద దాచిన తన గన్ అందుకోబోతున్న శామీకి, 'తూటా నీ చెవిలోంచి పోతుంది' అని చెప్పి, ఆర్చీ నావైపు తిరిగి 'నీ దగ్గర నా డబ్బు లేదూ?' అని గద్దించాడు.

నేను తల ఊపాల్సింది.

'నీకు రేపు పన్నెండు గంటల వరకు టైమిస్తున్నాను' అని వాకిలి తీసుకొని ఆర్చీ విసురుగా వెళ్లిపోయాడు.

సమస్య డబ్బు కాదు. నా దగ్గర అప్పటికింకా రెండు వందల డాలర్లున్నాయి. ఇంకా కావాలంటే శామీ సర్దేవాడు. అంతదాకా ఎందుకు, ఒకసారి ఆర్చీనే ఇచ్చాడు. ఇద్దరమూ ఎదురెదురుగా నిలబడేట్టు చేసిన అతని చర్యే సమస్య. దందారాయుళ్ల జంతు ప్రపంచంలో 'ముఖం', 'గౌరవం' ముఖ్యమైనవి. తాను మరొకరిచేత మోసగించబడే మూర్ఖుడు కావటాన్ని ఏ దాదా కూడా జీర్ణించుకోలేడు. కొంతమంది యువకులు ముసలి దాదాలను బోల్తా కొట్టించి వీళ్ల పని అయిపోయిందని అందరికీ చెప్పటం ఆర్చీకి తెలుసు. నేను కూడా తనను అలా మోసగిస్తున్నానని ఆర్చీ నమ్మాడు. దాంతో తన చేతిలో నాకు చావు మూడిందని ప్రకటించాడు.

నా పిస్టల్స్ నా అపార్ట్‌మెంట్‌లోనే వుండిపోవటంతో శామీ తన .32 పిస్టల్

నాకిచ్చాడు. దానిపై చేయివేసి ఆలోచిస్తూ నడుస్తున్నాను. రెగినాల్డ్ ఊళ్లో లేకపోవటం మేలైంది. నన్ను రక్షించే ప్రయత్నంలో వాడు ఆర్చీ చేతిలో తన ప్రాణాలు పోగొట్టుకోవటం నాకిష్టం లేదు. మత్తు మందుకు బానిసైనవాడి మనసు బురదగుంతలా వుంటుంది. అందుకే మనసు పరిపరి విధాలుగా ఆలోచిస్తోంది. జీన్‌పార్క్స్‌ను తీసుకొని ఓనిక్స్ క్లబ్బులో బిల్లీ సంగీత విభావరి చూడ్డానికి పోయాను. బిల్లీ మా ఇద్దర్నీ చూసి నాకు చాలా ఇష్టమైన పాట ఎత్తుకుంది. 'నీకు ప్రేమంటే ఏమిటో తెలీదు' - 'నిద్రలేని కళ్లతో ప్రతి వేకువనూ ఎదుర్కోనంతవరకు ...... ప్రేయసిని పోగొట్టుకొని అందుకు ద్వేషించనంత వరకు' - ఈ పాట అయిపోగానే ఆమె మా టేబుల్ దగ్గరికి వచ్చి మాతో కలిసి ఫోటో దిగింది. ఆమెను చూడటం అదే చివరిసారి. ఆ తర్వాత ఆమె చనిపోయింది. నీగ్రోల శతాబ్దాల వేదనను అద్భుతంగా పలికించిన ఆ కంఠం ఒక నల్లస్త్రీది అయిన కారణంగా ప్రపంచానికి తెలీకుండా ఇలాంటిచోట వినిపించింది.

మేమిద్దరమూ అక్కడి నుండి బైటపడి మరో బార్‌లోకి పోయాం. అప్పటికే కొకైన్ కూడా పీల్చాను. మూర్ఖుడిలా వాకిలికి వీపుచేసి కూర్చొని ఆర్చీ గురించే ఆలోచిస్తున్నాను. అదొకరకంగా మంచిదే అయింది. ముఖం చేసి కూర్చొని వుండగా ఆర్చీ లోపలికి అడుగుపెట్టుంటే అతడిని కాల్చి చంపేవాడిని. కానీ, అంతలో ఆర్చీ నా ముందు నిలబడి పిస్టల్ నాకు గురిపెట్టి, అక్కడున్న వాళ్లందరూ వినేట్టు గట్టిగా నన్ను తిడుతున్నాడు. ఆర్చీ అంత మైకంలో వుండగా ఎప్పుడూ చూడలేదు. అది విస్కీ మైకం కాదు. అందులో ఇంకేదో వుంది. దాదాలకు మనిషిని చంపేటప్పుడు వుండే మైకం, అతను కొద్దిగా అవతలకు తిరిగితే చాలు చంపేయాలని నా కోటు కింద వున్న పిస్టల్‌పై చేయివేసి ఆలోచిస్తూ అలాగే కూర్చున్నాను. ఆర్చీ నా మనసును పసిగట్టి తిట్టటం ఆపి, నాతో అన్న మాటలకు నా వెన్నులో చలి పుట్టింది. 'రెడ్, ముందు నన్ను చంపాలని ఆలోచిస్తున్నావు. ఒక విషయం చెపుతున్నాను ఆలోచించుకో. నాకు అరవై ఏళ్లు. నేను ముసలివాడిని. నా జీవితం అయిపోయింది. నీవింకా యువకుడివి. నన్ను చంపి జైలుకు పోవటం తప్ప నీవేమీ చేయలేవు'. అంతలో అతని స్నేహితులు వచ్చి ఆర్చీని అవతలికి తీసుకొని పోయారు. నేను అక్కడి నుండి వెనక్కి చూడకుండా బైటికి నడిచి ఆర్చీ కోసం అయిదు నిమిషాలు చూసి వెళ్లిపోయాను.

తెల్లవారురఝామున అయిదు గంటలకు ఒక స్నేహితుడి దగ్గరికి వెళ్లి

నల్లమందు తెచ్చుకొని ఎక్కువ మోతాదు తీసుకున్నాను. దాని దెబ్బకు తలదిమ్మెత్తి పోతుంటే బెన్‌జెడ్రిన్ మాత్రలు వేసుకున్నాను. రెండూ పనిచేయటంవల్ల నా తల చెరొక దిక్కుకూ పోతున్నట్టనిపించింది. ఇంతలో తెల్ల లెస్బియన్ తనకు రీఫర్లు కావాలని ఫోన్ చేసింది. వెనుక అపార్ట్‌మెంట్‌లో వుండే డీలర్ దగ్గరికి పోయి మారిజువానా పొడి అప్పుగా ఇమ్మని అడిగాను. నా పరిస్థితి చూసి అతను రీఫర్లు చేయటంలో సహాయపడ్డాడు. చేస్తూ చేస్తూ కొన్ని రీఫర్లు కూడా పీల్చాను. మేడం ఇంటికి పోతూ మధ్యలో శామీ దగ్గరికి పోయాను. అక్కడ కొకైన్ ఇస్తే కాదనలేకపోయాను. ఇప్పుడు నల్లమందు, బెన్‌జెడ్రిన్, రీఫర్లు, కొకైన్ అన్నీ పనిచేస్తున్నాయి. ఏమి జరుగుతుందో చెప్పాలంటే మాటల్లేవు. ఒక్క మాటలో చెప్పాలంటే అది 'కాలాతీతస్థితి'. రీఫర్లు వాళ్ల చేతిలో పెట్టి అక్కడే పడిపోయాను. మెలకువ వచ్చి చూసేసరికి ఆర్చీ పెట్టిన చివరి గడువు దాటి సగం రోజు అయింది. వెంటనే హార్లెమ్ ఎగువ ప్రాంతంలోని ఒక బార్‌లోకి పోయాను. అక్కడ ఎవరో పిల్లవాడు నన్ను చంపాలని చూశాడు. నేను పిస్టల్ తీసేసరికి ఎవరో వాడిని బైటికి పంపించారు. అనుమానం రావటంతో వెంటనే నా పిస్టల్ అక్కడే వున్న మరో దాదాకు సైగచేసి అతనికిచ్చేశాను. ఒక పోలీస్ సరాసరి నా దగ్గరికే వచ్చి పిస్టల్ గురించి నిలదీశాడు. ఖాళీ చేతులు చూపించాను. వెనక్కి తిరిగి బైటికి నడవమని ఆ పోలీస్ సైగ చేశాడు. తర్వాత అతను వెళ్లిపోగానే, నేను మళ్లీ బార్‌కు వచ్చి నా పిస్టల్ తీసుకున్నాను. అంతలో ఎవరో వచ్చి 'నీవు ఊరు విడిచి వెళ్లిపోవటం మంచిది' అన్నాడు. ప్రతిదీ నా చుట్టూ ఉచ్చులా బిగుసుకుంటోంది. నన్ను చంపాలని ఆర్చీ, ఇటాలియన్లు, ఎవరో పిల్లగాడు, పోలీసులు అంతా ఎదురుచూస్తున్నారు. నేను చాలా చిక్కుదారుల్లో ఇరుక్కుపోయాను. ఆ పరిస్థితుల్లో నాకు శామీ గొప్ప సహాయం చేశాడు. షార్టీకి ఫోన్‌చేసి నన్ను బోస్టన్‌కు తీసుకొని పొమ్మని చెప్పాడు. నేను ఆ బార్ నుండి బైటపడి రోడ్డుమీద నడుస్తుండగా నా వెనుక హారన్ మోగింది. నాకున్న బెదిరింపుల కారణంగా ఆ శబ్దం విన్న వెంటనే పిస్టల్ తీసి షార్టీని చచ్చేంతగా భయపెట్టాను. అదే కారులో నా సామాన్లు సర్దుకొని ఇద్దరం న్యూయార్క్ విడిచి బోస్టన్ దారి పట్టాం. బోస్టన్ చేరేవరకూ తలాతోకా లేకుండా ఏవేవో మాట్లాడానని షార్టీ చెప్పాడు. అప్పటికి షార్టీ ముప్పయి ఆరు గంటలుగా అవిశ్రాంతంగా కారు నడుపుతూనే వున్నాడు.

అధ్యాయం - 9

# బందీ

నా నాస్తికత్వాన్ని, మొరటుతనాన్ని చూసి ఎల్లా నమ్మలేకపోయింది. మగాడనే వాడెవడైనా స్త్రీని ఇంకో సరుకుగానే చూడాలని నేను నమ్మాను. ఎక్కడ చెప్పినా ప్రతి మాటా లౌక్యంగానే ఉపయోగించాను. నా ఉద్యోగ పదజాలం రెండువందల పదాలు కూడా మించదని ఎవరితోనైనా సరే పందెం కాయగలను.

నేనెంత క్రూరమృగంలా బతికానో పాపం షార్టీకి కూడా తెలీదు. అతను నన్ను మామూలుగానే చూసినా నేను అతడిని గుర్రుగా చూసేవాడిని.

అన్నిటికన్నా ముందు, నేను రాత్రిళ్లు కూడా బాగా నిద్రపోయాను. రాబోయే రెండు సంవత్సరాల కాలంలో చాలావరకు నేను పగటిపూటే నిద్రపోయాను. మెలకువైతే చాలు, రీఫర్లు పీల్చేవాడిని. మారిజువానా నాకు పరిచయం చేసిన షార్టీనే, నేను దాన్ని పీల్చే పీల్చుడుకు గుడ్లుమిటకరించాడు. ఇక్కడికి వచ్చిన కొత్తలో ఎక్కువగా మాట్లాడేవాడిని కాను. కళ్లు తెరిస్తే చాలు, ఆపకుండా రికార్డులు వేసుకోవటం, గుండెలనిండా రీఫర్లు పీల్చటం, ఇదే పని. న్యూయార్క్ సంగీత కారులతో ఊహా సంభాషణలు చేస్తూ పగటి కలలుకంటూ గంటలకొద్దీ ఆ మత్తులో తేలిపోయేవాడిని. కొకైన్ పొడిని పీలిస్తే చాలా గొప్పవాళ్లమైనట్టు భ్రమ కలుగుతుంది. శారీరకంగా మానసికంగా ఆత్మవిశ్వాసం మితిమీరుతుంది. హెవీవెయిట్ ఛాంపియన్ను కూడా చిటికెలో చిత్తు చేయగలమని, అందరికన్నా మనమే తెలివైన వాళ్లమని అనిపిస్తుంది. కాలాతీతమైన అనుభూతి కూడా కలుగుతుంది. చాలా కాలం క్రితం గడిచిపోయిన సంఘటనలను కూడా ఆశ్చర్యకరమైన స్పష్టతతో గుర్తు చేసుకొని సమీక్షించుకునే సామర్థ్యం అప్పుడప్పుడూ వస్తుంది.

సోఫియాతో నా సంబంధం ఎప్పటిలాగే కొనసాగుతూనే వుంది. నేను హార్లెమ్‌లో వున్న కాలంలో నా దగ్గర వందల డాలర్లు వున్నా నాకు డబ్బిచ్చేది. అదంతా ఆమె భర్త సొమ్మే. కొంతమంది స్త్రీలు తాము దోచుకోబడటాన్ని ఇష్టపడతా రనిపిస్తుంది. అలా జరగనప్పుడు వాళ్లు మగవాడిని దోచుకుంటారు. సోఫియా ఒకరోజు తన చెల్లెలిని షార్టీ ఇంటికి తీసుకొచ్చింది. ఆమెకు పదహారేళ్లు. వాళ్లిద్దర్నీ నేను నీగ్రో ప్రదేశాల్లో తిప్పుతున్నప్పుడు అక్కడి నీగ్రోలు ఈ తెల్ల అమ్మాయిల్ని

చూసి ముప్పయి రెండు పళ్ళూ ప్రదర్శించేవారు. వాళ్ల దృష్టిలో పడటం కోసం నానా తంటాలూ పడేవారు. ఆ రోజుల్లోనే మళ్లీ లారాను కలిశాను. ఇద్దరమూ సంతోషంగా ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాం. నేనెప్పుడు చూసినా ఆమె చాలా మత్తులోనే కనిపించేది. నెల రోజులు పనీపాటా లేకుండా పడివున్న నేను మళ్లీ ఏదో ఒక ఉద్యోగం చూసుకోవాల్సి వచ్చింది. రాక్స్‌బరీలో జూదగృహం నడిపే జాన్‌హ్యాస్ నాతో అంతకుముందు మాట్లాడేవాడు కాదు. నా హార్లెమ్ జీవితం తెలిసిన తర్వాత న్యూయార్క్ మంత్రం అతడిపై పనిచేయటం మొదలుపెట్టింది. న్యూయార్క్‌లో దందాలు చేసినవాడు తమకు తెలుసని చెప్పుకోవటమే ఇక్కడి వాళ్లకు గొప్ప హోదా. ఒకసారి జాన్ తన జూదగృహంలో పేకాట ఆడుతుండగా వెళ్లాను. నేనూ టేబుల్‌పై కూర్చున్నాను. ఆట రసవత్తరంగా సాగుతోంది. జాన్‌లాంటి ఆటగాడిని నేను న్యూయార్క్‌లో కూడా చూడలేదు. చివరికి నా హార్లెమ్ నైపుణ్యమంతా ప్రదర్శించి ఆట గెలిచాను. నా ఆట చూసిన తర్వాత, అక్కడ పనిచేసేవాడిని పిలిచి, 'రెడ్ ఇక్కడికి ఎప్పుడు వచ్చి ఏది కావాలంటే అదివ్వు' అని చెప్పి వెళ్లిపోయాడు. ఆ జూదగృహానికి వచ్చేవాళ్లు నోళ్లు వెళ్లబెట్టిన సంగతి మరొకటి వుంది. రాక్స్‌బరీ జూదగాళ్ల దగ్గర ఒక పిస్టల్ మాత్రమే వుండేది. మరోసారి పేకాటలో ఎవరో ముక్కలు తారుమారు చేయాలని చూస్తే నా దగ్గరున్న మూడు పిస్టల్స్ చూపించాను. దాంతో ఎవరూ కిక్కురుమనలేదు. నా ప్రతిభ చూసి జాన్‌హ్యాస్ ఉద్యోగమిస్తానంటే నేనే చెయ్యలేదు.

నేను చేసే పనివల్ల షార్టీకి కూడా డబ్బు రావాలని నా ఆలోచన. సంగీతకారుడిగా షార్టీ సంపాదించే డబ్బు తన రోజువారీ అవసరాలకే సరిపోతుంది. పైగా అప్పులు. అందుకే, నా మనసులో వున్న మాట చెప్పగానే షార్టీ కూడా అంగీకరించాడు. ఇళ్ల దొంగతనాల గురించి తనకేమీ తెలీకపోయినా నేను చెప్పిన వెంటనే షార్టీ అంగీకరించటం నన్ను ఆశ్చర్యపరచింది. దొంగతనం ఎలా చేయాలో నేను వివరించిన తర్వాత షార్టీ తన స్నేహితుడు రూడీని పిలిపించాడు. అతను ఒక ధనిక వృద్ధుడి ఇంటిలో పనిచేస్తున్నాడు. ఆ ఇంటినే దోచుకోవాలని నిర్ణయించుకున్నాం. నేను, షార్టీ, రూడీ, సోఫియా, ఆమె చెల్లెలు కలిసి ముఠాగా ఏర్పడ్డాం. ఎవ్వరికీ ఏ అనుమానమూ రాకుండా ఆ ఇంటిని బాగా దోచుకున్నాం. దొంగసొమ్మును తీసుకొనిపోతుండగా పోలీసుల కంటపడినా వాళ్లకు ఎలాంటి అనుమానం రాకుండా మా కారు వాళ్లముందే ఆపి, రాక్స్‌బరీకి దారి చెప్పమని

అడిగాను. తర్వాత పోలీసులు, మేము ఎవరి పని మీద వాళ్లు సుఖంగా వెళ్లిపోయాం. కొన్ని రోజులు మేమంతా ఎవరి పనివాళ్లు చేసుకుంటూ జల్సా చేశాం. అయితే డిటెక్టివ్‌లు, పోలీసులు దొంగల కోసం వెతుకుతూనే వున్నారు. ఆ ఇంటిలో మేము దొంగతనానికి ఉపయోగించిన పరికరాలన్నీ వాళ్లకు దొరికాయి. మెల్లగా ఒక్కొక్క విషయం బైటపడి మా ముఠాలోని తెల్లస్త్రీలు ముందు పట్టుబడ్డారు. తర్వాత షార్టీ, ఆ తర్వాత నేను ఒకరొకరే దొరికిపోయాం. అందరికన్నా ముందు పట్టుబడాల్సిన రూడీ మాత్రం ఎలా తప్పించుకున్నాడో నాకు అర్థమే కాలేదు.

తెల్లస్త్రీలైనందువల్ల వాళ్లిద్దరికీ తక్కువ శిక్ష పడింది. దొంగతనం చేయటంకన్నా, వాళ్లు ఆ పని నీగ్రోలతో కలిసి చేయటాన్నే తెల్లవాళ్లంతా అసహ్యించుకున్నారు. తెల్లస్త్రీలతో ఈ పని చేయించినందుకు నాకు, షార్టీకి ఎక్కువ శిక్ష విధించారు. జైల్లో వున్న కాలంలోనే తెల్ల సమాజం లోతుపాతులన్నీ చూశాను. అక్కడే అల్లా, ఇస్లాం మతం అంటే ఏమిటో తెలిసి నా జీవితమే పూర్తిగా మారిపోయింది.

అధ్యాయం - 10

# సైతాన్

నాకు పదేళ్లు జైలుశిక్ష విధించారు. తెల్లస్త్రీలకు (ఫ్రేమింగ్‌హామ్‌లోని (మెసాచుసెట్స్) మహిళా సంస్కరణ చెరసాలలో ఒకటి నుండి అయిదు సంవత్సరాల వరకు శిక్ష పడింది. అది 1946 ఫిబ్రవరి. అప్పటికి నాకింకా ఇరవైఒక్క సంవత్సరాలే. నేనింకా గడ్డం గీసుకోవటం కూడా మొదలుపెట్టలేదు.

నాకూ షార్టీకి కలిపి సంకెళ్లు వేసి చార్లెస్‌టౌన్ స్టేట్ ప్రిజన్‌కు తీసుకొని పోయారు.

ఖైదీగా వున్న కాలంలో నా నంబర్లేమిటో నాకు గుర్తులేదు. జైల్లో వుండగా ఎవరికైనా నంబర్లే సర్వస్వం. చివరికి మన మెదడుపైనే వాటి ముద్ర పడుతుంది.

'పక్క మనుషుల' గురించి బాధపడే ఏ మనిషైనా, వాళ్లు కటకటాల వెనుక వుండాలనుకోవటానికి ముందు చాలాసేపు ఆలోచించాలి. జైళ్లు వుండకూడదని నేనటంలేదు, కానీ కటకటాలు మాత్రం వుండకూడదంటున్నాను. కటకటాల వెనుక ఏ మనిషీ మంచి మనిషి కాలేడు. కటకటాల వెనుక బతికిన జ్ఞాపకాలని ఏ ఖైదీ కూడా మరిచిపోలేడు.

జైలు నుండి బైటపడిన తర్వాత వాడి మనసు తన అనుభవాలన్నిటినీ చెరిపేయటానికి ప్రయత్నిస్తుంది. కానీ వాడెప్పటికీ వాటిని చెరిపెయ్యలేడు. నేను చాలామంది ఖైదీలతో ఈ విషయం గురించి మాట్లాడాను. వాళ్లందరూ తాము కటకటాలను మరచిపోలేకపోయామనే చెప్పారు.

చార్లెస్‌టౌన్‌లో నేనూ ఒక 'చేప'నయ్యాను. (జైలు భాషలో కొత్త ఖైదీ) అక్కడ అకస్మాత్తుగా మత్తుమందుకు దూరం కావటంవల్ల శారీరకంగా చితికిపోయి, కోపంతో పాములా బుస కొట్టేవాడిని. ఆ స్థితిలో వున్న నన్ను ఎల్లా వచ్చి చూసిపోయింది. అక్కడ సంవత్సరానికి పైగా వున్నాను. అక్కడ వున్నన్ని రోజులూ గార్డులను తిట్టటం, వస్తువులన్నీ జైలు గది నుండి బైటికి విసిరేయటం, భోజనశాలలో కంచాన్ని నేలకేసి కొట్టటం, నా నంబర్ పిలిచినా జవాబు చెప్పకుండా వుండటం లాంటివన్నీ చేసేవాడిని.

ఇలా ప్రవర్తించటంవల్ల నన్ను ఒంటరిగా ఓ గదిలో పెట్టారు. నన్ను నేను గట్టిగా తిట్టుకుంటూ బోనులోపడ్డ చిరుతలా జైలుగదిలో గంటలకొద్దీ పచార్లు

చేసేవాడిని. బైబిల్‌నీ దేవుడినీ చాలా ఇష్టంగా తిట్టేవాడిని. ఒక మనిషిని ఎంతసేపు ఒంటరిగా వుంచాలనే దానికి కూడా అక్కడ చట్టబద్ధమైన పరిమితి వుంది. మతాన్నీ, దేవుడినీ దూషించినందుకు మిగతా ఖైదీలు నాకు 'సైతాన్' అనే పేరు పెట్టారు.

ఆ జైల్లో నన్ను బాగా ప్రభావితం చేసిన వ్యక్తి నాతోటి ఖైదీ 'బింబి'. పని ముగిసిన తర్వాత బింబి చెప్పే మాటలు వినేవాళ్లం. మాతోపాటు గార్డులు, అక్కడి ఉద్యోగులు కూడా ఆయన ఏ విషయం గురించి మాట్లాడినా శ్రద్ధగా వినేవారు. ఆయన పాత కాలం దొంగ. చాలా జైళ్లు తిరిగాడు. మనిషి ప్రవర్తనను శాస్త్రీయంగా వివరించేవాడు. జైల్లో వున్న మనిషికీ బైట వుండే మనిషికీ మధ్య పట్టుబడకపోవటంలో మాత్రమే తేడా అని చెప్పి దాన్ని అందరికీ రుజువు చేశాడు. చారిత్రక సంఘటనల గురించి మాట్లాడటం ఆయనకు ఇష్టం. అక్కడ వున్న లైబ్రరీని ఎక్కువగా ఉపయోగించుకున్న వ్యక్తి ఆయనే. ఆయనతో మతంపైన నాకున్న నాస్తిక అభిప్రాయాలన్నీ చర్చించాను. ఆయన చెప్పింది విన్నాక పక్కవాళ్లను తిట్టే నా నోటికి మూతపడింది. నాకు సొంతంగా ఆలోచించే శక్తి వుందని, ఇక్కడ దొరికిన సమయాన్ని, లైబ్రరీని ఉపయోగించుకొని కరెస్పాండెన్స్ కోర్సులు చేయమనీ చెప్పాడు. నేను బడిలో నేర్చుకున్న విషయాలన్నిటినీ వీధిజీవితం చెరిపేసింది. అవకాశముంటే ఇంగ్లీషు చదువుతూ చూచిరాత రాయమని మా అక్క హిల్డా తన ఉత్తరంలో సూచించింది.

సమయం బాగా వుండటంతో ఇంగ్లీషులో కరెస్పాండెన్స్ కోర్సు మొదలు పెట్టాను. క్రమంగా వ్యాకరణ సూత్రాలు నాకు మళ్లీ గుర్తుకొస్తున్నాయి. ఏడాది గడిచిన తర్వాత ఇంగ్లీషులో చక్కగా రాయటం వచ్చింది. పదాల పుట్టుక గురించి బింబి చెపుతున్నది తరచుగా వినటంతో లాటిన్‌లో మరో కరెస్పాండెన్స్ కోర్సు మొదలుపెట్టాను. 1948లో ఒకరోజు నన్ను కంకార్డ్ జైలుకు బదిలీ చేశారు. 'నల్లవాడి సహజమతాన్ని' తాను కనుగొన్నానని ఫిల్బర్ట్ ఉత్తరం రాశాడు. ఇప్పుడు తాను 'నేషన్ ఆఫ్ ఇస్లాం'కు చెందిన వ్యక్తినని, నేను 'విడుదల కోసం అల్లాను ప్రార్థించాల' ని రాశాడు. ఇంతకు ముందు రాసిన ఉత్తరంలో ఫిల్బర్ట్ నా కోసం క్రీస్తును ప్రార్థించాడు. రెగినాల్డ్ కూడా ఉత్తరం రాశాడు. డెట్రాయిట్‌లో విల్‌ఫ్రెడ్, హిల్డా, ఫిల్బర్ట్‌లను వాడు తరచూ కలుస్తున్నాడు. వాడి ఉత్తరాల్లో ఎక్కువగా వార్తలుండేవి. ఒక ఉత్తరంలో ఒక సూచన కూడా వుంది. 'మాల్కం' ఇక మీద పందిమాంసం తినకు. సిగరెట్లు కాల్చకు. జైలు నుండి బైటపడటమెలాగో చూపుతాను.'

ఇదెట్లా సాధ్యమవుతుందని తెల్లవార్లూ ఆలోచించాను. కొన్నాళ్లు ఇవి మానేస్తే ఒకవేళ శరీరానికి ఏదైనా రోగమొచ్చి బైటపడతానా? జైలు నుండి బైట పడటం అనే ఆలోచన ఏ పనిచేసినా నన్ను వెంటాడేది. సిగరెట్లు లేకుండా ఒంటరి ఖైదులో నన్ను కొన్ని రోజులుంచారు. కాబట్టి ఇది సాధ్యమే. ఉత్తరం చదివిన వెంటనే నా దగ్గరున్న సిగరెట్లన్నీ కాల్చేశాను. ఆ తర్వాత, అంటే 1948 నుండి ఈ రోజటి వరకూ మళ్లీ నేను సిగరెట్ ముట్టుకోలేదు. మూడు నాలుగు రోజుల తర్వాత మధ్యాహ్న భోజనంలో పందిమాంసం వడ్డించారు. నేను తినలేదు. అంతే - సైతాన్ పందిమాంసం తినలేదనే వార్త జైలంతా పాకింది. మోటు పద్ధతిలోనే అయినా నేను చాలా గర్వపడ్డాను. డెట్రాయిట్, షికాగోల్లోని మా అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లంతా ఇస్లాం మతం తీసుకున్నారు. నన్ను కూడా జైల్లోనే ఈ మతంలోకి మారమని వాళ్లంతా బతిమాలుకున్నారు. చివరిగా మతం మార్చుకున్న రెగినాల్డ్ నన్ను చాలా దగ్గరి నుంచి చూసినవాడు కావటంవల్ల, దీని గురించి నాతో ఎలా మాట్లాడాలో వాడికి తెలుసు. ఈ విషయాలేవీ పట్టించుకోకుండా మా పెద్దక్క ఎల్లా మాత్రం మాస్సచూసెట్స్‌లోని నార్‌ఫోక్ ప్రిజన్ కాలనీకి నన్ను బదిలీ చేయించటానికి ఆపకుండా ప్రయత్నాలు చేస్తూనే వుంది. అదొక ప్రయోగాత్మక పునరావాస జైలు. తగినంత డబ్బు, పరిచయాలు వుంటే అక్కడికి పోవచ్చని, అక్కడ చాలా బాగుంటుందని ఎంతోమంది ఖైదీలు చెప్పారు. నా కోసం ఎల్లా చేసిన ప్రయత్నాలు 1948 చివరికల్లా ఫలించాయి. నార్‌ఫోక్ జైలుకు నన్ను బదిలీచేశారు.

ఎన్నో విషయాల్లో ఈ కాలనీ నిజంగా స్వర్గమే. టాయ్‌లెట్లలో కూడా పుష్కలంగా నీళ్లు. సమృద్ధిగా స్వచ్ఛమైన గాలి. అక్కడ స్వేచ్ఛకు కటకటాలు లేవు. గోడలు మాత్రమే వున్నాయి. అయితే అది నగరంలో లేదు. అక్కడ 24 'ఇళ్లు'న్నాయి. ప్రతి 'ఇంటి'లో యాభైమంది ఖైదీలు వుండేవారు. అంతా కలిపితే ఆ కాలనీలో పన్నెండు వందల మంది ఖైదీలుండేవారు. ప్రతి ఇంటికీ మూడు అంతస్తులుండేవి. అక్కడ ప్రతి ఖైదీకీ ఒక సొంత గది వుండటం మహాప్రసాదం. ఖైదీల్లో పదహైదు శాతం నీగ్రోలే. ప్రతి ఇంటిలో అయిదు నుండి తొమ్మిది మంది నీగ్రోలుండేవారు. అంత ఆహ్లాదకరమైన వాతావరణమున్న జైలు గురించి నేనెప్పుడూ వినలేదు. అక్కడ వుండే ఖైదీల్లో చాలామందికి 'మేధోపరమైన' విషయాలు, సామూహిక చర్చలు, వాదనలు ఇలాంటివి అలవాటు. ఖైదీలకు విద్యా విషయాలు

బోధించటానికి హార్వర్డ్, బోస్టన్ విశ్వవిద్యాలయాల నుండి ఉపాధ్యాయులు వచ్చేవారు. మిగతా జైళ్లతో పోలిస్తే అక్కడ నియమ నిబంధనలు చాలా సరళంగా వుండేవి. ఖైదీలను చూడటానికి వచ్చే వాళ్లు ప్రతిరోజూ రెండు గంటలు గడిపేలా అనుమతించేవారు. వాళ్లెక్కడైనా కూర్చోవచ్చు. అలాంటి అవకాశం కూడా వుండేది.

ఆ కాలనీలో చాలా గొప్ప గ్రంథాలయం వుండేది. పునరావాస కార్యక్రమంలో ఆసక్తి వున్న ఒక కోటీశ్వరుడు నెలకొల్పిన గ్రంథాలయమది. చరిత్ర, మతాలపట్ల కూడా ఆయనకు ప్రత్యేకమైన ఆసక్తి వుండేది. వందలకొద్దీ ఉద్గ్రంథాలతోపాటు కొన్ని అరుదైన గ్రంథాలు కూడా అక్కడ వుండేవి. ఒక ప్రయోజనం కోసం ఏవి అవసరమో అవి మాత్రమే చదవటం నేర్చుకోనంతవరకూ ఏది పడితే అది చదివాను. అంతలో నన్ను చూడటానికి వస్తున్నట్టు రెగినాల్డ్ ఉత్తరం రాశాడు. నా దందారాయుడి జీవితం కళ్లారా చూసినవాడు కావటంవల్ల నన్ను ప్రభావితం చేసేవిధంగా మాట్లాడాడు. 'మాల్కం' అన్ని విషయాలూ తెలిసినవారు ఎవరై వుంటారు? అని అడిగాడు. 'సరే, ఎవడో దేవుడైవుంటాడు' అన్నాడు.

'అన్నీ తెలిసిన మనిషి ఒకరున్నారు'

'ఎవరా మనిషి?'

'దేవుడే ఆ మనిషి. ఆయన అసలు పేరు అల్లా'.

రెగినాల్డ్ ఏమి చెపుతున్నాడో నాకు పూర్తిగా అర్థం కాకపోయినా, నా మంచి కోసం వాడుపడుతున్న తపన చూసి అంతా శ్రద్ధగా విన్నాను. దేవుడు అమెరికాకు వచ్చాడని, తాను మానవుడై ఎలైజా ముహమ్మద్ అనే పేరు పెట్టుకున్నాడనీ, 'ఆయన మన మాదిరే నల్లవాడు' అనీ చెప్పాడు. అంతేకాదు, 'దయ్యం కూడా ఒక మనిషే' అన్నాడు. నాకు అంతా అయోమయంగా వుంది.. 'తెల్లవాడే ఆ దయ్యం' అని వాడు మళ్లీ అందుకున్నాడు. ఆ తర్వాత నా గత చరిత్ర అంతా నా కళ్లముందు తిరిగింది. నేను చిన్నప్పటి నుండీ చూసిన తెల్లవాళ్లంతా నా మనసులో మెదిలారు. 'నీకు నీ గురించే తెలీదు' అని రెగినాల్డ్ వివరించిన తర్వాత జీవితంలో మొదటిసారి సీరియస్‌గా ఆలోచించటం మొదలుపెట్టాను.

డెట్రాయిట్‌లోని మావాళ్ల నుండి నాకు ప్రతిరోజూ రెండు ఉత్తరాలు వస్తుండేవి. వాటిలో ఎలైజా ముహమ్మద్ గురించి, ఆయన 'అల్లా దూత' అనీ రాసేవారు. ఎంతో ముద్రిత సాహిత్యం కూడా పంపేవారు. అవన్నీ శ్రద్ధగా చదివాను. 'నిజమైన విజ్ఞానం' గురించి తెలుసుకున్నాను. తెల్లవాడి చరిత్ర పుస్తకాల్లో అసలు

చరిత్రకు ఎలా 'సున్నం' పూశారో, వందల ఏళ్లపాటు నల్లవాళ్ల మెదళ్లలోకి ఎలా విషం ఎక్కించారో చదివాను. భూగ్రహం మీద పుట్టిన నరజాతికి మూల పురుషుడు ఆఫ్రికా ఖండంలోని నల్లవాడే. వాడు మహాసామ్రాజ్యాలు, నాగరికతలు, సంస్కృతులను నిర్మించిన కాలంలో తెల్లవాడు ఇంకా నాలుగు కాళ్ల మీద సంచరిస్తూ గుహల్లో జీవిస్తున్నాడు. ఇలాంటి తెల్లవాడు ఆఫ్రికాలో ప్రవేశించి నల్లవాళ్లను కొట్టి, హింసించి, చంపి లక్షలాది మందిని నౌకల్లో పశ్చిమానికి తరలించాడు. నల్లవాడిని తన సొంతభాష, మతం, సంస్కృతి అన్నిటికీ దూరం చేశాడు. ఏ విషయంలో అయినా 'సొంతం' అనేదే లేకుండా ఈ భూమ్మీద మిగిలింది అమెరికాలోని నల్లవాడొక్కడే. ఒక తరంలో, అమెరికాలోని నల్లస్త్రీలను బానిస యజమానులైన తెల్ల పురుషులు మానభంగం చేయగా పుట్టిన వారిపై పూర్తిగా తనవన్నీ రుద్ది ఈ మానభంగ మిశ్రమ జాతికి 'నీగ్రో' అనే పేరు పెట్టాడు.

ఈ 'నీగ్రో తన మూలాలనే కోల్పోయాడు. నల్లవాడే నలుపుకు శత్రువయ్యాడు. తెల్లవాడి క్రైస్తవమతం నీగ్రోను ఒక సేవకుడిగా మార్చివేసింది. ఆ తర్వాత నా వ్యక్తిగత జీవితం గురించి కూడా చాలా ఆలోచించాను. నాలో ఏమి జరుగుతుందో అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నాను. ఒక పాపి తానెంతో పాపం చేశాననే అపరాధభావంతో తానున్నట్టు తెలుసుకున్నప్పుడే సత్యం తొందరగా అందుతుంది. ఆ క్రమంలోనే లైబ్రరీలో చాలాసార్లు బైబిల్ చదివాను. నా గత జీవితానికి సంబంధించిన అపరాధభావం సత్యాన్ని ఆమోదించటానికి నన్ను సంసిద్ధుడిని చేసింది. విమర్శ నా ఆత్మతో అనుసంధానం కాలేదు. అందుకే అప్పటికింకా నాలో వున్నది గుడ్డి వెలుతురే. రెగినాల్డ్ వెళ్లిపోయిన తర్వాత నా గదిలో ఊరికే అలా చూస్తూ కూర్చుండిపోయేవాడిని. తిండి కూడా సహించక నీళ్లు మాత్రమే తాగేవాడిని. నా పరిస్థితి చూసి తోటి ఖైదీలు నన్ను డాక్టర్‌కు చూపించారు. ఆయనేం చెప్పాడో నాకు తెలీదు. నాలో ఏదో మార్పు మొదలైంది. ఇంతకుముందే మన లోపల, మన చుట్టూ వున్నదాన్ని ఆమోదించటమే ఏ మనిషినైనా చాలా కష్టపెట్టే చాలా గొప్ప విషయం. ఆ సంఘర్షణే ఇప్పుడు నాలో జరుగుతూ వుంది.

డెట్రాయిట్ నుండి మా అక్క హిల్డా వచ్చింది. ఎలైజా ముహమ్మద్ డెట్రాయిట్‌లో వున్నాడని, మా అన్న విల్‌ఫ్రెడ్ ఇంట్లోనే అతిథిగా వుండబోతున్నాడనీ ఆమె చెప్పింది. ఆయనకు ఉత్తరాలు రాయమని, అయిదు సంవత్సరాలు జైలు

శిక్ష అనుభవించిన ఆయన తెల్లవాడి జైలు గురించి నాకు చెప్పగలడనీ తొందర పెట్టింది. తాను జైలు శిక్ష అనుభవిస్తున్న కాలంలో ఆలనాపాలనా చూసే దిక్కులేకుండా పోయిన తన మొదటి దేవాలయాన్ని (తర్వాతి కాలంలో దీన్ని మసీదు అని పిలిచారు) పునస్సమీకరించటానికి వచ్చాడని ఆమె చెప్పింది. అయితే ఆయన వుంటున్నది షికాగోలో. అక్కడే తన రెండో దేవాలయాన్ని నిర్మించే ప్రయత్నంలో వున్నాడు. 'ఈ భూగోళానికి తెల్లవాడు ఎలా వచ్చాడో వినాలనుందా?' అని హిల్డా ప్రశ్నించింది. ఇదే ఎలైజా ముహమ్మద్ బోధనల్లోకెల్లా ముఖ్యమైన పాఠం. "యాకోబు చరిత్ర'గా పిలువబడిన ఈ 'భూతశాస్త్రం' ప్రతి మతంలోనూ వుందని ఆ తర్వాత తెలుసుకున్నాను. అడుగడుగునా ముస్లింలను కాలరాచిన ఈ యాకోబు చరిత్ర చెప్పటం అయిపోగానే మా అక్కకు ఏమి చెప్పటానికీ నాకు నోట మాట రాలేదు. ఎలైజా ముహమ్మద్ చెప్పిన ఇలాంటి కథలన్నీ తూర్పు దేశాల ముస్లింలను రెచ్చగొట్టటానికేనని నేను తర్వాత తెలుసుకున్నాను.

ఆ తర్వాత మక్కాయాత్రకు పోయినప్పుడు నాకివన్నీ గుర్తొచ్చాయి. అప్పుడు నా కనిపించిందొక్కటే. పాశ్చాత్య ప్రపంచానికి నిజమైన ఇస్లాంను అర్థం చేయించలేకపోవటం తూర్పు దేశాల వైఫల్యం. వాళ్లు మౌనం పాటించటంవల్లే, మతాన్ని అడ్డం పెట్టుకునే ఏ తప్పుడు మనిషైనా మా ప్రజలకు నాయకత్వం వహించి తప్పుదారి పట్టించే పరిస్థితి ఏర్పడింది.

అధ్యాయం - 11

# యా అల్లా...

నేను ఎలైజా ముహమ్మద్ కు ఉత్తరం రాశాను. అప్పుడు ఆయన షికాగోలో వున్నాడు. నా రాత చదవటానికి నాకే రోత పుట్టేది. నా భాష, వ్యాకరణం అసహ్యంగా కాకపోయినా అధ్వాన్నంగా వుండేవి. ఏది ఏమైనా, ఆయన గురించి మా కుటుంబసభ్యుల ద్వారా విన్నానని, నా ఉత్తరంలో తప్పులుంటే క్షమించమనీ రాశాను. ఆయన నాకు జవాబు రాశాడు. అందులో వున్న 'అల్లాదూత' సంతకం నాలో ఎంతో ఉత్తేజాన్ని కలిగించింది. 'నిజమైన విజ్ఞానం' సంపాదించమని చెబుతూ, నల్లఖైదీ అనేవాడు తెల్ల సమాజం చేసిన నేరానికి ప్రతీక అని రాశాడు.

మా కుటుంబసభ్యులు 'అల్లావైపు తిరుగు... తూర్పును ప్రార్థించు' అని రాశారు. అంతవరకు నా జీవితంలో నేనెప్పుడూ ఎదుర్కోని కఠిన పరీక్ష - ప్రార్థించటం. మోకాళ్లు వంచి అలా కూర్చోవటానికి నాకు వారం రోజులు పట్టింది. దొంగతనానికి పోయి, ఆ ఇంటి తాళం తీసేటప్పుడు తప్ప నా జీవితంలో ఎప్పుడూ నేను మోకాళ్లు వంచలేదు. సిగ్గుపడుతూ, ఇబ్బంది పడుతూనే ప్రార్థించటం నేర్చుకున్నాను. మోకాళ్లు వంచి, తన తప్పు ఒప్పుకొని, క్షమించమని దేవుడిని అర్థించటం ఈ ప్రపంచంలో ఏ చెడుకైనా సరే అత్యంత కఠిన పరీక్ష. నాలో చెడు ఆలోచనలు వాటంతట అవే తొలగిపోవటం నాకే చాలా ఆశ్చర్యం కలిగించింది. ఎలైజా ముహమ్మద్‌కు, మావాళ్లకు ప్రతి రోజూ ఉత్తరాలు రాసేవాడిని. తిరిగి వాళ్లు రాసే ఉత్తరాల్లో ఏదో ఒక కొత్త విషయం వుండేది. తగినంత సమయం వుండటంతో, నేరప్రపంచంలో నాకు తెలిసిన వ్యక్తులందరికీ బార్లు, క్లబ్బుల చిరునామాలకు ఉత్తరాలు రాశాను. వాళ్లెవరికీ చదువురాదని తెలిసినా రాయకుండా వుండలేక పోయాను. నా ఉత్తరాలన్నీ జైలు అధికారులు చదువుతున్నారని నాకు తెలుసు. అన్నిట్లోనూ 'తెల్లవాడే దయ్యం' అని రాశాను. అయితే నా మనసులోని భావాలన్నీ రాయటం నాకు కష్టంగా అనిపించింది. ముఖ్యంగా యాసతో రాయటం. మంచి ఇంగ్లీషులో ఉత్తరం రాయటానికి నాకు సొంతవిద్య అవసరమైంది. ఏ పుస్తకం పట్టుకున్నా ఒక్క వాక్యం పూర్తిగా చదివి పదాలను అర్థం చేసుకోవటం చాలా కష్టంగా వుండేది. ఆ ప్రకారం కష్టపడితే చివరికి చాలా కొంచెమే అర్థమయ్యేది.

కొత్త పదాలు నేర్చుకోవటం కోసం నిఘంటువు తీసుకున్నాను. రాత కూడా

మెరుగుపరుచుకోవాలనుకున్నాను. సొట్టలు పోకుండా కనీసం ఒక్క వాక్యం కూడా రాయలేకపోయేవాడిని. అందుకే, నిఘంటువులోని ప్రతి పదం, దాని అర్థం కాగితం మీద రాసేవాడిని. అన్ని పదాలు వాడుకలో వున్నాయనే విషయమే అసలు నాకు అర్థం కాలేదు. ఏ పదాలు నేర్చుకోవాలో కూడా నాకు తెలీదు. అందుకే, ప్రతి పేజీని కాపీ చేయటం, తర్వాత నేను రాసింది గట్టిగా చదవటం మొదలుపెట్టాను. అలా నిఘంటువులో 'ఏ'తో మొదలయ్యే పదాలన్నీ కాపీ చేశాను. దాంతో నాకు ఉత్సాహం ఎక్కువై తర్వాతి పేజీ మొదలుపెట్టాను. పదాలకు అర్థాలు రాసుకునే క్రమంలో రకరకాల ప్రజలు, ప్రదేశాలు, చారిత్రక సంఘటనల గురించి తెలుసుకున్నాను. ఇలాగే నిఘంటువంతా కాపీ చేశాను. దాంతో నా చేతి రాత బాగైపోయింది. పుస్తకాల పట్ల ఇష్టం కూడా పెరిగిపోయింది. ఆ జైలు నుండి బైట పడేవరకు, నేను అసలు జైల్లో వున్నాననే స్పృహ కూడా లేకుండా ఏ మాత్రం సమయం దొరికినా పుస్తకాలు చదవటంలోనే మునిగిపోయాను.

నాతో పాటు చాలామంది ఖైదీలకు పుస్తకాలు చదివే అలవాటు బాగా వుండేది. కొంతమంది ఖైదీలు నడిచే విజ్ఞానసర్వస్వాల్లా వుండేవారు. పుస్తకాలను సొంతంగా చదివి అర్థం చేసుకునే శక్తి వచ్చిన తర్వాత నా కళ్ళ ముందు ఒక ప్రపంచమే తెరుచుకుంది. ఒంటరిగా నా గదిలో చదువుకోటానికే ఇష్టపడ్డాను. రాత్రి పదిగంటలకు లైట్ ఆర్పేసిన తర్వాత బైట వుండే లైటు వెలుతురులోనే కళ్లు చించుకొని గార్డులకు తెలీకుండా తెల్లవార్లూ చదివేవాడిని.

ఎలైజా ముహమ్మద్ చరిత్రకు 'సున్నం' పూయటం గురించే ఎక్కువగా చెప్పే వాడు. 'తెల్లవాడు రాసిన చరిత్ర పుస్తకాల నుండి నల్లవాడు బైటికి పోయాడు' . ఆయన చెప్పిన ఈ మాట నా మనసులో నాటుకొనిపోయింది. అందుకే నల్లవాళ్ల చరిత్ర తెలుసుకోవటం మొదలుపెట్టాను. విల్‌డ్యూరాంట్ రాసిన 'స్టోరీ ఆఫ్ సివిలైజేషన్', హెచ్‌జివెల్స్ 'ఔట్‌లైన్ ఆఫ్ హిస్టరీ, డు బోయిస్, 'సోల్స్ ఆఫ్ బ్లాక్ ఫోక్' చదివాను. కార్టర్ జి. వుడ్సన్ 'నీగ్రో హిస్టరీ' అనే పుస్తకం అమెరికాకు బానిసలుగా తీసుకొని రాకముందు నల్లవాళ్ళ సామ్రాజ్యవైభవం చూపి నా కళ్లు తెరిపించింది. జె.ఎ. రోజర్స్ 'సెక్స్ అండ్ రేస్' మూడు సంపుటాలూ క్రీస్తు కాలానికి పూర్వం జరిగిన జాతి మిశ్రమం గురించి చెపుతాయి. ఇంకా 'ఏసోప్ కథలు', ఈజిప్టు ఫారోలు, కాప్టిక్ క్రిస్టియన్ సామ్రాజ్యాలు, ప్రాచీన నాగరికతలకు నిలయాలైన ఇథియోపియా, చైనాల గురించి కూడా చదివాను.

తెల్లవాడు ఎలా సృష్టించబడ్డాడు అనే దాని గురించి ఎలైజా ముహమ్మద్ చెప్పిన మాటలు నన్ను గ్రెగర్ మెండల్ 'ఫైండింగ్స్ ఇన్ జెనటిక్స్' అనే పుస్తకం చదివేలా చేశాయి. (నిఘంటువులో 'జి' సెక్షన్‌లో 'జెనటిక్స్' అనే పదానికి అర్థం అంతకు ముందే నాకు తెలుసు). నీవు అధ్యయనం నల్లవాడితో మొదలు పెడితే తెల్లవాడు పుడతాడు. తెల్లవాడితో మొదలుపెడితే నల్లవాడు ఎప్పటికీ పుట్టడు. ఎందుకంటే తెల్లక్రోమోజోమ్‌కు 'పెత్తనమెక్కువ'. ఈ మధ్యే 'న్యూయార్క్‌టైమ్స్' లో టాయన్‌బీ కూడా దీనిపై రాశాడు. యూరోపియన్ భౌగోళిక ప్రాంతంలో ఆసియా ద్వీపకల్పంగా మాత్రమే వుందని, అసలు 'యూరప్' అని ప్రత్యేకంగా ఏదీ లేదనీ రాశాడు. (అయితే, చరిత్రలేని ఏకైక ఖండం ఆఫ్రికా అని ఆయన కూడా తెల్లచరిత్రకారులకు వంతపాడాడు). ఒక పాఠకుడిగా, బానిసలు అనుభవించిన భయంకరమైన బాధలు నన్ను తేరుకోలేకుండా చేశాయి. బానిసలుగా అమెరికాలో కాలుమోపిన తర్వాత నల్లవాళ్ళ బాధల గురించి ఫ్రెడరిక్ ఓమ్‌స్టెడ్ లాంటి వాళ్ళ రచనల వల్ల తెలుసుకొన్నాను. ప్రిజన్‌కాలనీ గ్రంథాలయంలో కూడా 'అబాలిషనిస్ట్ యాంటీ స్లేవరీ సొసైటీ ఆఫ్ న్యూ ఇంగ్లాండ్' వేసిన కరపత్రాల బొండు వుంది. తెల్లవాడు చేసిన అన్ని రకాల ఘోరాలూ వాటిలో వున్నాయి. బానిసల యజమానికి దేవుడి భయంపెట్టిన బానిసల మతబోధకుడు నాట్ టర్నర్ గురించి కూడా చదివాను. ఆయన నల్లవాళ్ళ స్వేచ్ఛ కోసం గాల్లోదీపంపెట్టి అహింసాపద్ధతిలో పాటుపడలేదు. 1831లో టర్నర్, ఏడుమంది బానిసలను వెంటబెట్టుకొని, ఒకరాత్రి వర్జీనియాలోని తన యజమాని ఇంటితో మొదలుపెట్టి, వరుసగా చంపుతూపోయాడు. తెల్లవారేసరికి యాభై ఏడుమంది తెల్లవాళ్లు చచ్చిపడివున్నారు. ఆ తర్వాత డెబ్బైమంది బానిసలు అతడి వెంట వున్నారు. తెల్లవాళ్ళు ప్రాణభయంతో వణికిపోయారు. టర్నర్‌ను పట్టుకొని ఉరితీయటానికి ఒక చిన్నపాటి సైన్యమే కావాల్సి వచ్చింది.

వివిధ దేశాల చరిత్రల్లో కూడా తెల్లదయ్యాలు సాగించిన దోపిడీ, మారణహోమాల గురించి తెలుసుకున్న తర్వాత నా దృష్టి మరింత విశాలమైనంది. విల్‌డ్యూరాంట్ 'దిస్టోరీ ఆఫ్ ఓరియంటల్ సివిలైజేషన్స్', భారతదేశం నుంచి బ్రిటిష్‌వాళ్లను తరిమివేసిన మహాత్మాగాంధీ పోరాటాల గురించి కూడా చదివాను. పదహారవ శతాబ్దంలో 'క్రిస్టియన్ వ్యాపారి' ఆసియా, ఆఫ్రికా సామ్రాజ్యాలను కొల్లగొట్టి అధికారం చెలాయించిన తీరు తెలుసుకున్నాను.

ఈ మధ్య, ఐక్యరాజ్య సమితిలో అమెరికా రాయబారిగా వుంటున్న అడ్లాయ్

స్టీవెన్సన్ సమితిలో 'రంగు' ఆధారంగా ఏర్పడుతున్న పొత్తుల గురించి మాట్లాడుతూ, అక్కడ 'తోలు' బొమ్మలాట ఆడుతున్నారని వ్యాఖ్యానించాడు. ప్రపంచచరిత్రలో తెల్లవాడికన్నా అసహ్యంగా 'తోలు' బొమ్మలాట ఆడినవాడెవాడు? పుస్తకాలు చదివి నేను తెలుసుకున్న విషయాల గురించి ఎలైజా ముహమ్మద్ కు ప్రతిరోజా ఉత్తరం రాసేవాడిని.

తత్వశాస్త్రం కూడా మొదల్లుపెట్టాను. తూర్పు, పశ్చిమ తత్త్వవేత్తల రచనలు ఎక్కువగా చదివాను. పాశ్చాత్య తత్త్వశాస్త్రం చాలా వరకు తూర్పు ఆలోచనాపరుల నుంచి అరువు తెచ్చుకున్నదే అనే అభిప్రాయానికి వచ్చాను. పుస్తకాలు నా జీవితంలో అంతర్భాగమయ్యాయి. అవి నాకు మానసికంగా జవసత్వాలనిచ్చాయి. మొన్న లండన్‌కు పోయివస్తున్నప్పుడు కూడా యునైటెడ్ నేషన్స్, ప్రపంచంలో అణగారిన మైనార్టీలకు మానవహక్కులను బీమా చేసిన డాక్యుమెంట్ చదువుతున్నాను. 'పౌరహక్కులు' అనే రెండు పదాలు వల్లించటం వల్ల ఒక నల్లవాడు తననుతాను కేవలం అమెరికా అంతర్గత సమస్యగానే అర్థం చేసుకుంటాడు. ముందు 'మానవ' హక్కులు సాధించకుండా 'పౌరహక్కులు' ఎలా సాధిస్తాడు? ప్రపంచ ప్రజల్లో భాగంగా తన గురించి, మానవ హక్కుల గురించి ఆలోచించటం నల్లవాడు నేర్చుకోవాలి. ఆ తర్వాత షోపెనార్, కాంట్, నీషేల రచనలు కూడా చదివాను. వీళ్ల ముగ్గురి మీదా నాకు గౌరవంలేదు. వీళ్ల సిద్ధాంతాలను పునాదిగా చేసుకునే ఫాసిస్ట్, నాజీ తత్త్వశాస్త్రం పుట్టుకొచ్చింది. ఈ ముగ్గురూ అంతగా ముఖ్యంకాని విషయాల గురించి వాదించటంలోనే జీవితంలో చాలాకాలాన్ని గడిపినందుకు వీళ్ళపట్ల నాకు గౌరవం లేదు. నాకు తెలిసి, పాశ్చాత్య తత్త్వచింతనాధారకు ఒకవైపు దారిమూసుకొనిపోయింది. ఆ మాత్రమున్న ఇరుకుదారిలో అది ఎన్నిమోసాలు చేసినా ఆఫ్రికాకు సంబంధించిన నిజాలు వెలుగు చూస్తూనే వున్నాయి. ఇలాంటి విషయాలపై నీగ్రోకాలేజీల్లో నేను ఉపన్యాసం ఇచ్చినప్పుడు అక్కడి నల్లప్రొఫెసర్లు, ఉపాధ్యాయులు కూడా నన్ను 'నల్లఉన్మాది' అని పిలిచే తెల్లవాడినే సమర్థించారు.

నా జీవితాన్ని సమూలంగా మార్చివేసిన రెండు అనుభవాల గురించి చెప్పాలి. ఒకటి, నేను ప్రిజన్‌కాలనీలో వుండగా నల్లజాతి చరిత్ర తెలుసుకోవటం. రెండు, అక్కడ ప్రతివారమూ జరిగే చర్చాకార్యక్రమంలో ఇస్లాం గురించి అందరిమధ్య నా ఆలోచనలు పెట్టటం. ముహమ్మద్ బోధనలు తెలుసుకున్న తర్వాత జైల్లో ప్రతినల్లవాడినీ మార్చే ప్రయత్నం చేసేవాడిని. తోటి నల్లఖైదీలకు నల్లజాతి చరిత్ర

గురించి చెప్పినప్పుడు వాళ్లు నమ్మలేకపోయేవారు. అమెరికా నల్లవాళ్ళ పూర్వీకుల తెగలైన మాండింగోస్, ఉలూఫ్, సీరర్, ఫూలా, ఫాంటి, అషంటి మొదలైనవాటిని పరిచయం చేసేవాడిని. వాళ్లతో 'తెల్లవాడే దయ్యం' అని చెప్పినప్పుడు అంతా ఆశ్చర్యంతో నోళ్ళువెళ్లబెట్టారు. తర్వాత నెమ్మదిగా ఆలోచించటం మొదలు పెట్టారు. అమెరికా జైళ్ల వ్యవస్థ ఈరోజు ఎదుర్కొంటున్న పెద్ద సమస్య ఇదే. నల్ల క్రైస్తవులు జైళ్లలోనే ఎక్కువగా ముస్లిములుగా మారుతున్నారు. నీగ్రోలందరిలోకీ నల్లనేరస్తుడే 'తెల్లవాడేదయ్యం' అనే మాట నమ్మటానికి సిద్ధంగా వుంటాడు. పుస్తక పఠనం వల్ల నా మనసు అణిచిపెట్టిన ఆవిరిలాగా వుండేది. తెల్లవాడి గురించి తెల్లవాడి ముఖంమీదే నేను అనుకుంటున్నది చెప్పటం మొదలుపెట్టాను. అదే వైఖరి నేను కాలేజీలు, విశ్వవిద్యాలయాలు, రేడియో, టెలివిజన్, ఈజిప్టు, ఆఫ్రికా, ఇంగ్లాండ్ దేశాల్లో కూడా ఉపన్యాసాలిచ్చేంతగా పెరిగింది.

జైలు చర్చలు చాలా వాడిగావేడిగా జరిగేవి. బైబిల్‌ను ఇంగ్లీషులోకి అనువాదం చేసిన కింగ్‌జేమ్స్ భాష, షేక్స్పియర్ భాష ఒక్కటేననీ ఫ్రాన్సిస్ బేకన్, షేక్స్పియర్ ఒక్కరేననే అభిప్రాయాల మీద ఒకసారి చర్చ జరిగింది. రెగినాల్డ్ నన్ను చూడటానికి వచ్చినప్పుడు, మనకు మరో ఆధారం దొరికిందని చెప్పాను. హార్వర్డ్ క్లాసిక్స్ నుండి నలభై మూడో సంపుటం తీసి అందులో మిల్టన్ 'ప్యారడైజ్‌లాస్ట్' చదివాను. దయ్యాన్ని స్వర్గం నుండి వెళ్లగొట్టిన తర్వాత ఆ స్థానం తిరిగి సంపాదించుకోవటానికి పోపులు, చార్లమైన్, రిచర్డ్ లాంటి ఇతర వీరులుండే యూరోపియన్ శక్తులను అది ఉపయోగిస్తుంది. యూరోపియన్లను చైతన్యవంతులను చేసి వాళ్లకు నాయకత్వం వహించింది దయ్యమే లేదా దానికి ప్రతిరూపమైన మానవుడేనని నేను దీనిపై వ్యాఖ్యానించాను. కాబట్టి మిల్టన్, ఎలైజా ముహమ్మద్ ఇద్దరూ ఒకే విషయమే చెపుతున్నారు.

ఉన్నట్టుండి ఎలైజా ముహమ్మద్ గురించి రెగినాల్డ్ చెడ్డగా మాట్లాడటం మొదలుపెట్టడాన్ని నేను నమ్మలేకపోయాను. వాడు ఏమి చెప్పాడు అనే దానికన్నా ఎలా చెప్పాడన్నదే ఎక్కువగా పనిచేసి గందరగోళానికి గురయ్యాను. నాకు అత్యంత నమ్మకస్తుడు, నేషన్ ఆఫ్ ఇస్లాంకు నన్ను పరిచయంచేసిన వాడే అలా మాట్లాడటాన్ని నమ్మలేకపోయాను. అయితే, నా జీవితంలో ఇస్లామే నాకు అన్నిటికన్నా ఎక్కువ. రెగినాల్డ్ అనైతికంగా ప్రవర్తించినందుకు ముహమ్మద్ వాడిని బహిష్కరించాడు. ఈ విషయమై ఆరోజే ముహమ్మద్‌కు రాసిన ఉత్తరంలో వాడికీ నాకూ మధ్య గల

సంబంధం ఎలాంటిదో వివరించాను. ఆ రాత్రంతా అల్లాను ప్రార్థిస్తూనే గడిపాను. నా గందరగోళం నుండి నన్ను విముక్తుడిని చెయ్యమని ప్రార్థించాను. మరుసటిరోజు రాత్రి నేను ఇంకా పరుపుమీద వుండగానే నా పక్కనే కుర్చీలో కూర్చునివున్న వ్యక్తిని అకస్మాత్తుగా చూశాను. నేను అతడిని స్పష్టంగా చూశాను. అతడిని ముఖంలోకే చూశాను. నాకేమీ భయం కాలేదు. నేను కదల్లేదు, మాట్లాడలేదు. అతనూ ఏమీ మాట్లాడలేదు. అతను యూరోపియన్ మాత్రం కాదు. అతనెవరో నాకు తెలీదు. ఎలా వచ్చాడో అలాగే వెళ్లిపోయాడు.

రెగినాల్డ్ గురించి ముహమ్మద్ నుండి నాకు బదులు వచ్చింది. 'నీవు ఒకసారి సత్యాన్ని నమ్మి, ఇప్పుడు దాన్ని శంకించటం మొదలుపెడుతున్నావు. నీవు అన్నిటికన్నా ముందు సత్యాన్ని నమ్మలేదు. బలహీనమైన నీ మనసుకాక ఏది సత్యాన్ని శంకించేలా చేయగలదు'? అని రాశాడు. అది నా మనసుకు హత్తుకుంది. ఇంక రెగినాల్డ్దే తప్పు అనే నిర్ణయానికి వచ్చేశాను. ఆ తర్వాత వాడు వస్తూపోతూనే వుండేవాడు. నా రక్తం పంచుకొని పుట్టినవాడు కాబట్టి వాడు చెప్పేది విని ఊరుకునేవాడిని. రెగినాల్డ్ను అల్లా దండిస్తాడని ముహమ్మద్ చెప్పాడు. త్వరలోనే నేను దాన్ని చూశాను. వాడు డెట్రాయిట్లో మా వాళ్లతోనే వుంటున్నట్టు సమాచారం అందింది. కొన్ని వారాల తర్వాత ఎల్లా నన్ను చూడటానికి వచ్చినప్పుడు, వాడు రాక్స్బరీలోని తన ఇంట్లోనే నిద్ర పోతున్నాడని చెప్పింది. ఒక రోజు రాత్రి బాగా అలసిపోయి వచ్చాడని, డెట్రాయిట్ నుండి నడుచుకుంటూ వచ్చినట్టు చెప్పాడని ఆమె నాతో చెప్పింది. జైల్లో నేను ముస్లింగా మారినప్పటి నుండీ గడ్డం పెంచుతున్నాను. రెగినాల్డ్ నన్ను చూడటానికి వచ్చి చాలా భయపడ్డాడు. నా గడ్డంలోని ప్రతివెంట్రుకా పాములా కనిపిస్తోందని చెప్పాడు. ఆ తర్వాత వాడు తానే 'అల్లాదూత' నని రాక్స్బరీ వీధుల్లో తిరుగుతూ ,జనాలందరికీ తనకు దివ్యశక్తులున్నాయని, చెప్పుకుంటూ తిరిగాడు. తర్వాత తానే అల్లాననీ చివరికి అల్లాకంటే తానే గొప్ప అని చెప్పుకునే స్థితికి పోయాడు. వాడిని ప్రస్తుతం ఒక సంస్థకు అప్పగించారు.

నన్ను రక్షించటానికే ఇదంతా జరిగిందని ఇప్పుడు నాకనిపిస్తుంది. ముహమ్మద్ కూడా చాలా అనైతికమైన మనిషేనని ఆరోపణలు వచ్చిన తర్వాత, రెగినాల్డ్ అనుభవించింది దివ్యదండన కాదనే నమ్మాను. ముహమ్మద్ కోసం కుటుంబ సభ్యులందరూ వాడిని తిరస్కరించటంతో ఆ బాధను భరించలేకే వాడు ఆయన పట్ల పిచ్చెత్తినట్టు ప్రవర్తించాడు.

నార్‌ఫోక్ జైల్లో నేనుచేసిన చర్చలు, వాదనలు, రాసిన ఉత్తరాలు నన్ను మళ్లీ చార్లెస్‌టౌన్ జైల్లో పడేశాయి. జైల్లో నేను చేస్తున్న మతవ్యాప్తికి భయపడైనా నన్ను బైటికి పంపిస్తారనుకున్నాను. ఈ కటకటాల జైల్లో ఒక రోజు బైబిల్ క్లాసుకు నీగ్రోలందరూ హాజరయ్యారు. నేనూ వెళ్లాను. అక్కడ 'తెల్లదయ్యం' పాఠం చెపుతోంది. పాల్ గురించి ప్రస్తావనవస్తే, ఆయన రంగు ఏది? అని అడిగాను. 'అతను నల్లవాడు. ఎందుకంటే అతనొక హీబ్రూ-అసలైన హీబ్రూలంతా నల్లవాళ్ళే కదూ!' అన్నాను. ఆ ఉపాధ్యాయుడి ముఖం జేవురించింది. ఇంకా అడిగాను. 'జీసస్‌ది ఏ రంగు... ఆయన కూడా హీబ్రూనే కదా?' ఈ ప్రశ్న వినేసరికి అక్కడున్న వాళ్లంతా జీసస్ నల్లవాడు కావటమనే మాటను జీర్ణించుకోలేకపోయారు. ఆ ఉపాధ్యాయుడు 'జీసస్ గోధుమ రంగువాడు' అన్నాడు. అక్కడితో నేను కూడా రాజీపడ్డాను. ఆ రాత్రంతా ఖైదీలు దీనిపైనే తర్జనభర్జనలు జరిపారు. నల్లఖైదీతో ఏమాత్రం మాట్లాడే అవకాశం వచ్చినా ఈ ప్రశ్న వేసేవాడిని. 'ఎలైజా ముహమ్మద్ అనే మనిషి గురించి ఎప్పుడైనా విన్నావా?'

అధ్యాయం - 12

# రక్షకుడు

మెసాచుసెట్స్ పెరోల్‌బోర్డు నన్ను విడుదల చేయాలని తీర్మానించిందని 1952 వసంతకాలంలో చాలా సంతోషంగా మావాళ్లకు, ముహమ్మద్‌కు ఉత్తరాలు రాశాను. ప్రముఖ వ్యక్తి ఎవరైనా సంతకం చేస్తే షార్టీ కూడా పెరోల్‌మీద విడుదల కావటానికి సిద్ధంగా ఉన్నాడు. నేను విడుదలైన వెంటనే జైలు వాసన పోవటం కోసం ఆవిరి స్నానం చేసి ఎల్లా దగ్గరికి పోయాను. ఆమె కూడా నేను డెట్రాయిట్‌లో వుంటే పోలీసులెవరూ గుర్తించలేరని చెప్పటంతో ఆ రాత్రి అక్కడ వుండి మరుసటిరోజే బయల్దేరాను. మా కుటుంబసభ్యులంతా ఎల్లాను కూడా ఇస్లాం మతం తీసుకొమ్మని శతవిధాలుగా ప్రయత్నించారు. కానీ ఆమె స్థిరచిత్తాన్ని ఎవరూ మార్చలేకపోయారు. ఎవరికి ఎట్లా వుండాలనిపిస్తే అట్లా వుంటారని ఆమె నాతో చెప్పింది.

ముందు ముందు నా జీవితం ఏ విధంగా మారినా అందుకు నేను సిద్ధంగానే వున్నాను. అందుకే, హిల్డా ఇచ్చిన డబ్బుతో కళ్లద్దాలు, సూట్‌కేసు, చేతి గడియారం కొన్నాను. ఈ మూడు వస్తువులనే నా జీవితంలో అన్నిటికన్నా ఎక్కువగా ఉపయోగించాను. నార్‌ఫోక్ జైల్లో వుండగా గుడ్డివెలుతురులో తెల్లవార్లూ పుస్తకాలు చదవటం వల్ల నాకు చత్వారం వచ్చింది. అందువల్ల కళ్లద్దాలు అవసరం. నేను విపరీతంగా ప్రయాణాలు చేస్తాను కాబట్టి నా కోసం నా భార్య సిద్ధంగా వుంచిన సూట్‌కేసుల్లోంచి ఒకటి తీసికొనిపోయేవాడిని. కాబట్టి సూట్‌కేసు తీసుకున్నాను. నా కంటే కాలస్పృహ వున్న మనిషిని మీరు చూసివుండరు. నా చేతిగడియారం ఆధారంగానే నేను బతుకుతాను. కారు నడుపుతున్నపుడు కూడా నేను స్పీడోమీటర్‌నుబట్టికాక నా గడియారాన్ని బట్టి నడుపుతాను. దూరం కన్నా నాకు కాలం ముఖ్యం.

డెట్రాయిట్‌కుపోయే బస్సెక్కాను. అక్కడ నల్లవాడలో వుండే యూదుల ఫర్నీచర్‌స్టోర్‌లో మా అన్న విల్‌ఫ్రెడ్ సిఫారసుతో సేల్స్‌మన్‌గా పనికి కుదిరాను. అక్కడ 'చిరుతపులి' బెడ్‌షీట్లు, 'పులిచర్మం' దుప్పట్లు - ఇలాంటి అనుకరణే కనిపించేది. ఇది చెప్తుంటే 1964 అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో 'జెట్' మ్యాగజైన్‌లో సెనేటర్ బ్యారీ గోల్డ్‌వాటర్ చెప్పిన జోక్ గుర్తొస్తోంది. తెల్లవాడిని, నీగ్రోను,

యూదును ఒక్కొక్క కోరిక కోరుకోమన్నారట. తెల్లవాడు ఆదాయపత్రాలను కోరుకుంటే, నల్లవాడు చాలా డబ్బుకావాలని కోరుకున్నాడట, యూదు మాత్రం తనకు గిల్టునగలు, 'ఆ రంగులపిల్లవాడి చిరునామా' కావాలని కోరుకున్నాడట.

'విల్‌ఫ్రెడ్ నన్ను తనింట్లోనే వుండమని అడిగితే సంతోషంగా ఒప్పుకున్నాను. జైలు నుండి వచ్చిన నాకు ఇల్లు, కుటుంబ వాతావరణం దొరకటంతో బాధనంతా మరిచిపోయాను. ముస్లింల ఆచారాలన్నీ మా అన్న నాకు వివరించాడు. అందరితోపాటే నేనూ ప్రార్థన చేసేవాడిని. 'ముస్లింలు సూర్యుడిని పూజించరు. ముస్లిం ప్రపంచంలోని మనుషులంతా ఒక్కటిగా వుండాలని తూర్పుదిశకు తిరిగి ప్రార్థిస్తారు,' ఇస్లాం మా అందరికీ నలుపును, నల్లవాళ్లను, నల్ల చరిత్ర, సంస్కృతులను ప్రేమించటం నేర్పింది. చిన్నా పెద్దా తేడా లేకుండా అంతా ఏ పని చేసినా మనస్ఫూర్తిగా కలిసి చేసేవారు. డెట్రాయిట్‌లోని ఒకటో దేవాలయం మినిస్టర్ లెమ్యూల్‌హసన్. ఆ దేవాలయంలో అమెరికా జాతీయపతాకం కింద 'బానిసత్వం', 'బాధ', 'మరణం' అనే మాటలున్నాయి. 'క్రిస్టియానిటీ' అనే పదం పక్క శిలువగుర్తు – దానికింద, చెట్టుకు ఉరిపోసుకున్న ఒక నల్లవాడి పెయింటింగ్ వున్నాయి. మరోపక్క ఎరుపురురంగు నేపథ్యంలో నెలవంక, నక్షత్రం వుండే ముస్లిం పతాకంపైన, 'ఇస్లాం' : 'స్వేచ్ఛ, న్యాయం, సమానత్వం' అనే పదాలున్నాయి– వాటికింద 'అంతిమయుద్ధానికి ఎవరు ప్రాణం పోస్తారు?' అనే వాక్యం వుంది.

ఎలైజా ముహమ్మద్ బోధనల గురించి మినిస్టర్ లెమ్యూల్ అక్కడున్న బ్లాక్‌బోర్డును ఉపయోగించి గంటకు పైగా ఉపన్యాసమిచ్చాడు. నేను ప్రతి అక్షరాన్నీ శ్రద్ధగా విన్నాను. ఆ చిన్న దేవాలయంలో కొన్ని సీట్లు ఖాళీగా వుండేవి. నల్లవాడ మధ్యలో వుంటూ చుట్టూవున్న నీగ్రోలను విడిచిపెట్టటం నాకు అసహనంగా వుండేది.

ఈ రోజు నాకు ప్రపంచ ప్రసిద్ధులైన వ్యక్తులతో, కొంతమంది దేశ నాయకులతో తీరిక లేకపోవచ్చు : కానీ, 1952లో లేబర్‌డే ముందు రోజు ఆదివారం కోసం, నేను ఎంతగానో ఎదురుచూశాను. షికాగోలో ముహమ్మద్ బోధనలు వినటానికి డెట్రాయిట్ నుండి పది వాహనాల్లో ముస్లింలు బయలుదేరుతున్నారు. షికాగో చేరగానే, అంతమంది ముస్లింలు ఒక్కచోట చేరి ఒకరినొకరు అభినందించు కోవటం చూసి నా ఒళ్లు పులకించింది. అయితే, ముహమ్మద్ భౌతిక రూపం గురించి నాకు ఏ మాత్రమూ ఊహలేదు. రెండో దేవాలయం వెనుక నుండి ఆయన వేదిక మీదికి వచ్చాడు. సన్నగా, సున్నితంగా, హుందాగా వుండే ఆ గోధుమరంగు

మనిషి. చుట్టూ భద్రతావలయం వుంది. వాళ్లతో పోలిస్తే ఆయన చాలా పొట్టిగా కనిపించాడు.

నల్ల ప్రజల కోసం తన జీవితాన్ని ధారపోసిన ఆ గొప్ప మనిషిని కన్నార్పకుండా చూశాను. అమెరికాలో అష్టకష్టాలూ పడుతున్న నల్లవాళ్ల గురించి ఆయన ఉపన్యసించాడు. చివరిలో, కొద్దిసేపు ఆగి నా పేరు పిలిచాడు. అది నాకు విద్యుద్ఘాతంలా తగిలింది. నన్ను నిలబడమని చెప్పాడు. జైలు నుండి నేను ఆయనతో కొనసాగించిన సంబంధం గురించి క్లుప్తంగా వివరించి, ఇక మీద మాల్కం నమ్మకంగా వుంటాడని ఆశిస్తున్నాను అని చెప్పాడు. నా నమ్మకానికి ఎన్ని గడ్డు పరీక్షలెదురైనా, అల్లా దయవల్ల నేనెప్పుడూ ఇస్లాంపట్ల నమ్మకం కోల్పోలేదు. నాకూ ముహమ్మద్‌కూ మధ్య సంక్షోభం తలెత్తిన కాలంలోనే ఆయనను నేను సంపూర్ణంగా నమ్ముతున్నానని చెప్పాను. కేవలం అసూయ కారణంగా ఈ రోజు మేమిద్దరం విడిపోయాం. ఈ ప్రపంచంలో అందరికన్నా ఎక్కువగా ఆయన్ను నేను నమ్మాను.

ఆయన అప్పుడే షికాగోలోని మరో పెద్ద ఇంటికి మారాడు. ఆ రాత్రి డిన్నర్‌కు నన్నూ ఆహ్వానించాడు. డెట్రాయిట్ దేవాలయానికి వేల సంఖ్యలో నల్లవాళ్లు రావాలంటే ఏమి చెయ్యాలి? అని అడిగాను. దానికాయన 'యువకుల వెంటపడు. వాళ్లు వచ్చేట్టు చేస్తే సిగ్గుతో పెద్దవాళ్లు కూడా వస్తారు' అన్నాడు. ఆ సలహాను పాటించాలని నిర్ణయించుకున్నాను. డెట్రాయిట్‌కు తిరిగి వెళ్లగానే 'చేపలవేట' మొదలుపెట్టాను. ఈ కాలంలోనే నాకు 'x' దక్కింది. ఒక ముస్లింకు తెలీని తన నిజమైన ఆఫ్రికన్ కుటుంబం పేరుకు ప్రతీక ఈ 'x'. ప్రాణం పోయేవరకూ దీన్ని విడిచిపెట్టరాదని ముహమ్మద్ మాకు బోధించాడు. కొన్ని నెలలు నల్లవాడలో తీవ్రంగా శ్రమించాక సభ్యుల సంఖ్య మూడు రెట్లు పెరిగింది. ఆయనకు ఎంతో సంతోషమై స్వయంగా దేవాలయాన్ని సందర్శించాడు. ఈసారి షికాగోకు ఇరవై అయిదు వాహనాల్లో జనాన్ని తరలించటం నాకు బాగా గుర్తుంది. ఆయనకు నా శక్తి సామర్థ్యాలపట్ల ఆసక్తి పెరిగింది.

నేను ఆయన్ను పూజించాను.

మతవ్యాప్తి బాగా జరగాలని, మిగతా నగరాల్లో కూడా దేవాలయాలు స్థాపించాలని ముహమ్మద్ చెప్పాడు. డెట్రాయిట్‌కు వచ్చిన తర్వాత, నల్లవాళ్ల నుద్దేశించి ఈసారి నన్ను ప్రసంగించమని లెమ్యూల్ చెప్పాడు. తడబడుతూనే క్రిస్టియానిటీ, బానిసల బాధలు అనే అంశాలపై ప్రసంగించాను. 1953 వేసవిలో

ఈ ఒకటో దేవాలయానికి నేను అసిస్టెంట్ మినిస్టర్ అయ్యాను. ప్రతిరోజూ ఉద్యోగం నుండి రాగానే, నీగ్రో వీధుల్లో తగినవాళ్ల కోసం వెతికేవాడిని. ఒకరోజు మళ్లీ ప్రసంగించాను.

'తెల్లవాడు నిన్ను ఎందుకు ద్వేషిస్తాడో నీకు తెలుసా? నీ మొహం చూసిన ప్రతిసారీ తను చేసిన నేరం వాడికి ఆ అద్దంలో కనిపిస్తుంది. అపరాధభావంతోవుండే వాడి అంతరాత్మ దాన్ని ఎదుర్కోలేదు!'

'అమెరికాలో వుండే ప్రతి తెల్లవాడూ నల్లవాడి కళ్లలోకి సూటిగా చూసినప్పుడు, మోకాళ్లపై కూర్చుని, "నన్ను మన్నించు, నన్ను మన్నించు, నా జాతి నీ జాతిపట్ల చరిత్రలోకల్లా మహా నేరం చేసింది : దాన్ని సరిదిద్దుకునే అవకాశం నాకిస్తావా?" తెల్లవాడు ఈ పనిచేస్తాడని నిజంగా మీలో ఎవరైనా ఆశిస్తారా? లేదు, మీకు చాలా బాగా తెలుసు! వాడెందుకు ఈ పని చెయ్యడు? ఎందుకంటే వాడు 'చెయ్యలేడు'! తెల్లవాడు భూమ్మీద అక్రమాలు చెయ్యటానికే పుట్టిన దయ్యం....'

ఈ కాలంలోనే ఫోర్డ్‌మోటార్ కంపెనీలో చేరాను. యువ మినిస్టర్‌గా వీలైనప్పుడల్లా షికాగోకు పోయేవాడిని. ఎప్పుడుపోయినా ముహమ్మద్, ఆయన భార్య క్లారా తమ కొడుకు మాదిరే నన్ను ఆదరించేవారు. వాళ్లింట్లో ముహమ్మద్ తల్లి మేరీ కూడా వుండేది. ముహమ్మద్ చిన్ననాటి సంగతుల గురించి ఆమెను అడిగేవాడిని. ఆయన 1897లో జార్జియాలో పుట్టాడని ఆమె చెప్పింది.

భోజనాలైన తర్వాత ఆయనతో మాట్లాడటమో, ఆయన వెంట షికాగోలోని కొంతమంది ముస్లింలు సొంతంగా పెట్టుకున్న దుకాణాల దగ్గరికో పోయేవాడిని. సొంతంగా అంగళ్లు పెట్టుకొని నల్లవాళ్లతో మాత్రమే వ్యాపారం చేయటం వల్ల తెల్లవాళ్ల దోపిడీ నుండి బైటపడవచ్చు. కొన్ని అంగళ్లలో ఆయన స్వయంగా చీపురు పట్టుకొని ఊడ్చేవాడు. ఆ పని నేను చెయ్యబోతే నన్ను వారించి, నల్లవాడు ఖాళీగా, సోమరిగా వుండటం అంటే తనకు తాను మహాపాపం చేసుకోవటమేనని చెప్పాడు. నన్నేమీ చెయ్యనీయకుండా, కేవలం తనతోపాటు వుండి తాను చెప్పేది శ్రద్ధగా వినమనేవాడు. అదంతా చూస్తే, ఏథెన్స్ నగరవీధుల్లో తన విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ తిరిగిన సోక్రటీస్ గుర్తొచ్చేవాడు. చెడు చేస్తున్నవాడిని నిందించకుండా వాడికి కనపడేట్టు మంచి పని చెయ్యమని ఆయన చెప్పేవాడు.

ఒకసారి మదర్ మేరీ తన కొడుకు బాల్య, యవ్వన దశల్లో ఎలా వుండేవాడో చెప్పింది. చిన్నప్పుడే అన్నదమ్ముల మధ్య తగవులు తీర్చేవాడని, బడిలో

చదువుతున్నప్పుడే తన జాతి చైతన్యాన్ని బలంగా ప్రదర్శించేవాడని, యువకుడుగా నీగ్రోల తప్పుల్ని గురించి కాకుండా వాటి వెనుక వున్న కారణాల గురించి మాట్లాడేవాడని, నల్లజాతిపట్ల చాలా ప్రేమ చూపించేవాడనీ చెప్పింది. కొన్నాళ్లకు మదర్ మేరీ చనిపోయింది. ఆమె అంత్యక్రియలకు హాజరైనంత మంది జనాన్ని షికాగో నగరం కూడా చూసి వుండదు.

1931లో మాస్టర్ డబ్ల్యు.డి. ఫార్డ్‌ను ముహమ్మద్ డెట్రాయిట్‌లో కలిశాడు. ఫార్డ్ నీగ్రోవాడల దుస్థితి చూసి వాటిని ఉద్ధరించటానికి నడుం బిగించాడని, ఆయనే తర్వాత ఆ బాధ్యతను తనకు అప్పగించాడని ముహమ్మద్ చెప్పాడు. స్వర్గం ఆకాశంలో కానీ, నరకం భూమ్మీద కానీ లేవని, ఆ రెండూ ఈ లోకంలో మనుషులు బతికే పరిస్థితులేనని, ఆ రకంగా నల్లవాడు నాలుగు వందల ఏళ్లుగా అమెరికా నరకంలో బతుకుతున్నాడని, తాను తిరిగి నల్లవాళ్లందరినీ సొంత స్వర్గమైన ఆఫ్రికాకు తసుకొనిపోవటానికే వచ్చాననీ ఫార్డ్ ప్రసంగించేవాడని ఆయన చెప్పాడు. అదే సంవత్సరం ఫార్డ్ తన వారసుడు ముహమ్మద్ అని ప్రకటించాడు. విద్యావంతులైన మిగతా మినిస్టర్స్ దాన్ని ఓర్చలేకపోయారు. ఆ తర్వాత ఫార్డ్ జాడలేవీ కనిపంచలేదు. ఆయన్ను హత్య చేయటానికి 'నల్లతొత్తులు' తీవ్రంగానే ప్రయత్నించారని ముహమ్మద్ చెప్పాడు. వాళ్లు ముహమ్మద్‌ను కూడా ఏ నగరంలోనూ స్థిరంగా వుండనీయలేదు. వాళ్ల బారిన పడకుండా భార్యా బిడ్డల్ని విడిచి ఏడేళ్లపాటు ఆయన రహస్య జీవితం గడిపాడు. చివరకి నల్లతొత్తులు తెల్లవాడితో కలిసి, వయసు మీరిన ఆయన్ను మిలిటరీ సర్వీసుకు దూరంగా వున్నాడనే నెపంతో దొంగకేసు బనాయించేట్టు చేసి 1942లో ఆయన్నకు జైలు శిక్ష పడేట్టు చేశారు. 1946లో ఆయన విడుదలై మళ్లీ తన పని కొనసాగించాడు. ఈ విషయాలన్నీ నేను ఎంతో ఆవేశంతో, ఉద్వేగంతో నల్లవాళ్ల ముందు ప్రసంగించేవాడిని. ఆ సమయంలో నేను చెప్పిన ప్రతి మాటా నిజాయితీగా, నిర్భయంగానే చెప్పాను. నేను ఆయనకు చాలా నమ్మకస్తుడైన సేవకుడిని. నేను ముహమ్మద్‌ను నమ్మినంతగా స్వయంగా ముహమ్మదే తననుతాను నమ్మివుండడు.

ముందు ముందు, నేను మానసికంగా, ఆధ్యాత్మికంగా సంక్షోభాన్ని ఎదుర్కోబోతున్నాను.

అధ్యాయం - 13

# మినిస్టర్ మాల్కాం ఎక్స్

ఫోర్డ్ మోటార్ కంపెనీ ఉద్యోగం విడిచిపెట్టాను. నార్త్ అమెరికా నగరాల్లో తలచెడి నిద్రావస్థలో వున్న ఇరవై రెండు మిలియన్ల నల్లవాళ్ల కోసం మరిన్ని దేవాలయాలు స్థాపించటానికి ముహమ్మద్ బోధనలు వ్యాప్తిచేయటం అవసరం. అందుకు మినిస్టర్స్ అవసరం. అదే నాకు అర్థమైంది.

నేనెప్పుడూ కార్యకర్తగానే వున్నా, వ్యక్తిగతంగా నేను చూపిస్తున్న ఆసక్తి, చొరవ, 'నేషన్ ఆఫ్ ఇస్లాం'లోని చాలామంది మినిస్టర్లకన్నా ఎక్కువ అంకితభావంతో పనిచేసే స్థితికి నన్ను తీసుకొనిపోయాయి. అయితే, అన్ని రకాల అనుభవాల నుండీ ప్రతి మినిస్టర్ తాను ముహమ్మద్‌కు శిష్యుడు కావటం కోసమే అంతవరకూ జీవించినట్టు భావించాడు.

జరగబోయేదంతా ముందే రాసిపెట్టి వుంటుందని ఇస్లాం బోధిస్తుంది.

జైల్లోకంటే ముహమ్మద్ నాయకత్వంలో నేను ఎక్కువగా నేర్చుకున్నాను. పూజా విధానాలు, స్త్రీ పురుషుల సహజ స్వభావాలు, సంస్థాగత, పరిపాలనా పద్ధతులు, బైబిల్, ఖురాన్‌ల అర్థాలూ అంతరార్థాలూ వాటి ఉపయోగాలూ అన్నీ ఆయన నేర్పాడు. ఏ మారణాయుధమూ ఉపయోగించకుండా, సూర్యుడిలాంటి తన శక్తితో నన్ను నిశ్శబ్దంగా భయపెట్టిన మొట్టమొదటి వ్యక్తి ఆయనే. 'బుక్ ఆఫ్ రివలేషన్స్'లో నోట్లో రెండంచుల కత్తి వుండే గొర్రెపిల్ల ప్రతీక వుంది. ముహమ్మద్‌ను దగ్గరి నుండి చూసిన తర్వాత అది ఆయనకు అచ్చంగా సరిపోతుందనిపించింది. నాకు చాలా ఇష్టమైన ఈ ప్రతీకతోనే ఉపన్యాసం మొదలుపెట్టేవాడిని.

నా పనితీరు మీద గురి కుదిరిన తర్వాత, ముహమ్మద్ నన్ను బోస్టన్‌కు పంపించాడు. అక్కడ నివసించే లాయడ్ ఎక్స్, ఇస్లాంపట్ల ఆసక్తి వున్న వారిని నా ఉపన్యాసం వినమని తన ఇంటికి ఆహ్వానించాడు. 'నీలికళ్ల తెల్లదయ్యాం' నల్లవాళ్లపట్ల పాల్పడిన అమానుష చర్యల గురించి చెప్పాను. మరో మూడు నెలల తర్వాత జనాల్లో కదలిక వచ్చింది. కుర్చీలు బాడుగకు తీసుకొని ఒక చిన్న దేవాలయం ప్రారంభించాం. దీన్ని సంతోషంగా ముహమ్మద్‌కు రిపోర్టు చేస్తూ, దీని చిరునామా కూడా రాశాను. అక్కడ నేను చెప్పేది వినటానికి మా అక్క ఎల్లా మొదటిసారి

వచ్చింది. నన్ను చూసి ఆమె నమ్మలేకపోయింది. ఆమె మతం మారటం గురించి నేను కనీసం ఆలోచించలేదు కూడా. ఎందుకంటే, సర్వస్వతంత్రురాలైన ఆమెను అల్లా తప్ప ఎవరూ మార్చలేరని నాకు తెలుసు. జైలు నుండి విడుదలైన తర్వాత డెట్రాయిట్‌కు పోతూ మధ్యలో ఆమె దగ్గర ఒక పూట వున్నదే, మళ్లీ ఏడు సంవత్సరాల తర్వాత రాక్స్‌బరీ వీధుల్లో తిరిగే అవకాశం వచ్చింది. వెంటనే మరోసారి షార్టీని కలిసేందుకు పోయాను.

నా వేషభాషలు చూసి షార్టీ పోల్చుకోలేకపోయాడు. ఇస్లాం గురించి షార్టీతో మాట్లాడిన తర్వాత అతడు నేను ఆశించినంతగా స్పందించలేదు. ఇంక లాభం లేదనుకొని పాత జీవితాన్ని నెమరు వేసుకోవటంతో అతను ఎప్పటిలాగే తమాషాగా మాట్లాడాడు. ఇస్లాం గురించి జైల్లో వున్న కాలంలో తప్పుగా వినటంవల్ల దాని గురించి మాట్లాడేందుకు షార్టీ ఆసక్తి చూపించలేదు. మిగతా వాళ్లెవరి దగ్గరా ఇంక దాని గురించి ప్రస్తావించలేదు. ఎందుకంటే వాళ్లు ఎంతగా తెల్లవాడి మాయలో కూరుకొనిపోయారో నాకు తెలుసు.

పదకొండో దేవాలయం మినిస్టర్‌గా కొద్దికాలంపాటు జనాన్ని పునస్సమీకరించిన తర్వాత దాన్ని మినిస్టర్ యులిసెస్ ఎక్స్‌కు అప్పగించి ముహమ్మద్ ఆజ్ఞ మేరకు 1954 మార్చికల్లా ఫిలడెల్ఫియాకు పోయాను. మే నెలలోగా అక్కడ పన్నెండో దేవాలయాన్ని ప్రారంభించాం. బోస్టన్, ఫిలడెల్ఫియాల్లో విజయం సాధించినందుకు, ముహమ్మద్ నన్ను న్యూయార్క్ మహా నగరంలోని ఏడో దేవాలయానికి మినిస్టర్‌గా నియమించాడు. నేను ఎంతో ఉద్వేగానికి లోనయ్యాను. పది లక్షలకు పైగా నల్లవాళ్లున్న న్యూయార్క్ నగరంలోని ఏడో దేవాలయానికి సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో జనాన్ని రప్పించటానికి ప్రయత్నించాలని నిర్ణయించుకున్నాను.

తొమ్మిది సంవత్సరాల తర్వాత పాత స్నేహితులందర్నీ కలుద్దామని బయల్దేరిన నేను మొదటగా శామీ కోసం విచారించాను. అతను అమ్మాయిల వ్యాపారం విడిచిపెట్టి నంబర్ల వ్యాపారంలో చాలా డబ్బు సంపాదించాడని, ఎవరో తెల్ల అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడని విన్నాను. అయితే, పెళ్లయిన కొద్ది రోజుల్లోనే తన ఇంట్లో పరుపు మీద శవమై పడి వున్నాడని తెలిసింది. అప్పుడు అతని దగ్గర ఇరవై అయిదువేల డాలర్లున్నాయి. (చీకటి ప్రపంచంలో ఎంత డబ్బు చెలామణీ అవుతుందో చెప్తే చాలా మంది నమ్మరు. 1964 మార్చిలో షికాగోలో 'అదృష్టచక్రం' నడిపే లారెన్స్ వేక్‌ఫీల్డ్ చనిపోయిన తర్వాత, అతనింట్లో ఏడు లక్షలా అరవైవేల

డాలర్ల సొమ్ము దొరికింది. అదంతా పేద నీగ్రోల సొమ్మే). శామీని తలుచుకుంటూ, వెస్టిండియన్ ఆర్చీ కోసం అన్ని బార్లూ గాలించాను. ఆయనెక్కడా కనిపించలేదు. ఎవరూ ఏమీ చెప్పలేదు. ఈ తొమ్మిదేళ్ల కాలంలో నాకు తెలిసిన ఇరవైఅయిదు మంది అన్నిరకాలుగా దిగజారి నికృష్టమైన జీవితం గడుపుతున్నారు. నాకు అలాంటి రాతను తప్పించినందుకు మనసులోనే అల్లాకు మొక్కుకున్నాను.

చివరికి, నేను పనిచేసే ఏడో దేవాలయం దగ్గర వుండే ఒక పాకీవాడు ఆర్చీ చాలా మెత్తబడ్డాడని, బ్రాంక్స్‌లో గది అద్దెకు తీసుకొని వుంటున్నాడని చెప్పటంతో టాక్సీ తీసుకొని సరాసరి అక్కడికి పోయాను. ఆర్చీ తలుపు తీశాడు. కొద్దిసేపటికి నన్ను గుర్తుపట్టి 'రెడ్, నిన్ను చూడటం సంతోషంగా వుంది' అని అరిచాడు. నేను మారు మాట్లాడకుండా ఆ ముసలాయన్ను కౌగిలించుకున్నాను. హార్లెమ్ విడిచిపెట్టిన తర్వాత ఇస్లాంకు ఎలా దగ్గరయ్యానో వివరించాను. 'నువ్వంటే నా కెప్పుడూ ఇష్టమే' అన్నాడు. తాను నిజంగా నన్నెప్పుడూ చంపాలనుకోలేదని, ఆ రోజు డబ్బు విషయంలో తనవల్లే పొరపాటు జరిగిందని కూడా చెప్పాడు.ముహమ్మద్ బోధనల గురించి చెప్పినప్పుడు 'అవును. ఇది తప్పకుండా ఆలోచించాల్సిన విషయమే' అన్నాడు. ఆయన పరిస్థితి చూసి, బలవంతంగా ఆయన చేతిలో కొంత డబ్బు పెట్టి వచ్చాను.

1954 జూన్‌లో జనసమీకరణ కోసం హార్లెమ్ వీధుల్లో తిరుగుతున్నప్పుడు, 'సమైక్యత'ను బోధించే జాతీయవాద గ్రూపులతో అడుగడుగునా ఆటంకాలు ఎదురయ్యేవి. దాంతో కరపత్రాలు అచ్చేసి ప్రతి ఒక్కరి దగ్గరికీ పోయి విషయం చెప్పటం, స్త్రీలకు ఇచ్చేటప్పుడు, 'తెల్లవాడు నల్లజాతిని ఎలా ఎత్తుకొని పోయి, దోచుకొని, మానభంగం చేశాడో వినండి' అని చెప్పేవాళ్లం. చర్చికి పోయే నల్లవాళ్ల కోసమే ఎక్కువ సమయం వెచ్చించేవాడిని. తెల్ల ప్రపంచంలో నల్ల మగవాడికి గౌరవం దక్కాలంటే, వాడు ముందు తన ఇంట్లోని స్త్రీలను గౌరవించటం నేర్చుకోవాలని, తన బలహీనతల్ని జయించి, తన జాతి స్త్రీలకు రక్షణ కల్పించాలని ప్రచారం చేస్తూ స్త్రీలలో ఆసక్తి రేకెత్తించాను. మా కఠినమైన నైతిక నియమావళి, క్రమశిక్షణ వారిని భయపెట్టాయని నాకు తెలుసు. అందుకే, 'నంబర్లు, పందిమాంసం, జూదం, తాగుడు, సిగరెట్లు, సినిమాలు, మత్తుమందు, పోట్లాటలు, దొంగతనాలు, క్లబ్బుల్లో నాట్యాలూ, వ్యభిచారం లాంటివి విడిచిపెడితేనే అందరికీ స్వేచ్ఛ, న్యాయం, సమానత్వం సాధ్యమవుతాయని ఓపిగ్గా వివరించాను.

ఏడో దేవాలయం కోసం పనిచేస్తూనే ప్రతి బుధవారం ఫిలడెల్ఫియాకు పోయి వచ్చేవాడిని. ఒస్బోర్న్ ఎక్స్ సహాయంతో మెసాచుసెట్స్‌లోని స్ప్రింగ్‌ఫీల్డ్‌లో పదమూడో దేవాలయాన్ని స్థాపించాం. అక్కడ జరిగిన సమావేశానికి హాజరైన ఒక స్త్రీ నేను గురువారం హార్ట్‌ఫోర్డ్‌కు వస్తే, తన స్నేహితులతో ఒక సమావేశం ఏర్పాటు చేస్తానని చెప్పింది. వెంటనే గురువారం అక్కడ హాజరయ్యాను. ఆ రోజు ఇళ్లల్లో పనిచేసేవాళ్లందరికీ సెలవు. వాళ్లు మిగతా నీగ్రోలకన్నా ఎక్కువ ఆసక్తి చూపించారు. త్వరలోనే అక్కడ పదహారుగో దేవాలయం ప్రారంభమైంది. బోస్టన్, ఫిలడెల్ఫియా, స్ప్రింగ్‌ఫీల్డ్, హార్ట్‌ఫోర్డ్, న్యూయార్క్ దేవాలయాల్లో నా ప్రమేయం ప్రత్యక్షంగా వుండటంవల్ల, 1955లో ఎక్కడికైనా పోగలిగే స్థితికి వచ్చాను. త్వరలో ముహమ్మద్ ఆజ్ఞ మేరకు అట్లాంటాకు వెళ్లాను. అక్కడ వుండే జేమ్స్ ఎక్స్ స్మశానవాటికలో సమావేశానికి ఏర్పాటుచేశాడు. దానికి చెల్లించే డబ్బు మాత్రమే ఆయన దగ్గరుంది. మేం అక్కడికి పోయేసరికి ఏ నీగ్రోవో అంత్యక్రియలు జరుగుతున్నాయి. వాళ్లందరూ వెళ్లిపోగానే అక్కడే ఉపన్యాసమిచ్చాను. చావు, అంత్యక్రియల గురించి ముహమ్మద్ మాకు చెప్పిందానికీ, తూర్పు దేశాల్లో చెప్పేదానికీ పూర్తిగా వైరుధ్యముంది అని ఆ తర్వాత నాకు తెలిసింది. 1956లో న్యూయార్క్‌లోని ఏడో దేవాలయానికి ఒక కొత్త షెవర్లె కారును ముహమ్మద్ మంజూరు చేశాడు. ప్రయాణించటం పట్ల నాకున్న ప్రేమను గమనించి, మతవ్యాప్తి ఇంకా వేగంగా మరిన్ని ప్రాంతాల్లో జరగాలంటే నాకు బంధనాలు వుండకూడదనే ఉద్దేశంతోనే ఆయన ఆ కారు నాకు ఇచ్చాడు. (అది నేషన్ ఆఫ్ ఇస్లాం సొత్తు. నాది కాదు. కళ్లద్దాలు, సూటుకేసు, రిస్ట్ వాచి - ఇవి మాత్రమే నా సొంతం. డబ్బు సంపాదన గురించి నేనెప్పుడూ ఆలోచించలేదు)

ఆ కారులో, అయిదు నెలల్లో ముప్పయివేల మైళ్లు తిరిగి ప్రచారం చేశాను. మినిస్టర్‌గా స్త్రీల విషయంలో చాలా నిక్కచ్చిగా వ్యవహరించేవాడిని. వాళ్లపట్ల నాకు స్పష్టమైన అభిప్రాయాలు కూడా వున్నాయి. అంతవరకూ నేను చూసిన చాలామంది స్త్రీలు మగవాళ్లతో తెలివిగా ఆటలాడి మోసం చేసిన వాళ్లే. నా దృష్టిలో భర్తలను వాళ్ల భార్యలకంటే వేశ్యలే అన్ని విషయాల్లోనూ బాగా అర్థం చేసుకున్నారు. నేను ఒంటరిగా వుండటంపై సమావేశాలకు వచ్చే ఆడవాళ్లు నా వెనుక జోకులేసుకుంటున్నారని నాకు తెలుసు. నాకు ఒక భార్య అవసరమనే అభిప్రాయాన్ని అక్కడికి వచ్చే ప్రతి స్త్రీ పరోక్షంగా ఏదో ఒక పద్ధతిలో చెప్పేది. ఆ కాలంలోనే బెట్టీ

దేవాలయానికి రావటం మొదలుపెట్టింది. న్యూయార్క్‌లోని ఒక ప్రముఖ నర్సింగ్ స్కూల్లో చదువుతూ వుండిన ఆమె, దేవాలయానికి వచ్చే అమ్మాయిలకు ఆరోగ్యంపై పాఠాలు చెప్పేది. ఇస్లాం ప్రాతిపదికగా వారంలో ప్రతి రోజూ రాత్రి ఒక కార్యక్రమం నడిచేలా ప్రణాళిక రూపొందించాను. ప్రతి సోమవారం, యువకులకు జూడో, కరాటేలతో పాటు కుటుంబంలో మగవాడి పాత్రపై శిక్షణ వుండేది. మంగళవారం, అందరూ కలిసి వాళ్లకు నచ్చిన విషయాలపై మాట్లాడుకునేవారు. బుధవారం, విద్యార్థులతో ఇస్లాం ప్రాథమిక సూత్రాలపై చర్చించేవాళ్లం. గురువారం, ముస్లిం స్త్రీలు, అమ్మాయిలకు 'సాధారణ నాగరికతా తరగతి' నిర్వహించేవాళ్లం. ఇంటి పనులు, కుటుంబంలో స్త్రీ పాత్ర గురించి చెప్పేవాళ్లు. శుక్రవారం, 'నాగరిక రాత్రి' పేరుతో స్త్రీ పురుష సంబంధాల గురించి చర్చ వుండేది. బెట్టీ చెప్పే ప్రతి క్లాసుకూ హాజరై ఇతర విషయాలు పర్యవేక్షించేవాడిని.

ఆ రోజుల్లోనే మా మధ్య పరిచయం కొంచెం పెరిగింది. అయితే, తాను ముస్లిం కావటం ఇంట్లో వాళ్లెవరికీ ఇష్టం లేదని తెలిసింది. నేనెక్కడికి పోయినా, ఏమి చేస్తున్నా ఆమె గురించే ఎక్కువగా ఆలోచించాను. చివరికి ఈ విషయం ముహమ్మద్‌కు చెప్పాను. తర్వాత షికాగో సమావేశానికి బెట్టీ వచ్చినప్పుడు ఆమెను చూసి ఆయన సంతృప్తి వ్యక్తం చేయటంతో నేను కచ్చితంగా ఒక నిర్ణయానికి రావాల్సి వచ్చింది. అప్పటికి మా వాళ్లను చూసి చాలా రోజులైనందువల్ల డెట్రాయిట్‌కు బయల్దేరాను. అక్కడికి చేరుకోగానే ఆమెకు ఫోన్ చేసి, 'నీవు పెళ్లి చేసుకోవాలనుకుంటున్నావా? అని నేను అడిగాను. ఆ మాట విని ఆమె ఆశ్చర్యపడినా అసలు విషయం ఆమెకు కూడా తెలుసని నాకూ తెలుసు. అందుకే వెంటనే 'అవును' అని జవాబు చెప్పింది. వెంటనే విమానంలో డెట్రాయిట్‌కు రమ్మని చెప్పాను. ఆమె బంధువుల ఇంట్లో దిగింది. ఆమెను మా పెద్దన్న కుటుంబానికి పరిచయం చేశాను. ఇండియానాలో ఏ ఆర్భాటమూ లేకుండా నిరాడంబరంగా పెళ్లి జరిపిస్తారని అన్నయ్య చెప్పటంతో మరుసటి రోజు పొద్దునే లాన్సింగ్‌కు దగ్గర్లోని పట్టణానికి పోయాం. ఆ రోజు జనవరి 4, 1958. సరిగ్గా మేము అక్కడికి చేరుకోవటానికి కొన్ని రోజుల ముందే కొత్త చట్టం చేశారు. దాని ప్రకారం పెళ్లి చాలా ఆలస్యమైంది. లాన్సింగ్‌లో ఫిల్బర్ట్ ఇంట్లో రాత్రి భోంచేసి ఇద్దరమూ న్యూయార్క్ బయల్దేరాం. మరుసటి రోజు దేవాలయానికి పోగానే అక్కడున్న వాళ్లంతా మేమిద్దరం ఏదో నమ్మకద్రోహం చేసినట్టు, కోపంగా మమ్మల్ని తినేట్టు చూశారు. క్వీన్స్‌లో కొత్త కాపురం. 1958

నవంబర్‌లో పెద్ద కూతురు అత్తిలా, 1960 లో రెండవ కూతురు కుబిలా, 1962లో ఇల్యాష్, 1964లో నాల్గవ కూతురు అమిలా పుట్టారు.

బెట్టీతో నా దాంపత్య జీవితం ఏ ఒడిదుడుకులూ లేకుండా హాయిగా సాగింది. పాశ్చాత్య 'ప్రేమ'లో వుండేదంతా కామమే. కేవలం శారీరకమైన ఆకర్షణే దానికి ఆధారం. మాది అలాంటి ప్రేమ కాదు. ఆమె నా జీవితాశయాన్ని, నన్ను పూర్తిగా అర్థం చేసుకున్న వ్యక్తి. పనిలో భాగంగా నేను కొన్నిసార్లు అయిదారు నెలలు ఇంటికి దూరంగా వుండాల్సి వచ్చేది. ఒకసారి చాలా దూర ప్రాంతం నుండి ఆమెకు ఫోన్ చేస్తే ఆమె చెప్పిన జవాబు చూడండి : 'నీవు ఊళ్లో లేనప్పుడు నా కళ్లముందే వుంటావు'.

పెళ్లయిన తర్వాత, అన్నిచోట్లా ఏకకాలంలో వుండటానికి ప్రయత్నించి పూర్తిగా అలసిపోయాను. బోస్టన్ దేవాలయంలో ఎప్పటిలాగే ఉపన్యాసమిచ్చిన తర్వాత ఎలైజా ముహమ్మద్‌ను అనుసరించేవాళ్లు లేచి నిలబడండి అని అడగ్గానే నా కళ్లను నేనే నమ్మలేనట్టుగా ఎల్లా లేచి నిలబడింది. ఈ నిర్ణయం తీసుకోవటానికి ఆమెకు అయిదు సంవత్సరాలు పట్టింది.

నగరంలో చాలామందికి తెలీని మా సంస్థ పేరు హార్లెమ్‌లో ఒక రాత్రి జరిగిన సంఘటనతో దాదాపు అందరికీ తెలిసింది. ఒక వీధిలో ఏదో గొడవ జరిగితే ఇద్దరు తెల్ల పోలీసులు అక్కడ మూగిన నీగ్రోలందరినీ వెళ్లిపొమ్మని గదమాయించారు. అప్పుడు అక్కడే వున్న ఇద్దరు ముస్లిం సోదరులు జాన్సన్ హింటన్, మరొక వ్యక్తి పారిపోకుండా అక్కడే వుండటంతో పోలీసులు రెచ్చిపోయి హింటన్ తలపై లాఠీలతో కొట్టారు. తల పగిలిన అతడిని దగ్గర్లోనే వున్న పోలీస్ స్టేషన్‌కు తీసుకొని పోయారు. రెండవ వ్యక్తి మాకు ఫోన్ చేసి చెప్పిన అరగంటలోపే యాభైమంది ఏడో దేవాలయం ముస్లిములు స్టేషన్ బైట నిలబడ్డారు. ఏమి జరిగిందో తెలుసుకోవాలనే కుతూహలంతో చుట్టుపక్కల నీగ్రోలు కూడా మావాళ్లతో కలిశారు. అంతమందిని చూసి పోలీసులు ఆశ్చర్యపోయారు. ఏడో దేవాలయం మినిస్టర్‌గా నేను లోపలికి పోయి మా సోదరుడిని నేను చూడాలని గట్టిగా అడిగాను. ముందు అతనక్కడలేడని దబాయించి ఆ తర్వాత చూడటం కుదరదని చెప్పారు. అతడిని మాకు చూపించేవరకు, అతనికి సరైన వైద్యం అందేవరకూ మేం అక్కడి నుండి అంగుళం కూడా కదలమని చెప్పాను. అంతకంతకూ మా వెనుక చేరుతున్న జనాన్ని చూసి పోలీసులు భయపడ్డారు. హింటన్‌ను చూసిన తర్వాత నన్ను నేను అదుపు

చేసుకున్నాను. అతను పూర్తిగా స్పృహలో లేడు. తల, ముఖం, భుజాలు రక్తంతో తడిసిపోయాయి. అలాంటి పోలీసు పాశవిక చర్య మరోసారి జరగకూడదనుకున్నాను. అతడిని వెంటనే ఆసుపత్రికి తీసుకొనిపోండి అని లెఫ్టినెంట్ ఇన్‌ఛార్జికి చెప్పాను. అంబులెన్స్ పిలిపించి పోలీసులే అతడిని హార్లెమ్ ఆసుపత్రికి తీసుకొని పోతుంటే మేమంతా దాని వెనకే పోతున్నాం. పదిహేను బ్లాకుల పొడవునా చాలా రద్దీగా వుండే రహదారి మీద మేం నడుస్తూ వుంటే అంగళ్ళు, బార్లు, రెస్టారెంట్లలో వున్న నీగ్రోలంతా మమ్మల్ని అనుసరిస్తున్నారు. ఆసుపత్రికి చేరుకునేసరికి మా వెనుక చాలా పెద్ద జనసమూహం ఆవేశంతో ఊగిపోతోంది. హార్లెమ్‌లోని నల్లవాళ్లు అప్పటికే చాలా రోజులుగా పోలీస్ జులుంతో విసిగిపోయి వున్నారు. నల్లవాడి కోసం అంత పటిష్టంగా నిలబడిన సంస్థను వాళ్లు అంతవరకూ చూళ్లేదు.

ఒక పోలీస్ ఉన్నతాధికారి వచ్చి అక్కడ మూగిన జనసమూహాన్ని వెళ్లిపొమ్మని చెప్పాడు. మా వాళ్లంతా శాంతియుతంగా క్రమశిక్షణతోనే వున్నారని చెప్పాను. డాక్టర్లు వచ్చి హింటన్‌కు సరైన వైద్యం చేస్తున్నామని నమ్మకం కలిగేట్టు చెప్పటంతో ముస్లిం సోదరులందరినీ వెళ్లిపొమ్మని ఆజ్ఞాపించాను. వాళ్లతోపాటు అక్కడున్న నీగ్రోలు కూడా కోపంగానే వెళ్లిపోయారు. హింటన్ తలలో స్టీల్ ప్లేటు అమర్చారని తర్వాత తెలిసింది. (ఆపరేషన్ తర్వాత నేషన్ ఆఫ్ ఇస్లాం చొరవతో న్యాయస్థానం, హింటన్‌కు డెబ్బైవేల డాలర్ల నష్టపరిహారం చెల్లించాలని పోలీస్‌శాఖను ఆదేశించింది. న్యూయార్క్ నగర ప్రభుత్వం అంత పెద్ద మొత్తం చెల్లించిన కేసు అదే.)

ఈ సంఘటన గురించి న్యూయార్క్ నగరంలోని లక్షలాది మందికి పత్రికల ద్వారా తెలిసిపోయింది. కొన్ని పత్రికలు వాస్తవానికి మసి పూయాలని చూశాయి. అప్పటి నుండి పోలీస్‌శాఖ నేషన్ ఆఫ్ ఇస్లాం గురించి ఆరాలు తీసి దానిపై కొత్త నిఘా మొదలుపెట్టింది. అన్నిటికన్నా ముఖ్యమైన విషయమేమిటంటే, ప్రపంచంలోని అతిపెద్ద నల్లవాళ్లుండే ప్రాంతమైన హార్లెమ్‌లో 'ఆమ్‌స్టర్‌డ్యాం న్యూస్' మొత్తం సంఘటన గురించి పతాక శీర్షికలతో ప్రచురించింది. ఆ వీధుల్లో మొట్టమొదటిసారి నల్లవాళ్లలో ప్రతి మగవాడు, ప్రతి స్త్రీ, ప్రతి పిల్లవాడు 'ఆ ముస్లింలు' ఎవరు అని చర్చించుకుంటున్నారు.

అధ్యాయం - 14

# నల్ల ముస్లింలు

**జా**న్సన్ హింటన్ కేసులో హార్లెమ్ నీగ్రోలంతా కళ్లు తెరవటానికి కొన్ని నెలల ముందు అంటే 1959లో తెల్ల దయ్యం అదుపులో వున్న పత్రికలు, రేడియో, టెలివిజన్ లాంటి ప్రసార సాధనాలు, నీగ్రో విద్యార్థులు, మేధావులు నేషన్ ఆఫ్ ఇస్లాంపై రకరకాలుగా దుమ్మెత్తి పోస్తే, నేను అంతే ఆవేశంగా వాటిని ఎదుర్కొన్నాను.

ఈ నేపథ్యంలో నేషన్ ఆఫ్ ఇస్లాం తరపున 'ముహమ్మద్ స్పీక్స్' అనే వార్తాపత్రికను ప్రచురించటం ప్రారంభించాను. జాతీయస్థాయిలో మా సంస్థకు గుర్తింపు రావటం కోసం ముహమ్మద్ నన్ను మూడు వారాలపాటు ఆఫ్రికా పర్యటనకు పంపించాడు. ఆయన ప్రతినిధిగా ఈజిప్టు, అరేబియా, సూడాన్, నైజీరియా, ఘనా దేశాల్లో పర్యటించాను. తెల్లదయ్యం ఏదో ఒక రకంగా మాపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగే విధంగా ప్రవర్తిస్తూనే వుంది.

1959లో న్యూయార్క్‌లోని ఏడో దేవాలయంపై టిలివిజన్‌లో ఒక కార్యక్రమం ప్రసారమైంది. అందులో మా ముఖాలు, వేషధారణ, భాష, హావభావాలు అన్నిటినీ ప్రేక్షకులు చూడగానే ఆశ్చర్యానికి లోనయ్యే విధంగా కూర్చుచేసి 'ద్వేషం పుట్టించిన ద్వేషం' అనే శీర్షిక కింద ప్రసారం చేశారు. అది సహజంగానే ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. దానికి వార్తాపత్రికలు కూడా వంతపాడాయి. 'పారాహుషార్', 'ద్వేషదూతలు', 'జాతుల మధ్య సత్సంబంధాలకు గొడ్డలిపెట్టు', 'నల్ల వేర్పాటు వాదులు', 'నల్ల నిరంకుశులు', 'హింసాప్రియులు', 'నల్ల జాత్యంహకారులు', 'నల్ల ఫాసిస్టులు', 'క్రిస్టియన్ వ్యతిరేకులు', 'కమ్యూనిస్టు తొత్తులు' లాంటి శీర్షికలతో అబద్ధపు కథనాలను అవి ప్రచురించాయి.

మా 'క్రిస్టియన్ వ్యతిరేకత'ను బిషప్ చికెన్‌వింగ్స్ విమర్శిస్తే ఆయనకు నేను, ఇలా ఘాటుగా జవాబిచ్చాను. 'క్రిస్టియానిటీ తెల్లవాడి మతం. వాడు బైబిల్‌ను అడ్డం పెట్టుకొని తప్పుడు వ్యాఖ్యానాలతో మిలియన్ల మంది ప్రజలను మొదట 'అనాగరికులు'గా చిత్రించి ఆ తర్వాత తుపాకులకు పని చెప్పాడు. ఆ రక్తపు మరకలను మిషనరీలు కనపడకుండా తుడిచేశాయి.

తెల్ల విలేకరులయితే నా మీద ఏకంగా మండి పడేవారు. నన్ను ఫోన్‌లో

కూడా ఆవేశంగా ప్రశ్నిస్తే, నేనూ ఆవేశంగానే బదులిచ్చేవాడిని. ఒకసారి, ఒక విలేకరి, 'మీ దృష్టిలో అమెరికన్ నల్లవాళ్లకు మేలు చేసిన తెల్లవాడే లేడా?' అని అడిగాడు. 'అవును. ఇద్దరున్నారు. ఒకరు హిట్లర్, మరొకరు స్టాలిన్. తెల్లవాడిపైన హిట్లర్ ఒత్తిడి పెట్టినందుకే అమెరికాలో నల్లవాడికి కనీసం గౌరవప్రదమైన కార్మికుడి ఉద్యోగమైనా దొరికింది. ఆ వత్తిడినే మరో తెల్లవాడైన స్టాలిన్ కొనసాగించాడు' అని బదులిచ్చాను. ఇంటర్వ్యూలలో కూడా నేను ఒకటి చెపితే పత్రికలు మరొకటి అచ్చేశాయి. నీగ్రో నాయకులు కూడా అడుగడుగునా తెల్లవాడికే కొమ్ముకాశారు. అందుకే, ఇరవయ్యవ శతాబ్దపు అంకుల్‌టామ్ 'వృత్తి' నీగ్రో అన్నాను. తెల్లవాడి కోసం నీగ్రోగా వుండటమే వాడి వృత్తి అని నేను ఉద్దేశించిన అర్థం. ఇలాంటి వాళ్లంతా కేవలం 'తెల్ల తలకాయలతో వుండే నల్ల శరీరాలు'. ఈ నల్ల 'నాయకులు' సాధించిన 'నీగ్రో ప్రగతి' నల్లవాళ్ల మధ్య చర్చనీయాంశం కాగానే 'లైఫ్', 'లుక్', 'న్యూస్‌వీక్', 'టైం' మొదలైన పత్రికలు లక్షల సంఖ్యలో ప్రతులు అచ్చేశాయి.

చాలా రోజుల క్రితమే రేడియో, టెలివిజన్‌లలో పనిచేసేవాళ్లు సామూహిక చర్చలో నేషన్ ఆఫ్ ఇస్లాంను సమర్థించమని నన్ను అడగటం మొదలుపెట్టారు. యూనివర్సిటీల్లో డాక్టరేట్ పట్టాలు పుచ్చుకున్న తెలుపు, నలుపు పరిశోధకులు, మేధావులు నన్ను ప్రశ్నలడిగారు. ఎప్పటిలాగే తెల్లవాడిని విమర్శించాను. దాంతో 'సమైక్యత' పిచ్చి పట్టుకున్న నీగ్రోలు ఆవేశంతో నా మీద, ముహమ్మద్ మీద, మా సంస్థ మీద కయ్యిమని లేచి 'అమెరికన్ నీగ్రోల సమస్యకు తెల్లవాళ్లతో 'సమైక్యత' సాధించటాన్ని ఎందుకు ముస్లింలు పరిష్కారంగా చూడరు? అని ప్రశ్నించారు. 'మతిస్థిమితమున్న ఏ నల్లవాడూ, తెల్లవాడూ నిజంగా సమైక్యతను కోరుకోరు కాబట్టి, ఈ సమస్యకు పరిష్కారం సమైక్యత కాదు సంపూర్ణ విభజన' అని బదులిచ్చాను.

ప్రసార సాధనాలు మా సంస్థపైన ఎంతగా బురద చల్లినా ప్రజల్లో దానికి ఆదరణ ఏ మాత్రమూ తగ్గలేదు. ముహమ్మద్ ఏ నగరంలో ప్రసంగించినా ఆయన మాటలు వినటానికి వందల బస్సుల్లో ముస్లింలు తరలివచ్చేవాళ్లు. వేరే నగరంలో సభ జరిగితే ముహమ్మద్ షికాగో నుండి తన సొంత జెట్ విమానంలో వచ్చేవాడు. ఆయన ఎప్పుడు బహిరంగసభకు హాజరైనా అన్ని దేవాలయాల మంత్రులూ వెంట వుండేవారు. సంస్థ భద్రతాదళం అనుక్షణం ఆయన వెన్నంటే వుండేది. ఆయన వేదిక పైకి వచ్చి 'అస్-సలైకుం-సలాం' అని ప్రజలకు అభివాదం చేయగానే 'వా-అలైకుం-సలాం' అని ముస్లింలంతా ముక్త కంఠంతో గర్జించేవారు. ఆయన

ఉపన్యాసం ఇవ్వడానికి సిద్ధపడితే చాలు, ప్రతి ముస్లిమూ ఆందోళన చెందేవాడు. ఎందుకంటే, రెండు గంటలపాటు సుదీర్ఘ ఉపన్యాసమిస్తే ఆయనకున్న దీర్ఘకాలిక ఆస్తమా అంతకు రెండింతలు ఆయన్ను బాధపెడుతుందని అందరికీ తెలుసు.

'మీలో చాలామందికి వున్నట్టు నాకు డిగ్రీలు లేవు. చరిత్రకు మీ డిగ్రీలతో పనిలేదు.'

'తెల్లవాడు పసితనం నుండీ మీ మనసుల్లో భయాన్ని నూరిపోశాడు. ఏ మనిషికైనా ప్రథమ శత్రువు భయమే. మీలో కొంతమంది సత్యాన్ని వినటానికి భయపడుతున్నారని నాకు తెలుసు. మీరు భయాలు, అబద్ధాల్లోనే పుట్టి పెరిగారు. మీరు ఆ భయాల నుండి విముక్తులయ్యే వరకూ నేను మీకు సత్యాన్ని ప్రబోధిస్తూనే వుంటాను.'

అలా వుండేది ముహమ్మద్ ఉపన్యాసశైలి. మా సంస్థ నల్లవాళ్లను దురలవాట్లకు దూరం చేయటంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. వాటివల్ల ప్రభుత్వానికి ఎంత ఆదాయం వస్తుందో ప్రజల ఆరోగ్యం ఎంతగా చెడిపోతుందో గణాంకాలతో సహా వివరించి చెప్పేవాళ్లం. మత్తుమందుకు బానిసలైన చాలామంది ఆ దురలవాటును విడిచిపెట్టేలా చేశాం. దీనిపై 'న్యూయార్క్ టైమ్స్' కూడా ఒక ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దాంతో సామాజిక సేవాసంస్థలు కూడా మమ్మల్ని సంప్రదించాయి. హార్లెమ్‌కు చెందిన మాజీ మత్తుమందు బానిసలు అన్ని జాగ్రత్తలూ తీసుకొని యువకులచేత ఈ అలవాటు మానిపించేవారు. ఇలాంటి స్త్రీలకు కూడా దేవాలయాల్లోని ముస్లిం స్త్రీలు సహాయం చేసేవారు.

చర్చికిపోయే 'మంచి క్రైస్తవులైన' నల్లవాళ్లు కూడా మెల్లగా నేషన్ ఆఫ్ ఇస్లాంలో సభ్యులుగా చేరుతున్నారు. మధ్యతరగతి నీగ్రోలు కూడా ఒకరొకరే రావటం మొదలుపెట్టారు. తెల్ల ప్రపంచంలో ఉన్నత హోదాల్లో పనిచేసే ముస్లింలు కూడా మా సంస్థలో సభ్యులుగా వుండేవారు. వాళ్ల సభ్యత్వం గురించి ముహమ్మద్‌కు, మినిస్టర్స్‌కు మాత్రమే తెలుసు. 1961లో మా సంస్థ అమెరికా అంతటా గుర్తింపు సంపాదించుకుంది. మా వార్తాపత్రిక 'ముహమ్మద్ స్పీక్స్' వెనుక అట్టపైన ఇరవై మిలియన్ల డాలర్ల ఖర్చుతో షికాగోలో నిర్మించతలపెట్టిన ఇస్లామిక్ కేంద్రం రేఖాచిత్రాన్ని ఒక ఆర్కిటెక్ట్‌తో గీయించి అచ్చేశాం. దీనికోసం ప్రతి ముస్లిమూ ఆర్థిక సహాయం చేశాడు. అందులో ఒక అందమైన మసీదు, బడి, గ్రంథాలయం, ఆసుపత్రి, నల్లవాడి ఘనమైన చరిత్రను రికార్డుచేసి భద్రపరిచే మ్యూజియం వున్నాయి.

ముహమ్మద్ ముస్లిం దేశాలు పర్యటించి వచ్చిన తర్వాత, దేవాలయాలను ఇకమీద మసీదులుగా పిలవాలని ఆదేశించాడు. ముస్లింల సొంత వ్యాపారాలు కూడా బాగానే పెరిగాయి. అంతా కలిసికట్టుగా వుండి పరస్పరం వ్యాపార సంబంధాలు కలిగివుంటే నల్లవాళ్ల డబ్బంతా నల్లవాళ్ల మధ్యే తిరుగుతూ వుంటుంది. మిగతా మైనార్టీలు ఈ విధంగానే స్వయం సమృద్ధిని సాధించాయి. సొంత వ్యాపారాల ద్వారా నల్లవాళ్లందరికీ మేం దీన్నే చూపించాలనుకున్నాం.

ముహమ్మద్ ఉపన్యాసాలు రికార్డుచేసి చిన్న రేడియోల్లో ఇప్పుడు అమెరికా అంతటా ప్రసారం చేస్తున్నారు. డెట్రాయిట్, షికాగో నగరాల్లో సంస్థ నెలకొల్పిన రెండు ముస్లిం విశ్వ విద్యాలయాల్లోనూ చిన్న పిల్లలకు అరబిక్‌తోపాటు నల్లచరిత్ర కూడా బోధిస్తున్నారు.

ముహమ్మద్‌కు ఆయాసం చాలా ఎక్కువై విపరీతంగా బాధపడటంతో డాక్టర్ల సూచన మేరకు, పొడి వాతావరణముండే ఫీనిక్స్ (ఆరిజోనా) పట్టణానికి ఆయన మకాం మారింది. సంస్థ అక్కడో ఇల్లు కొని ఆయనకు ఇచ్చింది. ఫీనిక్స్‌లో ఆయన బాగా కోలుకోవటంవల్ల సంవత్సరంలో చాలా కాలం అక్కడే వుండేవాడు. ఇంతకుముందు మాదిరి అన్ని బాధ్యతలూ ఆయన చూసుకోలేడు కాబట్టి సంస్థకు సంబంధించి ఏ కీలకమైన నిర్ణయమైనా నన్నే తీసుకొమ్మని చెప్పాడు. ఆయన నన్ను అంతగా నమ్మాడు. 'బ్రదర్ మాల్కం, నువ్వు అందరికీ తెలియాలి' అని ఆయన ఒకరోజు నాతో చెప్పాడు. 'ఎందుకంటే నీవు అందరికీ తెలిస్తే దాని ద్వారా నేను ఇంకా బాగా తెలుస్తాను'. అయితే, నీవు తెలుసుకోవాల్సిన విషయం ఒకటుంది. నీవు అందరికీ తెలిసేకొద్దీ నిన్ను ద్వేషించేవాళ్లు కూడా తయారవుతారు. ఎందుకంటే, సాధారణంగా ప్రజలు ప్రముఖ వ్యక్తులను చూసి అసూయపడతారు'. ముహమ్మద్ నాకు వినిపించిన భవిష్యవాణి అంతే.

అధ్యాయం - 15

# ఇకారస్

రేడియో, టెలివిజన్, కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో నా ప్రసంగాలు, వాదనలు విన్న తర్వాత చాలామంది నాకు ఉత్తరాలు రాశారు. వాటిలో తొంభై అయిదు శాతం తెల్లవాళ్లే.

వాటిలో కొన్ని మాత్రమే 'ప్రియమైన నల్లవెధవా ఎక్స్' అని సంబోధిస్తూనో, నన్ను చంపుతామని బెదిరిస్తూనో రాసినవి. నాకు వచ్చిన చాలా ఉత్తరాలు తెల్లవాడికున్న రెండు పెద్ద భయాలను బట్టబయలు చేశాయి. భగవంతుడు ఈ నాగరికతను చాలా క్రోధంతో ధ్వంసం చేయబోతున్నాడని వ్యక్తిగతంగా వాడు నమ్మటం మొదటి భయమైతే, తెల్లస్త్రీ గర్భంలోకి నల్లవాడు ప్రవేశిస్తున్నాడనే ఊహ వాడి రెండో భయం.

ఆశ్చర్యకరంగా చాలామంది, తెల్లవాళ్ల సమస్యలపై ముహమ్మద్ చేసిన విశ్లేషణతో ఏకీభవించారు తప్ప ఆయన చూపిన పరిష్కారంతో కాదు. 'తెల్లదయ్యాలు' అనే మాటపట్ల వాళ్లు విముఖత వ్యక్తం చేశారు. దానికి నేను 'దయ్యం' అనే మాటను మేం ఉపయోగిస్తున్నది వ్యక్తిగతమైన అర్థంలో కాదు, జాతిపరంగా తెల్లవాడు మిగతా ప్రజలపట్ల చూపిన అమానుషత్వాన్ని మాత్రమే మేం విమర్శిస్తున్నాం' అని సమాధానమిచ్చాను.

దాదాపు ప్రతిరోజూ 'నల్లముస్లిములపై' దాడులు జరుగుతున్నట్టు కొన్ని పత్రికల్లో వార్తలొస్తూనే వున్నాయి. వాటిల్లో నన్ను 'రెచ్చగొట్టుడుగాడు'గా అభివర్ణిస్తూనే వున్నారు. ఒకసారి హార్లెమ్ నీగ్రోవాడలో పనిచేస్తున్న ఏడో దేవాలయం ముస్లిం సోదరులు నాకో రహస్య నివేదిక చూపించారు. అనుభవజ్ఞుడైన ఒక నల్ల సంఘసేవకుడు నెలరోజులపాటు హార్లెమ్ ప్రాంతంలో తిరిగి సేకరించిన వాస్తవాల సారాంశం అది. 'హార్లెమ్ ఉపసంస్కృతిలో సజీవంగా వుండే తేడాలను మాల్కం ఎక్స్ తన సొంత అవసరాలకు వాడుకుంటున్నాడు.'

మా ఇద్దరిలో హార్లెమ్ నల్లవాడ 'ఉపసంస్కృతి' గురించి ఎవరికి ఎక్కువగా తెలుసు? ఆ వీధుల్లో కొన్ని ఏళ్లపాటు దందాలు చేస్తూ తిరిగిన నాకా? తెల్లవాడిని అనుకరించే ఆ సంఘ సేవకుడికా? నా దృష్టిలో ముఖ్యమైన విషయం అది కాదు. అమెరికాలోని లక్షలాది నీగ్రోల్లో చదువుకున్నవాళ్లు తమ వారి కోసం ఆ చదువును

నిజజీవితంలో ఎంత ఉపయోగించారు? అన్నదే నాకు ముఖ్యమైన ప్రశ్న.

మీడియా విషయానికి వస్తే, విలేకర్లు నాకు మానవరూపంలో వున్న జంతువుల్లా కనిపించారు. ఇది 1963 నాటి సంగతి. ఏదో ఒకరకంగా నన్ను ఒక మూలకు నెట్టి ఒంటరివాడిని చెయ్యాలని చూశారు. తెల్లవాడి ప్రభుత్వ అధికార నిర్మాణాన్ని ఇరకాటంలో పెట్టేలా ఒక 'పౌరహక్కుల' నాయకుడు మాట్లాడితే, అతడిని దారిలో పెట్టటానికి నన్ను ఉపయోగించుకోవాలని చూశారు. దీనికి నేనో ఉదాహరణ ఇస్తాను. 'మిస్టర్ మాల్కం ఎక్స్', మిగతా నీగ్రో తిరుగుబాటు చర్యల గురించి ఎందుకు మీరు ఏమీ మాట్లాడటం లేదు? మార్టిన్‌లూథర్‌కింగ్ నాయకత్వం వహిస్తున్న మాంట్‌గామెరీ బహిష్కరణ గురించి మీ అభిప్రాయమేమిటి? ఇలాంటి ప్రశ్నలు నన్ను తరచూ అడుగుతుండేవారు.

ఈ పౌరహక్కుల 'నాయకులు' ముస్లింలపైన దాడులు జరుగుతున్నా వాళ్లూ మా జాతి నల్ల మనుషులే అయినా మౌనం వహించారు. పౌరహక్కుల ఉద్యమానికి వ్యతిరేకంగా నన్ను నిలబెట్టే అవకాశం తెల్లవాడికి ఇవ్వటం నా మూర్ఖత్వమే.

మాంట్‌గామెరీ బహిష్కరణ గురించి నన్నడిగిన తర్వాత, దాని గురించి పూర్తిగా తెలుసుకున్నాను. రోసాపార్క్స్ అనే నల్లస్త్రీ బస్సులో ప్రయాణిస్తుంటే మధ్యలో ఎక్కిన ఒక తెల్లస్త్రీకి కూర్చోవటానికి సీటు లేదని డ్రైవర్ రోసాను లేచి నిలబడమని చెప్పాడు. ఎంత విచిత్రం! స్వయంగా క్రైస్తవ మతస్తురాలైన ఆ స్త్రీని, పైగా తాను డబ్బు చెల్లించి కూర్చున్న సీటు నుండి లేపటం! ఆమె కేవలం నల్లస్త్రీ కావటమే దానిక్కారణం. అందుకే, తెల్లవాడి తలపొగరు కొన్నిసార్లు నాక్కూడా నమ్మశక్యం కాదు. వందల ఏళ్లుగా దక్షిణ ప్రాంత ప్రజలకు ఇలాంటి అవమానాలు జరుగుతూనే వున్నాయి.

ఉత్తరప్రాంత ఉదారవాదులు దక్షిణప్రాంతం వారిని ఎప్పుడూ విమర్శిస్తుంటారు. నేను కూడా ఉత్తరప్రాంతపు తెల్లవాడి సృష్టినే. నా జీవితంలో కూడా వాడి నయవంచనే ప్రతిఫలిస్తుంది. అదే దక్షిణప్రాంతపు తెల్లవాడు 'సమైక్యత' గురించి మాట్లాడడు. నీగ్రోలు అధములని వాడు మొహం మీదే చెపుతాడు. ఆ మేరకు శత్రువు చాలా స్పష్టంగా కనిపిస్తున్నట్టే. అందుకే, ఉత్తరప్రాంతపు తెల్లవాడు చెప్పే 'సమానత్వం', 'సమైక్యత' భావాలను తలకెక్కించుకున్న నల్లవాడే అందరికన్నా ప్రమాదకరమైనవాడు. 'సమైక్యత' అనేది ఉత్తరప్రాంత ఉదారవాది కనిపెట్టిన మాట. ఈ మాట జాతి విషయంలో విస్తృతంగా వాడుతున్నారు. నిజానికి 'సమైక్యత' అనేది ఒక ఊహ. ఇది అమెరికన్ నల్లవాడు తన నిజమైన కోరికలను

సాధించుకోకుండా గందరగోళపరచడానికి నక్కజిత్తుల ఉత్తరప్రాంత ఉదారవాది ప్రయోగించిన పొగమబ్బు. అందుకే, అన్నిచోట్లా తెల్లవాడు, నల్లవాడు కలిసే వున్నట్టు కనిపించినా మనసులో ఆ ఇద్దరూ ఎప్పుడూ ఒకటి కారు. ఒకరినొకరు వెనుక తిట్టుకుంటూనే వుంటారు. ఈ 'సమైక్యత' నినాదంతో చరిత్రలో ఎక్కువగా నష్టపోయినవాళ్లు జర్మనీలోని యూదు జాతీయులే. జర్మన్ల కంటే యూదులే శాస్త్ర, సాంకేతిక, కళా, సాంస్కృతిక రంగాల్లో జర్మనీకి ఎక్కువ సేవ చేశారు. రెండు తెల్లజాతి సమూహాల మధ్య సమైక్యత అనే పదానికి అర్థం 'కలుపుకొనిపోవటం' యూదులు ఆ విధంగా జర్మన్లతో కలిసి చివరికి హిట్లర్ చేతిలో అన్ని బాధలూ పడ్డారు.

ఒకసారి 'సమైక్యజీవులు' నా క్రిస్టియన్ వ్యతిరేకత గురించి అడిగితే, నేను క్రీస్తును నమ్ముతాను కానీ క్రైస్తవమతాన్ని కాదని చెప్పాను. క్రీస్తు తాను జీవించినంత కాలమూ బోధించిన ప్రేమ సందేశాన్ని తెల్లవాడే వక్రమార్గంలో పెట్టాడని చెప్పాను.

ముహమ్మద్‌ను కలవటానికి షికాగో, ఫీనిక్స్‌లకు పోయిన ప్రతిసారీ నా మీద తనకున్న నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశాడు. ఆయన మక్కాయాత్రకు పోయినప్పుడు నేషన్ ఆఫ్ ఇస్లాం ఇన్‌ఛార్జి బాధ్యత నాకు అప్పగించి పోయాడు. కొన్నిరోజుల తర్వాత, హార్వర్డ్ లా స్కూల్ ఫోరం వాళ్లు నన్ను వక్తగా పిలిచారు. అనుకోకుండా అక్కడ ఒక కిటికీలోంచి బైటికి చూడటం తటస్థించింది. అక్కడ కనిపిస్తున్న అపార్ట్‌మెంటును చూడగానే, క్రూరంగా ఆలోచిస్తూ బతికిన నా గతకాలపు జంతు జీవితం గుర్తొచ్చింది. దాంతో నా మనసు కొద్దిసేపు అల్లకల్లోలమై అంతలోనే శాంతించింది. ఇస్లాంమతం గురించి నేను తెలుసుకోవటంవల్లే కదా ఆ పాపపంకిలం నుండి బైటపడింది అనుకున్నాను. అది అల్లా దయ. ఆ సమయంలో, నేను జైల్లో ఉన్నప్పుడు చదివిన ఒక గ్రీకు పౌరాణికగాథ గుర్తొచ్చింది. ఇకారస్ అనే పిల్లవాడుంటాడు. అతడి తండ్రి, రెక్కలకు మైనం పూసి గాలిలోకి ఎగురుతాడు. 'ఈ రెక్కలతో మరీ ఎత్తుకు ఎప్పుడూ ఎగరకు' అని తన కొడుక్కు చెపుతాడు. అయితే ఇక్కడికీ అక్కడికీ ఎగురుతూ, ఎగరటం ఇచ్చిన ఆనందంలో తానే స్వయంగా ఎగురుతున్నాననే ఆలోచనలో పడిపోయి చాలా ఎత్తుకు ఎగిరిపోతాడు. సూర్యుని వేడికి మైనం కరిగిపోయి రెక్కలతో సహా ఇకారస్ నేల కూలుతాడు. నేను ఆ కిటికీ ముందు అలాగే నిలబడి, 'నాకు రెక్కలిచ్చింది ఇస్లాం మతమేనని ఎప్పటికీ మరచిపోను' అని మనసులోనే నిశ్శబ్దంగా అల్లాకు ప్రమాణం చేశాను. ఆ వాస్తవాన్ని ఒక క్షణంపాటు కూడా నేనెప్పుడూ మరిచిపోలేదు.

అధ్యాయం - 16

# బహిష్కరణ

1961లో ముహమ్మద్ ఆరోగ్య పరిస్థితి అకస్మాత్తుగా క్షీణించింది. ఈ విషయాన్ని ఆయన అధికారులమైన మేము, ఆయన కుటుంబసభ్యులు రహస్యంగా వుంచాం. ఎందుకంటే, ఏ పెద్ద ఊరేగింపు జరిగినా ఆయన వుండటాన్ని ఆశిస్తున్న ముస్లింలకు నిరాశ కలగకుండా చేయటమే మా ఉద్దేశ్యం.

నిజానికి ముహమ్మద్ మొదట్లో నన్ను చాలా చిన్న దేవాలయానికి పంపించాడు. అయితే ఇప్పుడు నేను, నేషన్ స్థాపించిన వాటిల్లోకల్లా శక్తివంతమైన, పోరాటపటిమగల మూడు మసీదుల్ని మ్యాన్‌హట్టన్, క్వీన్స్, బ్రూక్లిన్‌లలో నిర్మించాను. జాతీయ ప్రాతిపదికగా యాభై రాష్ట్రాలలో వందకుపైగా దేవాలయాలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో నా ప్రమేయంతో స్థాపించినవే. ఒకవైపు రేడియో, టెలివిజన్, ప్రసంగాలతో క్షణం తీరిక లేకుండా వున్నాను. ముహమ్మద్ ప్రతినిధిగా ఈ పనులన్నీ ఆయన నాకిచ్చిన రెక్కలతోనే ఎగురుతూ చేశాను.

ముహమ్మద్ అనారోగ్యంగా వున్న కాలంలోనే అసూయతో ఆయన నా మీద చేసిన దుష్ప్రచారానికి కొన్ని సాక్ష్యాలు దొరికాయి. సంస్థను నా గుప్పిట్లో పెట్టుకోవాలని చూస్తున్నానని, అమెరికా అంతటా ధనవంతుడిగా కనిపిస్తూ తిరగటం నాకిష్టమని వచ్చిన ఆరోపణలను నేను పట్టించుకోలేదు. నేను బాగా డబ్బు సంపాదిస్తున్నానని ముస్లిమేతరుల్లో బాగా పుకారు పుట్టింది. నా చేతిలో డబ్బు వుండిన మాట నిజమే. ముహమ్మద్ తనేనెంత అడిగితే అంత ఇచ్చేవాడు. అయితే అందులో ప్రతిపైసా నేను నేషన్ ఆఫ్ ఇస్లాం పేరు అందరికీ తెలియటం కోసమే ఉపయోగించానని ఆయనకు, ముస్లిం అధికారులకు తెలుసు. డబ్బుపట్ల నా వైఖరి, ఇంట్లో నాకూ నా భార్య బెట్టీకీ మధ్య ఎప్పుడూలేని గొడవలు పెరిగేట్టు చేసింది. కుటుంబం కోసం కొంత డబ్బు పక్కకు తీసి పెట్టాలని ఆమె అంటే అందుకు నేను తిరస్కరించాను. వ్యక్తిగతంగా లాభపడటానికి ప్రయత్నించిన నాయకులవల్లా, వాళ్లను ఆ పని చేయమని ముల్లుకర్రతో పొడిచే భార్యలవల్లా ఎన్నో సంస్థలు నాశనమయ్యాయని ఆమెకు వివరించాను. నా కుటుంబానికి అన్నిరకాలుగా సంస్థనే భద్రత కల్పిస్తుందని నచ్చజెప్పాను.

నా వెనుక జరుగుతున్న ప్రచారానికి బలమిచ్చే విధంగా 1962లో సంస్థ

పత్రికలో, నాకంటే 'సమైక్య' నీగ్రో నాయకుల గురించి ఎక్కువగా రాయటం గమనించాను. అప్పుడు ప్రచురణకర్తగా వున్న ముహమ్మద్ కొడుకు నా గురించి సాధ్యమైనంత తక్కువగా రాయమని చెప్పాడు. విచిత్రమేమంటే నా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల గురించి యూరోపియన్, ఆసియన్, ఆఫ్రికన్ పత్రికల్లో ఎక్కువగా చదవటం. ఇది నా ప్రచారానికి సంబంధించిన సమస్య కాదు. నాకు అప్పటికే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వుంది. సంస్థ తరపున జరిగిన కార్యక్రమాలు కేవలం నా నాయకత్వంలో జరిగాయనే కారణంగా సొంత పత్రికలో అచ్చు వేయకపోవటం నన్ను ఎక్కువగా బాధించింది. కొద్ది రోజులకు నన్ను పూర్తిగా పక్కన పెట్టాలనే నిర్ణయం కూడా తీసుకున్నారు. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో ఎనిమిదివేల మంది విద్యార్థులనుద్దేశించి నేను మాట్లాడినప్పుడు, హార్లెమ్‌లో ఏడువేల మందితో ఊరేగింపు జరిపినప్పుడు 'షికాగో హెడ్‌క్వార్టర్స్' (ముహమ్మద్) నుండి నాకు నిరుత్సాహమే ఎదురైంది. అయినా, మరుసటి వారమే హార్లెమ్‌లో అంతకన్నా పెద్ద ఊరేగింపు నా నాయకత్వంలో జరిగింది. అది సహజంగానే 'షికాగో'లో అసూయ పెంచింది. అప్పటికీ మనిషిగా నాకు సాధ్యమైనంతవరకూ ఈ విషయాలన్నిటినీ నా మనసులో తుడిచిపెట్టి, పనిమీదే దృష్టి పెట్టాను. ఎందుకంటే, సంస్థను, ముహమ్మద్‌ను నేను ప్రేమించాను.

1963లో 'మాల్కం మంత్రుల'ను తప్పుబట్టినందుకు, న్యూయార్క్ ముస్లిం సోదరులకు డబ్బిచ్చి ఇతర రాష్ట్రాలలో మసీదుల స్థాపనకు పంపించటం మానేశాను. అమెరికాలో నల్ల ప్రజల తరఫున శక్తివంతమైన అభిప్రాయం వినిపించటం చాలా అవసరమైన ఆ కాలంలో, 'లైఫ్' మ్యాగజైన్ నా మీద ఓ కథనాన్ని ప్రచురించాలనుకుంది. నేను తిరస్కరించాను. 'న్యూస్‌వీక్' నా ముఖచిత్ర కథనం వెయ్యాలని చూసినప్పుడూ తిరస్కరించాను. పత్రికల్లో కనిపించే ప్రముఖ వ్యక్తుల్లో మొదటి వరుసలో వున్నవాడిగా నాపై కార్యక్రమం ప్రసారం చేస్తామని టెలివిజన్‌వాళ్లు అడిగినప్పుడు కూడా నేను తిరస్కరించాను. మీడియా నాకు అధిక ప్రాముఖ్యతను ఇస్తోందని 'షికాగో' అసూయపడటమే నా తిరస్కారానికి కారణం.

1963లో ముహమ్మద్ నన్ను మొదటి జాతీయ మంత్రిగా నియమించాడు. అదే సంవత్సరం చివరలో ఫిలడెల్ఫియాలో జరిగిన ఊరేగింపు సభలో, నన్ను కౌగిలించుకొని 'ఇతను నాకు నమ్మకస్తుడైన మంత్రి ప్రాణం పోయే వరకూ నన్ను అనుసరిస్తాడు' అని స్వయంగా ముహమ్మద్ ప్రజల ముందు బహిరంగంగా

ప్రకటించాడు. జనం ముందు మేమిద్దరమూ కనిపించటం అదే చివరిసారి. అంతకు కొన్ని రోజుల ముందే, బోస్టన్‌లో ఒక రేడియో కార్యక్రమంలో వుండగా ఎవరో ఒక పత్రిక తెచ్చి నా చేతిలో పెట్టారు. అందులో, లూసియానా సిటిజన్స్ కౌన్సిల్ నా చావుకు పదివేల డాలర్ల నజరానా ప్రకటించింది.

మినిస్టర్‌గా నేను పనిచేసిన పన్నెండు సంవత్సరాల కాలంలో స్త్రీలపట్ల నేను నిక్కచ్చిగానే వ్యవహరించాను. నా గత జీవితం నాకు నేర్పిన పాఠం అది. నేను స్త్రీ ద్వేషిననే అభిప్రాయం కూడా చాలామంది ముస్లింలకు వుండేది. నైతిక ప్రవర్తనపట్ల నేను అంత కఠినంగా వుండటమే దానిక్కారణం. 1963లో నన్ను గమనించిన వాళ్లెవరైనా, ముస్లింలకు నేను మతం గురించి చాలా తక్కువగా చెప్పానని, సామాజిక సిద్ధాంతాలు, వర్తమాన రాజకీయాలు, సంఘటనల గురించే ఎక్కువగా చెప్పానని ఒప్పుకుంటారు. ఎలైజా ముహమ్మద్ ముస్లింలకు ద్రోహం చేశాడని నాకు తెలియటంతో నా నమ్మకం పునాదులతో సహా కదిలింది. ఈ కారణంగానే మతం గురించి ఎక్కువగా చెప్పలేదు. దీనికి రుజువుగా పత్రికలు, రేడియోలు, టెలివిజన్‌లలో వచ్చిన ఒక వార్త మీ ముందుంచుతున్నాను.

'నల్లముస్లిం ఉద్యమ నాయకుడైన అరవైఏడేళ్ల ఎలైజా ముహమ్మద్ తన వ్యక్తిగత కార్యదర్శులుగా పనిచేసిన ఇద్దరు అమ్మాయిలతో లైంగిక సంబంధం కలిగివున్నాడు. తమ నలుగురు పిల్లలకు తండ్రి ముహమ్మదే అని ఆ యువతులిద్దరూ దావా వేశారు. 1957 నుండీ వీళ్ల మధ్య సంబంధాలున్నాయి.'

1955లోనే చూచాయగా ఈ మాట విన్నాను. కానీ, 'అల్లాదూత' అంత అనైతికంగా ప్రవర్తించటమనే ఆలోచనే నన్ను భయపెట్టింది. అందుకే, నా మనసే దాన్ని అంగీకరించలేదు. ఆ తర్వాత, ముహమ్మద్ దగ్గర పనిచేస్తూ గర్భవతులు అయినందుకు వాళ్లిద్దర్నీ జనరల్‌బాడీ ముందు నిలబెట్టి ప్రశ్నిస్తే వాళ్లు ఒప్పుకున్నారు. కారకుడైన వ్యక్తి పేరు చెప్పలేదు. కానీ, తప్పు చేసినట్టు మాత్రం ఒప్పుకున్నారు. ఆ నేరానికి మా తమ్ముడు రెగినాల్డ్‌కు ముహమ్మద్ విధించినట్టే వాళ్లిద్దరికీ బహిష్కార శిక్ష విధించాం. అంటే అయిదు సంవత్సరాలపాటు వాళ్లకు ఏ ముస్లింతోనూ సంబంధ బాంధవ్యాలుండవు. ఈ నియమాన్ని అనుసరించినందువల్లే, రెగినాల్డ్‌ను కూడా నేను మసీదులోకి రానివ్వలేదు. వాడికి అన్నను కావటానికి ముందు నేను ముస్లింననే నమ్మాను. ఆ తర్వాత వాడినింతవరకూ చూడలేదు.

1962 చివరికల్లా షికాగోలోని రెండో దేవాలయాన్ని ముస్లింలు విడిచిపెట్టి

పోతున్నారని నమ్మకస్తుల ద్వారా విన్నాను. ఆ పుకారు దావానలంలా వ్యాపిస్తూ వుంది. అది మీడియా చెవిలో పడితే సంస్థ పేరు ప్రతిష్ఠలు ఏమవుతాయోనని భయపడ్డాను. ఎన్నో రకాలుగా ఆలోచించి, ఇంక ఆ హింస భరించలేక నేరుగా ముహమ్మద్‌నే అడిగి తెలుసుకోవాలనే నిర్ణయానికి వచ్చి షికాగో వెళ్లాను. అక్కడ ఆయన రెండో కొడుకైన వాలేస్ ముహమ్మద్‌తో మాట్లాడాను. ఇద్దరం కలిసి ముహమ్మద్‌కు ఈ విషయంలో సహాయపడదామని చెప్పాను. ఆయన మన ప్రయత్నాలేవీ ఒప్పుకోడని వాలేస్ చెప్పాడు.

తర్వాత, 'బహిష్కార' నియమాన్ని ఉల్లంఘించి ఆ యువతులిద్దరినీ కలిశాను. తమ పిల్లలకు తండ్రి ముహమ్మదేనని వాళ్ల నోటివెంటే విన్నాను. అంతేకాదు, తన మంత్రుల్లోకల్లా నేను గొప్ప మంత్రినని, అయితే ఏదో ఒక రోజు నేను ఆయనను విడిచి తనకు వ్యతిరేకంగా మారుతానని, అందుకే నేను ప్రమాదకరమని కూడా వాళ్లతో చెప్పాడు. ముహమ్మద్, ఎదురుగా నన్ను పొగడుతూనే నా వెనక గోతులు తవ్వుతున్నాడని తెలుసుకోలేకపోయాను. అది నన్ను చాలా తీవ్రంగా బాధించింది. నేను ఏమీ చెయ్యకుండా మౌనంగా వుంటే సంఘకు చాలా నష్టం జరుగుతుందనే ఉద్దేశంతో ముహమ్మద్‌కు ఉత్తరం రాశాను. ఈసారి కలిసినప్పుడు అన్నీ మాట్లాడుకుందాం అని ఫోన్‌చేసి చెప్పాడు.

విధేయులైన ముస్లింలకు, ముహమ్మద్‌కు మధ్య ఒక వంతెన నిర్మించాలనుకున్నాను. ఈ పనిలో వాలేస్ నాకు సహాయపడ్డాడు. ఇద్దరం కలిసి ఖురాన్, బైబిల్ మరోసారి జాగ్రత్తగా తిరగేశాం. గోలియాను చంపిన డేవిడ్‌కు బాత్‌షీబాతో, హీబ్రూలను బానిస చెర నుండి విడిపించిన మోజెస్‌కు ఇథియోపియా స్త్రీలతో అక్రమ సంబంధాలున్నా వాళ్లు చేసిన మంచి పనులే చరిత్రలో మిగిలిపోయాయి. ఈ పద్ధతితోనే ముహమ్మద్‌కు సహాయం చేసి సంస్థను రక్షించుకోవాలని మా ఆలోచన. షికాగోలో పుట్టిన వార్త దేశంలోని మిగతా నగరాల మసీదులకు అప్పటికింకా పాకలేదు. షికాగోలో మాత్రం ముస్లిం వ్యతిరేక ధోరణి, ముహమ్మద్ కుటుంబంపట్ల వ్యతిరేకత నాకు స్పష్టంగా కనిపించింది.

1963 ఏప్రిల్‌లో ఫీనిక్స్‌కు వచ్చి తనను కలవమని ముహమ్మద్ చెప్పాడు. నన్ను చూడగానే, ఎప్పటిలాగే కౌగిలించుకున్నాడు. వెంటనే నన్ను తన స్విమ్మింగ్ పూల్ పక్కకు తీసుకొనిపోయాడు.

ఆయన అల్లాదూత. నేను తప్పుడు పనులుచేసి నేరస్తుడినై సైతాన్‌గా

అందరి నోళ్లలో నానుతున్నప్పుడు నన్ను ఆయన రక్షించాడు. నాకు శిక్షణనిచ్చి తన కన్నకొడుకులాగే నన్ను ఆదరించాడు. నేను కలలో కూడా ఊహించని ప్రదేశాల్లో తిరిగి పనులు చేయటానికి నాకు రెక్కలిచ్చాడు.

అప్పుడు నా మనసు సుడిగుండంలా వుంది.

'సరే, నీ మనసులో ఏమనుకుంటున్నావు?' అని అడిగాడు.

ఉన్నదున్నట్టు చెప్పాను. ఖురాన్, బైబిల్ చదివానని చెప్పాను.

'నాకేమీ ఆశ్చర్యం కలిగించలేదు. దైవవాణిని, ఆధ్యాత్మిక విషయాలను నువ్వెప్పుడూ సరిగ్గానే అర్థం చేసుకున్నావు. తలపండిన వాడికుండే అవగాహనాశక్తి నీకుంది. నేను కూడా డేవిడ్, మోజెస్ లాంటివాడినే. నేను కూడా ఆ విషయాలన్నిటినీ తృప్తిపరచాలి'

ఈ విషయమై అప్పటికే సందిగ్ధంలో వున్న ఆరుమంది ఈస్ట్‌కోస్ట్ ముస్లిం అధికారులకు ఈ విషయం చెప్పాను. 1963 నవంబర్ 22న కెన్నడీని హత్యచేసిన కొన్ని గంటల్లోపే, ప్రతి ముస్లిం మినిస్టర్‌కూ ముహమ్మద్ నుండి రెండు ఆ దేశాలు పోయాయి. ఆ హత్య గురించి ఎవరేమి అడిగినా 'నో కామెంట్' అని మాత్రమే చెప్పాలని, న్యూయార్క్‌లో తనకు బదులు నేను ప్రసంగం చేయాలని ఆదేశించాడు. మ్యాన్‌హటన్ సెంటర్‌లో నేనే ప్రసంగించాను. ప్రశ్నోత్తరాల సమయం మొదలుకాగానే ఎవరో విలేకరి, కెనడీ హత్య గురించి మీరేమనుకొంటున్నారు? మీ అభిప్రాయం ఏమిటి? అని అడిగాడు. నేను దాటవేయలేని పరిస్థితి. అందుకే, 'తెల్లవాడి ద్వేషం నోరులేని నల్లవాడినే కాదు, అది చివరికి దేశాధ్యక్షుడిని కూడా పొట్టన బెట్టుకుంది. గతంలో తెల్లవాడు చేసిన తప్పులే ఈ పరిస్థితికి కారణమయ్యాయి' అని రెండో ఆలోచన లేకుండా నేను మనస్ఫూర్తిగా అనుకున్నది చెప్పాను. మరుసటి రోజు అన్ని పత్రికలు, రేడియోలు, టీవీల్లో 'నాటి పాపం నేటి శాపం : మాల్కం ఎక్స్' అనే శీర్షికతో నా అభిప్రాయాన్ని ప్రకటించాయి.

ఆ వార్త చదివి, ముహమ్మద్ వెంటనే తనను షికాగోలో కలవమని చెప్పాడు. ఆ అభిప్రాయం ఏమీ బాగలేదు. దేశమంతా ఆయన కోసం ఏడుస్తున్న సమయంలో అలా మాట్లాడితే అది ముస్లింలపైన ప్రభావం చూపుతుంది' అని ముహమ్మద్ నన్ను మందలించాడు.

'నీవు తొంభై రోజులపాటు నిశ్శబ్దంగా వుండు. దాంతో ఈ తప్పు నుండి ముస్లింలు అన్నిచోట్లా బైటపడతారు.' నేనేమీ మాట్లాడలేదు. ఆయన చెప్పింది

కాదనటం క్రమశిక్షణా చర్య కిందికి వస్తుంది కాబట్టి 'నూటికి నూరు శాతం మీరు చెప్పినట్టే చేస్తాను. నా తప్పు ఒప్పుకుంటున్నాను' అని చెప్పాను. మానసికంగా సంసిద్ధుడినవుతూ న్యూయార్క్‌లోని నా ఏడుమంది సహాయ మంత్రులకు ఈ విషయం చెపుదామని బయల్దేరాను. నేను అక్కడికి చేరుకునేలోపే, షికాగో అధికారులు మీడియాకంతా ఈ విషయమై టెలిగ్రాం పంపించారు. 'ఒకవేళ తప్పు ఒప్పుకుంటే' తొంభై రోజుల్లో మాల్కం మళ్లీ బాధ్యతలు స్వీకరిస్తాడు అని నేషన్ ఆఫ్ ఇస్లాం అంతటా ఒక ప్రకటన చేశారు. అది నాకు అనుమానం కలిగించింది. మనస్ఫూర్తిగా తప్పు ఒప్పుకున్నా నేను తిరుగుబాటు చేశాననే భావన ఉద్దేశపూర్వకంగా ముస్లింలందరికీ కలిగించారు.

నేషన్ ఆఫ్ ఇస్లాం అధికారులు నన్ను చంపటం గురించి కూడా ఆలోచిస్తున్నారని తెలిసింది. నా మెదడులో నరాలు చిట్లి లోపలివైపు నెత్తురోడుతున్నట్టనిపించింది. మెదడు చితికిపోయిందేమోననుకున్నాను. లాంగ్ ఐలాండ్‌లో మా ఫ్యామిలీ డాక్టరైన డాక్లర్ లియోనా ఎ. టర్నర్ దగ్గరికి పోయి నా మెదడును పరీక్షించమని అడిగాను.

ఆమె పరీక్షించి, నేను చాలా వత్తిడిలో వున్నాని, నాకు విశ్రాంతి అవసరమని చెప్పింది. సరిగ్గా ఈ సమయంలోనే కాసియస్‌క్లే నన్ను, నా కుటుంబాన్ని తన ఇంటికి అతిథులుగా ఆహ్వానించాడు. అప్పుడు అతను మియామీలో ప్రపంచ హెవీవెయిట్ బాక్సింగ్ శిక్షణలో వున్నాడు. నేను అతడిని 1962లో డెట్రాయిట్‌లో కలిశాను. అక్కడి మసీదుకు వచ్చి ముస్లిం ర్యాలీలో తన సోదరుడితో సహా ఉత్సాహంగా పాల్గొన్నాడు. కపటంలేని అతని మనస్తత్వం చూడగానే ఆకర్షించేది. నా ఇంటికి వచ్చిన అతి కొద్దిమందిలో కాసియస్ ఒకడు. నా భార్య, పిల్లలకు కూడా అతనంటే ఎంతో అభిమానం.

మా పెళ్లి అయిన తర్వాత బెట్టీ నాతో కలిసి బైటికి రావటం అదే మొదటిసారి. నా ముగ్గురు పిల్లలూ ఆ యోధుడితో బాగా కుస్తీలు పట్టారు.

న్యూయార్క్ నగరానికి దూరంగా వుండటంవల్ల న్యూస్ మీడియా తలనొప్పి నుండి బైటపడ్డాను. అప్పటికే నేను మానసికంగా కుంగిపోయాను. నన్ను భయపెట్టింది చావు కాదు. నమ్మకద్రోహం. ఈ పన్నెండు సంవత్సరాల్లో అవసరమైతే ముహమ్మద్ కోసం నా ప్రాణం ఇవ్వటానికి కూడా నేనేనాడూ వెనుకాడలేదు. బెట్టీ కూడా ఏమీ మాట్లాడలేదు. ఆమెకు అల్లా మీద నమ్మకం.

నాకు ఏమి జరిగినా ఆమె నాతోనే వుంటుందని నా నమ్మకం. తర్వాత మేం మియామీ నుండి వెళ్లిపోయాం.

నేను కాసియస్‌క్లేతో చనువుగా వుండటాన్ని కూడా షికాగోలో ముస్లిం అధికారులు తప్పుపట్టారు. గెలుపు కోసం క్లే ప్రార్థన చేయలేదని కూడా వాళ్లు భావించారు. అతడి గురించి సంస్థ పత్రికలో ఒక్కమాట కూడా రాయలేదు. అందుకే, అతడిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాలని నిర్ణయించుకొని మళ్లీ మియామీకి వచ్చి అతడితోపాటే వున్నాను. మియామీలో పోటీ మొదలైంది. ప్రత్యర్థి లిస్టన్ ఓడిపోయాడు. కాసియస్ ప్రపంచ హెవీవెయిట్ ఛాంపియన్‌గా అవతరించాడు. మరుసటిరోజు 'నేను ఒక నల్లముస్లిం' అని ప్రకటించి అంతర్జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించాడు.

ఏడో మసీదు అధికారి, గతంలో నాకు సహాయమంత్రిగా పనిచేసిన సహచరుడు నన్ను చంపమని మొదటిసారి ఆజ్ఞ జారీ చేశాడు. మరో సహాయమంత్రి ఆ పనికి సిద్ధపడ్డాడు. అతను 'నిర్మూలనా జ్ఞానం' వున్నవాడు. కారులో బాంబు పెట్టి నన్ను చంపమని అతడిని ఆదేశించారు. అయితే నేషన్ ఆఫ్ ఇస్లాంకు నేనెంత నమ్మకంగా సేవ చేశానో ప్రత్యక్షంగా చూసినవాడు కావటంవల్ల నేరుగా నా దగ్గరికి వచ్చి విషయం చెప్పాడు. షికాగోలో అసలు ఏం జరుగుతుందో అతనికి వివరించాను. అతడు నమ్మలేకపోయాడు. అయితే, మిగతా మంత్రులందరితో మాట్లాడి నన్ను చంపకుండా వుండేట్లు ఒప్పిస్తానని చెప్పి వెళ్లిపోయాడు. దాంతో, ఇంక నేషన్ ఆఫ్ ఇస్లాంతో మానసికంగా కూడా తెగతెంపులు చేసుకున్నాను. ఆ తర్వాత నగరంలోని ముఖ్య ప్రదేశాల్లో నేను జాగ్రత్తగా గమనించాను. ఏ మాత్రం అవకాశం దొరికినా ఎవరో ఒక ముస్లిం నా ప్రాణం తీయాలని చూస్తున్నట్టు నా కనిపించింది.

నా బహిష్కరణ అన్నిచోట్లా నల్లవాళ్లను ఆలోచనలో పడేసింది. అన్నిచోట్లా నల్లవాడల్లో బతికేవాళ్లు నన్ను అప్పటికే తమ నాయకుడిగా భావించారు. అమెరికాలో 'ఏ క్షణమైనా అల్లరి సృష్టించి, ఆపగల ఏకైక నీగ్రో'గా అందరూ నా గురించి చెప్పుకుంటున్నారు. ఆ సమయంలో, చేసుకోవటానికి పనుల్లేక కనీస అవసరాలు తీరక నీగ్రోల్లో అసంతృప్తి, ఆగ్రహం పెరుగుతున్నాయి. వాళ్ల కోసం పోరాడే ఒక సంస్థ అవసరం. అందుకే, ఇప్పుడు లక్షమంది నల్లవాళ్లు దీని గురించి ఆలోచిస్తున్నారు. ఉత్తర అమెరికాలో తెల్లవాడి చెప్పు కింద చీమలా బతుకుతున్న నల్లవాడి కోసం ఒక సంస్థను స్థాపించి, నిర్మించటాన్ని సవాలుగా తీసుకున్నాను.

ఉత్తర అమెరికాలో నల్లవాడు ఆర్థికంగా ఎంత దుస్థితిలో వున్నాడో నిరూపించటానికి ఈ చిన్న వాస్తవం చాలు. నల్లవాడు వినియోగదారుడుగా తన వాటాకన్నా తక్కువ పొందుతాడు, ఉత్పత్తిదారుడిగా అతి తక్కువ ఇస్తాడు. దీనివల్ల ప్రతి దానికీ తెల్లవాడిపైనే ఆధారపడి బతుకుతాడు. నల్లవాళ్లు ప్రతి సంవత్సరమూ వాహనాలపైన మూడు బిలియన్ల డాలర్లకంటే ఎక్కు ఖర్చు పెడుతున్నారు. అయినా అమెరికాలో వాహన డీలర్లుగా నల్లవాళ్లు లేరు. విదేశాల నుండి దిగుమతి అయ్యే ఖరీదైన స్కాచ్‌విస్కీలో నలభై శాతం, హోదాల కోసం పడిచచ్చే నల్లవాడే తాగుతున్నాడు. అయినా నల్లవాళ్ల చేతుల్లో ఒక్క డిస్టిలరీ కూడా లేదు. ఇంతకన్నా సిగ్గుచేటైన సంగతి మరొకటుంది. పట్టుమని పదిమందిని పనిలో పెట్టుకోగలిగిన నల్ల వ్యాపారస్తులు మొత్తం న్యూయార్క్ నగరంలోనే ఇరవైమందికి మించి లేరు.

ఈ ఉత్తర అమెరికా నల్లవాళ్లు రాజకీయంగా కూడా బలహీనులే. మొత్తం జనాభాలో కోటిమంది నల్లవాళ్లు తెల్లవాడి రాజకీయాల కారణంగా 'ప్రజాస్వామిక వాదులు'గా, 'గణతంత్రవాదులుగా', 'సంప్రదాయవాదులు'గా, 'ఉదారవాదులు'గా విడిపోయారు. వీళ్లంతా కలిసికట్టుగా ఆలోచిస్తే అమెరికన్ రాజకీయాల్లో దేన్నయినా నిర్ణయించగలరు. ఈ రోజు అమెరికా రాజకీయాలను ప్రత్యేక ప్రయోజన బృందాలే శాసిస్తున్నాయి. విద్య, ఆరోగ్యం, సంక్షేమం, వ్యవసాయం, పరిశ్రమలు ఇలా అన్ని రంగాల్లో దోపిడీకి నల్లవాళ్ల ఓటు బ్యాంకును ఉపయోగించుకోవటమే తెల్లవాడి చాలా పెద్ద రాజకీయం.

అమెరికన్ నల్లవాడి మానసిక, ఆధ్యాత్మిక, ఆర్థిక, రాజకీయ పురోగతికి ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నాను. దీన్ని ఆచరణలో పెట్టటానికి నాకు మరికొంతమంది సహాయం కావాలి. నేషన్ ఆఫ్ ఇస్లాంలో అంకితభావంతో పనిచేసే ప్రతి ముస్లిమూ దాంతో తెగదెంపులు చేసుకొని నాతోటే వుంటానని ప్రకటించాడు. మిగతా నీగ్రోలూ వచ్చారు. మధ్యతరగతి నీగ్రోలు కూడా వచ్చారు. 'అందరినీ సమీకరించే సమావేశం ఎప్పుడు పెడుతున్నావు?' అని వీళ్లంతా నన్ను అడగటం మొదలుపెట్టారు.

హార్లెమ్‌లోకల్లా సున్నిత ప్రాంతమైన సెవెన్త్ అవెన్యూలోని హోటల్ థెరిసాలో మొదటి సమావేశానికి ఏర్పాట్లుచేశాను. అక్కడే ఒక కొత్త మసీదు ప్రారంభిస్తున్నట్టు 'ఆమ్‌స్టర్‌డ్యాం' పత్రికలో వార్త రావటంతో దేశం నలుమూలల నుండీ నాకు టెలిగ్రాములు, ఉత్తరాలు, ఫోన్లు రావటం మొదలుపెట్టాయి. ఈ క్షణం కోసమే

ఎదురుచూస్తున్నామని అందరూ చెప్పారు. మా విధానాలు బహిరంగంగా ప్రకటించకముందే చాలామంది డబ్బు కూడా పంపించారు. మిగతా నగరాల్లోని ముస్లింలు కూడా నాతో చేయి కలుపుతామని చెప్పారు. ఆశ్చర్యకరంగా, చాలామంది తెల్లవాళ్లు కూడా డబ్బు ఇవ్వటానికి సిద్ధపడ్డారు. 'మేం కూడా చేరవచ్చా?' అని అడిగారు. 'మా సంస్థలో నల్లవాళ్లు మాత్రమే వుండాలి. అయితే జాతి సమస్యలపై మేం చేయబోతున్న పోరాటాలకు మద్దతునిచ్చేవాళ్లు ఆర్థికంగా ఏ సహాయమైనా చేయవచ్చు' అని చెప్పాను. తెల్ల క్రైస్తవ మంత్రుల నుండి కూడా లెక్కలేనన్ని అభ్యర్థనలు వచ్చి పడటం నాకు ఆశ్యర్యం కలిగించింది. పత్రికా సమావేశం పెట్టాను. దేశ విదేశాల విలేకర్లంతా నాముందు కూర్చున్నారు. నేను చెప్పబోయేది రాసుకోవటానికి సిద్ధంగా వున్నారు.

'న్యూయార్క్ నగరంలో నేనో కొత్త ముస్లిం మసీదును ప్రారంభించ బోతున్నాను. హార్లెమ్‌లోని థెరిసా హోటల్ దీనికి తాత్కాలిక హెడ్ క్వార్టర్‌గా వుంటుంది. ఇరవై రెండు మిలియన్ల ఆఫ్రికన్ అమెరికన్లు అనుభవిస్తున్న రాజకీయ అణచివేతను, ఆర్థిక దోపిడీని, సామాజిక అసమానత్వాన్ని నిర్మూలించేందుకు కృషిచేసే కార్యాచరణ ప్రణాళికకు ఇది పునాది' అని ప్రకటన చేశాను. నేషన్ ఆఫ్ ఇస్లాం నుండి నా ప్రాణానికి వున్న ముప్పు గురించి ఆలోచించాను. 'అల్లా ఆదేశం' గా భావించే ముస్లిం తప్ప నన్నెవరూ చంపరని నిర్ధారణకు వచ్చాను.

నేను మరో పెద్ద ఏర్పాటు చేసుకోవాలి. అది చాలాకాలంగా నా మనసులో వున్నదే. దానికి డబ్బు కావాలి. అయితే అదిప్పుడు నా దగ్గర లేదు. అందుకే, బోస్టన్‌కు పోయాను. మా అక్కకు నేను కొన్నిసార్లు చాలా కోపం తెప్పించినా, టీనేజ్ కుర్రవాడిగా మొదటిసారి ఆమె దగ్గరికి వచ్చినప్పటి మాదిరే ఆమె నన్నెప్పుడూ ఆదరించింది. 'ఎల్లా, నేను మక్కాయాత్ర చేయాలనుకుంటున్నాను'.

'నీ కెంత డబ్బు అవసరం?'

అధ్యాయం - 17

# మక్కా

ప్రతి సాంప్రదాయ ముస్లిమూ కలలుగనే హజ్ యాత్రకు ఏర్పాట్లు చేసుకుంటున్నాను. ఆ సమయంలో చాలామంది నన్ను డాక్టర్ ముహమ్మద్ యాసిన్ షవార్బీని కలవమని చెప్పారు. ఆయనొక ముస్లిం విద్యావేత్త. అమెరికా, కెనడా దేశాల్లోని ఇస్లామిక్ సంఘాల సమాఖ్యకు డైరెక్టర్‌గా న్యూయార్క్‌లోనే వుంటున్నాడు. ఎన్నోసార్లు ఆ భవనం ముందు నుంచే పోయాను కానీ లోపలికెప్పుడూ పోలేదు. ఒక పత్రికా విలేకరి ద్వారా మేమిద్దరమూ పరిచయం చేసుకున్నాం. అప్పుడక్కడ ఎల్లా కూడా వుంది. షవార్బీతో కొద్దిసేపు మాట్లాడి ఇద్దరమూ ఇంటికి పోయాం. స్వతంత్రమైన వ్యక్తిత్వం నేషన్ ఆఫ్ ఇస్లాం నుండి ఆమెను బైటికొచ్చేలా చేసింది. తర్వాత, ఆమె సాంప్రదాయ ముస్లింల దగ్గర అరబిక్ అధ్యయనం చేయటం మొదలుపెట్టింది. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూనే అరబిక్ నేర్పే పాఠశాలను స్థాపించింది. అరబిక్ ఆమెకు ఒక్క ముక్క రాకపోయినా జీతాలిచ్చి మరీ ఉపాధ్యాయులను పెట్టింది. అదీ ఎల్లా వ్యక్తిత్వం! న్యూయార్క్‌కు తిరిగివస్తూ ఆమె గురించే ఆలోచించాను. ఆమె నా జీవితంలో చాలా ముఖ్యమైన పాత్ర పోషించింది. చాలామంది మగవాళ్ళకన్నా శక్తివంతురాలైన స్త్రీ ఆమె.

మక్కాయాత్ర కోసం సౌదీ అరేబియా కాన్సులేట్‌లో వీసా కోసం దరఖాస్తు చేసుకున్నాను. అయితే షవార్బీ అనుమతి పత్రం లేకుంటే ఏ నల్ల ముస్లింకూ అనుమతివ్వమని అక్కడి అధికారులు చెప్పారు. వెంటనే ఆయనకు ఫోన్ చేస్తే, తన దగ్గరికి రమ్మన్నాడు. పోగానే తను సంతకం చేసిన అనుమతి పత్రం నా చేతిలో పెట్టి ఓ పుస్తకం ఇచ్చాడు. ఆ పుస్తక రచయిత అరేబియా పాలకుడైన ప్రిన్స్ ఫైజల్‌కు సన్నిహిత సలహాదారు. ఆయనే నాకు ఈ పుస్తకం ఇవ్వమన్నాడని షవార్బీ చెప్పాడు. తన కొడుకుదీ, రచయిత కొడుకుదీ ఫోన్ నెంబర్లు ఇచ్చి, జెద్దాలో ఏ అవసరమొచ్చినా వాళ్ళకు ఫోన్ చేయమని ఆయన చెప్పాడు.

న్యూయార్క్ నుండి బయల్దేరాను. మధ్యలో ఫ్రాంక్‌ఫర్ట్‌లో కొంచెంసేపు గడిపి కైరోకి పోయే విమానమెక్కాను. అక్కడ రెండు రోజులుండి జెద్దా వెళ్లాను. అక్కడ కాలు పెట్టగానే, నన్ను ముస్లిం హైకోర్టుకు తీసుకొనిపోయారు. ముస్లింలు కాని వాళ్ళకు మక్కాలోకి ప్రవేశం లేదు. నేను నల్ల అమెరికన్ కాబట్టి నన్ను అక్కడ విచారించి కానీ అనుమతించలేదు.

దేశ విదేశాల నుండి వచ్చిన ముస్లింలందరితో కలిసి మక్కాకు బయల్దేరాను.

అచ్చమైన ఇస్లాం ప్రపంచంలో నేను పొందిన ఆనందం మాటల్లో చెప్పలేను. నాతోపాటు వచ్చేవాళ్లలో చాలామందికి ఇంగ్లీషు రాదు. నేను అమెరికన్ అని తెలుసుకున్న ప్రతి ఒక్కరూ నేనేదో అంతరిక్షంలోంచి వచ్చినట్టే చూశారు. పక్కనుండే వాళ్లతో నా మనసుకు ఏది తోస్తే అదంతా మాట్లాడాను. మధ్యలో ఒకసారి ముహమ్మద్ అలీక్లే' అన్నాను. ఆ మాట విన్న ఒక స్నేహితుడు సంతోషంతో నావైపు చూసి మీరేనా? అని అడిగాడు. 'కాదు. అతను నా స్నేహితుడు' అని చెప్పాను. క్రిస్టియన్ బాక్సర్ అయిన లిస్టన్‌ను ఓడించి, తన పేరు ముహమ్మద్ అలీ, తన మతం ఇస్లాం, తనకు విజయం చేకూర్చింది అల్లా అని కాసియస్‌క్లే ఆరోజే ప్రపంచానికి చాటిచెప్పాడు.

మక్కాయాత్రలో 'తెల్లవాడు' అనే మాట గురించి మరోసారి విమర్శనాత్మకంగా ఆలోచించాను. ఇక్కడ వుండే తెల్లవాళ్ల ఆదరణ చూసిన తర్వాత, మనిషి ప్రవర్తన, చేతలే ముఖ్యం కానీ 'రంగు' కాదని తెలుసుకున్నాను. ఆ సమయంలో 'తెల్ల'వాడికి సంబంధించి మొత్తంగా నా దృక్పథంలోనే మౌలికమైన మార్పు మొదలైంది. న్యూయార్క్ విడిచిపెట్టిన తర్వాత నేను ఒక్క వార్తాపత్రిక కూడా చదవలేదు. అసలు అక్కడ ఏమి జరుగుతుందో కూడా నాకు తెలీదు. హార్లెమ్‌లో పన్నెండు సంవత్సరాలుగా నడుస్తున్న ఒక 'రైఫిల్ క్లబ్'ను పోలీసులు కనుక్కున్నారని, దాని వెనుక నా హస్తం వుందని వార్త రావటంతో, నా కోసం కైరోలోని అమెరికా న్యూస్ ప్రతినిధులు గాలిస్తున్నారు. దాని గురించి నాకేమీ తెలీదు. అది తెలిసే సమయానికి నేను హజ్‌యాత్ర ముగించి, అక్కడ పరిచయమైన కొంతమంది స్నేహితులతో మౌంట్ అరాఫత్‌పై మాట్లాడుతూ వున్నాను. మొత్తానికి ఈ పదకొండు రోజుల మక్కాయాత్రలో అన్ని రంగుల మనుషులూ ఒకే దేవుడిని పూజించటం చూసిన తర్వాత నా ఆలోచనల్లో వచ్చిన మార్పు గురించి బెట్టీ, ఎల్లా, కొందరు సహాయకులు, షబాజ్‌లకు అందరికీ ఉత్తరాలు రాశాను.

నాకు కచ్చితమైన అభిప్రాయాలున్నా, వాస్తవాలను ఎదుర్కోవటానికీ, కొత్త అనుభవం, కొత్త జ్ఞానం తెలియజేసే జీవిత వాస్తవికతను ఆమోదించటానికీ నేనెప్పుడూ సిద్ధంగానే వున్నాను. సత్యాన్వేషణకు అవసరమైన మేధో నిజాయితీ ఏ రూపంలో వున్నా దాన్ని గుర్తించే శక్తి కూడా నాకుంది.

హజ్‌యాత్రలో, ఉన్నతస్థానాల్లో వున్న వ్యక్తులు నన్ను బాగా ఆదరించారు. నన్నో ప్రభుత్వ అతిథిగా గుర్తించారు. హజ్‌కోర్టు నేనెప్పుడు కోరుకుంటే అప్పుడు మక్కాయాత్ర చేయవచ్చని, నేను ఎప్పుడు వచ్చినా ఎక్కడికి పోయినా సకల సౌకర్యాలతో ప్రభుత్వమే అన్ని ఏర్పాట్లూ చేస్తుందని హామీ ఇచ్చింది. అదంతా అల్లా దయ.

అధ్యాయం - 18

# ఎల్-హజ్ మాలిక్ ఎల్ షాబాజ్

నేను చేసిన హజ్‌యాత్ర చరిత్రలోనే చాలా పెద్దదని తర్వాత తెలిసింది. అయితే ఆ పవిత్రభూమిలో ఎక్కడ చూసినా సాఫ్ట్ డ్రింకులు, సిగరెట్లూ కనిపించాయి. 'అమెరికా నుండి వచ్చిన ముస్లిం' అని చుట్టూ వున్నవాళ్లంతా నావైపు ఆశ్చర్యంగా చూశారు. నేనెక్కడికి పోయినా వర్ణ వివక్షకు సంబంధించిన ప్రశ్నలే అడిగారు. జెద్దా ప్యాలెస్ హోటల్లో నా ఉపన్యాసం వినటానికి వివిధ దేశాల వాళ్లను ఆహ్వానించారు. అమెరికాలో నల్లవాళ్ల పరిస్థితిని వివరించాక ప్రతి ఒక్కరూ నన్ను సమర్థించారు.

తెల్లవాళ్లు కాని ఇతర జాతుల ప్రజలు తమను ఎంతగా అభిమానిస్తారో, సోదరభావంతో వుంటారో అమెరికన్ నీగ్రోలకు తెలీదు. హజ్‌యాత్ర తర్వాత నేను తెలుసుకున్న ముఖ్యమైన విషయం ఒకటుంది. అమెరికాలోని ఏ నల్ల నాయకుడైనా తప్పనిసరిగా ప్రపంచంలోని శ్వేతేతరుల మధ్య తిరగాలి. ఆ నాయకులతో సమావేశం కావాలి. అమెరికన్ నల్ల నాయకుడికి వుండే తీవ్రమైన సమస్య భావనాశక్తి లేకపోవటం. అతని ఆలోచనా విధానం, వ్యూహాలు చాలా పరిమితమైనవి. అవి కూడా తెల్లవాడు సలహా ఇచ్చినవో ఆమోదించినవో మాత్రమే అయి వుంటాయి. అన్నిటికన్నా ముఖ్యమైన విషయమేమిటంటే, అమెరికన్ అధికారచక్రం ఏ నల్లవాడినీ అంతర్జాతీయంగా ఆలోచించటం మొదలుపెట్టనీయదు. నా దృష్టిలో అమెరికన్ నల్ల సంస్థలు, వాటి నాయకత్వాలు ఆఫ్రికాలోని స్వతంత్ర దేశాలకూ, అమెరికన్ నల్ల ప్రజలకూ మధ్య ప్రత్యక్ష సోదర సంబంధాన్ని నెలకొల్పటంలో ఘోరంగా విఫలమయ్యాయి. ఆఫ్రికా దేశాల నాయకులు అమెరికా ప్రభుత్వం చెప్పేది నమ్మకుండా, ప్రతిరోజూ అక్కడి నల్లవాళ్ల పోరాటాల గురించి తెలుసుకుంటూనే వుంటారు.

ప్రిన్స్ ఫైజల్ నన్ను పిలిపించాడు. వెళ్లి, నాపట్ల చూపిన ఆదరణకు కృతజ్ఞతలు చెప్పాను. తాను ఈజిప్టియన్ రచయితలతో ఏకీభవిస్తున్నానని, అమెరికాలోని నల్ల ముస్లింలకు తెలిసింది నిజమైన ఇస్లాం కాదని ఆయన చెప్పాడు. నా హజ్‌యాత్ర కూడా దాన్ని తెలుసుకోవాలనే చేస్తున్నాని చెప్పాను. 'బాగుంది' అంటూనే, ఇస్లాం గురించి ఇంగ్లీషులో విస్తృతంగా అనువాద సాహిత్యం వుంది కాబట్టి. తప్పుడు ఇస్లాంను నమ్మి నిజాయితీపరులు దారి తప్పిపోవటం క్షమించరానిదని

అన్నాడు.

1964 ఏప్రిల్ నెల చివరి రోజున బీరూట్‌తో మొదలుపెట్టి, నైజీరియా, ఘనా, మాన్రోవియా, లైబీరియా, డకార్, సెనెగల్, అల్జీరియాలలో విద్యార్థులు, పత్రికా ప్రతినిధులు, వివిధ దేశాల రాయబారులతో చర్చలు, ఉపన్యాసాలు, సందర్శనలు పూర్తి చేసుకొని మే 21న న్యూయార్క్‌లో అడుగుపెట్టాను.

ఎయిర్‌పోర్టులో నేను అడుగుపెట్టినప్పటి నుండీ న్యూస్ మీడియా నా వెంటపడింది. నా మక్కాయాత్ర గురించి, రైఫిల్ క్లబ్ గురించి, హార్లెమ్ తెల్ల దంపతులను హత్యచేసి 'బ్లడ్ బ్రదర్స్' అని చెప్పుకున్న ఎవరో నీగ్రో యువకుల గురించి నన్ను చాలా ప్రశ్నలడిగారు. నాకు సంబంధంలేని విషయాలను కొట్టి పారేశాను.

మరుసటి రోజు ఉదయం నేను కారులో పోతూండగా రెడ్‌సిగ్నల్ చూసి ఆగాను. అంతలో నా పక్కనే వున్న కారులోంచి ఒక తెల్లవాడు, 'మాల్కం ఎక్స్' అని పిలిచి నావైపు చెయ్యి చాచాడు. నేనూ చెయ్యి కలిపాను. 'ఒక తెల్లవాడితో చెయ్యి కలిపితే ఏమైనా అనుకుంటారా? అని అడిగాడు. 'మనుషులతో చెయ్యి కలిపితే నేనేమీ అనుకోను. మీరు అలాంటివారేనా?'

అధ్యాయం - 19

# అసురసంధ్య

మక్కా నుంచి తిరిగి వచ్చాక, మతభేదం లేకుండా కేవలం 'నల్లవాళ్లు' అనే మాటను మాత్రమే ఉపయోగిస్తూ ఉపన్యసించటం మొదలుపెట్టాను. అలా చేయటంవల్ల ప్రజల నుండి బాగా స్పందన వచ్చింది. అంతర్యుద్ధం తెచ్చిన 'స్వాతంత్ర్య' కాలం నుండీ నల్లజాతి నాయకత్వమూ, క్రైస్తవమతమూ నల్లవాడిని 'తెలివైనవాడుగా' తీర్చిదిద్దాయి.

వర్ణ వివక్షకు దూరంగా మక్కాకు పోయిన తర్వాతే అమెరికన్ నల్లవాడి పోరాటం, అతని సమస్యలు, సత్యం, న్యాయం అనే విషయాలకు సంబంధించి నా అన్వేషణ పదునెక్కింది.

'ఎవరు చెప్పినా సరే నేను సత్యం, న్యాయం కోసమే వున్నాను. నేను మొదటగా అంతిమంగా మనిషిని. మొత్తంగా మానవత్వానికి ఎవరు ఎలా లాభం చేకూర్చినా సరే నేను ఆవైపే వుంటాను'. తెల్ల సమాజం నాకు 'అమెరికాలోకెల్లా ఆవేశపరుడైన నీగ్రో' అనే బిరుదు ఇచ్చింది. నేను దాన్నేమీ కాదనటం లేదు. నా మనసులో వున్నదే నేను చెప్పాను. 'ఆవేశం'లో నాకు నమ్మకముంది. ఆవేశం రావటానికి 'కాలం' వుంది అని బైబిల్ చెపుతుంది. నేను హింసను ప్రబోధిస్తున్నానని కూడా అన్నారు. నేను ఉద్దేశపూర్వక హింసకు వ్యతిరేకిని. నాకు కావాల్సింది కూడా న్యాయమే. అయితే, నల్లవాళ్లు తెల్లవాళ్ల మీద దాడిచేసినప్పుడు వాళ్లను రక్షించటంలో చట్టం, పోలీసులు విఫలమైనప్పుడు తెల్లవాళ్లు తమని తాము రక్షించుకోవటానికి ఆయుధాలు పట్టుకోవటంలో ఏ మాత్రమూ తప్పు లేదు. ఇదే మాట నల్లవాళ్ల విషయంలో కూడా వర్తిస్తుంది.

"మాల్కం ఎక్స్ సాయుధ నీగ్రోలను వెనకేసుకొస్తున్నాడు'. అవును. అందులో తప్పేముంది? ఒక మనిషి తనను తాను రక్షించుకునే ప్రయత్నమే చేయకుండా, పాశవికత్వానికి బలికావటాన్ని ఆమోదించటానికే పాశవీకరించబడటం ఎవరు చేసినా అది నా దృష్టిలో నేరమే. దాన్నే క్రైస్తవ తత్వశాస్త్రం, గాంధేయ తత్వ శాస్త్రం బోధించింది. అందుకే, వాటిని నేను నేరపూరిత తత్వశాస్త్రాలని పిలుస్తాను.

ప్రతి ఉపన్యాసంలోనూ తెల్లవాళ్లకు సంబంధించి నా కొత్త దృక్పథాన్ని స్పష్టంగా చెప్పాను. 'నేను తెల్ల' 'జాత్యహంకారుల'కే తప్ప తెల్లవాళ్ళందరికీ వ్యతిరేకిని కాను.

వాళ్లలో నిజాయితీ, మంచితనం వున్న వాళ్లు కూడా చాలామంది వున్నారు. అయితే, జాత్యహంకారులకు వ్యతిరేకంగా పోరాడే హక్కు మాత్రం నీగ్రోలకుంది, అవసరమైతే ఏ విధంగానైనా సరే అని నేను కచ్చితంగా నమ్ముతున్నాను'

తెల్లవిలేకర్లు ఎప్పుడూ నన్ను 'హింస' అనే మాటకు ముడిపెట్టాలనే చూశారు. ఒక ఇంటర్వ్యూలో దీనికి ఇలా సమాధానమిచ్చాను.

హింసను కేవలం 'వదిలించుకొని' అమెరికన్ నల్లవాడి సమస్యకు పరిష్కారాన్ని వాయిదావేస్తూ పోవటమే అహింస అయితే నేను హింసనే సమర్థిస్తాను. సమస్యను పరిష్కరించటంలో కాలయాపన చేయటమే అహింస అయితే అలాంటి అహింస నాకొద్దు. కాలయాపన చేసే పరిష్కారం నా దృష్టిలో పరిష్కారమే కాదు. తెల్లవాడి నేరాల గురించి నేను మాట్లాడినందుకు నా మీద 'విప్లవకారుడు' అనే ముద్ర కూడా వేశారు. విప్లవం అటే సమూలమైన మార్పు. అమెరికాలో వున్న వ్యవస్థలో తానుండటాన్ని కూడా ఆమోదించమని మాత్రమే నల్లవాడు అడుగుతున్నాడు. ఇది కూడా తెల్లవాడి దృష్టిలో 'నీగ్రో తిరుగుబాటు'. ముందు నుండీ తెల్లవాడు 'అహింస', 'శాంతియుత సహజీవనం' అనే మాటలు ఉపయోగిస్తూనే వున్నాడు. అయితే, చరిత్రలో అడుగడుగునా వాడు ఒక చేతిలో క్రైస్తవ పతాకం మరో చేతిలో ఖడ్గం చూపుతూనే పురోగమించాడు. భౌతిక అధికారాన్ని పచ్చిగా ఉపయోగిస్తూనే వాడు తెల్ల అధికారాన్ని బోధించాడు. నిజమైన నాయకత్వానికి ప్రాతిపదిక చైతన్యమే తప్ప అధికారం కాదని చరిత్ర ప్రతిశకంలోనూ రుజువు చేసింది. చైతన్యం మనుషులను ఆకర్షిస్తుంది. అధికారం మనుషులను బలవంత పెడుతుంది. చైతన్యం ప్రేమను ఉద్దీపింపజేస్తుంది. అధికారం ఆందోళనలను సృష్టిస్తుంది.

ప్రపంచ జనాభాలో మైనారిటీ అయిన తెల్లవాడి క్రైస్తవానికి ఈ భూమ్మీద నూకలు చెల్లుతున్నాయి. వాడి పాలనలో బతికిన ప్రజలు మళ్లీ తమ సొంత మతాల్లోకి మారుతున్నారు. ఆఫ్రికన్లు ఇస్లాంలోకి, ఇతర దేశీయ మతాల్లోకి మారుతున్నారు. ఆసియావాసులు హిందువులుగా, బౌద్ధులుగా, ముస్లింలుగా మారుతున్నారు. క్రైస్తవ మత యుద్ధం ఒకప్పుడు తూర్పుకు వస్తే - ఇప్పుడు ఇస్లామిక్ మతయుద్ధం పశ్చిమానికి పోతూ వుంది. యూరప్‌వాసులు కూడా క్రైస్తవాన్ని విడిచిపెడుతున్నారు. 'క్రైస్తవ' నాగరిత నేర్చిన అమెరికా తెల్లవాడు రాబోయే కాలంలో ఒంటరిగా మిగులుతాడు.

క్రైస్తవ చర్చి అతి పెద్ద వైఫల్యం జాతి వివక్షను ఎదుర్కోలేకపోవటంలోనే

వుంది. ఈ చర్చి జాతివివక్షనే విత్తనంగా నాటింది. అదే ఇప్పుడు కోతకొచ్చింది.

అమెరికాలో కొంతకాలం వున్న తర్వాత, విదేశాలకు పోయాను. ఈసారి మధ్యప్రాచ్యం, ఆఫ్రికాలలో పద్దెనిమిది వారాలు గడిపాను. ఈ పర్యటనలో ఈజిప్టు, టాంజానియా, నైజీరియా, ఘనా, గినియా, కెన్యా, దేశాల అధ్యక్షులతోను, ఉగాండా ప్రధానమంత్రితోనూ మాట్లాడాను. ఈ దేశాల్లోని ఆఫ్రికన్, అరబ్, ఆసియన్, ముస్లిం, ముస్లిమేతర మతనాయకులు, ఆఫ్రికన్, అమెరికన్లు, వివిధ నేపధ్యాలున్న తెల్లవాళ్లను కలిశాను.

నేను ఈ పర్యటనలో వున్న కాలంలో అమెరికాలో రాజకీయ వాతావరణం చాలా వేడెక్కింది. 'సంప్రదాయవాది' అయిన గోల్డ్ వాటర్', 'ఉదారవాది' అయిన జాన్సన్ - ఈ ఇద్దరిలో నేను ఎవరికి మద్దతునిస్తానని అమెరికన్ పత్రికలు నన్ను అడిగాయి. నల్లవాడికి సంబంధించినంత వరకు జాన్సన్ నక్క, గోల్డ్‌వాటర్ తోడేలు - కాబట్టి వాళ్లిద్దరూ ఒక్కటేనని చెప్పాను. అమెరికా రాజకీయాల్లో 'సంప్రదాయవాదం' అంటే 'నల్లవెధవలను వాళ్ల స్థానంలో వాళ్లను వుండనీయండి' అని అర్థం. 'ఉదారవాదమంటే, 'నీగ్రోలను వాళ్లున్న స్థానంలోనే ఎదగనీయండి' అని చెప్పటం, అయితే వాళ్లను కొంచెం బాగా చూస్తామని చెప్పటం, మరిన్ని వాగ్దానాలతో వాళ్లను మరింత మోసం చేస్తాం అని చెప్పటం! వున్న ఈ రెండు అవకాశాల్లో తాను ఎవరికి ఆహారం కావాలో తేల్చుకోవటమొక్కటే నల్లవాడికి మిగిలింది. ఎందుకంటే, 'ఉదార' నక్క, 'సంప్రదాయ' తోడేలు రెండూ వాడిని తినేవే.

జాతివివక్షకు వ్యతిరేకంగా నేను, మార్టిన్ లూథర్‌కింగ్ ఎవరి పంథాలో వాళ్లు ఉద్యమిస్తున్నాం. అయితే మా ఇద్దరి గమ్యం మాత్రం ఒక్కటే. అమెరికాలో ఇప్పుడున్న వాతావరణాన్ని బట్టి చూస్తే, మా ఇద్దరిలో ముందు ఎవరు బలి అవుతారు? 'అహింస'ను ప్రబోధించే మార్టిన్ లూథరా? 'హింస'ను ప్రబోధించే నేనా? ఈ ప్రశ్నకు సమాధానం ఎవరికి వారు ఊహించాల్సిందే.

ఈ రోజు నేను ఏ పనిచేసినా చాలా త్వరగా చేయాలి. ఎందుకంటే, నమ్మకస్తుల ద్వారా నాకు అందిన సమాచారాన్ని బట్టి ఏ క్షణమైనా మృత్యువు నన్ను కబళించవచ్చు. మిగతా కొంతమంది మాదిరి చావును మూసి పెట్టడం గురించి నా కెప్పుడూ చింతలేదు. ఎందుకంటే, కేవలం ఒక ముసలివాడిని కావటం కోసం నేను ఎప్పుడూ బతకలేదు. నేను ముస్లింను కావటానికి ముందు నుండీ - జైల్లో నేరస్తుడిగా వున్న కాలం నుండీ నేను హింసాత్మకంగా చస్తాననే నా మనసుకెప్పుడూ

అనిపించింది. అంతేకాదు, అలా చావటం నా కుటుంబంలో జరుగుతున్నదే. నేను నమ్మిన విషయాల పట్ల చిత్తశుద్ధితో, అంకితభావంతో బతికిన పద్ధతే నేను ముసలివాడుగా చావటాన్ని అసాధ్యం చేసింది.

నా జీవితాన్ని ఉన్నదున్నట్టు నిజాయితీగా మీ ముందుంచుతున్నాను. నా జీవితం ఏ మాత్రమైనా సామాజిక విలువకు సాక్ష్యంగా నిలుస్తుందేమో వస్తుగత దృష్టితో చదవండి. ఈ దృష్టితో చదివే పాఠకుడే, అమెరికన్ సమాజంలో ఒక నల్ల యువకుడిగా నా జీవితం, జైలుపాలు కావటం ఎలా అనివార్యమో చూడగలడు.

నల్లప్రజల స్వేచ్ఛకోసం నాకు తెలిసిన, చెయ్యగలిగిన ఉత్తమ పద్ధతిలోనే పోరాడనని నమ్ముతున్నాను. నాకు విద్యా సంస్థల్లో చదివిన అనుభవం లేకపోవటమే చాలా పెద్ద లోపం. అలా చదివుంటే నిజంగానే నేను మంచి లాయర్నై వుండేవాడిని అనుకుంటున్నాను. ఎందుకంటే, మాటల యుద్ధాన్ని, సవాళ్లను నేనెప్పుడూ ఇష్టపడ్డాను. ఈ ఒక్క లోపం వల్లే నాకెన్నో విషయాల్లో ఆసక్తి వున్నా నా జ్ఞానానికి మెరుగులు దిద్దుకోలేకపోయాను. భాషలంటే కూడా నాకు చాలా ఇష్టం. ఏదైనా విద్యాసంస్థలో చేరే అవకాశముండి వుంటే, ఆఫ్రికన్ మాండలికాలతో పాటు చైనా భాష కూడా నేర్చుకునేవాడిని. చైనీస్ రాజకీయంగా, అరబిక్ ఆధ్యాత్మికంగా భవిష్యత్తులో శక్తివంతమైన భాషలుగా అవతరించబోతున్నాయి.

ఏది ఏమైనా, ప్రతి రోజూ నేను చచ్చి బతుకుతున్నాను. నా ఆత్మకథను పుస్తకం రూపంలో చూసేంతవరకైనా నేను ప్రాణాలతో వుంటానని అనుకోవటం లేదు. మీరు చూడండి. నేను చనిపోయిన తర్వాత 'బాధ్యత లేని నల్లవాడి''నని తెల్ల సమాజం నా మీద ముద్ర వేస్తుంది.

జాతి వివక్ష వున్న అమెరికన్ సమాజంలో నల్లప్రజల నాయకుడిగా తెల్లవాడు నన్ను అడ్డుకున్న ప్రతిసారీ, క్రూరంగా దాడి చేసిన ప్రతిసారీ, నల్లవాళ్ల ఉత్తమ ప్రయోజనాల కోసం నేను సరైన దారిలో పయనిస్తున్నాననే నాకు నమ్మకం కలిగింది.

"అవును. నేను 'రెచ్చగొట్టుడు' పాత్ర పోషించాను. సమాజాన్ని మార్చటానికి ప్రయత్నించిన వాళ్లను సమాజమే తరచూ హతమార్చిందని నాకు తెలుసు. అమెరికా శరీరంలో ప్రమాదకరమైన కేన్సర్‌లాంటి జాతివివక్షను నాశనం చేయటానికి సహాయపడే అర్థవంతమైన సత్యంలా, ఏ మాత్రంగానైనా వెలుగు ప్రసరించి నా జీవితం ముగిసిపోతే - ఆ గొప్పదనమంతా అల్లాది. తప్పులు మాత్రమే నావి.

“నిజమైన ఇస్లాంను పాశ్చాత్య ప్రపంచానికి పరిచయం చేయలేకపోవటం తూర్పు దేశాల వైఫల్యం. దీనివల్ల మతాన్ని అడ్డుపెట్టుకొని తప్పుడు పనులు చేసేవాళ్లు మా నల్లజాతి ప్రజలకు నాయకత్వం వహించే అవకాశం ఏర్పడింది”

-మాల్కం ఎక్స్

9



“ఈ ఆత్మకథ ముద్రించటానికి ఇచ్చిన ఒప్పంద పత్రంపై సంతకం చేసిన తర్వాత, మాల్కం ఎక్స్ నా వంక కర్కశంగా చూసి, ‘నాక్కావలసింది రచయిత, వ్యాఖ్యాత కాదు’ అన్నాడు. అలా వుండటానికే ప్రయత్నించాను. ఏమైనా, ఇంతటి విద్యుత్తేజం కలిగిన వ్యక్తిత్వాన్ని నా జీవితంలో ఎప్పుడూ చూడలేదు. అతను చనిపోయాడంటే ఇప్పటికీ నమ్మలేకున్నాను. చరిత్రకారులు రాయాల్సిన తర్వాతి అధ్యాయంలోకి అతను అలా వెళ్లిపోయినట్టే నా మనసు [illegible]ది”.

[illegible] హేలీ

VPH03104460

112